

ఈనాడు



విజయవాడ 23-8-2025 శనివారం సిటీ సంపుటి 52 . సంచిక 14
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఈటీవీ 30 వసంతాల వేడుక ప్రారంభ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, అగ్ర కథానాయకుడు చిరంజీవి, రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ కిరణ్, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరి, ఈటీవీ సీఈఓ బాపినీడు, సుజయ్

కనుల పండువ
ఈటీవీ@30 వేడుక

తెలుగు నేలన తిరుగులేని చరిత లిఖించిన ఈటీవీ... 24 గంటలూ వినోదాన్ని పంచుతూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటోంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి మనసుల్ని రంజింపజేస్తూ ఘనంగా ముప్పై వసంతాలు పూర్తిచేసుకుంది. సుదీర్ఘ ప్రస్థానంతో భారతీయ శాటిలైట్ టీవీ రంగంలో తనదైన ముద్ర వేసింది. 'కదిలేది.. కదిలించేది.. ముమ్ముందుకు నడిపించేది కళ' అని నమ్మిన మహర్షి రామోజీరావు... తెలుగు ప్రజలకు ఆరోగ్యకరమైన వినోదాన్ని అందించాలనే సదాశయంతో 1995 ఆగస్టు 27న ఈటీవీకి శ్రీకారం చుట్టారు. మూడు దశాబ్దాలుగా అదే ఒరవడి కొనసాగిస్తున్న ఈటీవీ ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచింది. ఈటీవీ 30 ఏళ్ల వేడుకలు రామోజీ ఫిల్మ్‌సిటీ వేదికగా వైభవంగా ప్రారంభమయ్యాయి.

ఈ వేడుకల్లో తెలుగు సినీ, టీవీ రంగాలకు చెందిన అతిరథ మహారథులు పాల్గొన్నారు. కోట్ల మంది అభిమానుల మదిదోచిన మెగాస్టార్ చిరంజీవి, వెండితెరపై తనదైన ముద్ర వేసిన ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు సహా ఎందరో నటీనటులు, దిగ్గజ దర్శకులు, నిర్మాతలు, 24 క్రాఫ్ట్‌లకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ కిరణ్, మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరి సహా ఇతర కుటుంబసభ్యులు, గ్రూప్ ఉన్నతోద్యోగులు వేడుకల్లో మమేకమయ్యారు. మెగాస్టార్ చేతుల మీదుగా **ఈటీవీ@30** ప్రత్యేకలోగోను ఆవిష్కరించారు.



మరిన్ని విశేషాలు సినిమాలో


ప్రారంభ వేడుకలు నేడు, రేపు సాయంత్రం 7 నుంచి 9 వరకు 'ఈటీవీ'లో

ప్రతి సవాల్ వెనుకా ఓ అవకాశం

ట్రంప్ టారిఫ్ ఇబ్బందులు తాత్కాలికమే

ఎకనమిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సులో సీఎం చంద్రబాబు

- ప్రధాని మోదీ వాటిని సమర్థంగా పరిష్కరిస్తారు
- సంపద సృష్టికర్తలకే సంక్షేమ పథకాలిచ్చే హక్కు
- అంతర్జాతీయ జీవన ప్రమాణాలతో అమరావతి నిర్మిస్తున్నాం



ఎకనమిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు - దిల్లీ

మనకు ఎదురయ్యే ప్రతి సవాల్ వెనుక ఒక అవకాశం ఉంటుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌ల వల్ల వచ్చిన సమస్యలను పరిష్కరించాలని.. అదే సమయంలో మనం రాజీపడకూడదని ఆయన సూచించారు. ప్రస్తుత ఇబ్బందులను ప్రధాని మోదీ చాలా సమర్థంగా పరిష్కరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రముఖ దినపత్రిక ఎకనమిక్ టైమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం దిల్లీలో జరిగిన 'వరల్డ్ లీడర్స్ ఫోరం' సదస్సులో చంద్రబాబు ప్రసంగించారు. 'ప్రపంచంలో ఏ దేశమైనా, రాష్ట్రమైనా సంక్షేమం లేకుండా మనుగడ సాగించలేవు. సంస్కరణల కారణంగా దేశంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్లు, టెలి కమ్యూనికేషన్లు, విద్యుత్తు ప్రాజెక్టులు, కళాశాలల్లాంటి ఆస్తులు వచ్చాయి. దేశంలో సంపద సృష్టి జరిగి, ప్రభుత్వాలకు రాబడి పెరిగింది. సమాజంలో పేద, ధనిక వర్గాల మధ్య అంతరాన్ని (మిగతా 6లో)

మనం గేర్ మార్చాలి

ప్రధాని మోదీ ఇప్పుడు తదుపరి తరం సంస్కరణల వైపు వెళ్తున్నారు. దీనివల్ల మరో ఏడాదిలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతాం. మనకంటే 4.5 రెట్లు, 7.5 రెట్ల పెద్దగా ఉన్న చైనా, అమెరికా ఆర్థిక వ్యవస్థలతో పోటీపడాలి. కాబట్టి మనం గేర్ మార్చాలి. ప్రపంచస్థాయి నాణ్యతతో కూడిన వస్తువుల భారీ ఉత్పత్తి దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాలి.

■ దేశంలో తొలిసారి జనవరి నుంచి అమరావతిలో కృత్రిమమేధతో కూడిన క్వాంటమ్ వ్యాలీ ప్రారంభిస్తున్నాం. దీంతో పెద్ద ముందడుగు పడుతుంది.

కమ్యూనిస్టు దిగ్గజం సురవరం కన్నుమూత

- మూడు దఫాలు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన తెలుగు నేత
- తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక



ఈనాడు, హైదరాబాద్: కమ్యూనిస్టు దిగ్గజం, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి (83) ఇకలేరు. హైదరాబాద్ గచ్చిబౌలి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి కన్నుమూశారు. వయోభారం దానికి తోడు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. నగరంలోని మణికొండలో నివసిస్తున్న ఆయనకు భార్య డాక్టర్ బీవీ విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు నిఖిల్, కపిల్ ఉన్నారు. విద్యార్థి ఉద్యమాల నుంచి జాతీయ రాజకీయాల దాకా ఎదిగిన ఆయన... మూడు దఫాలు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన తెలుగు నేత. ఆయన కంటే ముందు చండ్ర రాజేశ్వరరావు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. సుధాకర్‌రెడ్డి తండ్రి వెంకట్రామిరెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు కాగా...సురవరం ప్రతాపరెడ్డి ఆయన పెద్దనాన్న. (మిగతా 6లో)

శునకాలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు



ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు

- మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటు
- దేశమంతటికీ వర్తించేలా సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు
- సంతాన నిరోధక చికిత్సల తర్వాత వీధి కుక్కలను వదిలిపెట్టాలి
- దిల్లీలో నిషేధం ఉత్తర్వుల సవరణ

దిల్లీ: వీధి కుక్కల బెడదకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు వెలువరించింది. వీధులు/బహిరంగ ప్రదేశాల్లో వీటికి ఆహారం అందించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. దేశ రాజధాని దిల్లీ పరిధిలో శునకాలను నిషేధిస్తూ ఇటీవల వెలువరించిన ఉత్తర్వులను శుక్రవారం సవరించింది. మూగజీవుల పట్ల ఆ ఆదేశాలు చాలా కఠినంగా ఉన్నాయంటూ జంతు ప్రేమికుల నుంచి వచ్చిన తీవ్ర నిరసనల నేపథ్యంలో జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం మధ్యంతర తీర్పు వెలువరించింది. వీధి శునకాలకు టీకాలు ఇవ్వడంతో పాటు సంతాన నిరోధక చికిత్సల తర్వాత వాటిని వదిలిపెట్టాలని స్పష్టం చేసింది. అయితే, మనుషులపై దాడి చేసే స్వభావం, రేబిస్ వ్యాధి కారక శునకాలను మాత్రం షెల్టర్లకు తరలించాలని తెలిపింది. తీర్పును దేశ రాజధాని దిల్లీ పరిధిలోని ప్రాంతాలకే (మిగతా 6లో)

విపక్ష నేతల్లో అత్యధికులు అవినీతిపరులే

జైలులో లేదా బెయిల్‌పై ఉన్నవారే



- అందుకే 130వ రాజ్యాంగ సవరణను వ్యతిరేకిస్తున్నారు
- ఇండియా కూటమిపై ప్రధాని విమర్శలు

11లో

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

సబ్జెక్టులు, రాష్ట్ర, జోన్, జిల్లాల వారీగా ర్యాంకులు

ఈనాడు, అమరావతి: డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ జాబితాను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. అన్ని సబ్జెక్టులు, రాష్ట్ర, జోన్, జిల్లా వారీగా ర్యాంకులు ఇచ్చింది. పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ), ప్రిన్సిపాల్ పోస్టుల మెరిట్ జాబితాలను తొలుత ప్రకటించింది. అధికారిక వెబ్‌సైట్ https://apdsc.apcfss.in లో వీటిని అందుబాటులో ఉంచింది. అభ్యర్థులకు డీఎస్సీ లాగిన్ ఐడీల ద్వారా కాల్ లెటర్లు అందిస్తారు. అభ్యర్థులు వ్యక్తిగత లాగిన్ ద్వారా వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ (మిగతా 6లో)



ఇదీ సంగతి!



అగండ్సార్! మాకు మద్దతిచ్చినందుకు థాంక్స్ చెప్పడానికొస్తున్నాం.. అంతే! భౌ..భౌ..!!

అంతా పైవాళ్లకే తెలుసు

- వారి ఆదేశాలు పాటించా.. అంతే
- సిట్ విచారణలో ఎక్సైజ్‌శాఖ నాటి మంత్రి నారాయణస్వామి వెల్లడి
- మద్యం కుంభకోణం కేసులో 6 గంటల పాటు ప్రశ్నించిన సిట్
- సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం..


ఈనాడు-అమరావతి, తిరుపతి, న్యూస్‌టుడే- పుత్తూరు: 'అన్నీ పైవాళ్లకే తెలుసు. నాకేం తెలియదు. వారి ఆదేశాలే పాటించా..' ఇదీ వైకాపా హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేసిన కె.నారాయణస్వామి సిట్ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలం. మద్యం విధానం రూపకల్పన, సరఫరా ఆర్డర్ల (ఓఎఫ్ఎస్) జారీని ఆటోమేటెడ్ నుంచి మాన్యువల్‌లోకి మార్చటం సహా ఇతర కీలక నిర్ణయాల గురించి తనకేమీ తెలియదని.. అప్పట్లో ఉన్నత స్థానాల్లో కొనసాగిన వారికే అవి తెలుసని వెల్లడించారు. మద్యం కుంభకోణం జరిగిన ఐదేళ్లూ నారాయణస్వామి ఎక్సైజ్ శాఖ మంత్రిగా వ్యవహరించిన నేపథ్యంలో సిట్ అధికారులు శుక్రవారం ఆయన్ను సుదీర్ఘంగా విచారించారు.



తిరుపతి జిల్లా పుత్తూరులోని ఆయన నివాసానికి వెళ్లి ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు ప్రశ్నించారు. 100కు పైగా ప్రశ్నలు అడిగి వివరాలు రాబట్టారు. ఆయన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణుల బృందాన్ని తీసుకెళ్లి.. వాటిలోని డేటా, సమాచారం వెలికితీశారు. దాన్ని విశ్లేషించనున్నారు. వారం రోజుల్లో విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు రావాలని నోటీసులిచ్చారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం సిట్ విచారణలోని ప్రధానాంశాలివి.

ఇవీ సిట్ ప్రశ్నలు

■ ముడుపుల వసూళ్లకు వీలుగా నూతన మద్యం విధానం రూపకల్పనలో ఎవరెవరు ఏయే పాత్రలు పోషించారని (మిగతా 6లో)



నంద్యాల జిల్లా గోరకల్లులో నిర్మించిన జలాశయం రక్షణ చర్యల నిమిత్తం తొలిదశలో రూ.53 కోట్లతో పనులు చేపట్టనున్నారు. ఇందుకు జలవనరుల శాఖ పాలనామోద ఉత్తర్వులు ఇచ్చింది. తొలిదశలో రూ.58.90 కోట్లకు కర్నూలు చీఫ్ ఇంజినీరు ప్రతిపాదనలు పంపగా పరిశీలన అనంతరం రూ.53 కోట్లకు పరిమితం చేశారు.

నారావారిపల్లెలో పాల వెల్లువకు శ్రీకారం

- దేశంలో తొలిసారి పాడి పశువుల్లో ఎద క్రమబద్ధీకరణ
- 250 పశువులపై ప్రయోగం.. 156 పశువులకు గర్భనిర్ధారణ

తిరుపతి (వ్యవసాయం), న్యూస్‌టుడే: పశువులు వయసు దాటినా ఎదకు రాకపోకపోవడం.. లేదంటే ఒకట్రెండు ఈతలకే వట్టిపోతుండటంతో పాడి రైతులు నష్టపోతున్నారు. వారి కష్టాలు తీర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వగ్రామమైన తిరుపతి జిల్లా నారావారిపల్లె పరిసరాల్లో దేశంలోనే తొలిసారిగా ఎద క్రమబద్ధీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సాధారణంగా కృత్రిమ గర్భధారణతో 30-40 శాతం చూలు కట్టు శాతం ఉండగా.. ఎద క్రమబద్ధీకరణ కార్యక్రమంతో 63 శాతం పశువులు గర్భం దాల్చాయి. జిల్లా పశుసంవర్ధక శాఖ నారావారిపల్లె సహా చుట్టుపక్కల 29 గ్రామాల్లో వెయ్యికి పైగా ఎదకు రాని పశువుల్ని అధికారులు గుర్తించారు. తొలి విడతగా 172 మంది రైతులకు చెందిన 250 పశువులను ఎంపిక చేసుకుని మార్చి 29న పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 30 మంది పశు వైద్యులు, సహాయకులు ఎంపిక చేసుకున్న ప్రతి పశువు పునరుత్పాదక, గర్భాశయం, అండాశయ స్థితిగతులను అధ్యయనం చేసి వాటిని ఎదకు రప్పించే ప్రక్రియను ప్రారంభించారు. పశువుకు ఆరోగ్య పరీక్షలు చేసి ఎదకు రాకపోవడానికి కారణాలను గుర్తించారు. ప్రతి పశువుకు డీవార్మింగ్ మాత్రలు, 20 కిలోల సమీకృత దాణా, 20 మినరల్ మాత్రలు, యాంటీ బయాటిక్ మందులతో కూడిన రూ.1500 విలువైన కిట్‌ను రూ.400కే అందజేశారు. మే నెలలో మేలుజాతి ఆంబోతుల వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేశారు. దీంతో 156 వట్టిపోయిన పశువులు ఇప్పుడు చూలు కట్టాయి.



పాడి రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

75 శాతం ఫలవంతం చేయడమే లక్ష్యం

ఎదకు రాని పాడి పశువు విలువ రూ.15 వేలు మాత్రమే. అదే పశువు ఎదకు వచ్చి గర్భం దాల్చితే రూ.60-70 వేలు. ఆరు నెలల తర్వాత నారావారిపల్లెలోని 172 మంది రైతుల ఇళ్లలో పాల వెల్లువ ప్రారంభమవుతుంది. సాగును మించిన ఆదాయం లభించనుంది.

–ఎ.రవికుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి

4 విడతల్లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

- మంత్రి నాదెండ్ల మనోహర్

కానూరు, న్యూస్‌టుడే: క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డుల్ని ఈ నెల 25 నుంచి నాలుగు విడతల్లో పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా 1.45 కోట్ల కార్డుదారుల కుటుంబాలకు రేషన్ దుకాణాల వద్దే వాటిని ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. విజయవాడలోని పౌరసరఫరాల భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ పంపిణీ 93 శాతానికి చేరింది. కార్డుల జారీ నిరంతర ప్రక్రియ. ఈసారి కొత్తగా 6.71 లక్షల కార్డులు ఇస్తున్నాం. స్మార్ట్‌కార్డుల్లో రాజముద్రతోపాటు కుటుంబసభ్యుల వివరాలు, క్యూఆర్‌కోడ్ ఉంటుంది. ఏదైనా సమస్య ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1967ను సంప్రదించవచ్చు' అని నాదెండ్ల మనోహర్ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, చిత్రంలో కమిషనర్ సౌరభ్ గౌర్

ఏయే జిల్లాల్లో ఎప్పుడంటే: ఆగస్టు 25 నుంచి విజయనగరం, ఎన్టీఆర్, తిరుపతి, విశాఖపట్నం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఆగస్టు 30 నుంచి చిత్తూరు, కాకినాడ, గుంటూరు, ఏలూరు జిల్లాల్లో పంపిణీ చేయనున్నారు. సెప్టెంబరు 6 నుంచి అనంతపురం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అనకాపల్లి, సెప్టెంబరు 15 నుంచి బాపట్ల, పల్నాడు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో అందించనున్నారు.

పాలేకర్ సాగు విధానంపై నెల రోజులపాటు అవగాహన

2న తెలుగు రాష్ట్రాల నుంచి జిల్లాకు 100 మంది చొప్పున ఎంపిక

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సుభాష్ పాలేకర్ కృషి (ఎస్‌పీకే) విధానంలో పంటలు సాగు చేయాలనే ఔత్సాహికులను పూర్వ జిల్లాల ప్రకారం 100 మంది చొప్పున ఎంపిక చేయనున్నట్లు సేవ్ సంస్థ ప్రతినిధి విజయ్‌రామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రతి జిల్లా నుంచి నలుగురు ప్రతినిధులు సెప్టెంబరు 2న హైదరాబాద్ దోమలగూడలోని శ్రీరామచంద్రమిషన్‌లో ఉదయం 9.30 నుంచి 1 గంట వరకు జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఎంపికైన వారికి ఈ ఏడాది డిసెంబరు 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 15 వరకు ఏపీలోని కృష్ణా జిల్లా గూడూరు మండలం తరకటూరు గ్రామంలో అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని రైతులు, కొత్తగా వ్యవసాయం చేయాలనుకునే స్వచ్ఛంద సంస్థలు, ఆధ్యాత్మిక కేంద్రాల ప్రతినిధులు, యోగా గురువులు, విశ్రాంత ఉద్యోగులు వంటి వారు ఎవరైనా పాల్గొనవచ్చని సూచించారు.

మునిగిపోయే నావ వైకాపా

అక్కసుతోనే అమరావతిపై విమర్శలు: కందుల దుర్గేష్

ఈనాడు, అమరావతి: వరదలతో మునిగింది అమరావతి కాదని, ప్రజా వ్యతిరేకతతో వైకాపాయే మునిగిందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. వైకాపా మునిగిపోయే నావని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో మండిపడ్డారు. ''అమరావతి ప్రతిష్ఠతో ఆడుకుంటే వైకాపాకు భవిష్యత్తులో 11 సీట్లు కూడా రావు. వైకాపా నేతలకు దమ్ముంటే రాజధానిలో పర్యటించి అమరావతి మునిగిపోయిందని నిరూపించాలి. రాజధానిపై ఆ పార్టీ నేతలకు అక్కసు ఎందుకు? నీటమునిగింది నవ నగరాలు కాదు.. నవరత్నాలు. వరదల విషయంలో తప్పుడు కథనాలు, ప్రసారాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం'' అని పేర్కొన్నారు.

10,834 ఎకరాల్లో కృష్ణపట్నం నోడ్

ఈనాడు, అమరావతి: చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో ప్రతిపాదించిన కృష్ణపట్నం ఉత్తర నోడ్‌ను 10,834.5 ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు వీలుగా ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఐసీడీఏ) రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ భూమిని మూడు దశల్లో వివిధ అవసరాలకు వినియోగించేలా అందులో ప్రతిపాదించింది. మొత్తం భూమిలో 44.3 శాతాన్ని పారిశ్రామిక అవసరాలకు, రహదారుల నిర్మాణానికి 13.8 శాతం, పచ్చదనం అభివృద్ధికి 11.1 శాతం పోను మిగిలిన భూమిని ఇతర అవసరాలకు వినియోగించేలా మాస్టర్ ప్లాన్‌ను ఏపీఐసీడీఏ రూపొందించింది.

వైకాపా నేతలు అబద్ధాలతో ప్రజలను భయపెడుతున్నారు: మంత్రి నిమ్మల

ఈనాడు, అమరావతి: వైకాపా నేతలు అబద్ధాలతో ప్రజల్ని భయకంపితుల్ని చేయాలని చూస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. 'ప్రకాశం బ్యారేజి తలుపులు బాగోలేదు.. విజయవాడ మునిగిపోతోంది.. పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యాం కొట్టుకుపోయింది.. కొండవీటి వాగు వరదకు అమరావతి మునిగిపోయిందంటూ.. అసత్య ప్రచారాలతో వైకాపా నేతలు, ఆ పార్టీ అనుబంధ మీడియా ప్రజల్ని భయకంపితుల్ని చేస్తోంది. అందుకే పొన్నూరు నియోజకవర్గ వైకాపా నేత అంబటి మురళీకృష్ణ చేస్తున్న అసత్య ప్రచారంపై జలవనరులశాఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణలో నిజాలు బయటపడ్డాయి' అని మంత్రి వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వీడియో సందేశం విడుదల చేశారు.

గ్రహం అనుగ్రహం
23-8-2025 శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం
అమావాస్య: ఉ. 11-17 తదుపరి భాద్రపద శుక్లపక్ష పాడ్యమి
మఖ: రా.1-40 తదుపరి పుబ్బ, **వర్జ్యం:** మ. 1-28 నుంచి 3-06 వరకు
అమృత ఘడియలు: రా.11-14 నుంచి 12-51 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-46 నుంచి 7-27 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5.47; **సూర్యాస్తమయం:** సా.6.19

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.0	27.0
నెల్లూరు	36.5	28.2
ఒంగోలు	35.3	28.0
తిరుపతి	35.2	26.1
విశాఖపట్నం	34.4	27.6
విజయవాడ	34.4	26.7
నరసాపురం	34.0	28.5
గుంటూరు	34.0	28.0
విజయనగరం	33.0	27.0
కడప	33.0	26.0
అనంతపురం	32.6	23.3
శ్రీకాకుళం	32.0	27.0
కర్నూలు	31.8	26.0
తాడేపల్లిగూడెం	30.1	27.2
హైదరాబాద్	30.0	22.2

ఈనాడు సినిమా

తరలివచ్చిన తారాలోకం ఈటీవీ @ 30 వేడుకలకు కొత్త వన్నె తెచ్చింది. నాటి నుంచి నేటి వరకూ ఈటీవీలో భాగస్వాములైన 24 క్రాఫ్ట్‌ల నిపుణులు, సిబ్బంది 'ఇది మన ఛానల్' అంటూ మధురస్మృతుల్లో మునిగితేలారు. 'ఈటీవీ - మీ టీవీ' అంటూ మొదలై మూడు పదుల ప్రయాణంలో 'మన టీవీ - మనందరి టీవీ'గా ఎదిగిందంటూ ప్రశంసించారు. నభూతో అన్నట్లు అట్టహాసంగా జరిగిన 'ఈటీవీ @ 30' కార్యక్రమాలను ఈ రోజూ, రేపూ ఈటీవీలో చూసి ఆనందిద్దాం.





చిరు కాలు కదిపితే మాస్ విజిల్సే

ఫరియా, ఖుష్బూతో చిరు. చిత్రంలో నందు, యాంకర్ రవి



వినోద భరితం
ఈటీవీ @ 30 సంబరం

ఈటీవీ 30 ఏళ్ల ప్రారంభ వేడుకల్ని
నేడు, రేపు సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు ఈటీవీలో వీక్షించండి





అలీ, సుజయ్, బాపినీడు, సీహెచ్.కిరణ్, చిరంజీవి, కె.రాఘవేంద్రరావు, శైలజాకిరణ్, దివిజ, మురళీ మోహన్, విజయేశ్వరి, జెమినీ కిరణ్

ఈటీవీ 30 ఏళ్ల జ్ఞాపికను సినీనటి కీర్తి సురేశ్ ఆవిష్కరించారు. ఆ తర్వాత సినీ ప్రముఖుల చేతుల మీదుగా ఈటీవీ ప్రయాణంలో భాగస్వాములైన నటీనటులు, సాంకేతిక నిపుణులకు ప్రదానం చేశారు. ఈటీవీ మూడు దశాబ్దాల ప్రయాణంపై సినీ ప్రముఖులు హర్షం వెలిబుచ్చి ఈ విజయంలో రామోజీరావు, సుమన్ కృషిని కొనియాడారు. అంగరంగ వైభవంగా సాగిన ఈ వేడుకలో ప్రముఖ దర్శకులు కోదండరామిరెడ్డి, బి.గోపాల్, బోయపాటి శ్రీను, నటులు మురళీ మోహన్, బ్రహ్మానందం, అలీ, నిర్మాతలు డి.సురేశ్ బాబు, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎస్.గోపాల్ రెడ్డి, జెమినీ కిరణ్, కె.ఎల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

"రామోజీరావు ఒక పేరు మాత్రమే కాదు. తెలుగు సంప్రదాయానికి ఓ మార్గదర్శి. ఈనాడు గ్రూప్ సంస్థలు ఒక అందమైన కుటుంబం. అందులో నన్ను భాగస్వామిని చేయడం ఒక అవకాశం మాత్రమే కాదు నా అదృష్టం. ఈటీవీ.. మీటీవీ.. మన టీవీ.. మనందరి టీవీ".
– కీర్తి సురేశ్, కథానాయిక

● "రామోజీరావుతో అనుబంధం తలుచుకుంటేనే కళ్లు చెమర్చుతాయి. ఎందుకంటే ఆయనతో 30ఏళ్ల ఆత్మీయ ప్రయాణం నాది. ఆయనతో ఓ గంట గడిపితే కొత్త ఎనర్జీ వస్తుంది. 'శాంతి నివాసం' అనే సీరియల్‌తో మొదలుపెట్టి 'కలిసుందాం రా' వరకు నిరంతరం మద్దతు ఇస్తున్న ఈటీవీకి ధన్యవాదాలు. ఈ సీరియల్స్ వల్ల నేనే 300 - 400 మందికి అన్నం పెడుతున్నానంటే.. అన్ని సీరియల్స్ వాళ్లు, మిగతా స్టాఫ్ కలిపితే ఎన్ని లక్షల మందికి రామోజీరావు ఉపాధి కల్పిస్తున్నారో కదా".
– కె.రాఘవేంద్రరావు, సినీ దర్శకుడు



నవ్వుల కౌగిలింత- మెగా పులకింత


బ్రహ్మానందం, చిరంజీవి

"రామోజీరావు అంతటి ఆస్తికుడు ఇంకొకరు లేరేమో అని నా అభిప్రాయం. ఎందుకంటున్నానంటే ఆయనకు పనే దైవం. ఇన్ని వందల ఎకరాల్లో ఇంత అద్భుతమైన రామోజీ ఫిల్మ్‌సిటీని కట్టి అందరినీ ఆశ్చర్యపరిచే విధంగా చేయడమనేది న భూతో న భవిష్యత్. ఇంకెవరి వల్లా అది సాధ్యం కాదు".
– బ్రహ్మానందం, హాస్య నటుడు

● "ఎన్నో వందల సందర్భాల్లో రామోజీరావు గారి వ్యక్తిత్వాన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఇప్పటికీ ఆయన పేరు చెబితే వచ్చే భావోద్వేగం ఇంకెప్పుడూ కూడా నాకు కలగదు. సంగీత దర్శకుడిగా ఆయన నాకు ఇచ్చిన జన్మకు సదా కృతజ్ఞుడిని. ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటాను".
– కీరవాణి, సంగీత దర్శకుడు

● "ఎక్కడికెళ్లినా చిన్న పిల్లలు కూడా మీరు జబర్దస్త్‌లో వస్తారు కదా అని అడుగుతున్నారు. అందుకు కారణమైన జబర్దస్త్ టీమ్‌కి ధన్యవాదాలు. ఇవి నా కుటుంబ వేడుకలు. ఈటీవీకి 30 ఏళ్లు అనేది ప్రారంభం మాత్రమే ఇంకా చాలా దూరం ప్రయాణించాలి".
– ఖుష్బూ, సీనియర్ నటి

● "రామోజీరావు చాలా గొప్ప వ్యక్తి. ఓ రోజు 'చిత్ర పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్‌కు రావడానికి సమస్యగా ఉంది. వచ్చేటట్టు లేదు' అని ఆయనతో అంటే 'కొన్ని రోజులు ఆగండి.. నేను ఓ స్టూడియో కట్టబోతున్నాను. తమిళనాడు నుంచే కాదు.. మొత్తం భారతీయ చిత్రసీమే ఇక్కడికి వచ్చేస్తుందని చెప్పారు. జీవితంలో మనం ఏదైనా చేయాలి అనుకున్నప్పుడు కష్టనష్టాలు వస్తాయి. అలాగని ఆగిపోకూడదు. ముందుకు వెళుతూనే ఉండాలి. అప్పుడు విజయం అదే వస్తుంది. ఇదే ఆయన్నుంచి నేను నేర్చుకున్న గొప్ప విషయం". – డి.సురేశ్ బాబు, సినీ నిర్మాత




రామోజీరావు నాకెప్పుడూ స్ఫూర్తే

చిన్న నటుడిగా ప్రస్థానం ప్రారంభించి, స్వయంకృషితో అగ్రపథానికి చేరారు మెగాస్టార్ చిరంజీవి. కళామతల్లి ముద్దుబిడ్డగా సినీ రంగం అభివృద్ధికి కృషి చేస్తూనే...సామాజిక సేవలోనూ నిమగ్నమయ్యారు. ఈ సేవలకు గుర్తుగా రామోజీ గ్రూప్ సీఎండీ కిరణ్.. చిరంజీవిని సన్మానించారు. ఈటీవీ ప్రారంభం నుంచి ఇప్పటిదాకా కొనసాగుతున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న చిరంజీవి...రామోజీరావు ప్రేమాభిమానాలను తలచుకుని భావోద్వేగానికి లోనయ్యారు.

"ఈటీవీ 30వ వార్షికోత్సవానికి రావడం నా బాధ్యత. ఎందుకంటే 1995లో ఈటీవీ ప్రారంభ వేడుక ఇప్పటికీ నా కళ్ల ముందు ఉంది. మొదటి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చాను. 20వ వార్షికోత్సవానికి వచ్చాను. కొవిడ్ కారణంగా 25 సంవత్సరాల వేడుకని అంత ఆర్భాటంగా చేయలేదు. కానీ నా మీద గౌరవంతో మా ఇంటికి కేక్ తీసుకొచ్చి కట్ చేయించినప్పుడు నేను పొందిన ఆనందం అంతా ఇంతా కాదు. అదీ నిజమైన ప్రేమ. అది నాకిచ్చిన గౌరవంగా భావిస్తాను. మళ్లీ ఐదేళ్లకు ఇంత గొప్పగా, ఇంత ఆర్భాటంగా జరుగుతున్న వేడుకల్లో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. రామోజీరావు నాకెప్పుడూ స్ఫూర్తే. ఎప్పుడు కలిసినా ఆయన చెప్పేది అలా వింటూ ఉండేవాడిని. ఏదో ఒకటి నేర్చుకునేవాడిని. ఎక్కడో ఒక పల్లెటూళ్లో పుట్టి, ఇక్కడే కాదు మన జీవితం. ఎక్కడికో వెళ్లాలి. ఇంకేదో చరిత్ర సృష్టించాలి. చరిత్రలో మన పేరు శాశ్వతంగా నిలిచిపోవాలనే ఆలోచనతో.. ఒక లక్ష్యం పెట్టుకుని 'ఈనాడు' పత్రికను ప్రారంభించారు. మార్గదర్శి స్థాపించారు. ఆ తర్వాత ఈటీవీ పెట్టారు. చిత్ర పరిశ్రమలోనూ రాణించారు. ఆయన పేరు శాశ్వతంగా ఉండిపోయేలాగా రామోజీ ఫిల్మ్ సిటీ పేరుతో ఇంత అద్భుతమైన కళాఖండాన్ని సృష్టించారు".
– చిరంజీవి, అగ్ర కథానాయకుడు



"గతంలో రామోజీరావుతో జరిగిన సంభాషణను ఈటీవీ 30 ఏళ్ల వేడుకల వేళ ఇప్పుడు పంచుకుంటున్నా. మీరింత కరినంగా, క్రమశిక్షణతో, మీ ఆలోచనలు, సిద్ధాంతాల ప్రకారం సంస్థల్ని నడుపుతున్నారు. మీ తర్వాతి తరానికి ఇది సాధ్యమా? మీ తదనంతరం ఇది కొనసాగుతుందా? అని అడిగాను. ఆయన ఏమాత్రం ఆలోచించకుండా కచ్చితంగా ఇలానే జరుగుతుంది. నా నిబంధనల మీద, నా క్రమశిక్షణ మీద నాకు నమ్మకం అన్నారు. అన్నింటికంటే నా కుటుంబం మీద నమ్మకం. 40వేల మంది నామీద గౌరవంతో, నన్ను నమ్మి, నాతో పాటు ప్రయాణం చేస్తున్నారు. వాళ్లందరూ నామీద గౌరవంతో ఇలాగే కొనసాగిస్తారని అన్నారు. హ్యాట్సాఫ్. ఇప్పుడు మన దగ్గర ఆయన లేరు. ఏడాదికి పైగానే గడిచిపోయింది. అయినా అణువంత తేడా కూడా కనిపించడం లేదు".
– శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, సినీ నిర్మాత







మధురగానం... తన్మయత్వం

గాయనీ గాయకులు: కల్పన, సునీత, కీరవాణి, ఆర్పీ పట్నాయక్

● 50 మంది యువ గాయనీ గాయకులతో కలిసి ప్రముఖ గాయని కల్పన 'ఈటీవీ యాంతమ్' పేరిట రూపొందించిన ప్రత్యేక గీతాన్ని ఆలపించారు. చైతన్యప్రసాద్ రచనలో కీరవాణి స్వరపరిచిన ఈ గీతం ఈటీవీ ఆత్మను, వారసత్వాన్ని, ప్రస్థానాన్ని ప్రతిబింబించింది.

● ప్రఖ్యాత గాయకులు ఘంటసాల, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంకు నివాళులు అర్పిస్తూ... ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి బృందం చేసిన సంగీత విభావరి అలరించింది. సంప్రదాయ, ఆధునిక వాద్యపరికరాలతో నాలుగు తరాల గాయకుల బృందం చేసిన సంగీత ప్రదర్శన మైమరపించింది.

● తెలుగు సినీ చరిత్రలో నిలిచిపోయే చిత్రాలను అందించింది రామోజీ గ్రూపు వారి ఉషా కిరణ్ మూవీస్. ఈ సంస్థ నిర్మించిన మనసు మమత, ప్రేమించు పెళ్లాడు, చిత్రం, నువ్వే-నేను, కాంచనగంగ లాంటి చిరస్మరణీయమైన సినిమాల నుంచి చిత్ర, సునీత, ఎస్.పి.శైలజ, ఎస్.పి.చరణ్ బృందం క్లాసిక్ మెలోడీలను ఆలపించింది. 50 మందితో కూడిన యువ వయొలిన్ బృందం... లైవ్ ఆర్కెస్ట్రాతో వీనుల విందు చేసింది.

● ఈటీవీ స్వప్నం సాకారం కావడంలో అసమాన సృజనతో, అనుపమాన కార్యనిర్వహణతో నిరంతరం కృషి చేసిన సాహితీమూర్తి సుమన్. సినిమాల కంటే సీరియల్స్ ఏం తక్కువంటూ సుమన్ కలం నుంచి ఎన్నో మధుర గీతాలు జాలువారాయి. ఆ పాటలను గాయని సునీత సుమధురంగా ఆలపించారు.

ప్రత్యేక పదనిసలు

● మెగాస్టార్ చిరంజీవి సూపర్‌హిట్ పాటలు, ఆయనకే ప్రత్యేకమైన డ్యాన్స్ మూమెంట్స్‌తో... సినీనటి రెజీనా, విజయన్ బిన్నీ మాస్టర్ ప్రదర్శించిన 'డ్యాన్స్ మెడ్లీ' అదరహో అనిపించింది. ఆ తర్వాత నటీమణులు ఖుష్బూ, ఫరియా కలిసి చిరంజీవిని స్టేజ్ పైకి తీసుకురాగా... వారితో ఆయన సరదాగా స్టెప్పులు వేశారు. వీక్షకుల కేరింతలతో ఆడిటోరియం మార్మోగింది.



మది దోచిన రెజీనా

● ఆదిదేవుడు వినాయకుడిని స్తుతిస్తూ.. గోల్డెన్ గర్ల్స్ బృందం ఆధ్వర్యంలో కన్నుల పండువగా సాగిన నృత్య ప్రదర్శన అతిథులను ఆకట్టుకుంది.

● ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భరతజాతి ఐక్యత, సంస్కృతిని చాటేలా ప్రదర్శించిన థీమ్ సాంగ్... ప్రతిఒక్కరి గుండెల్లో దేశభక్తి ఉప్పొంగేలా చేసింది.

● జబర్దస్త్ నటబృందం సుధీర్, ఆది, రాంప్రసాద్ ప్రదర్శించిన పెళ్లి స్కిట్ వినోదభరితంగా సాగింది. రైమింగ్, టైమింగ్ కలగలిపిన పంచ్‌లతో నవ్వులు పూయించింది.



వస్తున్నారు...
మన శంకరవరప్రసాద్‌గారు

"చిరంజీవి పాట... ఆయన ఆట.. మేనరిజమ్స్, ఫైట్స్, లుక్స్‌ని అభిమానిస్తూ అనుకరించేవాళ్లు ఎంతోమంది. ఎక్కడో ఒక చోట ఆయన ప్రభావం తప్పకుండా ఉంటుంది. అలాంటి చిరంజీవిని నా కంటితో ఎలా చూడాలనుకున్నానో అలా చూపించే అవకాశం ఈ సినిమాతో వచ్చింది" అన్నారు అనిల్ రావిపూడి. ఆయన దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. నయనతార కథానాయిక. మరో అగ్ర కథానాయకుడు వెంకటేశ్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మాతలు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఈ సినిమా పేరుతో కూడిన ఓ ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. సినిమాకి 'మన శంకరవరప్రసాద్‌గారు' అనే పేరుని ఖరారు చేశారు. పండగకి వస్తున్నారు.. అనేది ఉపశీర్షిక. అభిమానుల సమక్షంలో జరిగిన ప్రచార చిత్రం విడుదల వేడుకలో దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ "మెగాస్టార్ చిరంజీవి సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనతో సినిమా చేసే అవకాశం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూశా. ఆ అవకాశం ఈ సినిమాతో వచ్చింది. పాటలు, వినోదం అద్భుతంగా కుదిరాయి. ప్రచార చిత్రం కథానాయకుడు వెంకటేశ్ వాయిస్‌తో వినిపిస్తుంది. ప్రస్తుతానికి ఆయన వాయిసే ఇచ్చారు. త్వరలోనే ఈ సినిమా సెట్‌లోకి కూడా అడుగు పెట్టబోతున్నారు. ఈ సినిమా కోసం కథానాయకుడు చిరంజీవి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ బరువు తగ్గారు. అద్భుతమైన లుక్‌లో కనిపిస్తారు" అన్నారు. అనంతరం విలేకర్లతో అనిల్ రావిపూడి మాట్లాడుతూ "సరిపోయే కథ దొరికితే చిరంజీవి - బాలకృష్ణలతో కలిసి సినిమా చేయడానికి సిద్ధమే. విభిన్నమైన వాళ్ల మేనరిజమ్స్‌కి తగ్గ కథ కుదరాల్సి ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, సంగీత దర్శకుడు భీమ్స్‌తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

బాబీ దర్శకత్వంలో మరోసారి

చిరంజీవి హీరోగా బాబీ తెరకెక్కించనున్న రెండో సినిమాని శుక్రవారం ప్రకటించింది నిర్మాణ సంస్థ కె.వి.ఎన్.ప్రొడక్షన్స్. తమిళంలో అగ్ర హీరోలతో సినిమాలు చేస్తున్న ఈ సంస్థ తెలుగులోకి అడుగుపెట్టి నిర్మిస్తున్న తొలి చిత్రమిది. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా కాన్సెప్ట్ పోస్టర్‌ని విడుదల చేస్తూ, ఈ ఏడాది చివర్లో చిత్రీకరణ మొదలవుతుందని తెలిపాయి సినీ వర్గాలు. విజయవంతమైన 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరు- బాబీ కలయికలో రూపొందుతున్న సినిమా ఇది.



నువ్వు సుందరివే.. కానీ ఎరుపు చీరే ప్రమాదం


"నువ్వు సుందరివే.. కానీ నీ ఎరుపు రంగు చీరే ప్రమాదకరంగా కనిపిస్తుంద'ని తన ప్రేయసితో కబుర్లు చెప్తున్నాడు బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా. ఆయన, అందాల తార జాన్వీ కపూర్ జంటగా నటించిన చిత్రం 'పరమ్ సుందరి'. ఈ ప్రేమకథా చిత్రాన్ని తుషార్ జలోటా తెరకెక్కించారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ నెల 29న రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా తాజాగా ఇందులోని 'డేంజర్..' అనే మరో గీతాన్ని అభిమానులతో పంచుకుంది చిత్రబృందం. 'రెడ్ అలర్ట్' అంటూ మొదలైన ఈ గీతంలో హుక్ స్టెప్పులతో అదరగొడుతున్నారు సిద్ధార్థ్, జాన్వీ.



విశాల్ చిత్రంలో అంజలి

హీరో విశాల్ 35వ చిత్రం ఇటీవలే పట్టాలెక్కింది. సూపర్ గుడ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాని రవి అరసు తెరకెక్కిస్తున్నారు. దుషార విజయన్ ఓ కథానాయికగా ఇప్పటికే ఖరారవ్వగా.. ఇప్పుడు మరో ప్రధాన పాత్ర కోసం అంజలిని రంగంలోకి దించారు.

పంజాబీ నటుడు జస్వీందర్ భల్లా మృతి



ప్రముఖ పంజాబీ నటుడు జస్వీందర్ భల్లా (65) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన మొహాలీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 'క్యారీ ఆన్ జట్టా', 'మహౌల్ ఠీక్ హై', 'జాట్ ఎయిర్‌వేస్', 'జాట్ అండ్ జూలియట్ 2' లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకుల్ని అలరించారు భల్లా. నాటక రంగంలో కూడా ఎంతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన మాదక ద్రవ్యాలు, నిరుద్యోగం, భ్రూణహత్యలు లాంటి సాంఘిక దురాచారాలను తన కళ ద్వారా ఎత్తి చూపారు. 'జస్వీందర్‌భల్లా ఈ ప్రపంచం నుంచి దూరమవ్వడం చాలా బాధాకరం. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి" అంటూ పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు భల్లా మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

ఈనాడు

ఎన్నాళ్లు ఇలా ఎరువుల వ్యథ!

ఎరువుల కొరతతో రైతులు ఏటా సతమతమవుతున్న దురవస్థపై పార్లమెంటరీ స్థాయీసంఘం గతంలో ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక బృందాలను నెలకొల్పి సరఫరాలను పర్యవేక్షించాలని సూచించింది. అటువంటి మేలిమి సిఫార్సులకు మన్నన దక్కని దౌర్భాగ్య స్థితిలో అన్నదాతలకు అగచాట్లు తప్పట్లేదు. గతంతో పోలిస్తే ఈసారి తెలంగాణలో వ్యవసాయ సీజన్ ముందుగానే మొదలైంది. పలు పంటల సాగు అధికమైంది. దానికి తగినట్లు ఎరువుల సరఫరా లేకపోవడంతో రైతన్నలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏప్రిల్-ఆగస్టు మధ్యకాలంలో కేంద్రం కేటాయించిన మొత్తం యూరియా కోటాలో దాదాపు మూడు లక్షల టన్నుల మేరకు ఇంకా అందలేదని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దాంతో పంపిణీ కేంద్రాల దగ్గర వేకువజాము నుంచే పడిగాపులు కాస్తున్నప్పటికీ చాలామందికి రిక్తహస్తాలే ఎదురవుతున్నాయి. కొరతను అడ్డుపెట్టుకుని పలుచోట్ల నల్లబజారు విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. పంటల బాగోగులను తలచుకుంటూ తల్లడిల్లుతున్న రైతాంగానికి భరోసా దక్కాలంటే- తక్షణ అవసరాలకు సరిపడా యూరియాను వెంటనే అందించాలన్న తెలంగాణ అభ్యర్థన పట్ల కేంద్రం త్వరితగతిన సానుకూలంగా స్పందించాలి!

ఏపీలోనూ ఎరువులు సకాలంలో చేతికందక సామాన్య రైతులు కలత చెందుతున్నారు. వాస్తవానికి రాష్ట్రంలోని 35శాతం సాగు భూముల్లో పంటలు ఇంకా మొదలుకాలేదు. మిరప, పత్తి తదితరాల సాగు తగ్గడం వల్ల ఎరువుల వినియోగం సహజంగానే దిగిరావాలి. ఖరీఫ్ ఎరువులకు సంబంధించి రాష్ట్ర కేటాయింపుల్లో ఇప్పటికే 68శాతం అమ్మకాలు పూర్తయ్యాయి. ఆరు లక్షల టన్నుల మేర నిల్వలూ ఉన్నాయి. అయినప్పటికీ ఎరువులకు క్షామం నెలకొనడం విస్మయపరుస్తోంది. పర్యవేక్షణ లోపాలే కారణంగానే ఈ దుస్థితి నెలకొన్నట్లు అవగతమవుతోంది. పారిశ్రామిక అవసరాలకోసం వ్యవసాయ యూరియాను దారిమళ్లిస్తున్నట్లు ఇటీవల వెలుగుచూసింది. సరిహద్దు జిల్లాల నుంచి కొందరు అక్రమంగా ఇతర రాష్ట్రాలకు ఎరువులను తరలిస్తున్నట్లు అధికారులే చెబుతున్నారు. చాలాచోట్ల ప్రైవేటు వ్యాపారులు బస్తాపై 70శాతం దాకా అధికంగా వసూలు చేస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. కొన్నిచోట్ల పురుగుమందులు కొంటేనే ఎరువులిస్తామని మొండికేస్తున్నారు. అలాంటి వారిని కట్టడి చేయడంతోపాటు సహకార సంఘాలు, మార్కెటింగ్ సొసైటీల వంటి వాటిలో ఎరువుల లభ్యతను పెంచాలి. యూరియా తదితరాల పంపిణీలో రాజకీయ జోక్యాన్ని నివారించి రైతులందరికీ అవి అందేలా చూడాలి!

పెద్ద గిన్నెడు అన్నం ఒకేసారి పెట్టినంత మాత్రాన బిడ్డ వేగంగా పెరగదు. అలాగే బండెడు రసాయనాలు గుమ్మరిస్తే ఫలసాయం రెట్టింపు కాదు. పైగా దానివల్ల నేల నిస్సారమవుతుంది. దీనిపై రైతాంగంలో అవగాహన పెంచడంలో ప్రభుత్వాల వైఫల్యం మన ఆహార భద్రతనే ప్రమాదంలోకి నెడుతోంది. గత ఆర్థిక సంవత్సరం దేశీయ పొలాల్లో సుమారు 6.56 కోట్ల టన్నుల ఎరువులను వెదజల్లినట్లు అంచనా. అంతకు ముందు ఏడాదికన్నా అది తొమ్మిది శాతం ఎక్కువ. జాతీయ సగటుతో పోలిస్తే ఏపీలో రసాయన ఎరువుల వాడకం 82శాతం దాకా అధికంగా ఉంది. తరతమ భేదాలతో తెలంగాణలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సాగు భూములను కాపాడుకోవాలంటే ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు నిర్వహిస్తూ, అవసరానికి తగినంత పరిమాణంలోనే ఎరువులను చల్లేలా అన్నదాతలను చైతన్యపరచాలి. సాగుదారుల అవసరాలతో అమానుష వ్యాపారం చేసే స్వార్థపరులపై కఠిన చర్యలు తీసుకోవాలి!

ఆర్థిక స్థిరత్వానికి అప్పుల గండం

పొదుపు, పెట్టుబడులు, ఖర్చులపై భారతీయుల దృక్పథం మారిపోతోంది. పొదుపు తగ్గుతూ అప్పులు పెరిగిపోతున్నాయి. మనదేశం ప్రపంచ అగ్ర ఆర్థిక వ్యవస్థల్లో మూడో స్థానాన్ని అందుకునే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇలాంటి సమయంలో పెట్టుబడులకు చోదక శక్తిగా నిలిచే గృహ పొదుపు క్షీణించడం మంచిది కాదు.

మొత్తం వ్యక్తిగత ఆదాయంలో పన్నులు పోగా మిగిలే దాన్ని ఖర్చు పెట్టుకోదగిన (డిస్పోజబుల్) రాబడిగా పరిగణిస్తారు. 2023లో స్థూల జాతీయ డిస్పోజబుల్ ఆదాయం(జీఎన్‌డీఐ)లో 4.9 శాతంగా ఉన్న కుటుంబ పొదుపు, 2024లో 5.1 శాతానికి పెరిగిందని రిజర్వు బ్యాంకు వార్షిక నివేదిక చెబుతోంది. కానీ, గడచిన 50ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 2023-24లో జీడీపీలో గృహ పొదుపు మొత్తాలు 5.3 శాతానికి తగ్గాయి. కుటుంబాల అప్పులు 5.8శాతం నుంచి 6.1శాతానికి పెరిగాయి. అంటే వినియోగానికీ, గృహ నిర్మాణానికీ అప్పులపైనే ఆధారపడక తప్పడం లేదని స్పష్టమవుతోంది. 2021లో 'జీఎన్‌డీఐ'లో 3.7 శాతంగా ఉన్న కుటుంబ రుణాలు 2024లో 6.1శాతానికి పెరిగాయి. దశాబ్దం క్రితం 34.6 శాతంగా ఉన్న స్థూల దేశీయ పొదుపు రేటు 2022-23లో 30శాతం దిగువకు పడిపోయింది. నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత తక్కువ రేటు ఇది. గత తొమ్మిదేళ్లలో బ్యాంకు డిపాజిట్లలో కుటుంబాల పొదుపు వాటా 43 శాతం నుంచి 35 శాతానికి పడిపోవడంపై రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా సైతం ఆందోళన వ్యక్తం చేశారు.

జీవనశైలి ద్రవ్యోల్బణం...

కొత్త తరహా ఉద్యోగాలు రావడం, తరచూ లేఆఫ్‌లకు గురికావడం, ఉద్యోగ రీత్యా తరచూ వేర్వేరు చోట్లకు మారడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో విచ్ఛిన్నకర టెక్నాలజీల రంగప్రవేశం, వస్తువ్యామోహం పెరగడం వంటివన్నీ నవతరం భారతీయుల వ్యయం, పొదుపు ధోరణుల్లో మార్పు తీసుకొచ్చాయి. క్రెడిట్ కార్డులు, మొబైల్ యాప్‌లు, డిజిటల్ వేదికల వల్ల సులభంగా రుణాలు లభిస్తున్నాయి. సున్నాశాతం లేదా చాలా తక్కువ వడ్డీతో ఈఎంఐల మీద వస్తువులను కొనే సౌలభ్యం ఏర్పడింది. వ్యక్తిగత రుణాలు విరివిగా లభించడంతో వ్యక్తులు పొదుపు కన్నా ఖర్చుపెట్టడం ఎక్కువైంది. అందుకే నేడు భారతీయులపై క్రెడిట్ కార్డు రుణాలు, వ్యక్తిగత రుణాల భారం పెరిగిపోయింది. 2024-25లో భారత జీడీపీలో కుటుంబాల రుణ భారం 6.4శాతానికి చేరింది. 2007నాటి ఆర్థిక సంక్షోభంలో కూడా దాదాపు ఇంతే తీవ్ర స్థాయి రుణభారం ఉండేది. నేడు అప్పుల బెడద మహానగరాలకు మాత్రమే పరిమితం కాదు, పట్టణాలు, గ్రామాలకు కూడా పాకింది. అందరికీ స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, ఈ-కామర్స్ అందుబాటులో ఉండి, తేలిగ్గా రుణాలు లభించడం వల్ల అప్పులు చేసే అలవాటు పెరిగిపోతోంది. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు అవసరం లేకున్నా కొత్త వస్తువులను అప్పుచేసి కానీ, పొదుపును కరిగించి కానీ కొనుక్కోవడానికి వెనకాడటం లేదు. 'జీవనశైలి ద్రవ్యోల్బణం'గా వ్యవహరించే ఇలాంటి ధోరణితో పొదుపు అలవాటు తగ్గిపోతోంది. ఆదాయాలు పెరుగుతున్నా ఖర్చులు ఎక్కువైపోవడమే దీనికి కారణం.

సినిమాల్లో, వాణిజ్య ప్రకటనల్లో చూపించే పెద్ద బంగళాలు, విలాసవంతమైన అపార్ట్‌మెంట్లలో నివసించాలనీ, ఖరీదైన కార్లలో తిరగాలనీ, విందువినోదాల్లో మునిగితేలాలనీ, విహార యాత్రలకు వెళ్లాలనే కోరికలు మధ్యతరగతిలో పెరిగిపోతున్నాయి. స్వల్పకాలిక ఆనందాల కోసం దీర్ఘకాలిక రుణఉచ్చులో కూరుకుపోతున్నారు. ప్రస్తుతం విజయవాడ, కోయంబత్తూరు వంటి మూడో అంచె పట్టణాల్లోనూ సకాలంలో వ్యక్తిగత, క్రెడిట్ కార్డ్ రుణాలు చెల్లించలేని వారి సంఖ్య ఎక్కువవుతోంది. మూడో అంచె పట్టణాల్లో ఇలాంటి వారు 4.2 శాతానికీ, గ్రామాల్లో 4.1 శాతానికీ పెరిగారు. 25 ఏళ్లలోపువారు ఎడాపెడా రుణాలు తీసుకుని చిక్కుల్లో పడుతున్నారు. 2024 డిసెంబరులో క్రెడిట్ కార్డు బకాయిలు రూ.6,742 కోట్లకు చేరినట్లు రిజర్వు బ్యాంకు తెలిపింది. ఈ రుణాలు ఏటా 28.4 శాతం చొప్పున పెరుగుతున్నాయి. అప్పులు తగ్గించడం, సకాలంలో ఈఎంఐలు చెల్లించడం, క్రెడిట్ స్కోరును సాధించడం ద్వారా దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని అందుకోవాలి.

బ్యాంకులపై తీవ్ర ప్రభావం

మన దేశంలో కుటుంబాలు, ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల మొత్తం పొదుపులో ఫ్యామిలీల వాటాయే 60శాతం ఉంటుంది. ఇటీవలి కాలంలో ఇది తగ్గిపోతోంది. కొవిడ్ కాలంలో భారతీయ కుటుంబాలు మ్యూచువల్ ఫండ్‌లు, ఈక్విటీల్లో ఎక్కువగా పొదుపు చేశాయి. తరవాత స్థిరాస్తి రంగంవైపు మళ్లాయి. కానీ స్థిరాస్తులు కొనడానికి అప్పులు ఎక్కువగా చేయాల్సి వచ్చింది. 2022-23నాటి జీడీపీలో కుటుంబాల



స్థిరాస్తుల వాటా గరిష్ఠంగా 12.9శాతాన్ని అందుకుంది. కానీ చరాస్తుల్లో నికర పెట్టుబడి 2013-2022లో 39.8 శాతంగా ఉండగా, 2022-23లో అది 28.5శాతానికి తగ్గిపోయింది. కుటుంబాలు బ్యాంకు డిపాజిట్లలో పొదుపు తగ్గించి ఈక్విటీ వంటి నష్టభయం అధికంగా ఉండే చరాస్తులవైపు మళ్లుతున్నారు. ఫలితంగా డెరివేటివ్స్ మార్కెట్ పరిణామం దేశ జీడీపీని మించిపోవచ్చనీ, ఇది ఆందోళనకరమని రిజర్వు బ్యాంకు గవర్నర్ హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితిని చక్కదిద్దేందుకు సెబీ పలు చర్యలకు ఉపక్రమించింది. కుటుంబాలు బ్యాంకు డిపాజిట్లలో పొదుపు చేయడం తగ్గించడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. బ్యాంకులు ఆర్థిక కార్యకలాపాలకు గతంలో మాదిరిగా భారీగా పెట్టుబడి రుణాలు ఇవ్వలేకపోతున్నాయి. డిపాజిట్లు తగ్గడం వల్ల బ్యాంకుల ఆస్తి-అప్పుల నిష్పత్తిలో, నగదు లభ్యతలో ఇబ్బందులు ఎదురవుతాయి. దాంతో బ్యాంకులు స్వల్పకాలిక పరిష్కారాలను వెతుక్కోవాల్సి వస్తుంది. అది కూడా సమస్యాత్మకమే. ఈ క్రమంలో బ్యాంకులు కుటుంబాల నుంచి డిపాజిట్లను ఆకర్షించేందుకు వినూత్న పద్ధతులను అనుసరించక తప్పదు. మరోవైపు, ప్రభుత్వం సైతం పొదుపు అలవాటును పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.



ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్.జ్యోతికుమార్
ఆచార్యులు, మిజోరం కేంద్రీయ విశ్వవిద్యాలయం



బాధ్యత అందరిదీ కాదా..?

వానొస్తే చెరువులూ రిజర్వాయర్లూ నిండుతాయి. పుష్కలంగా నీరుంటే పంటలు బాగా పండుతాయని సంతోషించేవాళ్లం ఒకప్పుడు. అదేంటో ఈరోజుల్లో వానంటేనే భయమేస్తోంది. అదిప్పుడు చెరువులను నింపి ఊరుకోవడం లేదు, ఇళ్లల్లోకి వస్తోంది, ఊళ్లకు ఊళ్లనే ముంచేస్తోంది. ఎందుకిలా? ఈ పరిస్థితికి కారణమెవరు? ఎవరు చేసిన నేరానికి నేటి సమాజం శిక్ష అనుభవిస్తోంది? అని ప్రశ్నిస్తే... అసలు కారణం కానివారు ఎవరు అన్న ప్రశ్నే సమాధానమవుతుంది. అవును, కొందరు నేరం చేస్తారు, మరికొందరు దాన్ని చూస్తూ ఊరుకుంటారు. రెండూ నేరాలే!

చెట్లను నాటమంటే... నరికేస్తున్నాం. ప్రకృతిని మనం కాపాడితే, అది మనల్ని కాపాడుతుందని బడిలో నేర్చుకున్న పాఠాలను బడిలోనే వదిలేస్తున్నాం. మనల్ని మనం గొప్పగా నిర్మించుకునే క్రమంలో చుట్టూ ఉన్న ప్రకృతిని ధ్వంసం చేసి వదిలిపెడుతున్నాం. ఏమీ లేని చందమామ మీదో, అంగారకుడి పైనో నివాసం ఏర్పరచుకోగల శక్తిమంతులమని గొప్పలు పోతాం. అన్నీ ఉన్న భూమిని నిర్లక్ష్యం చేస్తాం. మబ్బుల్లో నీటిని చూసి ముంత ఒలకబోసుకున్నట్లుగా తయారైంది మనిషి స్థితి. భారీ వర్షం అని మెసేజ్ వచ్చింది త్వరగా ఇల్లు చేరాలి.. . అనుకుంటాం. ఈరోజు గండం గడిస్తే చాలనుకోవడమే కానీ రేపటి తరానికి పొంచి ఉన్న పెనుముప్పును ఎలా నివారించడమో ఆలోచించలేకపోతున్నాం. అది ప్రభుత్వాల పని అని చేతులు దులుపుకొంటారు చాలామంది. ప్రభుత్వాలతో ఆ దిశగా పనిచేయించాల్సింది పౌరులేనన్న అసలు విషయాన్ని మాత్రం మర్చిపోతారు. ప్రకృతి సంరక్షణ ఏ ఒక్కరి బాధ్యతో కాదు, అది అందరి బాధ్యత. అది తెలుసుకున్న పుణ్యాత్ములు తమ వంతు కృషి చేశారు, చేస్తున్నారు. ఆ కృషిని ముందుకు తీసుకెళ్లే వారసులే ఇప్పుడు కావాలి.

జీవితంలో మనం చేయగల గొప్పపని మొక్కలు నాటడమే నంటూ గ్రీన్ బెల్ట్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు నోబెల్ శాంతి బహుమతి గ్రహీత వంగారి మతాయ్. అడవులను కాపాడుకుంటేనే భవిత అంటూ చెట్లను కొట్టకుండా వాటికి తమ ప్రాణాలను అడ్డుపెట్టారు ఉత్తరాదిన చిప్కో, దక్షిణాదిన అప్పికో ఉద్యమకారులు. అక్షరజ్ఞానం లేకపోయినా అడవుల విలువ తెలిసి ముప్పై వేల మొక్కలు నాటి నర్సరీల నిర్వహణకే జీవితాన్ని అంకితం చేసిన తులసిగౌడ గురించి విన్నాం. విత్తనాలు పంచుతూ మొక్కలు నాటుతూ తిరిగిన వనజీవి రామయ్యను చూశాం. ఆయన జీవితకథని పాఠ్యపుస్తకాల్లో రాసుకున్నాం. జాతీయ రహదారి పొడుగునా వందల్లో మర్రి చెట్లు పెంచిన సాలుమరద తిమ్మక్కని 'పద్మశ్రీ' అవార్డుతో సత్కరించుకున్నాం. మొక్కలు బతకవన్న నేలపై ఏకంగా 1360 ఎకరాల మేర అడవిని సృష్టించిన జాదవ్ పయెంగ్‌కి 'ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అని బిరుదిచ్చాం. ఇలా చెప్పుకొంటూపోతే ఎందరో పర్యావరణ యోధులు. వాళ్ల గురించి తెలుసుకుంటే సరిపోదు, వాళ్లు చూపిన దారిలో నడిస్తేనే ఇప్పటి మన కష్టాలూ తీరతాయి, ముందుతరాలకు ఈ పుడమిని పదిలంగా అందించనూగలుగుతాం.

– జూలూరు గౌరీశంకర్



సానుకూల ఆలోచనలు ఉంటే సరిపోదు,
వాటి ఆచరణలోనూ సానుకూలత కనిపించాలి.
ఒక వ్యక్తిని ముందుకు నడిపించేది
అతడి దృఢ నిశ్చయమే.

– శివ్‌ఖేరా, రచయిత

జీవిత లక్ష్యం

జీవిత లక్ష్యం ఏంటి? మానవ జీవితానికి ఏదైనా ప్రయోజనం, పరమార్థం ఉన్నాయా? ఈ మౌలిక ప్రశ్నలపై స్పష్టత వస్తే జీవితాన్ని సంఘర్షణారహితంగా, ఆనందమయంగా మలచుకోవచ్చు. జీవితాన్ని రెండు కోణాలనుంచి చూడవచ్చు. ప్రకృతిపరంగా చూస్తే మనిషి- ప్రాణికోటిలో ఓ భాగమంతే. ఇలా చూసినప్పుడు మానవ జీవితానికి ఒక నిర్దిష్ట లక్ష్యం, ప్రయోజనం లేవనే చెప్పాలి. జీవించడమే జీవిత లక్ష్యం!

ఇక ప్రపంచపరంగా చూస్తే- మనిషి ఈ నాగరిక సమాజంలో అంతర్భాగం. తల్లి, తండ్రి, కొడుకు, కూతురు, ఉద్యోగి, వ్యాపారి, దేశ పౌరుడు- ఇలా ఎన్నో పాత్రలు పోషిస్తాడు. ఈ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు ప్రతి వ్యక్తికీ కొన్ని ఆశలు, ఆశయాలు ఉంటాయి. వాటిని సమర్థంగా నెరవేర్చడం ముఖ్యం. కానీ వాటినే జీవిత లక్ష్యాలుగా భ్రమపడతారు చాలామంది. అప్పుడు ఆ పాత్రల పరంపరే జీవితంగా తయారై ఆందోళన పెంచుతుంది. ప్రస్తుతం ఇదే అతిపెద్ద సమస్య. జాగ్రత్తగా గమనిస్తే- పోషించే పాత్ర, వయసు, కాలాన్ని బట్టి మనిషి ఆశలు, ఆశయాలు ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటాయి. 'లక్ష్యం' అనుకున్నది ఒకటి పూర్తవగానే మరొకటి కనిపిస్తుంది. అందుకే ప్రాపంచిక విషయాల్లో దేన్నీ జీవిత లక్ష్యంగా, ప్రయోజనంగా పేర్కొనలేం.





ప్రకృతిపరంగా, ప్రపంచపరంగా కూడా ఏ లక్ష్యం, పరమార్థం లేకపోతే ఇక జీవించి ఉపయోగమేంటి అన్న కీలక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. నిజానికి ఈ ప్రశ్న 'అహం' నుంచి పుడుతుంది. సంకుచితమైన మనసు నుంచి జనిస్తుంది. నిరంతరం భద్రత కోసం పాకులాడే మనసు- ఏదో ఒక పాత్ర పోషణలోనే నీ జీవిత పరమార్థం ఉందని భ్రమింపచేస్తుంది. ఇక్కడే మనిషి జీవితపు విశిష్టతను అర్థం చేసుకోవాలి. జంతువులు జంతువులుగా పుడతాయి, అలాగే మరణిస్తాయి. మేధస్సు, ఊహాశక్తి, స్వీయ ఎరుక ఉన్న మనిషి మాత్రమే సృజనాత్మకంగా ఉండగలడు. ఆధ్యాత్మికంగా ఎదగగలడు. సూర్యోదయాన్ని ఆస్వాదించగలడు. ఈ విశ్వ రహస్యాలను శోధించగలడు. ఇంతటి మహాద్భుతమైన జీవితాన్ని పూర్తిగా జీవించడమే జీవిత లక్ష్యం. ఏ ఇతమిత్థమైన అర్థమూ, లక్ష్యమూ లేకపోవటమే జీవితానికి అందం.


రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితులను పక్కన పెడితే- జీవితంలో దేన్నయినా కళాత్మకంగా మార్చవచ్చు, ఏ పనిలోనైనా సృజనాత్మకతను కనబరచవచ్చు. అభిరుచి ఉన్న రంగంలో లోలోతులకు వెళ్లే స్వేచ్ఛ ఉంటేనే మనిషి తనలో దాగి ఉన్న సృజనశక్తిని వెలికి తీయగలుగుతాడు. నిజమైన విద్య ప్రయోజనం అదే. శాస్త్రవేత్త అయినా, సంగీత విద్వాంసుడైనా, కార్మికుడైనా, కర్షకుడైనా- ఎవరైనా సరే, తమ వ్యాపకంలో, తమ సృజనాత్మక సాగరంలో మునిగినప్పుడే వర్తమానాన్ని ఆస్వాదించగలరు. తమదైన ముద్రతో సృజన చేయగలరు. అదే స్వీయాన్వేషణకు నాంది, ఆధ్యాత్మికతకు పునాది. అలా అస్తిత్వం ప్రసాదించిన విషయాల్లో తనదైన స్వధర్మాన్ని జోడించి మూసకు కట్టుబడకుండా ముందుకు సాగడమే జీవిత పరమార్థం. మనిషి ఆనందానికి అదే అసలైన మార్గం.

– ఈదర రవికిరణ్

మార్పు వస్తుందా?

ధూమపానం వల్ల రకరకాల క్యాన్సర్లు చుట్టుముట్టి ఎంతోమందిని పొట్టనపెట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రిటైల్ మార్కెట్లో సిగరెట్లపై అధిక సుంకాలు విధించడం ద్వారా పొగతాగే అలవాటును తగ్గించాలని చాలా దేశాలు భావిస్తున్నాయి. అలా అభివృద్ధి చెందిన దేశాలు 75శాతానికి పైగా సుంకాలు విధిస్తుంటే, అల్పాదాయ దేశాల్లో పన్నులు చాలా తక్కువగా ఉంటున్నాయి. ఆయా దేశాల్లోనే ధూమపానం వల్ల అధికంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వాస్తవానికి, సుంకాల విధింపు వల్ల సరైన ప్రయోజనం ఉండదు. ధూమపానంపై పోరాటంలో విజయం సాధించాలంటే దానివల్ల తలెత్తే సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలి. పొగాకు సాగుదారులను ఇతర పంటల వైపు మళ్లించాలి. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపించాలి.

ఎన్ని దేశాల్లో సిగరెట్లపై ఎంత సుంకం విధిస్తున్నారంటే (శాతాల్లో)...



(ఆధారం: ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక-2025)

కొన్నాం సరే... ఎక్కడ నిలపాలి?

ప్రస్తుత జనజీవన సమస్యల్లో ప్రధానమైనది... పార్కింగ్. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా పార్కింగ్ సౌకర్యాలు లేకపోవడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం దేశంలో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వ్యవస్థీకృత పార్కింగ్ స్థలాల ఏర్పాటు చాలా అవసరం. చర్చల్లో నలుగుతున్న ఈ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయి.

గమ్యస్థానాలను త్వరగా చేరుకోవడానికి ప్రజలు వాహనాలు కొంటారు. కానీ, వాటిని నిలిపేందుకు స్థలమే కరవవుతోంది. దేశంలోని ప్రధాన నగరాల్లో పెరిగిన వాహనాలకు అనుగుణంగా పార్కింగ్ స్థలాలు లేక రోడ్ల మీద, వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వాటిని నిలపాల్సి వస్తోంది. అర్బన్ మాస్ ట్రాన్సిట్ కంపెనీ లిమిటెడ్(యూఎంటీసీ) అధ్యయనంలోనూ పార్కింగ్ కష్టాలెన్నో వెలుగు చూశాయి. స్థలాల కొరతతో చాలా చోట్ల ఫుట్‌పాత్‌లలో సైతం వాహనాలను నిలుపుతున్నారు. మన దేశంలో రిజిస్టర్ అయినవి సుమారు 26 కోట్ల ద్విచక్ర వాహనాలు, అయిదు కోట్ల కార్లు ఉన్నాయి. అంటే, దేశ జనాభా ప్రకారం ప్రతి వెయ్యి మందికి సుమారు 184 టూ వీలర్లు, 34 కార్లు ఉన్నాయన్నమాట. అయితే, పార్కింగ్ స్థలాలు మాత్రం 19,404 మాత్రమే అందుబాటులో ఉన్నాయని 'సీఈఐసీ' వెల్లడించింది. పార్కింగ్ స్థలం చూపిస్తేనే వాహనాలను రిజిస్ట్రేషన్ చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గతంలో సూచించారు. పార్కింగ్ స్థలం ఉన్నవారికి మాత్రమే కారు అమ్మాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఒక కొత్త నిబంధనను తీసుకొచ్చింది. ఇంటి దగ్గర పార్కింగ్‌కు తగిన స్థలం సంగతి సరే, పనుల మీద బయటకి వెళ్లినప్పుడు ఏంటి పరిస్థితి? బండ్లు ఎక్కడ నిలపాలి?

అందుబాటులో అరకొర స్థలాలే...

తమిళనాడులో 1789, కర్ణాటకలో 1012 పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 739 స్థలాలే లెక్కతేలుతున్నాయి. లక్షల సంఖ్యలో వాహనాలు ఉన్న ప్రధాన పట్టణాల్లో వేళ్ల మీద లెక్కపెట్టగలిగినన్ని పార్కింగ్ స్థలాలే అందుబాటులో ఉంటున్నాయి. మరి కొన్ని పట్టణాల్లో ఒక్క పార్కింగ్ స్థలం కూడా లేదంటే వ్యవస్థ ఎంత అధ్వానంగా ఉందో అవగతమవుతోంది. తెలంగాణలోనూ 576 పార్కింగ్ స్థలాలే ఉన్నాయి. కానీ, రాష్ట్రం సాంకేతికతను అందిపుచ్చుకుంది. మెట్రో రైల్ 15 అంతస్తుల ఆటోమేటెడ్ మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించింది. ఏపీలో గతంలో తెదేపా హయాంలో పార్కింగ్ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు సన్నాహాలు చేపట్టినా, వైకాపా సర్కారు ఆ ఊసే ఎత్తలేదు. ప్రారంభించిన స్మార్ట్ సిటీల కథనూ కంచికి చేర్చింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో సుమారు 84 లక్షల వాహనాలుంటే, కేవలం 304 పార్కింగ్ స్థలాలే అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని మిగిలిన ప్రధాన నగరాల్లో వాహనాలు నిలపడానికి సరైన జాగాలే కరవవుతున్నాయి.



పార్కింగ్ స్థలాలున్న కొద్ది చోట్ల కూడా సరైన నియమాలు పాటించడం లేదు. గతంలో బెంగళూరులోని ఓ పార్కింగ్ ప్రాంతంలో నిర్వహణ సరిగ్గా లేక అగ్ని ప్రమాదం జరిగి దాదాపు మూడు వందల కార్లు బుగ్గిపాలయ్యాయి. పార్కింగ్ స్థలాలు ఉన్న చోట ఏపీలో మొదటి 30 నిమిషాలు, చండీగఢ్‌లో 15 నిమిషాల వరకు వాహనాలను ఉచితంగా పార్కింగ్ చేసుకోవడానికి అక్కడి ప్రభుత్వాలు వెసులుబాటు కల్పిస్తున్నాయి. కానీ నిర్వాహణాధికారులు మాత్రం ఈ విషయాన్ని పెడచెవిన పెడుతున్నారు. వాహనదారుల నుంచి దండిగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 5న దిల్లీ రైల్వేస్టేషన్‌లో 44 నిమిషాల కారు పార్కింగ్‌కు రూ.500 వసూలు చేశారని ఒక మాజీ పోలీస్ అధికారి వాపోయారు. చాలా పార్కింగ్ స్థలాల్లో ఇదే వైఖరి కనిపిస్తోంది.


వాహనాలకు రక్షణ...

ఈ గందరగోళం నుంచి వ్యవస్థీకృత పార్కింగ్‌కు అడుగులు వేయాలంటే వినూత్న సాంకేతికతలను అందిపుచ్చుకోవాలి. ఆటోమేటెడ్ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలి. కమ్యూనిటీ, మల్టీ లెవల్, ఆన్-స్ట్రీట్, ఆఫ్-స్ట్రీట్ సదుపాయాలను కల్పించాలి. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు కలిసికట్టుగా పనిచేయాలి. రద్దీని బట్టి షేర్డ్ పార్కింగ్, డైనమిక్ ప్రైసింగ్ వ్యవస్థను అమలు చేయవచ్చు. స్కానింగ్ ద్వారా పార్కింగ్ స్థలాలు, వాటి సామర్థ్యం, వాహనాల వివరాలు తెలిసేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించాలి. ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా వాహనాలకు రక్షణ కల్పించాలి. పట్టణ, నగర ప్రణాళికలను మెరుగ్గా రూపొందించి ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, పార్కింగ్ సామర్థ్యాన్ని పెంచడంపై ప్రభుత్వాలు దృష్టి సారించడం అత్యావశ్యకం.

– వేల్పూరి వీర గంగాధర శర్మ

నమ్మకం..!

భూషయ్య అని ఒక వ్యాపారి ఉండేవాడు. తనకు సహాయకుడిగా ఒక వ్యక్తిని పెట్టుకోవాలి అనుకున్నాడు. దాని కోసం ఒక ప్రకటన వేశాడు. అది చూసి ముగ్గురు వ్యక్తులు వచ్చారు. 'మీలో ఒక్కరిని మాత్రమే పనిలోకి తీసుకుంటాం. అది.. ఎవరు అనేది మా అబ్బాయి వేణు ఎంపిక చేస్తాడు' అని చెప్పాడు భూషయ్య. వేణు ఆ ముగ్గురిలో నుంచి మొదట రంగడిని పిలిచి.. 'నీకు ఉద్యోగం ఇస్తే, మా నాన్నకు తెలియకుండా రోజూ కొంత డబ్బు నాకు ఇవ్వాలి. ఇది మన ఒప్పందం' అన్నాడు. రంగడు సరేనన్నాడు. ఆ తరవాత భీముడు వచ్చాడు. 'మా నాన్న చాలా పిసినారి. నీతో బండ చాకిరి చేయిస్తాడు. కొన్నిసార్లు పని ఎక్కువైతే ఇక్కడే ఉండిపోవాల్సి వస్తుంది. ఒక్కోసారి జీతం కూడా ఇవ్వడు' అన్నాడు వేణు. 'అలా అయితే కష్టమండీ!' అంటూ వెళ్లిపోయాడతను. ఇక చివరికి గోపాలుడు వచ్చాడు. 'మా నాన్నకు తెలియకుండా నాకు రోజూ కొంత డబ్బు ఇవ్వాలి'



అన్నాడు వేణు. 'అదెలా కుదురుతుంది. అలాంటి తప్పు పనులు నేను చేయను' జవాబిచ్చాడు గోపాలుడు. 'మరి మా నాన్న నీతో చాలా పనులు చేయిస్తాడు. సమయానికి ఒక్కోసారి జీతం ఇవ్వడు. పనిలో చేరతావా?' అన్నాడు వేణు. 'నేను ఏ పనైనా చేయగలననే నమ్మకం ఉంది. ఆయన ఏ పని ఇచ్చినా చేస్తాను. ఇక జీతం విషయానికి వస్తే.. ఆయన ఇంత వరకూ ఎవరికీ జీతం ఎగ్గొట్టలేదని చాలాసార్లు విన్నాను. ఆలస్యమైనా ఇస్తారనే నమ్మకం ఉంది' అన్నాడు గోపాలుడు. వెంటనే అతణ్ని వాళ్ల నాన్న దగ్గరికి తీసుకెళ్లి.. 'ఏ పనికైనా కావాల్సింది కష్టపడేతత్వం, నమ్మకం నాన్నా! ఆ లక్షణాలన్నీ ఇతనిలో ఉన్నాయి. మనకు కావాల్సింది ఇలాంటి మనిషే' అని చెప్పాడు వేణు. సరైన ఎంపిక చేసినందుకు భూషయ్య కొడుకును అభినందించాడు.

– నంగనభట్ల చిన్న రామకిష్టయ్య

జత చేయండి

ఇక్కడ కొన్ని దేశాల పేర్లు వాటి జాతీయ జెండాల చిత్రాలూ ఉన్నాయి. సరైన వాటిని జత చేయండి చూద్దాం.

1 చైనా
2 రష్యా
3 అమెరికా
4 జపాన్

ఎ
బి
సి
డి



జవాబు: 1-బి, 2-డి, 3-ఎ, 4-సి




దిల్లీలో శుక్రవారం 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగఢియాను సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. కేంద్రానికి సమర్పించే ఆర్థిక సంఘం సిఫారసుల్లో ఏపీకి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన్ను కోరినట్లు తెలిసింది. ఈ సందర్భంగా శ్రీవారి ప్రతిమను సీఎం చంద్రబాబు పనగఢియాకు అందజేశారు.

రాధాకృష్ణన్‌కు అందరూ మద్దతు పలకాలి

- ఉపరాష్ట్రపతి అభ్యర్థితో భేటీ తర్వాత తెదేపా అధినేత చంద్రబాబు పిలుపు
- ఎన్డీయే భాగస్వామ్యం నుంచి ఇతరులు మద్దతు ఆశించడం నైతికం కాదని హితవు


ఈనాడు, దిల్లీ: కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్డీయే భాగస్వామిగా ఉన్న తెదేపా.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 17న ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన రాధాకృష్ణన్‌ను శుక్రవారం సాయంత్రం ఇక్కడి మహారాష్ట్ర సదన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపాక ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ ఎన్నికల్లో విపక్షాల అభ్యర్థిగా నిలిచిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి తెలుగు రాష్ట్రాల ఎంపీలు మద్దతివ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రకటనల గురించి విలేకర్లు అడిగిన ప్రశ్నలకు విస్పష్టమైన సమాధానం ఇచ్చారు. "ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఎంపిక చేసినందుకు చాలా ఆనందంగా ఉన్నాం. మేమంతా కలిసే ఆయన అభ్యర్థిత్వాన్ని నిర్ణయించాం. రాధాకృష్ణన్ గౌరవం దగ్గ వ్యక్తి, అత్యున్నత స్థానానికి తగినవారు. తన పనితీరుతో దేశ గౌరవాన్ని, కుర్చీ ప్రతిష్ఠను పెంచుతారు. ఇలాంటి వ్యక్తికి మద్దతు విషయంలో మీడియా అనవసర అనుమానాలు సృష్టిస్తోంది. ఇందులో ఎవ్వరికీ అనుమానాలు అక్కర్లేదు. మేం ఎన్నికలకు ముందే ఎన్డీయేలో చేరాం. దిల్లీ, ఏపీ రెండుచోట్లా ఎన్డీయే ప్రభుత్వాలున్నాయి. అందువల్ల ఇక్కడ తెలుగువారు ఉన్న అంశం పరిగణనలోకి రాదు. నాడు కాంగ్రెస్, తెదేపాలు పరస్పరం పోరాడుతున్నా ప్రధానమంత్రి పదవిలో ఉన్న తెలుగు నాయకుడు పీవీ నరసింహారావు ఎంపీ పదవికి పోటీచేసినందుకే మేం మద్దతు పలికాం. అది విభిన్నమైన అంశం. కానీ ఇప్పుడు మేం ఎన్డీయే భాగస్వామిగా ఉంటూ ప్రతిపక్షాల అభ్యర్థికి మద్దతు పలుకుతామని ఎలా ఊహిస్తారు? అవతలివారికి మద్దతు పలకాలని అనుకోవడం నైతికమా? మా పార్టీకి నైతికత, విశ్వసనీయత ఉన్నాయి. వాటిని 50 ఏళ్లుగా నిర్మించుకుంటూ వచ్చాం. మీడియాలో కొత్తగా వచ్చినవారికి ఈ విషయాలు తెలియకపోవచ్చు, కానీ నాలుగు దశాబ్దాలుగా మా వైఖరేంటన్నది దిల్లీలోని వారికి బాగా తెలుసు. అభ్యర్థుల వారిగా చూస్తే సీపీ రాధాకృష్ణన్ ఉత్తమమైన అభ్యర్థి. అందువల్ల అందరూ ఆయనకు మద్దతు పలకాలి. పార్లమెంటు ఉభయసభల్లో ఎన్డీయేకి స్పష్టమైన మెజారిటీ ఉంది. అందువల్ల మా అభ్యర్థి సునాయాసంగా గెలుస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓడిపోతామని తెలిసినా ప్రతిపక్షాలు అభ్యర్థిని ఎందుకు నిలబెట్టాయి? తెలుగు వారు అన్నప్పుడు గెలిచే అవకాశాలుంటేనే అభ్యర్థిని నిలబెట్టాల్సింది. ఇక్కడ ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయి. మేం అలా చేయడంలేదు" అని పేర్కొన్నారు. సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు పలికినట్లు విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. ఆయనతో తన అనుబంధం ఈ రోజు కొత్తగా వచ్చింది కాదని, సుదీర్ఘకాలం నుంచి సంబంధాలున్నాయని పేర్కొన్నారు.



ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కనకమేడల, పెమ్మసాని, వినోద్ తావడే, రామ్మోహన్ నాయుడు, లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పయ్యావుల కేశవ్, దగ్గుమళ్ల ప్రసాదరావు

అభివృద్ధి పనులకు మరో రూ.5 వేల కోట్లు ఇవ్వండి

- సాస్కి పథకం కింద కేటాయించండి
- కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్‌కు సీఎం చంద్రబాబు వినతి



దిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు

ఈనాడు, దిల్లీ: మూలధన వ్యయం కోసం కేంద్ర ప్రభుత్వం అందించే ప్రత్యేక సాయం (సాస్కి) పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మరో రూ.5 వేల కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. శుక్రవారం ఆయన ఇక్కడి నార్త్ బ్లాక్‌లోని ఆర్థిక శాఖ కార్యాలయంలో ఆమెను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆర్థిక మంత్రికి వివరించారు. వాటి మూలధన వ్యయం కోసం అవసరమైన నిధులను ఈ పథకం కింద సాయంగా అందించాలని కోరారు. దీని కింద కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.2,010 కోట్లే ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచించినట్లుగా కేంద్ర ప్రాయోజిత పథకాలు, పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం, స్టేట్ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం, ఆర్‌బీఐ ఈ-కుబేర్ ప్లాట్‌ఫామ్‌లను ఒకేవేదికపైకి తెచ్చి సింగిల్ నోడల్ ఏజెన్సీని అమలు చేస్తున్నందున రూ.250 కోట్లు ప్రోత్సాహకం ఇవ్వాలని కోరారు. బిహార్, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతులు, మానవ వనరులు, ఆర్థికాభివృద్ధి కోసం 2024 బడ్జెట్‌లో ప్రకటించిన పూర్వోదయ పథకం విధివిధానాలను ఖరారు చేసి, దాని కింద రాష్ట్రానికి సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీ స్పేస్ టెక్ అకాడమీ అధ్యక్షుడిగా సుబ్బారావు



ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో శుక్రవారం ఇస్రో టీఎస్ సీఈఓ - స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డీన్ ప్రమోషన్స్ అండ్ కొలాబరేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవంలో ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ అకాడమీ(ఏపీ ఎస్‌ఏ)ని ఏర్పాటు చేశారు. ఈ అకాడమీకి అధ్యక్షుడిగా హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు పావులూరి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు మొదటివారంలో తొలి ఏపీ స్పేస్ టెక్ సదస్సు నిర్వహిస్తామని వెల్లడించారు. విద్యావేత్తలు, పరిశ్రమల అధిపతులు, పాలసీ రూపకర్తలు, ఆవిష్కర్తలను ఒకే వేదికపైకి తెచ్చి సాంకేతిక పురోగతిని ప్రదర్శిస్తారని, తదుపరి తరానికి ప్రేరణగా నిలుస్తారని చెప్పారు. పరిశ్రమ అమరావతి ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. అంతరిక్ష విషయంలో ఏపీని అగ్రగామిగా నిలుపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గౌరవ అతిథిగా హాజరైన శ్రీహరికోటలోని మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వి.శేషగిరిరావు మాట్లాడుతూ.. దేశీయ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ విశ్వసనీయ మార్గదర్శిగా నిలుస్తోందన్నారు. త్వరలోనే మానవ సహిత గగన్‌యాన్ మిషన్ ద్వారా భారత్ జెండా అంతరిక్షంలో ఎగరబోతోందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.వి.మురళీకృష్ణ, ఏఎస్‌టీసీ కార్యదర్శి సి.ఎల్.నరసింహారావు, విట్ ప్రొఫెసర్ ఇ.శ్రీనివాసరెడ్డి, విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి తదితరులు పాల్గొన్నారు.

3డీ సాంకేతికతతో అమరావతి క్వాంటమ్ భవనం!

- ఐకానిక్ భవనం ఆకృతి ఎంపిక కొలిక్కి
- నిర్మాణానికి 2 రోజుల్లో టెండరు ప్రకటన

ఈనాడు, అమరావతి: అమరావతి క్వాంటమ్ వ్యాలీలో నిర్మించే ఐకానిక్ భవనం ఆకృతిని ప్రభుత్వం ఖరారుచేసింది. ప్రపంచంలో ఎక్కడా లేని ప్రత్యేకతలు ఉండేలా ఆకృతి ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంది. ఈ దృష్ట్యా నిర్మాణ సంస్థ పలు నమూనాల్లో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో భవనాన్ని నిర్మించాలని ప్రతిపాదించింది. మొత్తం భూభాగంలో దీని వాటా 90 శాతం. చదరపు అడుగుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వివిధ కంపెనీలు, స్టార్టప్‌లు, పరిశోధనలు నిర్వహించే సంస్థలు, క్వాంటమ్ హార్డ్‌వేర్ సంస్థలు, విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం ఇందులో స్థలం కేటాయించనుంది. క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులో దీర్ఘకాలం నిలిచేపేందుకు భవనాలను ఏ ఆకృతుల్లో నిర్మించాలో ప్రభుత్వమే నిర్దేశిస్తుంది.

ఐకానిక్ భవనానికి సెప్టెంబరులో శంకుస్థాపన

ఐకానిక్ భవన నిర్మాణానికి సెప్టెంబరు మొదటివారంలో శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ తర్వాత ఎంపికచేసిన భవన ఆకృతిని విడుదల చేయనుంది. ప్రధానమంత్రిని ఆహ్వానించింది.. ఆయన చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. క్వాంటమ్ వ్యాలీని వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో శంకుస్థాపన తేదీనుంచి భవన నిర్మాణానికి 110-120 రోజులే ఉంటుంది.

3డీ ప్రింటింగ్ సాయంతో..

ఐకానిక్ భవనాన్ని '3డీ ప్రింటింగ్' సాంకేతికతతో నిర్మించనున్నట్లు తెలిసింది. ప్లాస్టిక్, టైటానియం మెటీరియల్ వినియోగించి 3డీ ప్రింటింగ్‌లో బ్లాకులు రూపొందిస్తారు. భవనం ఎలివేషన్ల డిజైన్ చేసి.. 3డీ ప్రాజెక్షన్ ఎక్కువ ఆకర్షణ ఉండేలా భవనాన్ని తీర్చిదిద్దనున్నారు. నిర్మాణంలో మామూలు ఇటుకలకు బదులు.. బయోమాస్ విధానంలో కంప్రెస్ హీటింగ్ ద్వారా తయారుచేసిన ఇటుకలను వాడనున్నారు. సాధారణ ఇటుకలతో పోలిస్తే ఇవి చాలా దృఢంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. కొంత భాగాన్ని సాధారణ విధానంలో నిర్మిస్తారు. దీంతో నిర్దేశిత వ్యవధిలో భవన నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

ఆకృతి కొలిక్కి..

వివిధ ఆకృతుల పరిశీలన తర్వాత.. ఒకదాన్ని ప్రభుత్వం ఎంపికచేసింది. క్వాంటమ్ వ్యాలీ ప్రకటించిన తర్వాత నుంచి ఆకృతి ఎంపికకు రెండు నెలలు పట్టింది. పదికి పైగా ఆకృతులను పరిశీలించి, అధికారులతో ఎనిమిది సార్లు సమావేశం నిర్వహించిన సీఎం చంద్రబాబు.. ఆకృతిలో మార్పులు సూచించారు. ఆఖరితమైన ఆకృతికి రెండు రోజుల క్రితం ఆమోదం తెలిపారు.

రెండు రోజుల్లో టెండరు ప్రకటన

ఆకృతి ఎంపిక కొలిక్కి రావడంతో.. భవన నిర్మాణానికి అంచనాలను అధికారులు రూపొందిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో దానిపై స్పష్టత రానుంది. ఆ వెంటనే గుత్తేదారు ఎంపిక కోసం టెండరు ప్రకటన జారీచేస్తారు. అంచనాలకు ప్రభుత్వ ఆమోదం కోసం వచ్చే క్యాబినెట్ ముందుకు తీసుకెళ్లనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. క్యాబినెట్ ఆమోదించగానే గుత్తేదారు ఎంపిక పూర్తిచేసి.. ఐకానిక్ భవన నిర్మాణపనులు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది.



కేంద్ర మంత్రి తనయుడికి చంద్రబాబు దీవెనలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడి నివాసానికి సీఎం చంద్రబాబు శుక్రవారం వెళ్లారు. ఇటీవల రామ్మోహన్ నాయుడు, శ్రావ్య దంపతులకు జన్మించిన కుమారుడికి ఆశీస్సులు అందించారు. కేంద్ర మంత్రి తల్లి విజయమ్మ, ఇతర కుటుంబసభ్యులతో కొద్దిసేపు మాట్లాడారు.

'అల్ప్రాజోలంను ఎందుకు పట్టుకోలేకపోయాం?'

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఓ డ్రగ్స్ తయారీ సంస్థలో రూ.23.88 కోట్ల విలువైన అల్ప్రాజోలం ముడిసరకును డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటనపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆరా తీశారు. డీఆర్ఐ వాళ్లు వచ్చి తనిఖీ చేసి పట్టుకునే వరకు వరకు మనకు ఎందుకు సమాచారం తెలియడంలేదు.. మనం ఎందుకు పట్టుకోలేకపోతున్నామని ఔషధ నియంత్రణ శాఖ ఉన్నతాధికారులను ప్రశ్నించారు. స్థానిక అధికారులు ఎందుకు తెలుసుకోలేకపోయారో ఛార్జ్ మెమో ఇచ్చి వివరణ తీసుకోవాలని స్పెషల్ సీఎస్ ఆదేశించారు.

14 వేల మందికి చీరలు పంపిన పవన్‌కల్యాణ్

- పిఠాపురం మహిళలకు అందించిన ఎమ్మెల్సీ నాగబాబు సతీమణి

పిఠాపురం, కొత్తపల్లి, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గ మహిళలకు శ్రావణమాస కానుకగా 14వేల చీరలు పంపించారు. ఎమ్మెల్సీ నాగబాబు సతీమణి పద్మజ, జనసేన పార్టీ నాయకులు కలిసి.. మహిళలకు చీరలు, పసుపు, కుంకుమలను శుక్రవారం అందజేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం పాదగయ క్షేత్రంలో ఐదు బృందాలుగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి వేలసంఖ్యలో మహిళలు ఆలయానికి పోటెత్తారు. అంతకుముందు పద్మజ.. కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకుని అనంతరం వ్రతాల్లో పాల్గొన్నారు. ఆలయ ఈఓ జగన్‌మోహన్ శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మహిళకు శ్రావణమాస కానుక అందిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు సతీమణి పద్మజ



పిఠాపురం పాదగయ క్షేత్రంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

వీడియోకాల్‌లో వైద్య నిపుణుడితో మాట్లాడుతూ.. భార్యకు ఇంట్లోనే ప్రసవం

- తమిళనాడులో ఓ బ్యాంకు మేనేజర్ నిర్వాకం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఆరోగ్యశాఖ అధికారులు

చెన్నై (విల్లివాక్కం), న్యూస్‌టుడే: పురిటి నొప్పులతో బాధపడుతున్న భార్యను ఆసుపత్రికి తీసుకెళ్లకుండా స్వయంగా భర్తే ఇంట్లోనే ప్రసవం చేసిన సంఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. తూత్తుక్కుడి జిల్లా తిరుచెందూర్‌కు చెందిన బ్యాంకు మేనేజర్ గజేంద్రన్(32), సత్య దంపతులు. వీరు ప్రస్తుతం దిండిగల్లు జిల్లా గోపాల్‌పట్టి ఎల్లైనగర్‌లోని అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. నిండు గర్భిణిగా ఉన్న సత్యకు గురువారం మధ్యాహ్నం పురిటి నొప్పులు వచ్చాయి. గజేంద్రన్ భార్యను ఆసుపత్రిలో చేర్చకుండా ఇంట్లోనే ఉంచారు. స్థానిక వైద్యులు, పోలీసులు, ఇతర అధికారులు చెప్పినా ఆ దంపతులు వినిపించుకోలేదు. ఎవరూ ఇంట్లోకి రాకుండా తలుపులు, కిటికీలు మూసివేశారు. సాయంత్రం 6.30 గంటలకు శిశువు ఏడుపు వినిపించింది. రాత్రి 7 గంటలకు తలుపుతీయడంతో వైద్యులు లోపలికి వెళ్లి సత్య ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు గుర్తించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు తేల్చారు. అనంతరం దీనిపై గజేంద్రన్‌ను విచారించగా.. వీడియో కాల్ ద్వారా వైద్య నిపుణుడితో మాట్లాడుతూ తానే ప్రసవం చేసినట్టు చెప్పారు. దీంతో గజేంద్రన్‌పై చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

అవినీతి కేసుల భయంతోనే భాజపాకు వైకాపా దాసోహం

అందుకే ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు: షర్మిల

ఈనాడు, అమరావతి: ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతిస్తున్నట్లు వైకాపా ప్రకటించడం చూస్తే.. ఆ పార్టీలోని కాషాయ కండువా మరోసారి బయటపడిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ముసుగులో ఉన్నది మోదీ పక్షమేనని తేటతెల్లమైందని శుక్రవారం ఓ ప్రకటనలో షర్మిల విమర్శించారు. 'అవినీతి కేసుల భయంతోనే భాజపాకు వైకాపా మరోసారి దాసోహమైంది. ఆ పార్టీ నేతలు ఐదేళ్లు దోచుకున్నది దాచుకోవడానికి భాజపాకు జై కొట్టారు. తెలుగు బిడ్డ, న్యాయ నిపుణుడు, 'ఇండియా' కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి వైకాపా మద్దతివ్వకపోవడం తెలుగు ప్రజలకు చేసిన ద్రోహం. దీనిపై ఆ పార్టీ సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

మరణించిన ఐదేళ్లకు అంత్యక్రియలు

- కుమార్తెను చూడలేక తల్లి ఆవేదన

కొయ్యలగూడెం, గ్రామీణ, న్యూస్‌టుడే: 'మద్యానికి బానిసైన భర్తతో వేగలేక అతడిని వదిలి ఆమె పుట్టింటికి వచ్చేసింది. తీరా అక్కడ తల్లికి భారం కాకూడదని విదేశాలకు వెళ్లి బతుకుదామనుకుంది. అక్కడా ఆమెను కష్టాలు వెంటాడాయి. చివరకు పరాయి దేశంలో రోడ్డుప్రమాదంలో కన్నుమూసిన ఆమె మృతదేహమూ అనాథగా మిగిలింది. అయినవారు, స్పందించేవారు లేక అక్కడ ఐదేళ్ల వరకూ అంత్యక్రియలకూ నోచుకోలేదు. ఓ దాత సహకారంతో అంత్యక్రియలు పూర్తిచేశారని తల్లికి సమాచారం అందింది. తన కుమార్తెను కడసారి కూడా చూసుకోలేకపోయానని ఏలూరు జిల్లా కొయ్యలగూడేనికి చెందిన లంకా సత్యవతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె కుమార్తె కోరాడ సత్యవతి (చనిపోయేనాటికి 37).. 2020లో రోడ్డుప్రమాదంలో బహ్రెయిన్‌లో మరణించారు. అప్పట్లో మృతదేహాన్ని తీసుకొచ్చే ఆర్థిక స్తోమత లేక అక్కడ వదిలేశారు. ఈ నెల 20న స్వచ్ఛంద సేవకుడి సహకారంతో మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రవాస తెలుగు సంఘం (ఏపీఎన్ఆర్టీఎస్) నుంచి సమాచారం వచ్చింది. తొలుత ఖతార్‌లో ఒకరింట్లో పనిచేసేందుకు బంధువులు తీసుకెళ్లి, కొన్నాళ్ల తర్వాత వదిలేస్తే తానే డబ్బులు సమకూర్చుకుని తన కుమార్తెను తీసుకొచ్చానని సత్యవతి తెలిపారు. అనంతరం అల్లుడు తరచూ తన ఇంటికి వచ్చి హింసిస్తుంటే. . ఆమె వేగలేక హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయిందని తల్లి వివరించారు. 2020లో ఆమె బహ్రెయిన్‌లో చనిపోయినట్లు వచ్చిన సమాచారంతోనే ఆమె అక్కడకు వెళ్లినట్లు తెలిసిందన్నారు. తనవద్ద డబ్బుల్లేక.. ఆమె శవాన్ని తీసుకురాలేకపోయానని తెలిపారు. ఎవరూ రాకపోవడంతో బహ్రెయిన్ ప్రభుత్వం ఐదేళ్లుగా మృతదేహాన్ని ఫ్రీజర్‌లో ఉంచింది. ఇప్పుడు ఓ దాత స్పందించడంతో అంత్యక్రియలు పూర్తయ్యాయని సమాచారం వచ్చింది. పిల్లల చిన్నప్పుడే భర్త చనిపోవడంతో కష్టపడి పెంచి వారికి పెళ్లిళ్లు చేశానని, తన కుమారుడు పెళ్లయ్యాక ఆత్మహత్యకు పాల్పడగా.. కుమార్తె కూడా పరాయి దేశంలో చనిపోవడంతో దిక్కులేనిదాన్ని అయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



కోరాడ సత్యవతి

ఛత్తీస్‌గఢ్ నీళ్లతో అనుసంధానం ఏమిటి?

వాళ్లు వినియోగించుకోబోమని అంగీకరిస్తారా?

- పోలవరం నుంచి అనుసంధానం చేయండి
- అభ్యంతరం లేదన్న ఆంధ్రప్రదేశ్
- జాతీయ జల అభివృద్ధి సంస్థ భేటీలో వాదన

తమిళనాడు: ఈ ప్రాజెక్టుకు ఎంఓయూపై సంతకం చేసేందుకు మాకు అభ్యంతరం లేదు. ఈ అనుసంధానం గ్రాండ్ ఆనకట్ట వరకు విస్తరించాలి.

జాతీయ జల అభివృద్ధి సంస్థ: తెలంగాణ, తమిళనాడు అదనపు డిమాండ్లను అంగీకరించలేం. ఈ ప్రాజెక్టు ప్రతిపాదన పరిధులు మార్చలేము.

కర్ణాటక: గోదావరి-కావేరి అనుసంధానం వల్ల ప్రస్తుతం ఇస్తామన్న 34 టీఎంసీలు కాకుండా మరో 40 టీఎంసీలు అదనంగా ఇవ్వాలి.

మహారాష్ట్ర: మా రాష్ట్రంలో అంతర్రాష్ట్ర అనుసంధాన ప్రాజెక్టులకు గోదావరి-కావేరి నుంచి నీళ్లు కేటాయించాలి.

ఈనాడు, అమరావతి: ఇచ్చంపల్లి నుంచి గోదావరి-కావేరి అనుసంధానంపై ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో గోదావరి-కావేరి అనుసంధానంపై చర్చ జరిగింది. భాగస్వామ్య రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జలవనరులశాఖ ఈఎన్‌సీ నరసింహమూర్తి, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ సుగుణాకర్‌రావు పాల్గొన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి ఈ పథకం ఎంఓయూపై సంతకాలు చేసేందుకు అంగీకరించాయి. ఏ రాష్ట్రం వాదన ఏమిటంటే..

ఆంధ్రప్రదేశ్: ఛత్తీస్‌గఢ్‌కు కేటాయించిన 147 టీఎంసీలు గోదావరి-కావేరి అనుసంధానానికి వినియోగిస్తామని అంటున్నారు. ఆ రాష్ట్రం ఇప్పటికే ఆ నీటితో ప్రాజెక్టులు చేపట్టబోతోంది. ఆ రాష్ట్ర వాటా నీళ్లతో అనుసంధానం చేస్తే ఆంధ్రప్రదేశ్ నష్టపోతుంది. మేం ఈ ప్రతిపాదనకు అంగీకరించబోం.

అతుల్‌జైన్ (కేంద్ర జలసంఘం ఛైర్మన్, నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్): ఇది ఛత్తీస్‌గఢ్ నీటితో నిర్మించేది కాదు. హిమాలయ నదుల అనుసంధానం వల్ల అదనంగా నీళ్లు వస్తాయి. అంతవరకు ముందే ప్రయోజనాలు సాధించేందుకు ఛత్తీస్‌గఢ్ వాటా నీళ్లు వాడుతున్నాం. ఈ విషయాన్ని ఏపీ గుర్తించి సహకరించాలి.

ఆంధ్రప్రదేశ్: అయితే హిమాలయ నదుల అనుసంధాన జలాలు వచ్చేవరకూ ఛత్తీస్‌గఢ్ 147 టీఎంసీల కేటాయింపులు వాడుకోబోమని అంగీకరిస్తుందా? పోలవరం నుంచి కావేరి అనుసంధానం చేపట్టండి. మాకు అభ్యంతరం లేదు. గోదావరి జలాల లభ్యతపై కేంద్ర జలసంఘం అధ్యయన నివేదికకు మేం అభ్యంతరాలు తెలియజేశాం. ఆ నివేదిక వాస్తవ విరుద్ధంగా ఉంది. దాన్ని పరిగణనలోకి తీసుకోకూడదు.

తెలంగాణ: ఈ అనుసంధానం మాకు సమ్మతమే. ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టు ఎత్తు మరింత పెంచి మరో 200 టీఎంసీల వరద జలాలు తెలంగాణ వినియోగించుకునేందుకు సమ్మతించాలి. మొత్తం 147 టీఎంసీల్లో సగం నీళ్లు తెలంగాణకు కేటాయించాలి. ఆంధ్రప్రదేశ్ చెబుతున్న అంతర్రాష్ట్ర అనుసంధాన ప్రాజెక్టులు చింతలపూడి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, గోదావరి-పెన్నా అనుసంధానం, పోలవరం-బనకచర్ల అనుసంధానం మాకు సమ్మతం కాదు. ఆ నిర్మాణాలను మేం అంగీకరించబోం.

నెరవేరిన ఎన్నికల హామీ

మంత్రి రాంప్రసాద్ రెడ్డి

పుంగనూరు, న్యూస్‌టుడే: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చిత్తూరు జిల్లాకు కృష్ణా జలాలు తీసుకొస్తామన్న తెదేపా అధినేత చంద్రబాబు హామీ ముఖ్యమంత్రిగా అమలు చేశారని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం ప్రసన్నయ్యగారిపల్లె వద్ద కృష్ణా జలాలకు హారతి ఇచ్చారు. సీఎం సొంత నియోజకవర్గమైన కుప్పంలో ప్రతి చెరువునూ ఈ నీటితో నింపడం సీఎం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణా జలాలకు హారతి ఇస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు

అనర్హుల పింఛన్ల తొలగింపుపై వైకాపా దుష్ప్రచారం: కొండపల్లి

ఈనాడు, అమరావతి: అనర్హుల పింఛన్ల తొలగింపుపై వైకాపా దుష్ప్రచారం చేస్తోందని, అర్హత ఉన్న ఏ ఒక్కరి పింఛనూ తొలగించబోమని సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. బోగస్ పింఛన్లపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో తనిఖీ చేపట్టిందన్నారు. అర్హులకు అన్యాయం జరిగితే అప్పీలుకు అవకాశం కల్పించామని, పునఃపరిశీలనలో అర్హత ఉన్నట్లు తేలితే పింఛన్‌ను పునరుద్ధరిస్తామని స్పష్టంచేశారు. ఇప్పటివరకు ఈ రెండు కేటగిరీల్లో 80 వేల మంది అనర్హులు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. వీరిలో వృద్ధాప్య పింఛనుకు అర్హత ఉన్న వారికి రూ.4 వేలు పింఛను అందిస్తామని శుక్రవారం సచివాలయంలో విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు.

పుస్తక హుండీ.. ఆలోచన బాగుందండి!

ఒంగోలులో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవంలో జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక హుండీ పలువురిని ఆకర్షిస్తోంది. పాఠకుల ఇంట్లో ఉన్న కథా, సాహితీ, ఇతర ఉపయుక్తమైన పుస్తకాలను ఇందులో వేస్తున్నారు. మరికొందరు కొత్తవి కొని అందజేయడం ద్వారానూ పుస్తక దాతలుగా మారుతున్నారు. పుస్తకాలపై వారి పేర్లు రాసి గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామని డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు సాంస్కృతికం



ప్రతి సవాల్ వెనుకా ఓ అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

తగ్గించడంలో భాగంగానే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. సంపద సృష్టించే వారికి అమలు చేసే హక్కు ఉంటుంది. కేవలం అప్పులు తెచ్చి సంక్షేమ పథకాలను అమలు చేయలేం. అలాగే రాష్ట్రానికి సంపద సృష్టించి, ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడం కూడా పేదలకు చేయడమే' అని చంద్రబాబు పేర్కొన్నారు.

● 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయి. 1995లో ముఖ్యమంత్రిగా నేను బాధ్యతలు చేపట్టాక ఆంధ్రప్రదేశ్‌లో రెండో తరం సంస్కరణలు ప్రారంభించాను. ప్రతి సంస్కరణ మా దగ్గర మొదలై ప్రయోజనాలు అందించింది. రాష్ట్ర విభజన ఇబ్బందులు, 2019-24 మధ్యలో గాడితప్పిన పాలన ఇప్పుడు మా ముందున్న పెద్ద సవాళ్లు. దశాబ్దాల క్రితం వ్యాపారవేత్తలు ఇచ్చిన సీఈవో బిరుదు అప్పట్లో నాకు నష్టం చేసింది. ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని నడిపించడం తెలియదని నిందించారు.

ఐటీకి భవిష్యత్తు లేదన్నారు.. మేం పట్టు వదల్లేదు

పాతికేళ్ల క్రితమే ఏపీలో ఐటీ విధానాన్ని తీసుకొచ్చాం. ఐటీకి భవిష్యత్తు లేదని అప్పట్లో ఎన్నో విమర్శలొచ్చినా పట్టు వదల్లేదు. ఫలితంగా మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు వచ్చింది. మిలియన్ల ఆఖ్యాతి పనిచేసిన ఉద్యోగే ఆ సంస్థకు సీఈఓ కాగలిగారు. ప్రభుత్వ విధానాల ఫలితంగానే మా రాష్ట్ర ప్రజలు ఎలా ఒడిసిపట్టు



సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. వేదికపై జర్నలిస్టు నిధిశర్మ

కుంటారో చెప్పడానికి ఇదో ఉదాహరణ. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా భారతీయులు, అందులోనూ 30-35% మంది తెలుగువారు ఉంటున్నారు. ప్రభుత్వ విధానాల ద్వారా మేం తెలుగువారికి ఇచ్చిన కంట్రిబ్యూషన్ ఇది.

ఏడాదిలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం

గత ఏడాది కాలంలో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మళ్లడం వల్ల పెద్ద కంపెనీలు వస్తున్నాయి. లక్ష్మీమిత్తల్ రూ.లక్ష కోట్లతో స్టీల్ సిటీ నిర్మించబోతున్నారు. బీపీసీఎల్ రిఫైనరీ ద్వారా మరో రూ.లక్ష కోట్ల పెట్టుబడి వస్తుంది. టీసీఎస్, గూగుల్ లాంటి దిగ్గజ కంపెనీలు కూడా ఏపీకి వస్తున్నాయి. ఒక్క గ్రీన్ ఎనర్జీలోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నాం.

మా మద్దతుపై సందేహమేంటి?

ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థికి మా మద్దతు విషయంలో సందేహం ఎందుకు వస్తుందని మీడియాను అడుగుతున్నా. ఒక అనుమానం సృష్టించి వ్యక్తులు, పార్టీల విశ్వసనీయతతో ఆడుకోవడం సరికాదు.

● ఓటర్ల జాబితా సవరణ నిరంతర ప్రక్రియ. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థ. అభ్యంతరాలుంటే పరిశీలనకు పంపిస్తాం. రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు కూడా ఓటర్ల జాబితా పరిశీలించాలి. అందువల్ల ఓటర్ల జాబితా తయారీపై అనుమానాలు అక్కర్లేదు.

● దేశంలో నాకు హైదరాబాద్, అమరావతి నగరాలు నిర్మించే వరమిచ్చాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత జీవనయోగ్యమైన నగరంగా అమరావతిని నిర్మిస్తున్నాం. వ్యక్తిగత ఏసీల అవసరం లేకుండా డిస్ట్రిక్ట్ కూలింగ్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నాం. సంతోషంగా జీవించాలనుకున్నవారు అమరావతికి వచ్చి స్థిరపడొచ్చు. భవిష్యత్తులో హైదరాబాద్, అమరావతిల మధ్యే ఉత్తమ నగరాల పోటీ ఉంటుంది.

బిల్ క్లింటనే కోరి.. హైదరాబాద్ వచ్చారు

'గతంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న బిల్‌క్లింటన్ ఇండియాకు వచ్చినప్పుడు హైదరాబాద్‌ను సందర్శించారు. వాస్తవానికి ఆయన్ను మేం ఆహ్వానించలేదు. అప్పటి కర్ణాటక సీఎం ఎస్‌ఎం కృష్ణ క్లింటన్‌ను బెంగళూరుకు తీసుకెళ్లాలనుకున్నారు. క్లింటన్ మాత్రం తాను హైదరాబాద్ రావాలనుకుంటున్నానని మాకు చెప్పి వచ్చారు. టైమ్స్, న్యూయార్క్ టైమ్స్, వాల్‌స్ట్రీట్ జర్నల్ వంటి పత్రికల్లో హైదరాబాద్ గురించి వార్తలు వస్తుంటే.. మనం భారతీయులం అని... చెప్పారని ఆయన అన్నారు. క్లింటన్ అమెరికా తిరిగి వెళ్లిన తర్వాత అక్కడి గవర్నర్లందర్నీ పిలిచి మనమేదో ఐటీలో గొప్ప అనుకుంటున్నాం.. కానీ హైదరాబాద్‌లో నాకు డ్రైవింగ్ లైసెన్స్ అప్లికేషన్ ఇచ్చారని చెప్పారు. ఆ రోజుల్లో ఎక్కడా ఆన్‌లైన్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చే విధానం లేదు. ఆ తర్వాత క్లింటన్ చెప్పడంతో టోనీబ్లెయిర్ హైదరాబాద్ వచ్చారు. మనం మంచి పని చేస్తే అదే మనకు ప్రచారం తెస్తుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.

- 'మీరు ఉమ్మడి రాష్ట్రం సీఎంగా ఉన్నప్పుడు లండన్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ ఘనత సాధించిన తొలి ముఖ్యమంత్రి మీరే కదా?' అని అప్పట్లో చంద్రబాబు వెంట ఆ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) ప్రతినిధి అడిగినప్పుడు ఆయన క్లింటన్ ఇండియా పర్యటన పూర్వాపరాలను గుర్తుచేశారు.

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

(మొదటి పేజీ తరువాయి)

సర్టిఫికెట్లతోపాటు ఐదేళ్ల లోపు కుల ధ్రువీకరణపత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్ల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలి. పరిశీలనకు హాజరయ్యే ముందు సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీ, సమయానికి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కాకపోయినా.. అర్హత లేకపోయినా అభ్యర్థిత్వం రద్దు చేస్తారు. ఆ తర్వాత మెరిట్‌లో ఉన్న అభ్యర్థిని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారు.

50 మందికో బృందం

జిల్లాల వారీగా సర్టిఫికెట్ల పరిశీలనకు అధికారుల బృందాలను ఏర్పాటు చేశారు. 50 మంది అభ్యర్థులకు ఒక బృందం ఉంటుంది. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు రెవెన్యూ, దివ్యాంగ సర్టిఫికెట్ల పరిశీలనకు వైద్యులను అందుబాటులో ఉంచనున్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలన సోమవారం నుంచి చేపట్టాలని విద్యాశాఖ భావిస్తోంది. సీనియర్ అధికారులను ఒక్కో జిల్లాకు ఇన్‌ఛార్జిగా నియమించింది. ఒకేసారి మొత్తం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేయనున్నారు. ఒకే అభ్యర్థికి రెండు, మూడు ఉద్యోగాలు వచ్చి, ఏదైనా ఒక్క పోస్టును ఎంపిక చేసుకుంటే ఆ తర్వాత అభ్యర్థిని ధ్రువపత్రాల పరిశీలనకు పిలుస్తారు.

● వ్యాయామ ఉపాధ్యాయ రాష్ట్రస్థాయి పోస్టుల్లో అన్నెపు జగదీశ్వరరావు 90.5 స్కోర్‌తో స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌గా నిలిచారు. రాత్రి 11.30 గంటలకు అన్ని పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

ప్రిన్సిపాల్ పోస్టుల్లో స్టేట్ టాపర్లు

ర్యాంకు	పేరు	స్కోరు
1.	చింతల గౌతమ్	75.5
2.	జి.రాజశేఖర్	73

పీజీటీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకర్లు సబ్జెక్టుల వారీగా..

సబ్జెక్టు	అభ్యర్థి	స్కోర్
తెలుగు	పట్నాన ధర్మారావు	85.5
ఆంగ్లం	వారణాసి లక్ష్మీస్వరూప	87
హిందీ	రమేష్ రామసుబ్బలు	93.5
సంస్కృతం	తునికిపాటి భాను	94
ఆంగ్ల మాధ్యమంలో..		
జీవశాస్త్రం	చోడవరం శివకుమార్	81.5
గణితం	విజయ్	78.5
భౌతికశాస్త్రం	కూరకుల బాలకోటి	74.5
సాంఘికశాస్త్రం	కురమాన నిరోషా	85

ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ)లో స్టేట్ ఫస్ట్ ర్యాంకర్లు

సబ్జెక్టు	అభ్యర్థి	స్కోర్
ఆంగ్లం	రమ్యశ్రీ వెలగల	85.43
హిందీ	పవన్ నారాయణ్	
	కోళ్ల శశి	88.53
సంస్కృతం	తునికిపాటి భాను	93.60
తెలుగు	కల్లె మహేశ్‌బాబు	85.20
ఆంగ్ల మాధ్యమంలో		
గణితం	సుంకరణం విజయ్	87.33
సామాన్యశాస్త్రం	బోకం అనిత	77.89
సాంఘికశాస్త్రం	బొమ్మిడి దిల్లేష్	84.20

సహస్రను చంపింది పదో తరగతి విద్యార్థి!

- బాలిక తమ్ముడు చదివే పాఠశాలలోనే చదువుతున్న నిందితుడు
- క్రికెట్ బ్యాట్ చోరీ చేసేందుకు వచ్చి బాలిక హత్య
- కూకట్‌పల్లిలో జరిగిన కేసును ఛేదించిన పోలీసులు

ఈనాడు, హైదరాబాద్ కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్ కూకట్‌పల్లిలో జరిగిన బాలిక సహస్ర హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్య అనంతరం ఓ బాలుడి కదలికలు అనుమానాస్పదంగా ఉన్నాయంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇచ్చిన సమాచారంతో దర్యాప్తు చేశారు. సమీప అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే పదో తరగతి విద్యార్థి(15) హత్యకు పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చారు. నిందితుడు ముందు నుంచే ఇంటర్నెట్‌లో 'దొంగతనం ఎలా చేయాలి, ఎవరైనా అడ్డొస్తే ఎలా తప్పించుకోవాలి' అనే అంశాలు అన్వేషించడంతోపాటు అవన్నీ కాగితంపై రాసుకున్నాడని పోలీసుల విచారణలో తేలినట్టు సమాచారం. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..సంగారెడ్డి జిల్లా ముక్తాక్యాసారానికి చెందిన కృష్ణ, రేణుక దంపతులు కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి కుమార్తె సహస్ర(10), కుమారుడు(8) సంతానం. సహస్ర బోయినపల్లి కేంద్రీయ విద్యాలయంలో ఐదో తరగతి చదువుతోంది. ఈ నెల 18న ఉదయం కృష్ణ, రేణుక పనులకు, కుమారుడు సమీపంలోని బడికి వెళ్లారు. పాఠశాలకు సెలవు కావడంతో బాలిక ఇంట్లో ఉంది. కుమారుడికి లంచ్‌బాక్స్ ఇచ్చేందుకు మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చిన తండ్రి.. కుమార్తె రక్తపు మడుగులో ఉండటాన్ని గుర్తించి హతాశయుడయ్యాడు. ఎటువంటి ఆనవాళ్లు దొరక్కపోవడంతో కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. 300 మందిని ప్రశ్నించినా ఫలితం లేకపోయింది.



హత్యకు గురైన సహస్ర

సమీప అపార్ట్‌మెంట్‌లో ఉంటూ..

ప్రకాశం జిల్లాకు చెందిన దంపతులు కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌లో హత్యకు గురైన బాలిక నివాస సమీపంలోని అపార్ట్‌మెంట్లో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు(హత్య కేసులో నిందితుడు), సహస్ర తమ్ముడు చదివే ప్రైవేటు పాఠశాలలోనే పదో తరగతి చదువుతున్నాడు. స్నేహితులతో ఎప్పుడూ క్రికెట్ ఆడుతూ పాఠశాలకు డుమ్మా కొట్టేవాడని, హారర్ సినిమాలు, క్రైమ్ వెబ్ సిరీస్‌లు చూస్తూ గడిపేవాడని సమాచారం.

బ్యాటు దొంగిలించాలనే ఆలోచనతో

సహస్ర తమ్ముడి వద్ద ఉన్న ఖరీదైన క్రికెట్ బ్యాట్‌ను దొంగిలించాలని బాలుడు 3 రోజుల ముందే ఇంటర్‌నెట్‌లో చూసి ప్రణాళిక రచించాడు. సోమవారం పథకం అమలుచేశాడు. ఇంటి తాళం తెరిచేందుకు వంట గదిలోని కత్తిని జేబులో పెట్టుకున్నాడు. తమ అపార్ట్‌మెంట్ పైనుంచి, పక్కనున్న భవనం పెంట్‌హౌస్ మీదికి దూకాడు. ఒంటరిగా ఉన్న సహస్ర తలుపులు దగ్గరికి వేసుకుని, లోపల టీవీ చూస్తూ ఉండటాన్ని గమనించాడు. తలుపులు తోసుకుని రహస్యంగా లోపలికి వెళ్లాడు. ఓ గదిలో ఉన్న బ్యాట్ తీసుకొని బయటకు వస్తుండగా అలికిడికి బాలిక తల తిప్పిచూసింది. కేకలు వేయడంతోపాటు అతడి చొక్కా పట్టుకుని నిలదీసింది. అమ్మానాన్నలకు చెబుతానంటూ హెచ్చరించింది. దీంతో భయపడిన బాలుడు ఆమెను తోసేసి, పొట్టమీద కూర్చొని గొంతు నులిమి ఊపిరాడకుండా చేశాడు. ఆపై తన కత్తితో గొంతు కోయడంతోపాటు విచక్షణారహితంగా పొడిచాడు.

ఇలా చిక్కాడు

అదే అపార్ట్‌మెంట్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..'హత్య జరిగిన రోజు ఓ బాలుడు గోడదూకి అపార్ట్‌మెంట్‌లోకి రావడాన్ని గమనించానంటూ' కూకట్‌పల్లి పోలీసులకు సమాచారమివ్వడంతో ఆ దిశగా విచారించారు. బాలుడు హత్య జరిగిన రోజు పాఠశాలకు రాలేదని తెలుసుకున్నారు. అనంతరం ఇంటి వద్దనే బాలుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో నిజం అంగీకరించినట్టు సమాచారం.

మిషన్ డన్.. పక్కా ప్లాన్

'మొదట ఇంట్లోకి వెళ్లాలి. గ్యాస్ ఉన్న చోటుకు చేరాలి. గ్యాస్ పైపును కట్ చేయాలి. తర్వాత మనీ తీసుకొని ఇంటిని లాక్ చేయాలి. గ్యాస్ లీక్ చేసి బయటకు రావాలి. ఇంటి బయట తాళం వేసి బయటపడాలి. మిషన్ డన్' అంటూ బాలుడు రాసిన కాగితాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కేకు తినిపించిన చేత్తోనే గొంతు కోసి

ఇటీవల సహస్ర పుట్టినరోజు వేడుకల్లో నిందితుడైన బాలుడు పాల్గొన్నాడని, కేకు తినిపించి బాలికకు శుభాకాంక్షలు చెప్పాడని పోలీసులు గుర్తించారు. 'హత్య అనంతరం బాలుడు ఎక్కడా అనుమానం రాకుండా ప్రవర్తించాడు. గతంలో పోలీసులు పాఠశాలలో విచారించినప్పుడు కూడా 'హత్య జరిగిన సమయంలో సహస్ర ఇంటి నుంచి కేకలు వినిపించాయని, డాడీ డాడీ అంటూ కేకలు వేయడాన్ని గమనించానని' చెబుతూ తనపై అనుమానం రాకుండా జాగ్రత్తపడ్డాడని తెలుసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించే సమయంలోనూ 'మీ పనికాగానే ఇంటికి పంపేయండి. మా అమ్మానాన్నలకు విషయం చెప్పొద్దంటూ' కోరినట్టు తెలిసింది.

డిగ్రీ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో కళాశాల ఐచ్ఛికాలకు మార్పు లేదు

ఈనాడు, అమరావతి: డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో ఈ ఏడాది కళాశాల లాగిన్ నుంచి సైతం వెబ్ ఐచ్ఛికాలు నమోదు చేసుకునేందుకు ఉన్నత విద్యాశాఖ అవకాశం కల్పించింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి మార్గదర్శకాలు విడుదల చేసింది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నేరుగా లేదంటే కళాశాలల నుంచి కోర్సుల ఎంపికకు వెబ్‌ఐచ్ఛికాలు నమోదు చేసుకోవచ్చు. కళాశాల లాగిన్ నుంచి వెబ్ ఐచ్ఛికాలు నమోదు చేస్తే మార్పులకు అవకాశం ఉండదు.

● అభ్యర్థి మొదట ఒక కళాశాల నుంచి నచ్చిన కోర్సును ఎంపిక చేసుకొని, ఆ తర్వాత మరో కళాశాలకు వెళ్లి వెబ్ ఐచ్ఛికం పెడితే రెండోసారి పెట్టిన కళాశాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తారు. చివరిగా ఏ కళాశాల నుంచి ఐచ్ఛికం పెడితే దానికే మొదటి ప్రాధాన్యం ఉంటుంది.

● విద్యార్థి ఆన్‌లైన్‌లో నేరుగా వెబ్ ఐచ్ఛికాలు నమోదు చేసుకొని, ఆ తర్వాత కళాశాలకు వెళ్లి వెబ్ ఐచ్ఛికాలు పెడితే కళాశాల నుంచి పెట్టిన వాటికే మొదటి ప్రాధాన్యం ఇస్తారు.

● అభ్యర్థి మొదట ఓ కళాశాల నుంచి కోర్సులు ఎంపిక చేసుకొని, ఆ తర్వాత ఆన్‌లైన్‌లో వ్యక్తిగతంగా ఐచ్ఛికాలు పెట్టుకుని, అనంతరం మరో కళాశాలకు వెళ్లి మళ్లీ ఐచ్ఛికాలు పెట్టుకుంటే రెండోసారి కళాశాల నుంచి పెట్టిన వాటికే ప్రాధాన్యం ఇస్తారు.

చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపిన సీఎం

ఈనాడు, అమరావతి: మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సినీ, రాజకీయ, సేవా రంగాల్లో ఆయన లక్షల మందిని ప్రభావితం చేశారని ఎక్స్ వేదికగా శుక్రవారం కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో పరిపూర్ణ జీవితం గడపాలని ఆకాంక్షించారు.

● చిరంజీవి జన్మదినం సందర్భంగా మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

'ఉపాధి' సిబ్బందికి ప్రమాద బీమా

ఎస్‌బీఐతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఒప్పందం

ఈనాడు, అమరావతి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) కొత్తగా ప్రారంభించిన కార్పొరేట్ వేతన ప్యాకేజీ పరిధిలోకి ఉపాధి హామీ పథకం సిబ్బందిని చేర్చి ప్రమాద బీమా వర్తింపజేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ చర్యలు చేపట్టింది. రూ.10 వేల నుంచి రూ.25 వేలలోపు వేతనం కలిగిన సిబ్బందికి రూ.3 లక్షలు, రూ.25 వేల నుంచి రూ.50 వేల వేతనం గల సిబ్బందికి రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించారు. ఈ మేరకు స్టేట్ బ్యాంక్‌తో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 8,500 మంది సిబ్బందిలో ఇప్పటికే 6,500 మంది బ్యాంకు ఖాతాలు కొత్త ప్యాకేజీ కిందకు వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన సిబ్బందికి ప్రమాద బీమా వర్తిస్తుందని అధికారులు తెలిపారు.

రూ.777 కోట్లతో 377 ఆలయాల పునరుద్ధరణ

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఈనాడు, అమరావతి: వెనుకబడిన జిల్లాల్లో ఉన్న 377 శిథిలమైన ఆలయాల్ని రూ.777 కోట్లతో పునర్నిర్మించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఇప్పటికే 206 దేవాలయాల నిర్మాణం ప్రారంభమైనట్లు, మిగిలినవి టెండర్ల దశలో ఉన్నాయన్నారు. శుక్రవారం ఆయన మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'దేవుడితోనూ రాజకీయాలు చేయడం వైకాపా వాళ్ల నైజం. హిందువుల మనోభావాల్ని దెబ్బతీస్తూ ఆలయాలపై విషప్రచారం చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే వాళ్లిలా వ్యవహరిస్తున్నారు. 40 ఏళ్లలో ఇలాంటి విపక్షాన్ని ఎన్నడూ చూడలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్చకుల వేతనాల్ని రూ.15 వేలకు పెంచాం. 599 మంది వేద విద్యార్థులకు రూ.3 వేల భృతి ఇస్తున్నాం. దేవాలయ ఆగమ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశాం' అని వివరించారు.

కమ్యూనిస్టు దిగ్గజం సురవరం కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థి దశ నుంచే..: సుధాకర్‌రెడ్డి 1942 మార్చి 25న ప్రస్తుత జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం కంచుపాడులో జన్మించారు. విద్యాభ్యాసం కోసం కర్నూలు వెళ్లారు. 15 ఏళ్ల వయసులో.. తమ పాఠశాలకు బ్లాక్‌బోర్డులు, సుద్దముక్కలు, పుస్తకాలు కావాలని కోరుతూ జరిగిన ఆందోళనలో పాల్గొన్నారు. విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు భావజాలం ఆయనను ఆకర్షించింది.

● 1960లో ఏఐఎస్‌ఎఫ్ కర్నూలు పట్టణ కార్యదర్శిగా, ఆ తర్వాత జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు.

● 1962లో వెంకటేశ్వర విశ్వవిద్యాలయ కోసం ఏర్పాటు చేసిన కమిటీ కార్యదర్శిగా పనిచేసి 62 రోజులపాటు సమ్మెకు నాయకత్వం వహించారు.

● 1964లో కర్నూలులో బీఏ చేసిన ఆయన కళాశాల విద్యార్థి సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.

● 1967లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల నుంచి ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. తర్వాత హైదరాబాద్ లా కాలేజీలో చేరిన వారంలోనే విద్యార్థి సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా గెలిచారు. ఆ ఎన్నికల అనంతరం ఆయన ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర బాధ్యతలను చేపట్టారు.

● 1970లో ఆయన ఏఐఎస్‌ఎఫ్, 1972లో ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.

● 1974 నుంచి 1984 వరకు సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పనిచేశారు.

● 1985, 90లలో కొల్లాపూర్ శాసనసభ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు.

● 1994లో కర్నూలులోని డోన్‌లో అప్పటి ముఖ్యమంత్రి విజయ్‌భాస్కర్‌రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు.

ఎంపీగా...: 1988లో నల్గొండ పార్లమెంట్ స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2000లో ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యునిగా నియమితులయ్యారు.

● 2000 సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా వామపక్షాలు నిర్వహించిన పోరాటంలో కీలక పాత్ర పోషించారు.

● 2004లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆయన నల్గొండ నుంచే రెండోసారి గెలిచారు.

● 2007లో హైదరాబాద్‌లో జరిగిన సీపీఐ జాతీయ మహాసభల్లో ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

● 2012 పట్నాలో జరిగిన జాతీయ మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

● 2015లో పుదుచ్చేరిలో, 2018లో కొల్లాంలో జరిగిన మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2021 వరకు పదవీకాలం ఉన్నప్పటికీ అనారోగ్య కారణాలతో 2019 జులై 24న వైదొలిగారు.

తెలంగాణ ఉద్యమంలో...

తెలంగాణ ఉద్యమంలో సుధాకర్‌రెడ్డిది కీలక భూమిక. మొదట్లో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు తెలిపిన సీపీఐ తర్వాత ప్రత్యేక ప్యాకేజీతో తెలంగాణ వెనుకబాటుతనాన్ని తీర్చవచ్చని భావించింది. అయితే ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం తప్ప వేరే మార్గం లేదని గుర్తించి పార్టీ వైఖరిని మార్చుకుంది. ఈ నిర్ణయం మారడంలో సుధాకర్‌రెడ్డి ప్రధానపాత్ర పోషించారు. సుధాకర్‌రెడ్డి భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం పది గంటలకు హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తరలిస్తారు. కార్యకర్తల సందర్శన తర్వాత గాంధీ మెడికల్ కళాశాలకు అందజేస్తారు.

సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సురవరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయి నేతగా ఎదిగారని, వామపక్ష ఉద్యమాలు, ప్రజా పోరాటాల్లో పాల్గొన్నారని ఆయన సేవలను స్మరించుకున్నారు. రెండుసార్లు నల్గొండ ఎంపీగా ఎన్నికైన ఆయన గొప్ప నాయకులని కొనియాడారు.

కేసీఆర్ సంతాపం: సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై భారాస అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పీడితవర్గాల అభ్యున్నతి కోసం తన జీవితకాలం కృషి చేసిన తెలంగాణ మట్టి బిడ్డ సురవరం. ప్రజానేతగా గొప్ప పేరు సంపాదించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విశేషంగా పనిచేశారు' అని ఆయనతో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు.

సీపీఐకి తీరని లోటు: పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఈనాడు, అమరావతి: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకరరెడ్డి మృతి పట్ల సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. "తాను నమ్మిన సిద్ధాంతం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలూ శ్రమించిన నేత సురవరం. ఆయన మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు" అని పేర్కొన్నారు. సురవరం కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

శునకాలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పరిమితం చేయకుండా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకూ వర్తింపజేస్తూ ధర్మాసనం ఆదేశాలిచ్చింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియా సభ్యులుగా ఉన్నారు. శునకాల సమస్యపై జాతీయ విధానం రూపొందించడానికి వీలుగా... ప్రస్తుతం హైకోర్టుల వద్ద పెండింగ్‌లో ఉన్న అభ్యర్థనలన్నీ సర్వోన్నత న్యాయస్థానం వద్దకు బదిలీ అవుతాయని ధర్మాసనం పేర్కొంది. ప్రధాన పిటిషన్‌తో కలిపి వాటిపై విచారణ జరుగుతుందని తెలిపింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

షెల్టర్లు నిర్మించండి

ఈ నెల 11న సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తొలి ఉత్తర్వుల ప్రకారం... దిల్లీ, గాజియాబాద్, నొయిడా, ఫరీదాబాద్, గురుగ్రామ్‌ల నుంచి వీధి శునకాలను తీసుకెళ్లడాన్ని మున్సిపల్ అధికారులు కొనసాగించవచ్చని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. అవసరమైన షెల్టర్లను తక్షణమే నిర్మించాలని ఆదేశించింది. ఆ శునకాలకు సంతాన నిరోధక చికిత్స, వ్యాధి నివారణ చర్యలతో పాటు టీకాలు వేసిన తర్వాత ఏ ప్రాంతం నుంచి తీసుకెళ్లారో అక్కడే వదిలిపెట్టాలని తెలిపింది. అయితే, శాశ్వతంగా శునకాలను తరలించాలన్న ఆదేశాల అమలును కొంత కాలం నిలిపివేయాలని చెప్పింది.

తీర్పులోని ముఖ్య విశేషాలు...

● తగినన్ని షెల్టర్లు, వాటిలో కనీస వసతుల్లేకుండా మూకుమ్మడిగా వీధి కుక్కలన్నింటినీ తరలిస్తే అసాధారణ పరిస్థితులు తలెత్తుతాయి. పురపాలక సంఘాల వద్ద ఉన్న మానవ వనరులు, ఇతర సదుపాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఈ తరహా ఆదేశాల అమలు అసాధ్యం. అన్ని అంశాలను సమగ్రంగా ఆలోచించిన తర్వాత ఈ నెల 11 ఉత్తర్వులకు సవరణలు చేయాల్సి వచ్చింది.

● నియంత్రణ లేకుండా శునకాలకు ఆహారం ఇవ్వడమే జనావాసాల్లో అవాంఛనీయ ఘటనలకు కారణమన్న నివేదికలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది.

● మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా వాటికి ఆహారం అందించేందుకు శాశ్వత ప్రాతిపదికన స్థలాలను మున్సిపల్ అధికారులు గుర్తించాలి. వీధి శునకాల సంఖ్య అధికంగా ఉంటే ఆ కేంద్రాల సంఖ్య పెంచాలి.

● 'ఇక్కడ మాత్రమే వీధి కుక్కలకు ఆహారాన్ని అందించాలి' అనే సందేశంతో నిర్దేశిత ఫీడింగ్ కేంద్రాల వద్ద నోటీసు బోర్డులను ఏర్పాటు చేయాలి.

● ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చర్యలుండాలి. ఫిర్యాదుల స్వీకరణకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి.

● వీధి కుక్కల రక్షణ విషయమై సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన వ్యక్తులు రూ.25వేలు, సంస్థలు రూ.2 లక్షల చొప్పున వారం రోజుల్లోగా సుప్రీంకోర్టు రిజిస్ట్రీ వద్ద డిపాజిట్ చేయాలి. షెల్టర్ల నిర్మాణానికి, శునకాల సంరక్షణకు ఆ నిధులను పురపాలక సంఘాల ద్వారా వినియోగిస్తారు.

● వీధి కుక్కలను పెంచుకోవాలనే ఆసక్తి ఉన్న జంతు ప్రేమికులు మున్సిపల్ అధికారులను సంప్రదించి వాటిని పొందవచ్చు. అయితే, అవి వీధుల్లోకి రాకుండా పూర్తి బాధ్యత వహించాలి.

జంతు ప్రేమికుల హర్షం

వీధి కుక్కలపై నిషేధం ఉత్తర్వులను సుప్రీంకోర్టు సవరించడంతో జంతు ప్రేమికులు హర్షం వ్యక్తం చేశారు. తీర్పు వెలువడిన వెంటనే దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జంతు ప్రేమికులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ అభినందనలు తెలుపుకున్నారు. తాజా తీర్పును కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ స్వాగతించారు. వార్డుల్లో ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటుకు స్థలాల ఎంపిక, ఆచరణలో తలెత్తే సమస్యలపై కొందరు సందేహాలు వ్యక్తం చేశారు.

యూట్యూబ్‌లో 'ఉపాధి హామీ' తనిఖీ సభలు

వినూత్న ఆలోచనకు రాష్ట్రంలో శ్రీకారం

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనులపై మండల స్థాయిలో నిర్వహించే సామాజిక తనిఖీ సభలను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసే వినూత్న కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వైఎస్సార్ కడప జిల్లాలోని జమ్మలమడుగు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో 2024-25 ఏడాది పనులపై సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. ఈ ప్రజావేదికను యూట్యూబ్‌లో 'కడప సోషల్ ఆడిట్' పేరుతో ప్రత్యక్ష ప్రసారం చేశారు. దీంతో పనులకు సంబంధించిన అన్ని వివరాలు ప్రజలు తెలుసుకుంటారని అధికారులు భావిస్తున్నారు.



జమ్మలమడుగులో నిర్వహించిన సామాజిక తనిఖీ సభను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ..

అంతా పైవాళ్లకే తెలుసు

(మొదటి పేజీ తరువాయి)

సిట్ ఆరా తీయగా.. 'మద్యపాన నిషేధం కోసం కొత్త పాలసీ తీసుకొస్తున్నట్లు నాకు చెప్పారు. మిగతా విషయాలన్నీ పైవాళ్లకే తెలుసు' అని నారాయణస్వామి సమాధానమిచ్చినట్లు సమాచారం.

■ 'ఆ పైవాళ్లు ఎవరు?' అని సిట్ అధికారులు అడగ్గా.. ఆయన మౌనం వహించినట్లు తెలిసింది.

■ మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులకు ఆస్కారం లేకుండా చేయటం వెనక ఎవరున్నారని ప్రశ్నించగా.. 'దాంతో నాకు సంబంధం లేదు. పైవాళ్లే నిర్ణయం తీసుకున్నారు' అని నారాయణస్వామి పేర్కొన్నట్లు సమాచారం.

■ 'ఎవరి ఒత్తిళ్ల మేరకు దస్త్రాలపై సంతకాలు చేశారు?' అని అడగ్గా.. ఆయన నీళ్లు నమిలినట్లు తెలిసింది.

■ మద్యం కుంభకోణం ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డితో సంబంధాలు, ముడుపుల సొమ్ము ఎవరెవరికి, ఎంతెంత చేరేది? ముడుపుల నిర్ణయంలో ప్రమేయంపై సిట్ బృందాలు నారాయణస్వామిని ప్రశ్నించాయి. కొన్నింటికి నేరుగా సమాధానమిచ్చిన ఆయన.. మరికొన్నింటిని దాటవేసినట్లు సమాచారం.

ప్రశ్నలన్నింటికీ కూల్‌గా జవాబు చెప్పా: 'సిట్ ప్రశ్నలన్నింటికీ కూల్‌గా జవాబు చెప్పా. భవిష్యత్తులో వారేం అడిగినా సమాధానం ఇస్తా' అని నారాయణస్వామి విచారణ అనంతరం విలేకరులతో అన్నారు.

తదుపరి అధినాయకుడేనా..?

'అన్నీ పైవాళ్లకే తెలుసు. నాకేం తెలియదు' అంటూ సిట్ విచారణలో నారాయణస్వామి వెల్లడించటంతో వైకాపాలో ఆందోళన నెలకొంది. ఆయన విచారణలో చెప్పిన సమాచారం ఆధారంగా తదుపరి తమ అధినాయకుడినే విచారిస్తారా? అనే సందేహం వారిలో వ్యక్తమవుతోంది.

వైకాపా నాయకుల హడావుడి..: నారాయణస్వామి విచారణ సందర్భంగా ఆయన ఇంటి వద్ద వైకాపా నేతలు కొంత హడావుడి చేశారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించేశారు. నారాయణస్వామి కుమార్తె, గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జ్ కృపాలక్ష్మి విచారణ సమయంలో ఇంట్లోనే ఉన్నారు. ఆమె పదేపదే హడావుడిగా తిరుగుతూ కనిపించారు.





వరలక్ష్మీ నమోస్తుతే

ఇంద్రకీలాద్రిపై సామూహిక వరలక్ష్మీ ఉచిత వ్రతాలకు శుక్రవారం విశేష స్పందన వచ్చింది. మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో దుర్గమ్మ ఉత్సవమూర్తికి వరలక్ష్మీ దేవి అలంకారం చేసి రుత్వికులు పూజలు చేశారు. చివరి శ్రావణ శుక్రవారం కావడంతో వరలక్ష్మీ వ్రతం దుర్గమ్మ సన్నిధిలో చేయించేందుకు మహిళలు ఆసక్తి చూపారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు.

- ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

ఇంటికే స్మార్ట్ రేషన్‌కార్డు

విజయవాడ (చిట్టినగర్): కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులు ఇంటికే అందించనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పాపారావు తెలిపారు. 25 నుంచి పంపిణీ చేస్తామన్నారు. 31 లోగా సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు కార్డుదారులకు ఇంటికి వచ్చి అందిస్తారని వివరించారు. పంపిణీ కాని వారికి సెప్టెంబరు 1 నుంచి చౌక ధరల దుకాణాల వద్ద ఇస్తారని చెప్పారు. కార్డుకు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ- పోస్ యంత్రాలు కూడా తహసీల్దార్ లాగిన్ ప్రక్రియ పూర్తి చేసి డీలర్లకు అందించనున్నట్లు తెలిపారు.

దారి చూపినా.. దయ తలచరేం?

పశ్చిమ బైపాస్‌కు భూమిస్తే ఇదేనా బహుమతి?

ఈనాడు, అమరావతి

వారంతా ప్రగతి రథానికి బాటలు వేశారు. సిరులు పండే భూములు త్యాగం చేశారు. ఇంత చేసినా వారికి రావాల్సిన పరిహారం విషయంలో మాత్రం పరిహాసం తప్పడం లేదు. పశ్చిమ బైపాస్ నిర్మాణానికి భూములిచ్చిన జక్కంపూడి రైతులకు ఏళ్లు గడుస్తున్నా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిహారం దక్కడం లేదు. తాజాగా తమకు పరిహారం ఇప్పించాలని కోరుతూ శుక్రవారం ఎన్‌హెచ్ఏఐ అధికారులకు వినతి పత్రం అందించారు.

సేకరించారు..విస్మరించారు..

చినఆవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ఉన్న పశ్చిమ బైపాస్ నిర్మాణానికి 2017కి ముందు భూసేకరణ చేశారు. విజయవాడ గ్రామీణ మండలం జక్కంపూడిలో మొత్తం 21 మంది రైతుల నుంచి 28 ఎకరాలు సేకరించారు. మిగిలిన ప్రాంతాల్లో ఇచ్చినట్లే ఎకరానికి రూ.25లక్షల చొప్పున పరిహారం ఇవ్వడానికి అధికారులు నిర్ణయించారు. జక్కంపూడి విజయవాడకు సమీపంలో ఉండడం.. ఇతర ప్రాంతాలతో పోలిస్తే మార్కెట్ విలువ ఎక్కువగా ఉండడంతో రైతులంతా తమకు అదనపు పరిహారం ఇవ్వాలని అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

గాలికొదిలిన వైకాపా..

రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టిన తర్వాత రైతులకు 40 శాతం అదనపు పరిహారం ఇవ్వాలని 2019లో జేసీ ఆదేశాలిచ్చారు. దీంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు అంత అదనంగా ఇవ్వలేమని కోర్టుకు వెళ్లారు. వాయిదాలకు అధికారులు హాజరుకాకపోవడంతో 2023లో కోర్టు పిటిషన్‌ను కొట్టివేసింది. అయినా అధికారులు రూ.25లక్షల పరిహారమే ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. వైకాపా హయాంలో ఐదేళ్ల రైతుల ఆవేదన పట్టించుకున్న పాపాన పోలేదు. ఒక్క ప్రజాప్రతినిధి కూడా రైతుల పక్షాన పోరాడలేదు.



ఎన్‌హెచ్ఏఐ పీడీ విద్యాసాగర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

అవస్థలపాలు చేశారు

జేసీ ఆదేశాల ప్రకారం ఎకరానికి రూ.10లక్షల చొప్పున రూ.2.8కోట్లు పరిహారం ఇవ్వాల్సి ఉంది. వడ్డీతో కలిపి రూ.5కోట్లకు పైగా రైతులకు చెల్లించాలని కలెక్టర్ ఎన్‌హెచ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. అయినా పట్టించుకోవడం లేదు. కూటమి సర్కారైనా తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. 'నాకు, నా తమ్ముళ్లకు సంబంధించిన 2.75 ఎకరాలు సేకరించారు. వడ్డీతో కలిపి మాకు రూ.60 లక్షల వరకు పరిహారం రావాలి. ఆరేళ్లుగా పంట లేదు. పరిహారం రాదు. కరోనాతో ఆర్థికంగా చితికిపోయాం' అని రైతు చలపతిరావు తెలిపారు. మిగిలిన రైతులు సైతం అవస్థలు పడుతున్నారు.

చెర వీడింది.. దరి చేరింది..!

రూ. కోట్ల విలువైన స్థలంలో సేవాకేంద్రాల ఏర్పాటు

ఈనాడు, అమరావతి

అమ్మవారి ఆధీనంలో దశాబ్దానికి పైగా ఉంది. .. తాజాగా వారి చెర నుంచి బయటపడిన స్థలం రూ. కోట్ల విలువైన దుర్గమ్మ స్థలాన్ని సద్వినియోగం చేసుకునే చర్యలు ఆరంభమయ్యాయి. ఇంద్రకీలాద్రి కొండ దిగువన భక్తులు దర్శనాల కోసం ప్రవేశించే మార్గం వద్దే కనకదుర్గనగర్‌లో ఈ స్థలం ఉంది. దీని ఎదుట రోడ్డు పక్కనే దుకాణాలు ఏర్పాటు చేసి ఈ స్థలాన్ని కనిపించకుండా చేశారు. ఈ దుకాణాల ఆక్రమణ వ్యవహారంపై 'ఈనాడు'లో రెండు నెలల కిందట కథనం ప్రచురించడంతో ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. పాత దస్త్రాలు తిరగేయగా.. 2017లో ఆలయ అవసరాల కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి రూ.1.82 కోట్లు చెల్లించి కొనుగోలు చేసిన స్థలం.. ఈ దుకాణాల వెనుక ఉందని గుర్తించారు. ప్రస్తుత మార్కెట్ విలువ దానికి రెట్టింపు ఉంటుంది. వెంటనే రంగంలోకి దిగిన ఆలయ అధికారులు ఎప్పుడో ఒక్కళ్ల వచ్చినా ఫ్లెక్సీ తగ్గకుండా దుకాణాలను తొలగించారు. స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు అక్కడే భక్తులకు ఉపయోగపడే పలు సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ★ కనకదుర్గనగర్‌లోకి ప్రవేశించే ముఖద్వారం వద్దే డోర్ నంబరు 10-2-51లో ఈ 265చ.గ. స్థలం ఉంది. కనకదుర్గ ఫ్లైవంతెనకు పక్కనే ఉన్న ఈ రూ. కోట్ల విలువైన స్థలాన్ని సద్వినియోగం చేసుకునే ప్రణాళికలు రూపొందించారు. భక్తులకు అన్ని పూజా టిక్కెట్లు విక్రయించే ఆర్జిత సేవల కౌంటర్, విరాళాలు ఇచ్చేవారి కోసం డొనేషన్ సెంటర్, భక్తులకు ఆలయ వివరాలన్నింటినీ తెలియజేసే సమాచార కేంద్రం, లగేజీని దాచుకునే క్లోక్‌రూం, మొబైల్ కౌంటర్, ప్రసాదాల కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.



కనకదుర్గనగర్ ముఖద్వారం వద్ద పనులు

కొండపైకి వెళ్లక్కర్లేదు

భక్తులు ప్రస్తుతం కొండపైకి వచ్చి ఆర్జిత సేవా టిక్కెట్లు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఇక నుంచి కొండపైకి రావాల్సిన అవసరం లేకుండా రథం సెంటర్ పక్కనే ఉన్న కౌంటర్‌లో కొనుగోలు చేయొచ్చు. పూజలు నిర్వహించే రోజు మాత్రమే పైకి రావొచ్చు. అదనపు క్లోక్‌రూం, సెల్‌ఫోన్ కేంద్రాలు బయటే ఉండటంతో బ్యాగ్‌లను మోసుకుంటూ లోపల వరకూ రావాల్సిన పని ఉండదు. ఇక్కడే దుకాణాల తొలగింపుతో వాహనాల పార్కింగ్‌కు విశాలమైన స్థలం అందుబాటులోకి వచ్చింది. ★ ప్రసాదాల కొనుగోలు, దాతలు విరాళాలు ఇచ్చేందుకూ.. ఇక్కడే కేంద్రాలు ఉండటంతో చాలా సౌకర్యంగా ఉంటుంది. ఘాట్‌రోడ్డు, కనకదుర్గనగర్‌లో భక్తుల రద్దీ తగ్గుతుంది.



పైపై పూత.. దారంతా కోత..

మహానాడు రోడ్డులో నుంచి ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులోకి వచ్చే ప్రధాన రహదారి ఇది. ఇక్కడ గోతులు ప్రమాదకరంగా ఉన్నా వారం కింద పైపైనే మట్టి వేసి మమ అనిపించారు. తీరా రెండు రోజులు వర్షాలు పడగానే అగాధాల్లా మారిపోయాయి.

-ఈనాడు, అమరావతి

ఎరువుల ఇక్కట్లపై.. కంట్రోల్ రూమ్

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో యూరియా తదితర ఎరువుల సరఫరాపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. వాటిని పక్కదోవ పట్టించేందుకు ఆస్కారం లేకుండా ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్.. ఎరువుల సరఫరాపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 4,786 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు, డీఏపీ, ఎంవోపీ, ఎస్.ఎస్.పి. కాంప్లెక్సు తదితర ఎరువులు.. 21,374 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్టు వివరించారు. ఎరువుల సరఫరాపై ఫిర్యాదులు లేదా ఏదైనా సమాచారం ఉంటే 91549 70454 నంబరుకు తెలియజేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి విజయకుమారి పాల్గొన్నారు.

వదిలేస్తే మీరు.. ముంచేయదా ఏరు

బుడమేరు వరద నీటితో పాటు కొట్టుకొచ్చిన మట్టి, రాళ్లు విజయవాడ న్యూరాజరాజేశ్వరి పేట రైలు వంతెన కింద దిబ్బలుగా పేరుకుపోయి ప్రవాహానికి ఆటంకంగా మారుతోంది. బుడమేరు పేరు చెబితే గతేడాది వరదలు గుర్తుకొచ్చి ప్రజలు హడలిపోతున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ సిబ్బంది బోట్ల సాయంతో చెత్త, గుర్రపు డెక్క తొలగిస్తున్నారు. ప్రవాహం మధ్యలో పేరుకుపోయిన భారీ మట్టి దిబ్బలను తీయడం సాధ్యం కావడం లేదు. దీన్ని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.



బుడమేరు రైల్వే బ్రిడ్జి కింద కాలువలో మట్టిదిబ్బ

-ఈనాడు, అమరావతి

నగరానికి వన్నె తెచ్చేలా విజయవాడ ఉత్సవ్

ఎన్టీఆర్ కలెక్టరేట్: రానున్న దసరా మహోత్సవాల్లో విజయవాడ ఉత్సవ్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. నిర్వహించే కార్యక్రమాలు నగరానికి వన్నె తెచ్చే రీతిలో ఉంటాయని తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం పర్యాటక స్టాల్ ఏర్పాటు చేయగా... కలెక్టర్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. విజయవాడలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి, జిల్లాను పర్యాటక హబ్‌గా మార్చేందుకు కార్యాచరణ రూపొందించి ముందడుగు వేయాలని సూచించారు. జిల్లా పర్యాటక అధికారి శిల్ప పాల్గొన్నారు.

త్వరలో ఆస్తుల అటాచ్‌మెంట్!

'యుపిక్స్' నిందితుల స్థిరాస్తుల జాబితా సిద్ధం

ఈనాడు, అమరావతి

యుపిక్స్ కుంభకోణంలో నిందితులు కొట్టేసిన సొమ్ము కక్కించేందుకు పోలీసులు వారి ఆస్తులను అటాచ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. వీరికి సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గుర్తించిన ఆస్తుల వివరాలను రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి పోలీసులు తెప్పించారు. వాటిని క్రోడీకరించి ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించారు. వీటిపై ఉత్తర్వులు ఒకటి, రెండు రోజుల్లో వెలువడే అవకాశాలున్నాయి. నష్టపోయిన బాధితులకు న్యాయం చేసేందుకు వీలుగా అయాచితంగా ఎక్కువ మొత్తంలో లబ్ధి పొందిన వారికి నోటీసులు ఇస్తున్నారు. రావాల్సిన దాని కంటే ఎక్కువ తీసుకున్న మొత్తాన్ని వెనక్కి ఇవ్వాలని, లేని పక్షంలో నిందితులుగా చేర్చి వారి ఆస్తులనూ జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇలా వెనక్కి వచ్చిన మొత్తాన్ని బాధితులకు సర్దుబాటు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ★ మూడు జిల్లాల్లో రూ.25 కోట్ల విలువైనవి.. గుంటూరు, నరసరావుపేట, విజయవాడ ప్రాంతాలకు చెందిన 338 మంది యుపిక్స్‌లో పెట్టుబడులు పెట్టారు. ఈ సొమ్మును నిర్వాహకులు ఇష్టారీతిన పంచుకుని ఆనక బోర్డు తిప్పేశారు. నిందితులు, వారి కుటుంబ సభ్యుల పేరున 2019 నుంచి కొనుగోలు చేసిన రూ.25కోట్ల విలువైన 120 స్థిరాస్తులను పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు కిరణ్, అతని తండ్రి సత్యనారాయణ పేరున ఎన్టీఆర్ జిల్లా గుణదల, నందిగామ, నున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని భూములున్నాయి. వీరి పేరున గణపవరం, రెడ్డిపాలెం, సొలస, బొప్పూడి, సందెపూడిలోనూ ఆస్తులున్నాయి. ★ మిట్టపల్లి రాజేంద్రబాబు, మిట్టపల్లి రత్నకుమారి పేరున గుంటూరు జిల్లా నల్లపాడు, ప్రత్తిపాడు, గుంటూరు నగరంలోని బ్రాడీపేట, ఆర్.అగ్రహారం ఎస్ఆర్వోల పరిధిలోని ఆస్తులు.. మురికిపాడులో మిట్టపల్లి రాజేంద్రబాబు, మిట్టపల్లి రత్నకుమారి, మిట్టపల్లి రాజీవ్ కృష్ణ పేరున ఉన్న ఆస్తులు గుర్తించారు. ★ కొత్తూరి వెంకట శివ వేణుగోపాలరావు పేరున పల్నాడు, వినుకొండ, పేరం మాల్యాద్రిరెడ్డి, పేరం మల్లికార్జునరెడ్డి, కొత్త రాధాకృష్ణారెడ్డి పేరున వినుకొండ, పెదకాకాణి, నర్సరావుపేట, గుంటూరులో భూములున్నాయి. ★ పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని మాల్యాద్రికి చెందిన కొన్ని భూములు డబ్బులు తీసుకోకుండానే బదిలీ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. వీటినీ అటాచ్‌మెంట్ జాబితాలో చేర్చారు. ★ నిందితులు, వారి కార్యాలయాల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న వివిధ ఎలక్ట్రానిక్ పరికరాల్లో డేటాను పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి డేటా రికవరీ చేశారు. ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, కంప్యూటర్ల నుంచి కీలకమైన వాట్సాప్ చాట్లు, వీడియోలు, లావాదేవీల వివరాలు రాబట్టారు. వీటిని బ్యాంకు లావాదేవీలతో సరిపోల్చుతున్నారు.

డిజిటల్ అరెస్టే లేదు... భయపడొద్దు

రెండు ఖాతాలకు విశ్రాంత ఉపాధ్యాయుడి సొమ్ము ★ మిగిలింది రూ.356



విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

డిజిటల్ అరెస్టు పేరుతో విస్సన్నపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడిని భయపెట్టి రూ.18.5 లక్షలు సైబర్ నేరగాళ్లు గుంజేసిన తీరు కలకలం సృష్టించింది. గతంలో ఇదే తరహా మోసాలతో నగర వాసులు గడగడలాడిపోయారు. సైబర్ క్రైం పోలీసుల చొరవ, బ్యాంకర్ల సహకారంతో ఆ మోసాలు కొన్నాళ్లు ఆగాయి. తాజాగా విస్సన్నపేట వాసికి బురిడీ కొట్టించారు. ఆయన బ్యాంకులో నగలు తాకట్టు పెట్టి రూ.13.5 లక్షలు అదే బ్యాంకు నుంచి సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాకు పంపించారు. తరువాత మరో రూ.5 లక్షలు జమ చేశారు.

★ నేరాల కట్టడికి బ్యాంకర్ల సహకారం అవసరమంటున్నారు పోలీసులు. ఎవరైనా పెద్ద మొత్తంలో డబ్బులు బదిలీ చేయడానికి వస్తే సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు రూపొందించిన 10 ప్రశ్నలు అడిగేవారు. అలా కొన్ని మోసాలను బ్యాంకర్లు అడ్డుకొని పోలీసుల అభినందనలు పొందారు. ఆ ప్రశ్నావళిని మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్తే మేలంటున్నారు సైబర్ క్రైం పోలీసులు.

గోల్డెన్ అవర్ కీలకం: ★ నేరం జరిగిన గంట లోపు 1930కు ఫిర్యాదు చేస్తే డబ్బులు బదిలీ అయిన ఖాతాను స్తంభింపజేస్తారు. పోయిన డబ్బులు తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువ. విస్సన్నపేట వాసి ఈ నెల 18న రూ.13.5 లక్షలు, 20న రూ.5 లక్షలు సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాలకు పంపించారు. 21వ తేదీ రాత్రి 7.20 గంటలకు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే నేరగాళ్లు ఆ డబ్బును వేరే ఖాతాలకు మళ్లించేశారు. ★ నేరగాళ్లు ఇచ్చిన రెండు ఖాతాలు తమిళనాడులోని కంచి, మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఉన్నట్టు పోలీసులు గుర్తించి నిలుపుదల చేశారు. అప్పటికే రూ.18.5 లక్షలు వేరే ఖాతాలకు బదిలీ చేయగా.. ఒక ఖాతాలో రూ.356 మాత్రమే ఉన్నాయి. నేరగాళ్లు ఇలాంటి నేరాలకు అద్దె ఖాతాలు ఉపయోగిస్తారు. పోలీసులు ఖాతా యజమానిని గుర్తించినా.. నేరానికి అతనికి సంబంధం ఉండదు. కేసు పెట్టినా ఉపయోగం ఉండదు.

★ డిజిటల్ అరెస్టు అనేదే లేదంటున్నారు పోలీసులు. అధికారులమని ఎవరైనా ఫోన్ చేసి అరెస్టు చేస్తామని బెదిరిస్తే కంగారు పడకూడదు. వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఉత్తమ స్టార్టప్‌లకు రూ.కోటి పెట్టుబడి

ఏపీ ఇన్నోవేషన్ తరఫున.. హ్యాకథాన్



మాట్లాడుతున్న ఏపీటీఎస్ ఎండీ సూర్యతేజ, వేదికపై ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్, ప్రిన్సిపల్ కృష్ణవేణి తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ తరపున త్వరలో హ్యాకథాన్ నిర్వహిస్తామని, ఉత్తమంగా నిలిచిన స్టార్టప్‌లకు ఎలాంటి టెండర్లు లేకుండా నేరుగా రూ.కోటి పెట్టుబడి పెడతామంటూ ఏపీ టెక్నాలజీ సర్వీస్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ ప్రకటించారు. విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. భవిష్యత్తులో ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా ఏపీ ఎదగబోతోందని ఆయన పేర్కొన్నారు. విజయవాడ కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో కోడ్ స్పార్క్ జాతీయ స్థాయి హ్యాకథాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూర్యతేజ మాట్లాడుతూ.. కొత్త ఆవిష్కరణలొస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించేందుకు వంద శాతం కృషి చేయాలని సూచించారు. యువతను ప్రోత్సహించేందుకు స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ రంగాలకు ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలో 1.30కోట్ల కుటుంబాల నుంచి పారిశ్రామికవేత్తలు తయారు కావాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం సాగుతోందని సూర్యతేజ వెల్లడించారు. రుషికొండలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేశామని ప్రతి విద్యార్థి సందర్శించాలని కోరారు.



కేబీఎన్ కళాశాలలో కోడ్ స్పార్క్ హ్యాకథాన్‌లో వివిధ రాష్ట్రాల విద్యార్థులు

సమస్యలకు పరిష్కారం దిశగా..

★ ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. ఆలోచనలను ఆచరణలోకి తీసుకొచ్చి, సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు సూచించే దిశగా స్టార్టప్‌లను ఏర్పాటు చేయాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల నుంచి 350కి పైగా బృందాలు హ్యాకథాన్‌లో పాల్గొన్నాయని వివరించారు. ఉత్తమ కోడింగ్ చేసిన విద్యార్థులకు తమ కళాశాల ఇన్నోవేషన్ హబ్ ద్వారా చేయూత అందించి, వారు స్టార్టప్ ప్రారంభించేందుకు సహకరిస్తామని చెప్పారు. కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏవో వి.నారాయణరావు, కళాశాల కంప్యూటర్స్ విభాగాధిపతి పి.రవీంద్ర, వైస్ ప్రిన్సిపల్స్ వెంకటేశ్వరరావు, రమేష్, రామకృష్ణ, ఐక్యూఏసీ సమన్వయకర్త షమీమ్ పాల్గొన్నారు.

భోజనం వారాలు మార్చాలన్న చెవిరెడ్డి పిటిషన్ కొట్టివేత

ఈనాడు - అమరావతి: తనకు ఇంటి నుంచి వస్తున్న ఆహారానికి సంబంధించి వారాలను మార్చాలని వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసుకున్న పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. తనకు మధ్యంతర, రెగ్యులర్ బెయిళ్లు మంజూరు చేయాలని చెవిరెడ్డి వేసిన పిటిషన్లపై తదుపరి విచారణ నిమిత్తం ఈనెల 25వ తేదీకి వాయిదా పడింది. గుంటూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్న నిందితులు బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై శుక్రవారం వాదనలు పూర్తి అయ్యాయి. తుది ఉత్తర్వుల కోసం 29వ తేదీకి న్యాయాధికారి భాస్కరరావు వాయిదా వేశారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి: ఎంపీ

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే : విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. విజయవాడలోని ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలు, నిర్మాణానికి అనుమతులు వచ్చిన ఎల్‌సీ గేట్ నంబరు 316 (విజయవాడ- గుణదల మధ్య), ఎల్‌సీ నంబరు 147 (రాయనపాడు- కొండపల్లి మధ్య) ఎల్‌సీ నంబరు 148 (విజయవాడ- రాయనపాడు మధ్య), ఎల్‌సీ నంబరు 8 (విజయవాడ- గుడివాడ లైన్ గుణదల సమీపంలో)లకు త్వరగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. కొండపల్లి రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ 2.0 కింద ఆధునికీకరించాలని, ప్రస్తుతం కొండపల్లి స్టేషన్‌లో 366 మీటర్ల పొడవు ఉన్న ప్లాట్‌ఫారం మాత్రమే ఉందని.. అందులో 136 మీటర్లు హైలెవల్, మిగతా 230 మీటర్లలో లెవల్ ప్లాట్‌ఫారంగా ఉండటంతో ప్రయాణికులు రైళ్లు ఎక్కడానికి, దిగడానికి ఇబ్బందులు పడుతున్నారని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. జీఎం సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఎంపీ పేర్కొన్నారు.



జీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న కేశినేని శివనాథ్

ఉయ్యూరుకు పురవైభవం

గ్రేడ్-2 మున్సిపాలిటీగా ప్రకటన

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, ఉయ్యూరు

విజయవాడ, మచిలీపట్నం నగరాలకు మధ్యలో ఉన్న ఉయ్యూరు నగర పంచాయతీని ద్వితీయ శ్రేణి(గ్రేడ్ 02) మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉయ్యూరుకు వర్గోన్నతి కల్పించాలనే ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గత ఏప్రిల్‌లో దీనిపై కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. 2020-21 నుంచి 2024-25 వరకు నగర పంచాయతీ ఆదాయ వివరాలతో కూడిన నివేదిక అందజేశారు. ఆ వివరాలు పరిశీలించిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ దీనికి ఆమోద ముద్ర వేశారు. దీంతో ఉయ్యూరుకు వర్గోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం గెజిట్‌ను విడుదల చేసింది.

కేంద్ర, రాష్ట్రాల నిధుల రాక..

పంచాయతీగా ఉన్న ఉయ్యూరును అప్‌గ్రేడ్ చేస్తూ 2011లో నగర పంచాయతీగా మార్చారు. ప్రస్తుతం స్థాయి మరింత పెరిగి ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా మారింది. గత మార్చి 17న దీనిపై కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. ఉయ్యూరులోని వనరులు, వచ్చే ఆదాయం, పెరుగుతున్న జనాభా, పట్టణ విస్తీర్ణం వంటి అంశాలను ప్రభుత్వం అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే ఆమోద ముద్ర వేసింది. ప్రస్తుతం 20 వార్డులతో నగర పంచాయతీగా ఉన్న ఉయ్యూరులో 2500 టిడ్కో గృహాలు, 2450 జగనన్న కాలనీ ప్లాట్లు కొత్తగా వెలిశాయి. గత దశాబ్దకాలంలో పట్టణం బాగా విస్తరించింది. ఆదాయం రూ.5 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం వర్గోన్నతి కల్పించడంతో మరింత స్వయం ప్రతిపత్తి రావడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు ఉయ్యూరుకు వస్తాయి.



పట్టణ స్వరూపం..

★ జనాభా: 54,500
★ విస్తీర్ణం: 12.79 చ.మీ
★ ఇళ్లు: 12,023
★ 2011లో ఆదాయం: రూ.1.20 కోట్లు
★ ప్రస్తుతం: రూ.4.90 కోట్లు

సాయి పెరగడంతో స్వయం ప్రతిపత్తి..

ప్రత్యేక పన్ను జోన్లు, పట్టణ ప్రణాళిక ప్లానింగ్, పారిశుద్ధ్యం నిర్వహణ విషయంలో మరింత స్వయం ప్రతిపత్తి వస్తుంది. పట్టణీకరణ, అభివృద్ధి వేగవంతమవుతాయి. ★ 15వ ఆర్థిక సంఘం నిధుల చివరి వాటా వస్తుంది. ★ 16వ ఆర్థిక సంఘం నిధులు పెరుగుతాయి. ★ అధికారులు, సిబ్బందికి 10శాతం హెచ్‌ఆర్ వస్తుంది. ★ ఇంజినీరింగ్ విభాగంలో డీఈఈ స్థాయి వస్తుంది. ★ పట్టణ ప్రణాళికలో సిబ్బంది పెరుగుతారు. ★ ప్రజారోగ్య, పారిశుద్ధ్యం మెరుగుపడతాయి.

డబ్బులు తీసుకొని ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా జాప్యం

బాధితుడి ఫిర్యాదు మేరకు దాసరి కిరణ్‌కుమార్‌పై మరో కేసు

పటమట, న్యూస్‌టుడే: వ్యూహం సినిమా నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ రియల్ ఎస్టేట్ ముసుగులో పలువురి వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసిన ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. బాధితులు ఒక్కొక్కరిగా బయటకు వస్తున్నారు. శుక్రవారం పటమట లంకకు చెందిన దుగ్గినేని గోపాలరావు కిరణ్‌కుమార్‌పై పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2017 సంవత్సరంలో దాసరి కిరణ్‌కుమార్ హైదరాబాద్‌లో వేసిన గోల్డెన్ క్రౌన్ వెంచర్‌లో 365 చదరపు గజాల ప్లాట్‌ను గోపాలరావు కొనుగోలు చేయడానికి బేరం కుదిరింది. ఈమొత్తాన్ని గోపాలరావు చెక్కులు, నగదు రూపేణా కిరణ్‌కుమార్‌కు చెల్లించారు. పూర్తి డబ్బులు చెల్లించినా కిరణ్‌కుమార్ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకుండా జాప్యం చేస్తూ వచ్చారు. ఇదే ప్లాట్‌ను వేరొకరికి రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుసుకొని గోపాలరావు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శుక్రవారం రాత్రి పొద్దుపోయాక కిరణ్‌కుమార్‌పై ఐపీసీ సెక్షన్ 420 కింద కేసు నమోదు చేశారు. కిరణ్‌కుమార్‌పై నమోదైన మూడో కేసు ఇది.



వంకాయలు-22/18, టమాటా-44, బెండ-22, పచ్చిమిర్చి-28, కాకర-22, బీర-32/40, క్యాబేజి-22, క్యారెట్-34/44, దొండ-16, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుళ్లు-24, దోస-20, సొర-14/16, పొట్ల-20, అరటికాయ-8/7, చామదుంప-26, అల్లం-50/90, మునగ-5/6, ఆకుకూరలు (కట్ట)-3/8, కంద-38, బీట్ రూట్-28, కీర దోస-36, బీన్స్-68, క్యాప్సికమ్-68, నిమ్మ (డజను)-30/24, కొత్తిమీర-12/24, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-13/15 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.
- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

నీవు లేక కన్నా.. నేను లేను నాన్న..

తల్లీబిడ్డలను బలిగొన్న లారీ ❖ కీసర టోల్‌ప్లాజా వద్ద విషాదం



చైతన్య (పాత చిత్రం)

కీసర (కంచికచర్ల), న్యూస్‌టుడే: రహదారి ప్రమాదం ఆ కుటుంబంలో అంతులేని శోకాన్ని మిగిల్చింది. ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ముక్కు పచ్చలారని మూడు నెలల చిన్నారి అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర గాయాలైన తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. విషాదకరమైన ఈ ఘటన కంచికచర్ల మండలం కీసర స్వర్ణ టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారి 65పై శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ సమీపంలోని కానూరుకు చెందిన నవీన్, చైతన్య(20)లకు గతేడాది వివాహమైంది. వీరికి మూడు నెలల కిందట ఆద్విక్ బాబు పుట్టాడు. కీసరలో చైతన్య బంధువు గారపాటి రేణుక ఉంటారు. ఆమె ఆహ్వానం మేరకు చైతన్య, తన కుమారుడితో కలిసి రేణుక ఇంటికి వెళ్లేందుకు విజయవాడ నుంచి బస్సులో వచ్చి, కీసర స్వర్ణ టోల్ ప్లాజా వద్ద దిగింది. తాను వచ్చిన విషయం రేణుకకు ఫోన్‌లో తెలపగా.. ఆమె.. చైతన్య, ఆమె కుమారుడిని తీసుకొచ్చేందుకు తమ ఇంటి పక్కన ఉండే శ్రీరామచంద్రమూర్తి అనే వ్యక్తిని పంపగా.. అతడు ద్విచక్ర వాహనంపై వారిని తీసుకొని వెళుతుండగా.. విజయవాడ నుంచి నందిగామ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారి ఆద్విక్ అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర గాయాలైన చైతన్య, శ్రీరామచంద్రమూర్తిలను నందిగామలో చికిత్స అనంతరం, మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చైతన్య చనిపోయింది. చిన్నారి జీవితం మూడు నెలలకే ముగియడం, భార్య సైతం ప్రమాదంలో మృతిచెందడంతో నవీన్ గుండెలవిసేలా రోదించారు. కీసర స్వర్ణ టోల్ ప్లాజా వద్ద రహదారి ఆక్రమణకు గురైందని, వాహనదారులు సైతం మితిమీరిన వేగంతో వెళుతుండటంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సజావుగా సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : లబ్బీపేట రెడ్‌సర్కిల్‌లోని బిషప్ అజరయ్య బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు పరీక్షకు 106 మంది అభ్యర్థులకుగాను 102 మంది హాజరయ్యారని వెల్లడించారు. విభిన్న ప్రతిభావంతులు పరీక్షలు రాసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 23, 24, 30, 31 తేదీల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కలెక్టర్ వెంట లైజన్ అధికారులు బి.రామకృష్ణనాయక్, సి.లక్ష్మీనారాయణరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కె.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పుణ్య క్షేత్రాలకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే : పుణ్య క్షేత్రాల సందర్శనార్థం వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ఐఆర్‌సీటీసీ భారత్ గౌరవ్ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 9 రాత్రులు, 10 పగళ్లతో గల ఈ ప్యాకేజీలో రైలు సెప్టెంబరు 9న సికింద్రాబాద్‌లో ఉదయం 11 గంటలకు బయలుదేరి ఖాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం మీదుగా పూరిలోని జగన్నాథస్వామి ఆలయం, సూర్య దేవాలయం, డియోఘర్ బాబా బైద్యనాథ్ ఆలయం, వారణాశిలోని కాశీ విశ్వనాథ ఆలయం, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణదేవి ఆలయం, గంగా హారతి, అయోధ్యలోని రామ జన్మభూమి, ప్రయోగరాజ్‌లోని త్రివేణి సంగమం తదితర ప్రాంతాలకు వెళుతుంది. టీ, అల్పాహారం, భోజనం, హోటల్ గదులు, రవాణాతో కలిపి టిక్కెట్ ధర ఒక్కొక్కరికీ స్లీపర్ తరగతిలో రూ.17 వేలు, థర్డ్ ఏసీలో రూ.26,700, సెకెండ్ ఏసీలో రూ.35 వేలు ఉంటుంది. టిక్కెట్ల బుకింగ్ ఇతర వివరాలకు ఫోన్ నంబరు 9701360701లో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

శాంతిస్తున్న కృష్ణమ్మ



ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కృష్ణా నదిలో వరద క్రమేపీ తగ్గుతోంది. ప్రకాశం బ్యారేజీకి శుక్రవారం ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 4.59 లక్షల క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 4.43 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 4.33 లక్షల క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 4.16 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. రాత్రి 7 గంటల వరకు ఇదే పరిస్థితి ఉంది. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉంది. పులిచింతల (వజినేపల్లి) నుంచి 3,99,589, పాలేరు నుంచి 2,057, కీసర (మునేరు) నుంచి 11,068 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు సాగునీటి విడుదలను 16,776 క్యూసెక్కులకు పెంచారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 9,750, కృష్ణా పశ్చిమ (ఈడబ్ల్యూ) ప్రధాన కాలువకు 7,026 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 4,891, కేఈబీ కాల్వకు 1,802, బందరు కాల్వకు 1,705, ఏలూరు కాల్వకు 1,352 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

వరద ప్రవాహం ఇలా.. (క్యూసెక్కుల్లో)

వేళలు	గంటలు	రాక	పోక
ఉదయం	06.00	4,59,227	4,43,808
ఉదయం	08.00	4,53,805	4,38,288
ఉదయం	09.00	4,43,460	4,27,455
మధ్యాహ్నం	12.00	4,37,967	4,22,004
సాయంత్రం	06.00	4,33,398	4,16,622

ఎంబీబీఎస్‌కు ఐచ్ఛికాలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వైద్య, దంత కళాశాలల్లో అందుబాటులో ఉన్న ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల ప్రవేశానికి డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి దరఖాస్తు చేసుకున్న 14,413 అభ్యర్థుల్లో 13,682 మంది వన్‌టైమ్ వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. ప్రత్యేక కేటగిరీ ఆర్మీ విభాగానికి 408 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 90 మంది అనర్హులని తెలిపారు. ప్రైవేటు వైద్య కళాశాలల్లో యాజమాన్య కోటాకు 4946 మంది అభ్యర్థులు అర్హత సాధించగా, వారిలో బీ1 కేటగిరీకి 1443, బీ2 కేటగిరీ 3500, కేటగిరీ-సి (ఎన్నారై) 1042, ముస్లిం మైనారిటీ 634 ఉన్నారన్నారు.

నేనేం చేశాను పాపం.. నాకెందుకీ శాపం



సీఐ వెంకటేశ్వర్లుకు చిన్నారిని అందిస్తున్న స్థానికులు



అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని సుమారు మూడు నెలల పాప.. ఆ తల్లికి ఎందుకు భారమైందో... బుడమేరులో విసిరేసేందుకు ప్రయత్నించింది. ఆ చిన్నారి మృత్యుంజయురాలై కాలువ ఒడ్డున పడింది. అమ్మ ఒడిలో సేద దీరాల్సిన పాప కాలువ తీరాన పడి ఏడుస్తోంది. ఈ ఘటన స్థానిక న్యూరాజరాజేశ్వరి పేట సమీపంలో శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. గేదెలకు మేత వేసేందుకు వెళ్లిన స్థానికుడు బేతాళం నాగరాజు ఆ శిశువు పాలిట దేవుడయ్యారు. ఏడుపు విని అటుగా వెళ్లిన నాగరాజు పాపను గమనించి బయటకు తీసుకువచ్చారు. అమానవీయ ఘటన చూసిన స్థానికుల నోట మాట రాలేదు. స్థానికులు చేరదీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు వచ్చి పాపను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన మాట్లాడుతూ.. ఛైల్డ్ వెల్ఫేర్ అధికారులకు విషయాన్ని తెలియజేశామని, పాప వివరాలు తెలియాల్సి ఉందని, సీసీ కెమెరాలు పరిశీలించి బాధ్యుల వివరాలు సేకరిస్తామని తెలిపారు.

'జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలి'

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : జనాభా దామాషా ప్రకారం ఓబీసీలకు రాజకీయ రిజ్వరేషన్లు, 33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు ఉప కోటా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా..ఓబీసీలకు సామాజిక న్యాయం చేసినవారినే మేము ముఖ్యమైన వారిగా భావిస్తామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్, భాజపాలు ఒకరితో ఒకరు పోటీ పడి 2029 సార్వత్రిక ఎన్నికల్లో విజయం కోసం తాపత్రయ పడుతున్నాయన్నారు. సమావేశంలో ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీవీఎస్ మూర్తి, నాయకులు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, మేకా వెంకటేశ్వరరావు, చిప్పాడ చందు, వాకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఆర్థికంగా వెనుక పడిన ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు రాయల్ సర్వీస్ ట్రస్ట్ 2025-26 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాలు ఇచ్చేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఛైర్మన్ శీతాళం రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ విద్యార్థులు అర్హులు. సెప్టెంబరు 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. తరువాత వచ్చిన దరఖాస్తులు పరిశీలించరు. దరఖాస్తు నమూనా, ఇతర వివరాలకు 79894 60929, 98481 30189, 98282 82354 నంబర్లలో సంప్రదించాలి. పూర్తి చేసిన దరఖాస్తులను రాయల్ సర్వీస్ ట్రస్ట్, ఎ4, సత్నమ్ అపార్ట్‌మెంట్, గురుద్వారా రోడ్డు, గురునానక్‌నగర్, విజయవాడ-520008 చిరునామాకు పంపాలి. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.


డేటా అప్‌లోడ్‌పై ప్రత్యేక దృష్టి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లతో పాటు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు డేటా అప్‌లోడ్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. వివిధ శాఖలు, విభాగాలు అంతర్గత పాలన సామర్థ్యంతో పాటు, నిర్ణయం తీసుకునే సామర్థ్యాన్ని మెరుగుపరచాలనే లక్ష్యంతో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్.టి.జి.ఎస్.) రూపొందించిన ఎంప్లాయీస్ పెర్ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్ (ఈపీటీఎస్) పోర్టల్‌లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు నిక్షిప్తం చేసేలా చూడాలని ఆదేశించారు. ఈపీటీఎస్ పోర్టల్‌లో సమాచారం అప్‌లోడ్ పురోగతిపై నగరంలోని కలెక్టరేట్‌లో ఆయా విభాగాల అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చెప్పకుండా బందరు బీచ్‌కు వెళ్లిన నలుగురు బాలురు

గంటల వ్యవధిలో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

పటమట, న్యూస్‌టుడే: ఇంట్లో తెలియకుండా సరదాగా బీచ్‌కి వెళ్లిన నలుగురు బాలురను పటమట పోలీసులు గంటల వ్యవధిలోనే గుర్తించారు. పటమటకు చెందిన నలుగురు బాలురు స్థానిక మున్సిపల్ పాఠశాలలో చదువుతున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పాఠశాల నుంచి బయటకు వచ్చాక అందరూ కలిసి బందరు బీచ్‌కి వెళదామని అనుకున్నారు. గురువారం రాత్రి 9 గంటలకు ఇళ్ల నుంచి వచ్చేసి పటమటలోని పార్కులో 11 గంటల వరకు ఉన్నారు. అనంతరం రెండు సైకిళ్లపై బందరు బీచ్‌కు వెళ్లారు. బాలుర తల్లిదండ్రులు వారి కోసం ఎంత గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పటమట పోలీసులను ఆశ్రయించారు. సెంట్రల్ ఏసీపీ దామోదర్ సూచనల మేరకు పటమట సీఐ పవన్‌కిషోర్ ఆధ్వర్యంలో బాలుర ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా సైకిళ్ల మీద ఆటోనగర్ మీదుగా బందరు రోడ్డులోకి వెళ్లినట్టు గుర్తించారు. వరుసగా సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించి బందరు వెళ్లినట్టు గుర్తించారు. పోలీసులు వెంటనే బందరు బీచ్‌కి వెళ్లారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు బాలుర ఆచూకీ కనిపెట్టి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పటమట స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలో బాలుర ఆచూకీ కనిపెట్టిన సిబ్బందిని సీఐ పవన్‌కిషోర్ అభినందించారు.



బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -114 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 125, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.99/-.

దసరా ఏర్పాట్లలో లోపాలకు తావు ఇవ్వొద్దు : సీపీ



క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న సీపీ రాజశేఖర్ బాబు, ఏడీసీపీ రామకృష్ణ, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఏర్పాట్లలో లోపాలకు తావు లేకుండా చూడాలని సీపీ రాజశేఖర్ బాబు అన్నారు. పోలీసు, దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిస్థితిని సీపీ శుక్రవారం పరిశీలించారు. సీతమ్మ వారి పాదాల సెంటరు నుంచి కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి, దుర్గా ఘాట్, దుర్గగుడి టోల్‌గేటు వరకు క్యూలైన్లు ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న విషయంపై అధికారులకు సీపీ పలు సూచనలు చేశారు. భక్తుల భద్రతకు దుర్గాఘాట్ ఎదురుగా కొండరాళ్లు జారి పడకుండా గోడ ఏర్పాటు చేస్తున్నట్లు ఈఈ రాంబాబు సీపీకి వివరించారు. క్యూలైను గోడకు పక్కగా వెళ్లేందుకు సమస్య లేకుండా నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. దుర్గాఘాట్‌లో కూడా చేయాల్సిన ఏర్పాట్లను వివరించారు. సీతమ్మవారి పాదాల సెంటరు వద్ద హోల్డింగ్ ఏరియాలో తలనీలాలు సమర్పించే వారికి, దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు.

24న డయాబ్ ఎండోకాన్ - 2025 సదస్సు

సూర్యారావుపేట(విజయవాడ): మధుమేహ వ్యాధిగ్రస్థుల చికిత్సకు ఇన్సులిన్ ఇంజక్షన్ల స్థానంలో ఇన్‌హెల్లర్స్ వస్తున్నాయని యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ యలమంచి సదాశివరావు పేర్కొన్నారు. మధుమేహ చికిత్సకు ఆధునిక ఆవిష్కరణలు, నవీన వైద్య విధానాలపై చర్చించేందుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న డయాబ్ ఎండోకాన్ -2025 సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం విజయవాడ సూర్యారావుపేటలోని తన ఆసుపత్రిలో సదాశివరావు సదస్సు వివరాలు వెల్లడించారు. లబ్బీపేటలోని జీఆర్‌టీ హోటల్‌లో నిర్వహించే సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని వివరించారు. ఆధునిక వైద్య చికిత్సను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావడమే సదస్సు ఉద్దేశమని చెప్పారు. బరువు తగ్గడం ద్వారా మధుమేహం నియంత్రణలో ఉండడంతో పాటు గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుందని వివరించారు. ఫౌండేషన్ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ హిమన యలమంచి, కార్యదర్శి డాక్టర్ ఐశ్వర్య యలమంచి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ అమూల్యా యలమంచి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సదస్సు బ్రోచర్లను ఆవిష్కరించారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

పోటీలతో ప్రతిభకు మెరుగులు



మైలవరం: బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ రాజారెడ్డి

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రతిభ పోటీల్లో పాల్గొనడం ద్వారా ప్రతిభకు మెరుగులు దిద్దుకోవచ్చని స్థానిక వివేకానంద పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ పి.రాజారెడ్డి పేర్కొన్నారు. 'ఈనాడు' ప్రతిభ పాటవ పోటీల్లో భాగంగా శుక్రవారం ఆ పాఠశాలలో, 'చంద్రయాన్ నుంచి ఏఐ వరకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశ ప్రయాణం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న పదో తరగతి విద్యార్థిని ఎం.లక్ష్మీజీత, 9వ తరగతి విద్యార్థులు ఇ.అనురాధ్ని, బి.సాయిసుధ వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్, కరస్పాండెంటులు బహుమతులు అందజేసి, అభినందించారు.



విస్సన్నపేట: విజేతలతో పాఠశాల ప్రతినిధులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా శుక్రవారం స్థానిక విజన్ టెక్నో స్కూల్లో 'చంద్రయాన్ నుంచి ఏఐ వరకు సాంకేతిక రంగంలో భారతదేశ ప్రయాణం' అంశంపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేయగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డి హర్షిక్, కె సన్విత్, డి ప్రీతం ప్రతిభ చూపి విజేతలుగా నిలవగా వారికి కరస్పాండెంట్ ఎస్.వేమన కుమారి, ప్రిన్సిపల్ ఆర్ గోపి, వైస్ ప్రిన్సిపల్ పి శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు అందజేసి, అభినందించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



నెమలి కృష్ణాలయంలో వరలక్ష్మి వ్రతంలో అధికారులు, పాలకవర్గం, అర్చకులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయ అర్చకులు తిరుమరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి శాస్త్రోక్తంగా వ్రతం నిర్వహించగా వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్రతంలో మహిళలకు ఆలయం నుంచి జాకెట్లు, గాజులు, పసుపు, కుంకుమ, లక్ష్మీదేవి చిత్రపటం అందజేశారు. పాలకవర్గ అధ్యక్షులు కె.శేఖర్‌బాబు, సహాయ కమిషనర్ ఎస్.సంధ్య, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. ఆలయంలో వేణుగోపాలస్వామి మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

కనిపెడతారు.. కాజేస్తారు

ప్రభుత్వ పథకాల సొమ్ములపై సైబర్ నేరగాళ్ల కన్ను

సైబర్ నేరాలు నానాటికీ పెచ్చుమీరుతున్నాయి. బ్యాంకుల్లో జమవుతున్న ప్రభుత్వ పథకాల సొమ్మును ఎంచక్కా తస్కరించేస్తున్నారు. మొన్నటి తల్లికివందనం నుంచి నేటి అన్నదాత సుఖీభవ పథకం వరకు ఖాతాల్లో నగదు ఏమవుతోందో తెలియని అయోమయ పరిస్థితుల్లో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు, నేరగాళ్ల నగదు తీసుకెళ్లే విధానం సరైందని బ్యాంకర్లు సూచిస్తున్నారు.

మైలవరం, న్యూస్‌టుడే

• రెండు నెలల కిందట జి.కొండూరు మండలం వెంకటాపురంలో పలువురు లబ్ధిదారుల ఖాతాల నుంచి తల్లికివందనం నగదును ఓటీపీల ద్వారా తస్కరించారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు.

• తాజాగా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.7 వేల నగదు రైతుల ఖాతాల్లో జమవగా.. సైబర్ నేరగాళ్లు కన్ను వేసి పట్టారు. తాజాగా మండలంలోని వెల్వడంనికి చెందిన ఓ మహిళకు, పలువురికి ఇదే అనుభవం ఎదురవుతోంది.



బ్యాంకులో ఖాతాలను తనిఖీ చేసుకున్నా చేసేదేమీ లేక నిరాశ చెందుతున్నారు. ఆ బ్యాంకు, ఈ బ్యాంకు అని తేడా లేకుండా.. వినియోగదారులకు తెలియకుండా నగదు నొక్కేస్తున్నారు. ప్రస్తుతం మైలవరం, రెడ్డిగూడెం, ఎ.కొండూరు మండలాల పరిధిలో పలు బ్యాంకుల నుంచి సొమ్ములు లాగేస్తున్నట్లు తెలుస్తోంది.

బయట లావాదేవీలతో మతలబులు

ఒక్కోసారి బయట తెలియని వ్యక్తుల ద్వారా నిర్వహించే ఏటీఎం ద్వారా, ఈ పోస్ సెంటర్ల ద్వారా సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల వేలిముద్రలను, పాస్‌వర్డులను పట్టేసి చోరీకి పాల్పడుతున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మైలవరం ప్రాంత పరిధిలోని పలు మండలాల్లో బ్యాంకర్లు, పెద్ద మొత్తంలో నగదు ఉంటున్న ఖాతాలను హోల్డ్‌లో ఉంచుతున్నామని చెబుతున్నారు.

ఎంతవారైనా మోసాలు అవకాశం

మైలవరం సర్కిల్ పరిధిలో గడచిన ఆరు నెలల్లో 9 కేసుల వరకు నమోదవగా, వాటికి సంబంధించిన నగదు రికవరీ చేయడం జరిగింది. ఏఈపీఎస్ మోసాలు జరుగుతున్నాయి. ఆధార్ డేటా ఆధారంగా జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఎంతవారైనా యాప్ ద్వారా బయోమెట్రిక్ లాక్ చేసే అవకాశం ఉంది. దాని ద్వారా మోసాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు. ఏదేమైనప్పటికీ లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలి. - దాడి చంద్రశేఖర్, సీఐ, మైలవరం

విద్యార్థులకు కంటివైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

మైలవరం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం, లయన్స్ ఇంటర్నేషనల్ పీడీజీ డాక్టర్ వై.జగన్మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ఫనేజ్, వివేకానంద, ఎస్ఎస్‌కే పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత కంటివైద్య పరీక్షలు చేశారు. మొత్తం 150 మందికి కళ్లజోళ్ల అవసరమని గుర్తించి వచ్చే నెలలో ఉచితంగా అందించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు తెలిపారు. క్లబ్ నాయకులు నాగభూషణం, రామిరెడ్డి, హరికిషన్‌కుమార్ గుప్తా, పాఠశాల ప్రిన్సిపాళ్లు జి.మోహనరావు, పి.రాజారెడ్డి, వీవీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? గొల్లపూడి కరకట్ట ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రహదారిపై వెళ్లే చిన్నారులు, స్థానికుల వెంట పడి గాయపరుస్తున్నాయి. - **శ్రీను, గొల్లపూడి కరకట్ట**

✔ కుక్కల సంఖ్యను తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. - **కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? గొల్లపూడి శ్రీనివాసనగర్‌లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షం పడితే నీరు రోడ్లపై నిలిచిపోతుంది. రహదారులను అభివృద్ధి చేయాలి. - **సత్యనారాయణ, శ్రీనివాసనగర్**

✔ రహదారుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. - **స్వరూపారాణి, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, గొల్లపూడి**

? కొండపల్లి పురపాలిక ఇబ్రహీంపట్నం హోండా షోరూం పరిసరాల్లో మురుగు కాలువ నిండిపోయింది. దీంతో మురుగు అంతా రహదారిపైకి చేరుతోంది. - **క్రాంతికుమార్, ఇబ్రహీంపట్నం**

✔ రెండు రోజుల కిందట కురిసిన వర్షాలకు అక్కడ చెత్త అడ్డుపడి కాలువ మురుగు పైకి వస్తోంది. సిబ్బందితో ఆ ప్రాంతంలో శుభ్రం చేయిస్తాం. - **మధు, పారిశుద్ధ్య మేస్త్రి - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**



◆ స్థానిక పంచాయతీలోని రామవరపురం పాఠశాల-2 దగ్గరలో డ్రెయినేజీలో గడ్డి, పూడిక పేరుకుపోయి మురుగు పారడంలేదు. అధ్వానంగా మారిందని స్థానికులు మేమున్నాం...మీకుతోడుగాకు తెలిపిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు స్పందించారు. శుక్రవారం పంచాయతీ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. - **న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

తల్లిని చంపిన తనయుడి అరెస్టు

మైలవరం, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై తల్లిని చంపిన నిందితుడిని అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను సీఐ చంద్రశేఖర్, ఎస్సై సుధాకర్ శుక్రవారం వివరించారు. పుల్లూరు శివారు గ్రామానికి చెందిన పూడి రవి అనారోగ్యానికి గురై జబీవల కోలుకోగా తిరిగి మద్యానికి అలవాటు అవుతున్నాడు. అడ్డుకుంటున్న తల్లి మహాలక్ష్మిని బుధవారం రోకలి బండతో కొట్టడంతో మృతి చెందారు. అనుమానాస్పద మృతిగా ఆమె భర్త సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా, కన్న కొడుకే నిందితుడని గుర్తించి అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

విద్యుత్తు చౌర్యం సామాజిక నేరం



అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈఈ పి.విజయకుమారి

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం అధికారులు గొల్లపూడిలో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 48 మంది అధికారులు, 96 మంది సిబ్బంది కలిసి 48 బృందాలుగా ఏర్పడి 3,958 సర్వీసులను తనిఖీలు చేశారు. ముందు గొల్లపూడి మోడల్‌నగర్‌లోని షాదీఖానాలో అధికారులు, సిబ్బంది సమావేశమయ్యారు. విజిలెన్స్ ఈఈ పి.విజయకుమారి వారికి సూచనలు చేశారు. ఆ సూచనల ప్రకారం సిబ్బంది తనిఖీ చేయగా.. అనుమతి ఇచ్చిన లోడ్‌కంటే అదనంగా విద్యుత్తును వాడుతున్న 98 మందిని గుర్తించి రూ.3లక్షల 46వేల అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడారు.. విద్యుత్తు మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా వినియోగదారులు చూసుకోవాలని కోరారు. సీలు లేకపోయినా, తుప్పు పట్టి ఊడిపోయినా విద్యుత్తు సిబ్బందికి తెలియజేయాలన్నారు, ఆ విధంగా చేయకపోతే ఉద్దేశపూర్వకంగా తొలగించినట్లుగా భావిస్తామన్నారు. పాడైన మీటరు నుంచి విద్యుత్తు వాడుకున్నా, వేరొక మీటరు పెట్టుకున్నా చౌర్యంగా భావిస్తామని పేర్కొన్నారు. విద్యుత్తు చౌర్యం సామాజిక నేరమని వెల్లడించారు. సమావేశంలో ఈఈ రవీంద్రబాబు, డీఈఈ ఎం.వి.వి.రామకృష్ణ, డీఈఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ఉత్సవాలు చేసుకోవాలి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: నిబంధనలకు లోబడి వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఆర్డీవో కె.మాధురి సూచించారు. త్వరలో జరగనున్న గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గణేశ్ మండపాలు ఏర్పాటు చేసే సభ్యులు ముందుగానే సింగిల్‌విండో విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్తు శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాల్లో ప్రమాద నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, మండపాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి 10 గంటలలోపు నిమజ్జనం పూర్తయ్యేలా చూసుకోవాలన్నారు. పోలీసులు, ప్రభుత్వ అధికారులకు సహకరిస్తూ.. భక్తిశ్రద్ధలతో పండగ నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో కె.మాధురి.

రైతులకు అండగా ఉండండి



త్రిసభ్య కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా గ్రామాల్లోని చిన్న సన్నకారు రైతులకు అండగా ఉంటూ, సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. వెల్వడం సొసైటీ ఛైర్మన్‌గా పఠాన్ సతీశ్, సభ్యులుగా జి.అజయకుమారి, పి.విజయ్‌కుమార్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. మండలంలోని వెల్వడం ప్రధాన రహదారిని వచ్చే నెలాఖరులోగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహనరావు, ఏఎంసీ ఛైర్మన్ నర్సయ్య, తెదేపా నాయకులు సీతారామయ్య, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు ప్రారంభం

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిధిలోని కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చర్యలుగా వీధుల్లో పిచ్చి మొక్కలను తొలగించే పనులను కమిషనర్ కె.మనోజ, పురపాలిక ఛైరపర్సన్ కె.నిర్మల శుక్రవారం ప్రారంభించారు. పలు వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్మికులు యంత్రాలతో నిర్వహిస్తున్న గడ్డి కత్తిరించే పనులను పర్యవేక్షించారు.

జిల్లా మహాసభల విజయవంతానికి పిలుపు

మైలవరం, న్యూస్‌టుడే: ఆశా వర్కర్ల సంఘం జిల్లా మహాసభలను ఈ నెల 26న మైలవరంలో నిర్వహించనున్నామని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మహాసభకు సంబంధించి మండల సమావేశం నిర్వహించారు.

సమస్యలతో సతమతం

ఏళ్లుగా రాజీవ్ కాలనీ వాసుల అవస్థలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే

విస్సన్నపేట గ్రామ పంచాయతీ రాజీవ్ కాలనీలో ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. కీలక రహదారి సీసీ రోడ్డు నిర్మించి ఏళ్ల గడిచినప్పటికీ డ్రెయినేజీ కట్టకుండా వదిలేశారు. దీంతో వర్షాలు పడినప్పుడు మురుగు మొత్తం రోడ్డుపైకి చేరి రోజుల తరబడి నిలిచి ఉండడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నా మా కాలనీ సమస్యలను ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.



రోడ్డుపక్కన చెత్తాచెదారంతో డంపింగ్ యార్డులా

300 కుటుంబాల ప్రజలకు తిప్పలు

• కుళాయిలు వద్ద మురుగు నిలిచి పోవడంతో రంగుమారిన వస్తున్నాయని • రహదారులపై పేరుకుపోయిన చెత్తను తీయడంలేదని, • ఇళ్ల మధ్య, వీధుల వెంట పిచ్చి మొక్కలు, పొదలు దట్టంగా పెరిగి విష పురుగులు నివాసాల్లోకి వస్తున్నాయని ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. కాలనీలో 300 కుటుంబాలు 800 జనాభా ఉండగా కనీస వసతులు లేవని వాపోతున్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపడుతాం

పారిశుద్ధ్య సిబ్బంది సీజనల్ జ్వరాల వల్ల విధులకు హాజరుకాలేక పోయారు. క్రమక్రమంగా కార్మికులు కోలుకొని విధులకు హాజరవుతున్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. - **హరికృష్ణ కుమార్, ఈవో**

ప్రజల భయం వీడింది

ఈనాడు కథనాలకు స్పందన



విద్యుత్తు శాఖాధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యంతో పలు విద్యుత్తు నియంత్రికలు, కరెంటు స్తంభాలకు పిచ్చి మొక్కల తీగలు అల్లుకుపోతున్నాయని ఈ నెల 19న 'నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం' శీర్షికతో ఈనాడులో చిత్ర వార్త ప్రచురితమైంది. దీనికి మండల ఏఈఈ ఎస్.విజయభాస్కర్ స్పందించారు. సిబ్బందిని పంపి తాతకుంట్ల, నరసాపురం గ్రామాలకు వెళ్లి విద్యుత్తు నియంత్రిక, స్తంభాలకు అల్లుకుపోయిన పిచ్చి తీగలను తొలగింపజేశారు. కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయించారు. సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. - **న్యూస్‌టుడే, విస్సన్నపేట**

రూ.43 లక్షలతో రహదారి నిర్మాణం

రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలిక అభివృద్ధికి సమన్వయ కృషి అవసరమని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రహదారి అధ్వానంగా ఉండడంతో ఈ సమస్యపై ఈనాడులో అనేక కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే 15వ ఆర్థిక సంఘ నిధులతో రహదారి నిర్మించాలని ఆ విషయాన్ని ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ.43.45లక్షలతో హైస్కూల్ నుంచి ఎర్ర వంతెన వరకు రహదారి నిర్మాణానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పురపాలిక నిధులతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ, ఆర్థిక సంఘ నిధులను వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలను భవిష్యత్తులో చేయనున్నామని చెప్పారు. మున్సిపల్ ఛైర్మన్ సీహెచ్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, కౌన్సిలర్లు, జనసేన నాయకుడు రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలు తిరస్కరించినా జగన్ తీరు మారడంలేదు'



నెట్టెం రఘురాంను సన్మానిస్తున్న కూటమి శ్రేణులు, బ్యాంకు అధికారులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ప్రజలు వద్దని తిరస్కరించినా జగన్ తీరు మారడంలేదని కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం విమర్శించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం విస్సన్నపేట కేడీసీసీ బ్యాంకును ఆయన సందర్శించి అన్నదాతలకు అందుతున్న సేవల గురించి బ్యాంకు అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక అమరావతిపై విషం చిమ్ముతున్నారన్నారు. అనంతరం ఆయనను అధికారులు, సిబ్బంది, తెదేపా శ్రేణులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా అధ్యక్షుడు రాయల సుబ్బారావు, విస్సన్నపేట బ్యాంకు ఛైర్మన్ కంభంపాటి బద్రీనాథ్, నాయకులు ఎన్ వెంకటేశ్వరరావు, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'డబ్బులు వసూలు చేస్తే చర్యలు'

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గ్రూపుల సభ్యుల నుంచి సభ్యత్వం కోసం డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెడ్డిగూడెం వెలుగు ఏపీఎం బి.రామకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలో మండల మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోలు నెలకు రెండు సార్లు సమావేశాలు నిర్వహించేలా సీసీలు చూడాలన్నారు. అర్హత ఉన్న ప్రతి గ్రూపునకు బ్యాంకు రుణాలు అందేలా చూడాలని వివరించారు. తీసుకున్న రుణాలు నూరుశాతం రికవరీ అయ్యేలా చూడాలని సూచించారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.శిరీష, కార్యదర్శి ఎన్.సీతామహాలక్ష్మి, కోశాధికారి ఎన్.సుజాత, సీసీలు మణి, సుందరమ్మ, రత్నావలి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



రెడ్డిగూడెం అంకమ్మతల్లి దేవాలయంలో..



మైలవరం: హోమంలో భక్తులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రెడ్డిగూడెం గ్రామంలోని అంకమ్మతల్లి దేవాలయంలో శ్రావణమాసం శుక్రవారం పురస్కరించుకొని మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు చింతలపాటి పవన్ కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం

మైలవరం, న్యూస్‌టుడే: శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ రేణుకా ఎల్లమ్మ త్రిశక్తిపీఠం ఆధ్వర్యంలో స్థానిక రాజాపేటలో సామూహిక లక్ష్మీగణపతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులతో పూజా కార్యక్రమాలను నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అమ్మవారికి సారె సమర్పణ

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలో శ్రీవాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారికి వాసవీక్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సారె సమర్పించారు. మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు చీరలు, జాకెట్లు, పిండి వంటలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కంచర్ల శశికళ తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు: ఆలయంలో మహిళలు

స్వీపర్ అదృశ్యంపై డీఎంహెచ్‌వో విచారణ

జి.కొండూరు: స్థానిక పీహెచ్‌సీలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న మంద చిరంజీవి గురువారం అదృశ్యమైన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు రెండవ రోజు కూడా ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. శుక్రవారం దీనిపై విచారణ చేపట్టేందుకు జిల్లా వైద్యాధికారి డా.సుహాసిని ఆసుపత్రి వద్దకు చేరుకుని స్వీపర్ కుటుంబ సభ్యులు, ఆసుపత్రి స్టాఫ్ నర్సు, యూడీసీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.ప్రసన్నరాణిల నుంచి లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో మాట్లాడుతూ..విచారణలో భాగంగా స్టేట్‌మెంట్‌లు రికార్డు చేసుకున్నామని దీనిని ఉన్నతాధికారులకు నివేదించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు నిరసన విరమించారు. తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎస్సై సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు అధునాతన కంప్యూటర్లు

మైలవరం, న్యూస్‌టుడే: లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేంద్ర ప్రభుత్వ పీఎం ఉష పథకం కింద విద్యార్థులకు కావాల్సిన 60 కంప్యూటర్లను అందజేశారని ప్రిన్సిపల్ ఇల్లా రవి తెలిపారు. గతంలో మరో 60 కంప్యూటర్లు కళాశాలలో ఉన్నాయని ప్రస్తుతం కళాశాలలో ప్రతి ఐదుగురు విద్యార్థులకు ఒక కంప్యూటర్ అందుబాటులో ఉందని చెప్పారు. అంతర్జాల సదుపాయం, పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో కంప్యూటర్ ల్యాబు అందుబాటులో ఉందని వివరించారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు



తిరువూరులో కేకు కోస్తున్న చిరంజీవి యువత, జనసేన నాయకులు

తిరువూరు: పట్టణంలో చిరంజీవి యువత, జనసేన నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నటుడు చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. అన్నక్యాంటీన్‌లో అల్పాహారం, భోజనం వితరణగా అందించారు. అనాథ శరణాలయాలు, ఆశ్రమంలో వృద్ధులకు భోజనం అందించారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎన్డీయే కూటమి నాయకులతో కలిసి కేకు కోసి పంచి పెట్టారు. ఎన్.శ్రీనివాసరావు, ఎల్.సుధాకర్ పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని తోటమూలలో చిరంజీవి సేవా సమితి ఆధ్వర్యంలో కేకు కోసి, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నాయకులు చిన్నంశెట్టి కృష్ణ, అగ్నిపర్తి రామచంద్రరావు, ఎం.సత్యనారాయణ, పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: ప్రముఖ సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం మైలవరం కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మదర్‌థెరెసా, వంగవీటి రంగా విగ్రహాల వద్ద, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, నాయకులతో కలిసి కేకును కోసి పంచారు. సంఘం ప్రముఖులు ఉమామహేశ్వరరావు, సీతయ్య, గాంధీ, వెంకటనారాయణ, శేషు, ఎన్డీపీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రాకపోకలు పునరుద్ధరించాలి



వినగడప వంతెన వద్ద మరమ్మతు పనుల పరిశీలనలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద భారీ వరదలకు ధ్వంసమైన మల్లింపు రహదారి మరమ్మతు పనులను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. కట్లేరుకు వరదలు పోటెత్తడంతో మళ్లింపు రోడ్డుకు భారీగా గండ్లుపడి 9 రోజులుగా రాకపోకలు నిలిచిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే ఆదేశాలతో స్థానిక తెదేపా నాయకులు రెండు జేసీబీలు ఏర్పాటు చేసి మళ్లింపు రోడ్డుకు ఏర్పడిన గండ్లకు శుక్రవారం నుంచి మరమ్మతులు చేయిస్తున్నారు. వంతెన వద్ద ప్రజలు ప్రయాణాలు సాగించేందుకు వీలుగా చేపట్టిన పనులను ఆయన పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని, రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో రాకపోకలు పునరుద్ధరించేలా కృషి చేయాలని సూచించారు.

విద్యార్థుల హాజరుపై దృష్టి

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే: తిరువూరు డివిజన్ 5 మండలాల పరిధిలోని ప్రభుత్వ మరియు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశమును తిరువూరులో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజు ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వివరాలు పంపాలన్నారు. గతేడాది 10వ తరగతి ఫలితాలు, ఇతర అంశాలపై మాట్లాడారు. ఎస్‌వో శంకర్, డీసీఈడీ ఛైర్మన్, డిప్యూటీ ఈవో తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసన



మైలవరంలో కాంగ్రెస్ నాయకుల ప్రదర్శన

మైలవరం, న్యూస్‌టుడే: కేంద్రం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా శుక్రవారం మైలవరంలో కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తులు, కాగడాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, నాయకులు శీలం రామకృష్ణ, పిట్టల నాగేశ్వరరావు, గిరికుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: తిరువూరు పట్టణంలోనూ కాంగ్రెస్ నాయకులు కాగడాలు, కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. నాయకులు బి.ప్రకాశరావు, పి.శ్రీనివాసరావు, జీవన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకరి బలవన్మరణం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం రోడ్డులో ఒకరు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో సమీపంలో నివాసముంటున్న బత్తుల దుర్గారావు(38) అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరేసుకుని ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని దింపి శవ పరీక్షల నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈతరం

youthpage@eenadu.in

చీరాజసం

ప్యాషన్ పంక్షన్‌లో సంప్రదాయం చిందించడానికి చీర... ప్రెషర్ పార్టీలో అదరగొట్టడానికి చీర... హుందాగా కనిపించాలంటే చీర... అందం రెట్టింపవ్వాలంటే చీర... ప్రతి సందర్భంలో అమ్మాయిలు చీరతో సింగారించుకొనే ధోరణి పెరుగుతోంది. ఈ ప్రభావం, ప్రాధాన్యానికి కారణాలేంటో తెలుసా?



● **ఆధునికం:** చీర అంటే ఒకప్పుడు అమ్మమ్మలు, బామ్మల కట్టుబొట్టు. సంప్రదాయ సింగారం. నేటితరం అమ్మాయిలకు మాత్రం ఇదో ఫ్యాషన్ సింబల్. ఒక ఎమోషన్. ఆధునికంగా కనిపించడానికి ఎడాపెడా చీరను వాడేస్తున్నారు. క్రాప్‌టాప్ వేసి దానిపై చీరను చుట్టేస్తున్నారు. జీన్స్‌పై జతగా చీరను సింగారించుకొని ఆధునిక అమ్మాయిలా ఉన్నారు.

● **సంప్రదాయం:** ఆధునికంగా ఉంటూనే, మన సంప్రదాయం కాపాడుకోవాలనే తపనతో జెన్ జీలో పెరుగుతోంది. మూలాల్ని మరవొద్దు, సంప్రదాయాన్ని వదలొద్దు అనుకునే నేటితరానికి చీర ఎప్పటికీ డార్లింగ్ ఫ్యాషనే. ఇలాంటివాళ్లు పండగలు, శుభకార్యాలు, కాలేజీ ఉత్సవాలే కాదు.. రోజువారీ చీరకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

● **హుందాతనం:** సూట్లు, ఫ్రెజర్లులాంటివి ఒకప్పుడు పవర్ డ్రెస్సింగ్ అనవాళ్లు. ఇప్పుడు కాస్త పెద్దరికం చూపించాలన్నా, హుందాగా కనిపించాలన్నా.. ఆరు గజాల చీరను ఆదరించాలనే సంకల్పం అమ్మాయిల్లో దండిగా పెరిగిపోతోంది. ఉద్యోగాల్లో మైప్రెయిలో ఉన్నవాళ్లు, కాస్త వయసు ఎక్కువైన ప్రౌఢలు చీరను ఆశ్రయిస్తున్నారు.

● **మాధ్యమాలు:** చీరకు సింహాసనం దక్కడంలో సామాజిక మాధ్యమాల పాత్రా తక్కువేం కాదు. ఇన్‌స్టాని రీల్స్‌తో ముంచెత్తాలన్నా.. డ్యాన్స్ స్టెప్పులతో పోస్టులు దడదడలాడించాలన్నా.. చీరకు మించిన అందం మరేదీ లేదని చాలామంది అమ్మాయిలు గాఢంగా నమ్ముతున్నారు. ఇన్‌ఫ్లుయెన్సర్ల రీల్స్, షార్ట్స్‌లలో చీర ఓ డ్రెస్‌కోడ్‌లా మారిపోయింది.

బ్రూస్‌లీ స్ఫూర్తితో..



బ్రూస్‌లీ, జాకీచాన్ పోరాటాలను కళ్లార్పకుండా చూసేవాడు హైదరాబాదీ హర్ష రత్నాకర్. డబ్ల్యూడబ్ల్యూఈ గేమ్స్‌లో ప్రత్యర్థిని తన పిడిగుద్దులతో మట్టికరిపించాలని ప్రయత్నించేవాడు. ఆ ఆసక్తితోనే బాక్సింగ్ బాట పట్టాడు. ఆర్థిక కష్టాలు, సౌకర్యాల లేమిలు అడ్డు తగిలాయి. వాటిని మట్టికరిపిస్తూ ముందుకు సాగుతూనే ఉన్నాడు. తను నాన్నతో కలిసి ఎక్కువగా యాక్షన్ సినిమాలు చూస్తుండే వాడు. ఇంటికొచ్చి హీరోలను అనుకరించేవాడు. కొడుకు ఆసక్తి గమనించిన తండ్రి, తనని కిక్ బాక్సింగ్ అకాడమీలో చేర్పించారు. అక్కడ అరకొర సౌకర్యాలున్నా పట్టుదలే తనకు ఆయుధమైంది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు గెలవడం మొదలు పెట్టాడు. ఇంతలో డిగ్రీ పూర్తైంది. బాక్సింగ్‌ని కెరియర్‌గా ఎంచుకోలేదుగా! ఆట ఆపేసి, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. సబ్ ఇన్‌స్పెక్టర్, గ్రూప్-1 కొద్దిలో మిస్ అయ్యాయి. చివరికి వాణిజ్య పన్నుల విభాగంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం దక్కింది. ఆర్థికంగా కాస్త కుదురుకున్నాక, ఆటతోనే బాక్సింగ్ బీమును మళ్లీ నిద్ర లేపాడు. రెట్టించిన ఉత్సాహంతో సాధన చేశాడు. గత మూడేళ్లలో వరుసగా పతకాలు గెలిచాడు. ఇండియన్ ఇంటర్నేషనల్ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజతం, జాతీయ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం, మూడో ఇండియన్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం, నాలుగో ఇండియన్ ఇంటర్నేషనల్ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజతం గెలిచాడు. జాతీయ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్, ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు సాధించాడు. ఇందులో కజకిస్థాన్‌కి చెందిన బలమైన ప్రత్యర్థిని మట్టికరిపించాడు.. అతడు 'యూ ఆర్ ఎ వారియర్' అంటూ మెచ్చుకున్నాడు. **- జి. వినయ్‌గౌడ్,** హైదరాబాద్

రింగ్‌లో కింగ్‌లు

ప్రత్యర్థులు విసిరే పంచ్‌లకన్నా.. ఆర్థిక కష్టాలే వాళ్లని తెగ ఇబ్బంది పెట్టాయి. బలంలోకి దిగాక ఎందరినో మట్టికరిపించిన ఆ చేతులే.. కఠిన సమయాల్లో ఏం చేయాలో తెలియక చేష్టలుడిగిపోయాయి. ఏదైతేనేం.. ఆ సవాళ్లను దాటి, విజేతలుగా నిలిచి.. రింగ్‌లో మేం కింగ్‌లం అనిపించుకుంటున్నారు ఈ ముగ్గురు.



యూట్యూబ్ మలిచింది

అమ్మానాన్నలేమో బాగా చదువుకొని మంచి ఉద్యోగం చేయాలన్నారు. మండ్ల జగదీశ్ మాత్రం కరాటే విన్యాసాలు చేస్తూ, బాక్సింగ్ ఆటలు చూస్తూ మురిసిపోయేవాడు. అతడిది ప్రకాశం జిల్లా మంటపంపల్లి. బాక్సింగ్‌పై విపరీతమైన ఆసక్తి ఉన్నా.. కన్నవాళ్ల కోసం ఇంజినీరింగ్ పూర్తి చేశాడు జగదీశ్. వెంటనే వీఆర్వో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కన్నవాళ్ల కల నెరవేరింది. ఇక తన ఆసక్తే మిగిలింది. ఓవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే సొంతంగా బాక్సింగ్ సాధన చేయడం ప్రారంభించాడు. యూట్యూబ్ వీడియోలు చూస్తూ మెలకువలు నేర్చుకున్నాడు. రాష్ట్రంలో ఎక్కడ బాక్సింగ్ పోటీలు జరుగుతున్నా వాలిపోయేవాడు. అతడి ఆసక్తి, ప్రతిభను అన్నమయ్య జిల్లా బాక్సింగ్ సెక్రటరీ గుర్తించారు. ఆయన సహకారంతో బాక్సింగ్‌లో ప్రొఫెషనల్ శిక్షణ తీసుకున్నాడు. ఏదావిపాటు అగ్నిరకాలుగా సిద్ధమయ్యాక అసలైన పోటీల బరిలోకి దిగాడు. మేలో గోవాలో నిర్వహించిన యూత్ అండ్ స్పోర్ట్స్ ప్రమోషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైఎస్‌పీఏ)లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. జులైలో నేపాల్‌లో జరిగిన నేపాల్ ఇన్విటేష నల్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి గెలిచాడు. ఒకవైపు ఉద్యోగం, మరోవైపు సాధన.. ఏమాత్రం తీరిక ఉండదు జగదీశ్‌కి. ఉద్యోగం వచ్చాక ఆటవిడుపు అని వెనక్కి లాగేవాళ్లు లాగుతూనే ఉన్నారు. అయినా ఉదయం, సాయంత్రాలు శ్రమిస్తూనే ఉన్నాడు. ఎప్పటికైనా భారత్ తరపున ఒలింపిక్స్‌కి ప్రాతినిధ్యం వహించడమే అతడి కల. **- పృథ్వీ కాకి,** ఈజేఎస్

డెలివరీ బాయ్‌నే..




జాతీయస్థాయిలో పదుల పతకాలు గెలిచాడు మన్నూరు వంశీకృష్ణ. వాటికోసం ప్రత్యర్థులతో చేసిన పోరాటాలకన్నా.. విధితో తలపడ్డ కష్టాలే ఎక్కువ. తనది అన్నమయ్య జిల్లా మందపల్లి. ఆరేళ్ల వయసులో తండ్రిని కోల్పోయాడు. తల్లి ఆసరాతో ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే డిగ్రీ వరకూ చదివాడు. తను చిన్నప్పట్నుంచి బ్రూస్‌లీ వీరాభిమాని. ఆ ఇష్టంతోనే కరాటే, కిక్‌బాక్సింగ్, మాయ్ థాయ్ నేర్చుకున్నాడు. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించి, జాతీయ స్థాయిలో 14 గోల్డ్ మెడల్స్ గెలుచుకున్నాడు. అయితే.. డిగ్రీ చదువుతున్న సమయంలో అన్నయ్య జలాశయం మట్టికట్ట తెగిపోవడంతో.. వాళ్ల ఊళ్లోకి వరద నీరు చేరింది. ఆ ఘటనలో పదుల సంఖ్యలో జనావాసాలు నేలమట్టం అయ్యాయి. దీంట్లో వంశీకృష్ణ పతకాలు, ధ్రువీకరణ పత్రాలు నీటిలో కొట్టుకుపోయాయి. దీంతో సర్వం కోల్పోయాడు. జీవనోపాధి కోసం బెంగళూరు చేరాడు. ఫుడ్ డెలివరీ కంపెనీలో బాయ్‌గా చేరాడు. సన్నిహితుల ద్వారా ఈ విషయాలన్నీ తెలుసుకున్న ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వంశీకృష్ణకు భరోసానిచ్చారు. 'నువ్వు ఆగిపోవద్దు. అండగా మేమున్నాం' అంటూ రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. దీంతో మళ్లీ రింగ్‌లోకి దిగాడు వంశీ. స్థానిక ఎమ్మెల్యే సాయంతో నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలకు వెళ్లాడు. 75 కిలోల విభాగంలో తలపడి గోల్డ్ మెడల్ సాధించాడు. ఇప్పటివరకు నలభై టోర్నీల్లో పాల్గొన్న వంశీ ఎనిమిది అంతర్జాతీయ మెడళ్లు గెలిచాడు. డెలివరీబాయ్‌గా పని చేస్తున్నా.. అతడి లక్ష్యం మాత్రం ఒలింపిక్ పతకం. **- శ్రీనివాసులు బోగెం,** కడప



రూ.కోటి వెనక ఎన్నెన్ని వెతలో..





మొదటిసారి ఫెయిలైతే ఉసూరుమంటాం. రెండోసారి విచారపడతాం. మూడోసారి బాధ ఎక్కువ అవుతుంది. నాలుగైదుసార్లు వైఫల్యాలు ఎదురైతే ఇక 'మనవల్ల కాదులే' అని కాడి వదిలేస్తాం. రాజస్థానీ ఆదిత్య కుమార్ 33 సార్లు ఓడిపోయాడు. ఏఐఈఈఈ, కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశం, బ్యాంకింగ్, యూపీఎస్సీ.. ఇలాంటి ప్రవేశ, పోటీ పరీక్షల్లో వరుసగా పరాజయం పాలయ్యాడు. యూపీఎస్సీ నాలుగో ప్రయత్నంలోగానీ ఐపీఎస్‌కి ఎంపికవ్వలేదు. ఇప్పుడు రియాలిటీ గేమ్ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతీ' 17వ సీజన్లో మాత్రం ఫెయిల్ కాలేదు. ప్రతి ప్రశ్నకి తడుముకోకుండా జవాబు చెబుతూ.. ఈ సీజన్‌లో తొలి రూ.కోటి రూపాయల ప్రైజ్‌మనీ గెల్చుకున్నాడు. తన పరాజయాల విజయగాథని కేబీసీ హాట్‌సీట్‌లో కూర్చొని వ్యాఖ్యాత బిగ్‌బీ అమితాబ్ బచ్చన్‌తో పంచుకున్నాడు. సివిల్స్ సాధించినప్పటికంటే ఇప్పుడే ఎక్కువ జేజేలు పలుకుతున్నారు జనం.

కలలకు రెక్కలు
విచ్చుకునే తరుణం...
ఆశల ఊహలు
ఊసులయ్యే సమయం...
కలకాలం తోడుండే
వ్యక్తితో కలలు కనే సందర్భం...
అదే పెళ్లి చూపుల
వేడుక సంబరం.
ప్రతి ఒక్కరి జీవితంలో
ఇది తీపి జ్ఞాపకమే!
కాలం గిర్రున తిరిగి,
ఏళ్లు గడిచినా..
మదిలో ఎప్పటికీ పదిలమే!!
ఆనాటి అనుభూతిని
అక్షరాలుగా పేర్చండి...
మర్చిపోలేని అనుభవాలను
మాకు పంపండి.
ఎంపిక చేసినవాటిని
ప్రచురిస్తాం.

ఈతరం స్పెషల్ డెస్క్,
ఈనాడు కార్పొరేట్ ఆఫీసు,
రామోజీ ఫిల్మ్‌సిటీ - 501512
youthpage@eenadu.in

రైడ్ చేద్దాం..

బాలీవుడ్ బైక్ వీరుల్లో మరో కొత్త హీరో చేరాడు. అతగాడే 'గల్లీ బాయ్' ఫేం సిద్ధాంత్ చతుర్వేది. 'నాకు సూపర్‌బైక్‌లు అంటే పిచ్చ ఇష్టం. కాలేజీ రోజుల్లో చాలాసార్లు లాంగ్‌డ్రైవ్‌లకు వెళ్లా' అంటూ ఈమధ్యే మోటార్‌సైకిళ్లపై తనకున్న ప్రేమను వెల్లడించాడు. తన దగ్గర బీఎండబ్ల్యూతోపాటు హార్లీ డేవిడ్‌సన్ బైక్ కూడా ఉందట. 'నాతోపాటు రైడింగ్‌కి వస్తారా?' అంటూ హార్లీ బైక్‌తో ఉన్న ఫొటోని ఇన్‌స్టాలో పెట్టేశాడు. బాలీవుడ్‌ని, బైక్‌లను తెగ ఇష్టపడే కుర్రకారు అతడి పోస్టుకు కామెంట్లతో ప్రేమ కురిపిస్తున్నారు. గతంలో సూపర్ బైక్‌లు అంటే జాన్ అబ్రహామే గుర్తొచ్చేవాడు తన దగ్గర డుకాటీ, బీఎండబ్ల్యూ, ఏప్రిలియా, యమహా కంపెనీల సూపర్ బైక్‌ల కలెక్షన్ ఉంది.



కాకినాడ జిల్లాలో సీఎం పర్యటన నేడు

ఈనాడు, కాకినాడ: ముఖ్యమంత్రి చంద్రబాబు కాకినాడ జిల్లా పెద్దాపురంలో శనివారం పర్యటించనున్నారు. పట్టణంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. స్థానిక పదో వార్డులో కొత్తగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలించనున్నారు. స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులతో ముచ్చటిస్తారు. ప్రజావేదిక సమీపంలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను సందర్శించి, ప్రసంగిస్తారు. సామాజిక మాధ్యమాల ప్రతినిధులతో వివిధ అంశాలపై చర్చిస్తారు. పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తారు. సాయంత్రం పెద్దాపురం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లి చేరుకుంటారు.

తప్పులు లేకుండా పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తాం: మంత్రి అనగాని



ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలోని రీసర్వేలో చాలా తప్పులు దొర్లాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని పరిష్కరించిందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రైతులకు పంపిణీ చేసేందుకు 21 లక్షల పాస్‌పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని, వాటిని ఇచ్చే ముందు మరోసారి పరిశీలిస్తామని చెప్పారు. ''రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు సిద్ధం'' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. 'రీ సర్వే జరిగిన 6,688 గ్రామాల్లో సభలు నిర్వహించగా, 2.79 లక్షల అర్జీలు అందాయి. వాటిని వంద శాతం పరిష్కరించాం. 17,600 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 1.85 లక్షల అర్జీలు వస్తే వాటినీ వందశాతం పరిష్కరించాం. తర్వాత నాలుగు నెలల సమయం ఇచ్చి, రైతుల నుంచి అర్జీలు తీసుకున్నాం. వెబ్‌ల్యాండ్‌లో తప్పులు సరిదిద్దాం. లైవ్ వెబ్‌ల్యాండ్‌లో ఉన్న డేటానే ముద్రించాం' అని వివరించారు. 'కొత్త పాస్‌పుస్తకాలు ఇచ్చాక వాటిలో మార్పులు కావాలంటే నిబంధనల ప్రకారం ఉచితంగానే చేస్తాం. జాయింట్ ఎల్‌పీఎం సబ్ డివిజన్‌కు సంబంధించి లక్షకు పైగా అభ్యర్థనలను ఫీజు లేకుండా పరిష్కరించాం. పేర్లు, జెండర్ తప్పులుంటే సరిచేస్తున్నాం' అని తెలిపారు.

ఏపీఎస్‌డబ్ల్యూసీ నకిలీ ఖాతా కేసులో ఆస్తుల జప్తునకు అనుమతి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూసీ) పేరిట నకిలీ డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలతో విజయవాడలోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో నకిలీ కరెంట్ ఎకౌంట్ తెరిచిన కేసులో నిందితులు, వారి కుటుంబీకులకు సంబంధించిన రూ.4.48 కోట్ల విలువైన స్థిర, చరాస్తుల జప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. 2021లో ఈ నేరం జరగ్గా.. మొత్తం రూ.9.6 కోట్లు దారి మళ్లినట్లు పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ఈ నేపథ్యంలో వారి ఆస్తులను గుర్తించారు. వాటి జప్తునకు అనుమతి కోరుతూ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్ వేసేందుకు విజయవాడ పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

'డీఎస్సీ-98లో అర్హులైన అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి'

ఈనాడు, అమరావతి: డీఎస్సీ-98లో మినిమం టైం స్కేల్ కింద నియమితులు కాకుండా మిగిలిపోయిన వారికి ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ మంత్రి లోకేశ్ పేషీలో డీఎస్సీ-1998 మిగిలిపోయిన అభ్యర్థుల సమాఖ్య తరఫున కొందరు అభ్యర్థులు వినతిపత్రం సమర్పించారు. ''డీఎస్సీ-98లో అర్హత సాధించి, మిగిలిపోయిన 1,814 మందికి ఎంటీఎస్ ఉద్యోగాలు ఇవ్వాలి. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్, ఎన్నికల ప్రచారంలో తెదేపా అధినేత చంద్రబాబుకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చాం. ప్రభుత్వం వచ్చిన వెంటనే మిగిలిపోయిన 1,814 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇటీవల ప్రభుత్వానికి పంపిన దస్త్రంలో కేవలం 595 మంది జాబితా మాత్రమే ఉంది. వీరికే కాకుండా మిగిలిపోయిన అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి'' అని కోరారు.

ఇదీ భారత అంతరిక్ష కేంద్రం!

● **నమూనాను ఆవిష్కరించిన ఇస్రో**

దిల్లీ, శ్రీహరికోట, న్యూస్‌టుడే: రోదసి రంగంలో శక్తిమంతమైన దేశాలకు దీటుగా భారత్ కూడా అడుగులు వేస్తోంది. భూ కక్ష్యలో అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించడానికి సిద్ధమవుతోంది. 'భారతీయ అంతరిక్ష స్టేషన్ (బీఏఎస్)' పేరుతో సిద్ధమయ్యే ఈ వేదిక నమూనాను శుక్రవారం దిల్లీలోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆవిష్కరించింది. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండురోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా దీన్ని ప్రదర్శించారు. ప్రస్తుతం భూ కక్ష్యలో ఐదు అంతరిక్ష సంస్థలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్), చైనాకు చెందిన తియాంగాంగ్ రోదసి కేంద్రం ఉన్నాయి.

బీఏఎస్ నిర్మాణం ఇలా

★ భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని భూమికి 400-450 కిలోమీటర్ల ఎత్తులోని భూ దిగువ కక్ష్యలో ప్రవేశపెడతారు. దశలవారీగా దీని నిర్మాణం సాగుతుంది. 2035 నాటికి పూర్తవుతుంది.

★ బీఏఎస్‌లో ఐదు మాడ్యూళ్లు ఉంటాయి. 27 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో విస్తరించి ఉంటుంది. మొత్తం బరువు 52 టన్నులు. ముగ్గురు నుంచి ఆరుగురు వ్యోమగాములు ఇందులో ఉండొచ్చు.

★ ఇందులో మొదటిది బీఏఎస్-01 మాడ్యూల్. దీని బరువు దాదాపు 10 టన్నులు.

★ అంతరిక్ష కేంద్ర నిర్మాణానికి ఎల్‌వీఎం-3, మరింత శక్తిమంతమైన ఎన్‌జీఎల్‌వీ రాకెట్లను ఉపయోగిస్తారు.

★ బీఏఎస్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన వాతావరణ నియంత్రణ, జీవనాధార వ్యవస్థ (ఈసీఎల్ఎస్ఎస్), భారత్ డాకింగ్, బెర్తింగ్ వ్యవస్థలు, ఆటోమేటెడ్ హ్యాచ్ సిస్టమ్ ఉంటాయి.

★ రోదసిని వీక్షించడానికి, శాస్త్రీయ ఇమేజింగ్‌కు వీలుగా వ్యూ పోర్ట్‌లను ఏర్పాటు చేస్తారు. వ్యోమగాముల ఆటవిడుపు కోసం కూడా ఇవి ఉపయోగపడతాయి.

★ చోదక వ్యవస్థలో, ఈసీఎల్ఎస్ఎస్‌లో అవసరమైన ఇంధనం, ద్రవాలు నింపడానికి ఏర్పాట్లు ఉంటాయి. ఉష్ణం, రేడియోధార్మికత, సూక్ష్మ ఉల్కల ధీ నుంచి రక్షణ ఉంటుంది.

★ స్పేస్‌వాక్ కోసం స్పేస్‌సూట్‌లు, ఎయిర్‌లాక్ వ్యవస్థలు ఉంటాయి.

ఎందుకీ బీఏఎస్?

★ బీఏఎస్‌లోని ప్రయోగశాలల్లో అంతరిక్ష, జీవ శాస్త్రం, వైద్యం తదితర అనేక రంగాల్లో పరిశోధనలు చేయవచ్చు.



★ భారరహిత స్థితిలో మానవ ఆరోగ్యంపై పడే ప్రభావాన్ని పరిశోధించడానికి ఇది వీలుకల్పిస్తుంది. రోదసిలో దీర్ఘకాల మానవ ఆవాసానికి తోడ్పడే సాంకేతిక పరిజ్ఞానాలనూ పరీక్షించొచ్చు. నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుంది.

★ అంతరిక్ష పర్యాటకానికీ ఇది దోహదపడుతుంది. అంతర్జాతీయ భాగస్వామ్యాలకూ తోడ్పాటు అందిస్తుంది.

★ తాజాగా దిల్లీలో బీఏఎస్-1 మాడ్యూల్ నమూనాను ప్రదర్శించారు.

పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతోనే

''భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని 2035 నాటికి పూర్తి చేసే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో మొదటి మాడ్యూల్‌ను 2028లో ఎల్‌వీఎం-3 వాహకనౌక ద్వారా పంపేందుకు సన్నాహాలు చేస్తున్నాం. బీఏఎస్ పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో సిద్ధమవుతుంది.''
- ఇ.ఎస్.పద్మకుమార్, షార్ డైరెక్టర్

మార్క్‌ఫెడ్‌కు ఎరువుల కేటాయింపు పెంపు

ప్రభుత్వం నిర్ణయం

ఈనాడు, అమరావతి: మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల సరఫరా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రానికి సరఫరా అవుతున్న మొత్తం ఎరువుల్లో మార్క్‌ఫెడ్‌కు 50, ప్రైవేటు వ్యాపారులకు 50శాతం కేటాయిస్తుండగా.. ఇక నుంచి 70:30 చొప్పున ఇవ్వాలని స్పష్టం చేసింది. వ్యవసాయేతర అవసరాలకు యూరియా వినియోగిస్తే కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు ఎరువుల లభ్యతపై శుక్రవారం అధికారులతో సమీక్షించారు. మరోవైపు క్షేత్రస్థాయి కొరత, అధిక ధరలపై ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ఇంటెలిజెన్స్ డీజీపీ మహేశ్ చంద్ర లడ్డా, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సీఎం కార్యాలయ అదనపు కార్యదర్శి రాజమౌళి, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు పాల్గొని చర్చించారు. కేంద్రం అవసరానికి మించి ఎరువులు సరఫరా చేస్తున్నా రైతులకు అందడం లేదని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ సరిగా లేదని అభిప్రాయపడ్డారు. సమీక్ష సందర్భంగా తీసుకున్న నిర్ణయాలివీ.. ★ వ్యవసాయేతర అవసరాలకు యూరియా మళ్లించడంపై గట్టి నిఘా. ★ పోలీసు, రెవెన్యూ, పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో తనిఖీలు. ★ మార్క్‌ఫెడ్ నిల్వల నుంచి ఆర్ఎస్‌కేలకు ఎరువుల సరఫరా. ★ రైతుల్లో యూరియా లభ్యతపై ఉన్న అనుమానాల తొలగింపు. ★ కలెక్టర్లు రోజువారీగా సమీక్షించి.. ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం ఇవ్వడం.

25న బంగాళాఖాతంలో అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఒడిశా-పశ్చిమబెంగాల్ తీరాల్లో ఈ నెల 25న (సోమవారం) అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. దీని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. మరోవైపు రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలకు అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం

● 'తల్లికి వందనం' పెండింగ్ దరఖాస్తులకు రూ.325 కోట్లు
● విద్యా శాఖ సమీక్షలో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి, విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. ఉండవల్లిలోని నివాసంలో శుక్రవారం విద్యా శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ''ప్రభుత్వ విద్యలో ప్రమాణాల మెరుగుకు 14 నెలలుగా సంస్కరణలను సమర్థంగా అమలు చేశాం. వీటి అంతిమ లక్ష్యం అభ్యసన ఫలితాలే. అనవసర శిక్షణ కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృథా చేయొద్దు. దేశంలోనే మొదటిసారిగా ప్రతి బిడ్డకూ గ్యారెంటీ ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ హక్కుగా ఇవ్వబోతున్నాం. తల్లికి వందనం పథకం చివరి విడత పెండింగ్ దరఖాస్తులను ఆమోదిస్తూ రూ.325 కోట్లు విడుదల చేశాం. 2024-25 ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి. కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలకు దాతల సహకారంతో భూసేకరణకు చర్యలు తీసుకోవాలి. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేసి, ఉత్తమ పూర్వ ప్రాథమిక విద్యా విధానాన్ని సిద్ధం చేయండి'' అని సూచించారు.



విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్

అసెంబ్లీలో పిల్లలతో సమావేశం


''రాజ్యాంగ దినోత్సవం రోజు అసెంబ్లీలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి ప్రతి శాసన సభ నియోజకవర్గం నుంచి విద్యార్థులను ఎంపిక చేయాలి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి దేశ, విదేశాల్లో స్థిరపడిన ప్రముఖులు, దాతల సహకారం తీసుకోవాలి. పాఠశాలల దత్తతకు వీలుగా ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించాలి'' అని ఆదేశించారు.

అత్యుత్తమ కేంద్రీయ గ్రంథాలయం

''దేశంలోనే అత్యుత్తమంగా అమరావతిలో కేంద్రీయ గ్రంథాలయ నిర్మాణాన్ని చేపట్టాలి. రెండు లక్షల చదరపు అడుగుల్లో డిజైన్ చేస్తున్న ఈ భవనాన్ని ఏడాదిలోగా పూర్తి చేయాలి. విశాఖలో ప్రతిపాదించిన ప్రాంతీయ గ్రంథాలయ భవనాన్ని 50 వేల అడుగుల విస్తీర్ణంలో నిర్మించేందుకు చర్యలు చేపట్టాలి. కొత్తగా ఏర్పాటైన జిల్లా కేంద్రాల్లోనూ జిల్లా గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. స్థానిక సంస్థల నుంచి రావాల్సిన రూ.213 కోట్ల నిధులతో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. అన్నింటిలో పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి'' అని చెప్పారు.

దేశానికే ఆదర్శంగా నిలిచేలా 'నైపుణ్యం' పోర్టల్‌ను రూపొందించాలి

ఉద్యోగ, ఉపాధి కల్పన విషయంలో యువత, పరిశ్రమలను అనుసంధానించేందుకు తీసుకురానున్న 'నైపుణ్యం' పోర్టల్‌ను దేశానికే ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధి-శిక్షణ, ఇంటర్మీడియట్ విద్యపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ''సెప్టెంబరులో నైపుణ్యం పోర్టల్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి. దీన్ని పీఎం ఇంటర్న్‌షిప్ పోర్టల్‌తో అనుసంధానించాలి. దృష్టి లోపం గల విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరేందుకు అనుమతి మంజూరు చేశాం. అక్షర ఆంధ్రలో భాగంగా గుర్తించిన 16 లక్షల మందికి వయోజన విద్య ద్వారా శిక్షణ అందించాలి'' అని సూచించారు.



ఒక్కో సమస్యకు.. ఒక్కోలా పరిష్కారం

దంతాలు ఎంత పదునుగా ఉన్నాసరే.. నీటిని మీరు కొరకలేరు కదా..! అన్ని సమస్యలపై ఒకే పరిష్కారాస్త్రాన్ని ప్రయోగించలేం. ఒక్కో సమస్యకు పరిష్కారం ఒక్కోలా ఉంటుంది. మీరు ఇబ్బందుల్లో ఉన్నట్లయితే.. కాస్త సమయం తీసుకొని పరిస్థితిని సరిగ్గా అర్థం చేసుకోండి. అనంతరం దానికి తగ్గట్టు కార్యాచరణకు ఉపక్రమించండి.
- శ్రద్ధే కటియార్, వైద్యుడు

రాష్ట్రపతి భవన్‌కు చేరిన అంజు ఘనత



ఈటీవీ భారత్: బిహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన మహిళారైతు అంజుకుమారి ఇటీవల స్వాతంత్ర్య వేడుకల అతిథిగా రాష్ట్రపతి భవన్ విందుకు హాజరయ్యారు. ప్రధాని మోదీతోనూ ముచ్చటించారు. అవి నా జీవితంలో గర్వకారణమైన క్షణాలు అంటున్న అంజుకుమారి ఈ స్థాయికి చేరుకోవడానికి దశాబ్దాలుగా అహర్నిశలు శ్రమించారు. 2.5 ఎకరాల భూమిలో నూనెగింజలు, చిరుధాన్యాలు, పప్పుగింజలు, అరటి, బొప్పాయి సాగుచేస్తున్న ఈమె వీటి నుంచి అధిక ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ఇప్పుడు సేంద్రియ సాగు గురించి నేర్చుకోవడానికి ఇరుగు పొరుగు రైతులు అంజు వద్దకు వస్తున్నారు. చిన్న గుడిసెలో మొదలైన ఈ ప్రయాణంలో మంచి ఇల్లు కట్టుకొని ఆర్థికంగానూ స్థిరపడ్డారు. భర్త రాంకరణ్ రాయ్ ఆదరణతోనూ అండగా నిలిచి, తన నైపుణ్యాలకు పదును పెట్టుకుంటూ వస్తున్నారు.

సైనికులు కనిపిస్తే.. టోల్‌గేట్ సిబ్బంది సెల్యూట్

ఇంటర్నెట్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని టోల్‌గేట్ల వద్ద ఓ సరికొత్త దృశ్యం కనిపిస్తోంది. సైనిక వాహనాలు కనిపిస్తే అందులోని జవానులకు టోల్‌గేట్ సిబ్బంది సెల్యూట్ చేస్తూ గౌరవమర్యాదలతో వ్యవహరిస్తున్నారు. వారికి తాగునీటిని అందిస్తున్నారు. ఇటీవల మేరఠ్‌లో ఓ ఆర్మీ జవానుపై టోల్‌గేట్ సిబ్బంది దాడి చేసిన ఘటన తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఆ టోల్ ఏజెన్సీపై భారీ జరిమానా విధించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని టోల్‌గేట్ల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బందికి సైనికులతో పాటు ఇతర వాహనదారులతోనూ మర్యాదగా వ్యవహరించేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.



సీబీఐ అధికారులమంటూ రూ.2.3 కోట్లు దోపిడీ



దిల్లీ: సీబీఐ అధికారులమంటూ దాడికి పాల్పడిన ఓ ముఠా దిల్లీలో వ్యాపారవేత్త కార్యాలయం నుంచి రూ.2.3 కోట్లు దోచుకుంది. గాజియాబాద్‌కు చెందిన మన్‌ప్రీత్‌సింగ్ అనే వ్యాపారవేత్త దిల్లీలోని వివేక్ విహార్‌లో ఉన్న తన కార్యాలయంలో రూ.2.3 కోట్లు దాచిపెట్టారు. మూణ్నెల్ల కిందట ఆక్షత్ నుంచి రూ.1.10 కోట్లు తీసుకురావాలని తన మిత్రుడైన రవిశంకర్‌ను కోరాడు. అతడు నగదు సంచితో కార్యాలయం నుంచి బయటకు రాగానే.. ఓ మహిళతో సహా నలుగురు వ్యక్తులు కార్లలో వచ్చి అతడిని అడ్డగించారు. తాము సీబీఐ అధికారులమని బెదిరించి అతడిపై దాడికి పాల్పడ్డారు. నగదు బ్యాగును లాక్కొని రవిశంకర్‌ను కార్యాలయం లోపలికి తీసుకెళ్లారు. అక్కడ మిగిలిన నగదును దోచుకున్నారు. నిందితుల్లో ... అరెస్టు చేసి వారి నుంచి రూ.1.08 కోట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

ఇద్దరి మధ్యే పోటీ

ఉపరాష్ట్రపతి ఎన్నికకు నామినేషన్ల పర్వం పూర్తి

దిల్లీ: ఉపరాష్ట్రపతి పదవికి జరుగుతున్న ఎన్నికలో శుక్రవారం నామినేషన్ల పరిశీలన పర్వం పూర్తయింది. దీంతో వచ్చే నెల 9న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలో పోటీ అధికార ఎన్డీయే కూటమి అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి మధ్యేనని స్పష్టమైంది. అభ్యర్థులిద్దరూ దక్షిణ భారతదేశానికి చెందినవారు కావడంతో పోటీని 'సౌత్ వర్సెస్ సౌత్'గా అభివర్ణిస్తున్నారు. అభ్యర్థులిద్దరి నామినేషన్లు సజావుగా ఉన్నాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన రాజ్యసభ సెక్రటరీ జనరల్ ప్రకటించారు. తమిళనాడుకు చెందిన సీనియర్ భాజపా నాయకుడైన సి. పి.రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. తెలంగాణ వాస్తవ్యులైన జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి రిటైర్ అయ్యారు. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీ 17వ ఉపరాష్ట్రపతిని ఎన్నుకోనున్న విషయం తెలిసిందే.



ధనవంతులుగా మారితే సరిపోదు..!

మీరు చేసే పని/వ్యాపారం మిమ్మల్ని కేవలం ధనవంతులుగానే కాదు.. మెరుగైన వ్యక్తిగానూ తీర్చిదిద్దాలి. వ్యక్తిత్వం విషయంలో రాజీ పడుతున్నట్లయితే.. మీరు సాధించే పెద్ద పెద్ద విజయాలకు అర్థమే ఉండదు. చేసే పనితో గొప్ప విలువను సృష్టిస్తూ, ఆ ప్రక్రియలో మీరూ మరింత విలువైన వ్యక్తిగా ఎదుగుతూ ఉండాలి.

– జస్టిన్ వెల్ష్, వ్యాపారవేత్త

విపక్ష నేతల్లో అత్యధికులు అవినీతిపరులే

- అందుకే 130వ రాజ్యాంగ సవరణను వ్యతిరేకిస్తున్నారు
- ఇండియా కూటమిపై ప్రధాని ఘాటు విమర్శలు



బిహార్‌లోని బెగుసరాయ్‌లో కేబుల్ వంతెనను ప్రారంభించిన అనంతరం పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

గయాజీ/కోల్‌కతా: అత్యున్నత అధికార స్థానాల్లో అవినీతి రూపుమాపేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలను తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సహా ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని ప్రధాని మోదీ శుక్రవారం బిహార్‌లోని గయాజీలో, కోల్‌కతాలో జరిగిన ర్యాలీల్లో ఆరోపించారు. అధికార పీఠంపై ఉంటూ నేరం చేసినవారు కటకటాల వెనక నుంచి పరిపాలన సాగించే పద్ధతి నశించాలని అన్నారు. ఓ గుమాస్తా స్థాయి ప్రభుత్వ ఉద్యోగి కొంత కాలం జైలులో గడిపితే సస్పెన్షన్‌కు గురవుతున్నప్పుడు 30 రోజులు జైలులో ఉన్న ముఖ్యమంత్రి లేదా ప్రధాని తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని మోదీ ప్రశ్నించారు. బిహార్‌లో నిర్వహించిన ఎన్నికల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను చొరబాటుదారుల కారణంగా దేశానికి తలెత్తుతున్న ముప్పును తప్పించే ప్రయత్నంగా అభివర్ణించారు. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించడం ద్వారా ఇండియా కూటమి చొరబాట్లను సమర్థిస్తోందని ఆయన గయాజీ ర్యాలీలో అన్నారు. ప్రతిపక్ష కూటమి నేతల్లో అత్యధికులు జైలులో లేదా బెయిలుపై ఉన్నారని, అందుకే 130వ రాజ్యాంగ సవరణను వ్యతిరేకిస్తున్నారని ఎద్దేవా చేశారు. తీవ్ర నేరానికి పాల్పడి 30 రోజుల పాటు జైలులో గడిపిన ప్రధాని, సీఎంతోపాటు కేంద్ర, రాష్ట్రాల మంత్రుల్ని పదవి నుంచి ఉద్వాసన పలకవచ్చని ఈబిల్లు పేర్కొంటున్న విషయం తెలిసిందే.

■ బిహార్‌లో ఆర్జేడీ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు శుక్రవారం మోదీ ర్యాలీలో పాల్గొన్నారు. వారిద్దరూ ఎన్డీయేలో చేరుతారనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. మోదీ శుక్రవారం బిహార్‌లోని గయాజీ, బెగుసరాయ్ జిల్లాల్లో రూ.13 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టుల్ని ప్రారంభించారు.

మమత గైర్హాజరు

కాంగ్రెస్, టీఎంసీ వంటి పార్టీలు బుజ్జగింపు రాజకీయాల్లో భాగంగా చొరబాటుదార్లకు మద్దతు తెలుపుతున్నాయని కోల్‌కతాలో జరిగిన ర్యాలీలో మోదీ పేర్కొన్నారు. చొరబాటుదార్లు దేశ ఆర్థిక వ్యవస్థకు భారంగా పరిణమించారని, వారు మన తల్లులు, చెల్లెళ్లను వేధిస్తున్నారని ప్రధాని అన్నారు. మోదీ శుక్రవారం కోల్‌కతాలో మూడు కొత్త మెట్రో రూట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ గైర్హాజరయ్యారు.

ఓటు కోల్పోయిన వారి దరఖాస్తుకు ఆధార్‌ను పరిగణనలోకి తీసుకోండి

బిహార్ ఎస్ఐఆర్‌పై ఈసీకి సుప్రీం ఆదేశం


దిల్లీ: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమం(ఎస్ఐఆర్)లో ఓట్లు కోల్పోయిన ఓటర్లకు అనుకూలంగా సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశాలు వెలువరించింది. ఆ ప్రకారం తొలగింపునకు గురైన ఓటర్లకు భౌతికంగా దరఖాస్తు చేసుకునే అవకాశంతోపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అనుమతించాలని ఎన్నికల సంఘాన్ని(ఈసీ)కి సుప్రీంకోర్టు సూచించింది. ఆమోదయోగ్యమైన 11 పత్రాల్లో ఏదో ఒకదానితోపాటు ఆధార్ కార్డు సంఖ్యతో క్లెయిం ఫారం సమర్పణకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ ధర్మాసనం అనుమతించింది. ఎస్ఐఆర్‌లో 65 లక్షల ఓట్లను తొలగించినప్పటికీ ఈ అంశంపై ఇప్పటి వరకూ ఏ ఒక్క రాజకీయ పార్టీ ఎటువంటి అభ్యంతరాలు తెలుపకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. 85 వేల కొత్త ఓట్లు నమోదైతే బూత్‌స్థాయి ఏజెంట్ల నుంచి కేవలం రెండు అభ్యంతరాలే రావడమేంటని ప్రశ్నించింది. సంబంధిత పార్టీలనూ ఈ కేసులో చేర్చాలంటూ బిహార్ ముఖ్య ఎన్నికల అధికారిని ఆదేశించింది. ఎస్ఐఆర్‌లో ఓటు కోల్పోయిన వారు భౌతికంగా దరఖాస్తు చేసిన సందర్భంలో పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లకు రశీదును అందించాలంటూ ఈసీ అధికారులకు ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 8వ తేదీకి వాయిదా వేస్తూ ఆనాటికి వాస్తవస్థితిపై అన్ని రాజకీయపార్టీలు నివేదికను సమర్పించాలని కోరింది.

మాపై విశ్వాసం ఉంచండి: ఈసీ

ఈ సందర్భంగా బిహార్‌లో తాము చేపట్టిన ఎస్ఐఆర్‌పై విశ్వాసం ఉంచాలని ఈసీ సుప్రీంకోర్టును కోరింది. తమ చర్యతో ఏ ఒక్క ఓటరూ నష్టపోరని హామీ ఇచ్చింది.

క్రెమ్లిన్‌కు భారత్ ఓ శుద్ధి కేంద్రం

- రక్తపాతంలో తన పాత్రను గుర్తించడం లేదు
- ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో



వాషింగ్టన్: రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకొంటూ భారత్ 'లాభదాయకమైన పథకం' నడుపుతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో వ్యాఖ్యానించారు. భారత్‌ను సుంకాల 'మహారాజు'గా అభివర్ణించారు. వైట్‌హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. క్రెమ్లిన్‌కు భారత్ ఓ శుద్ధికేంద్రమని, అసలు వాస్తవమిదేనన్నారు. ఆగస్టు 27 నుంచి భారత్‌పై 25% శిక్షార్హమైన సుంకాలు అమలులోకి వస్తాయా అన్న ప్రశ్నకు.. 'జరిగేలా చూస్తాను' అని బదులిచ్చారు. "భారత్‌తో మా వ్యాపారం వల్ల అమెరికన్లపై పడే నికర ప్రభావం ఏమిటి? మా వ్యాపారాన్ని, అమెరికన్ కార్మికులను ఇది దెబ్బతీస్తుంది. మా నుంచి పొందుతున్న డబ్బును రష్యన్ చమురు కొనుగోలుకు ఉపయోగిస్తున్నారు. ఆ డబ్బును రష్యా ఆయుధాల తయారీకి వాడి ఉక్రెనియన్లను చంపుతోంది. జరుగుతున్న రక్తపాతంలో తన పాత్రను గుర్తించడానికి భారత్ ఇష్టపడటం లేదు. మరోవైపు.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వైపు కూడా మొగ్గు చూపుతోంది" అని నవారో అన్నారు. ప్రస్తుతం భారత్ చేస్తున్నది శాంతిని కోరుకునేలా లేదని, యుద్ధాన్ని కొనసాగిస్తున్నట్లుగా ఉందన్నారు. రష్యా నుంచి భారత్ చౌక చమురును కొనుగోలు చేసి, శుద్ధి చేసిన ఉత్పత్తులను యూరప్, ఆఫ్రికా, ఆసియా దేశాల్లో మంచి ధరకు విక్రయిస్తోందని నవారో తెలిపారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మావోయిస్టులకు అనుకూల తీర్పులిచ్చారు

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపణ



కొచ్చిన్, చెన్నై: ఇండియా కూటమి తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీచేస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి న్యాయమూర్తిగా పనిచేసిన రోజుల్లో నక్సలిజానికి మద్దతుగా తీర్పులిచ్చారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం ఆరోపించారు. కేరళలో ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. "జస్టిస్ సుదర్శన్‌రెడ్డి.. 2011 డిసెంబరులో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు 'సల్వాజుడుం'పై తీర్పు ఇచ్చారు. మావోయిస్టులపై పోరాటం చేసేందుకు 'సల్వాజుడుం' పేరుతోనో మరో పేరుతోనో గిరిజన యువకులను ప్రత్యేక పోలీసు అధికారులుగా ఉపయోగించడం చట్ట విరుద్ధమని, రాజ్యాంగ విరుద్ధమని ఆ తీర్పులో పేర్కొన్నారు. సల్వాజుడుం సభ్యులను నిరాయుధులను చేయాలని ఆదేశించారు. ఆయన అలా తీర్పు ఇచ్చి ఉండకపోతే, 2020 నాటికే మావోయిస్టు తీవ్రవాదం ముగిసి ఉండేది" అని అభిప్రాయపడ్డారు. జస్టిస్ రెడ్డి నక్సల్ భావజాలం నుంచి స్ఫూర్తి పొందారు కాబట్టే అలాంటి తీర్పు వెలువరించారన్నారు.

130వ రాజ్యాంగ సవరణ బిల్లును తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నల్ల చట్టంగా అభివర్ణించడాన్ని అమిత్‌షా ఖండించారు. దిల్లీ సీఎంగా ఉన్న రోజుల్లో కేజ్రీవాల్ జైలులో ఉండి పరిపాలన సాగించారని, అలాంటి ఉదంతాలు పునరావృతం కాకూడదనే 130వ రాజ్యాంగ సవరణ బిల్లు తెచ్చామని షా అన్నారు.

29 నుంచి మోదీ జపాన్, చైనా పర్యటన

దిల్లీ, బీజింగ్: ప్రధాని మోదీ ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు జపాన్, చైనాల్లో పర్యటించనున్నారు. మోదీ తన పర్యటనలో ముందుగా రెండు రోజులపాటు(ఈ నెల 29 నుంచి 30 వరకూ) జపాన్‌ను సందర్శిస్తారు. అనంతరం చైనాకు చేరుకుని తియాన్‌జిన్‌లో నిర్వహించనున్న షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారని విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది. ఈ నెల 31, వచ్చే నెల 1 తేదీల్లో నిర్వహించనున్న శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ తదితరులు హాజరుకానున్నారు.

ఇకపై ట్రక్కు డ్రైవర్లకు వర్కర్ వీసాలు ఇవ్వబోం

- అమెరికా ప్రభుత్వం ప్రకటన



వాషింగ్టన్: విదేశీయులకు వీసాలు జారీ చేసే ప్రక్రియను కఠినతరం చేస్తున్న అమెరికా శుక్రవారం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వాణిజ్య ట్రక్కులు నడిపే డ్రైవర్లకు ఇకపై వర్కర్ వీసాలు జారీ చేయబోమని స్పష్టంచేసింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రకటించింది. "అమెరికా రోడ్లపై భారీ ట్రక్కులు నడిపే విదేశీ డ్రైవర్ల సంఖ్య పెరుగుతోంది. వీరి నిర్లక్ష్యం కారణంగా అమెరికన్ల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. అమెరికా డ్రైవర్ల జీవనోపాధికీ గండి పడుతోంది" అని అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. ఫ్లోరిడాలోని హైవేపై ఓ ట్రక్కు డ్రైవర్ నిర్లక్ష్యంగా యూటర్న్ తీసుకొని ముగ్గురు ప్రాణాలు బలిగొన్న నేపథ్యంలో రూబియో ఈ ప్రకటన చేశారు. విదేశీ ట్రక్కు డ్రైవర్లపై ఆంక్షలకు ఉపక్రమించిన ట్రంప్ యంత్రాంగం.. డ్రైవర్లకు ఆంగ్లం చదవడం, రాయడం వచ్చి ఉండటాన్ని తప్పనిసరి చేసింది. రోడ్లపై సూచికలు చదవలేకపోవడం, ఇంగ్లిష్‌లో మాట్లాడకపోవడం వల్లే అనేక ప్రమాదాలకు డ్రైవర్లు కారణమవుతున్నారని రవాణాశాఖ పేర్కొంది. మరోవైపు అమెరికాలో ఉన్న సుమారు 5.5 కోట్ల మంది విదేశీయుల వీసా పత్రాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నట్లు ట్రంప్ ప్రభుత్వం వెల్లడించిన సంగతి తెలిసిందే. వీసా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని స్వదేశాలకు తిప్పి పంపించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు ప్రకటించింది.

ఆ నిర్బంధ కేంద్రాన్ని మూసేయండి

- ట్రంప్ ప్రభుత్వానికి ఫెడరల్ కోర్టు ఆదేశం

ఇంటర్నెట్ డెస్క్: ఓ నిర్బంధ కేంద్రానికి సంబంధించి ట్రంప్ ప్రభుత్వానికి కోర్టులో చుక్కెదురైంది. ఫ్లోరిడాలోని నిర్బంధ కేంద్రంలోకి కొత్తగా వలసదారులెవరినీ తరలించొద్దని ఫెడరల్ కోర్టు ఆదేశించింది. ఆ కేంద్రంలోని చాలా భాగాన్ని కూల్చివేసి, పూర్తిస్థాయిలో దానిని మూసివేయాలని స్పష్టం చేసింది. ఇక్కడ తాత్కాలికంగా నిర్మించిన ఫెన్సింగ్, జనరేటర్లు, చెత్త, మురుగు నిర్వహణ వ్యవస్థలను 60 రోజుల్లోగా తొలగించాలని ఆదేశించింది. అయితే, ఈ ఆదేశాలపై స్పందించిన ఫ్లోరిడా ప్రభుత్వం.. అప్పీలుకు వెళ్తామని ప్రకటించింది. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ యంత్రాంగం ఫ్లోరిడాలోని ఎవర్‌గ్లేడ్స్‌లో నిర్బంధ కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. దాదాపు 3 వేల మందిని బంధించేందుకు వీలుగా టెంట్లు, వైరు బోనులు, బెడ్‌లు ఏర్పాట్లుచేశారు. ఈ కేంద్రాన్ని ఇటీవల తనిఖీ చేసిన అధ్యక్షుడు ట్రంప్.. ఈ ప్రాంతంలో ఉండే ప్రాణాంతక జీవాలు కాపలాదారుగా పని చేస్తాయంటూ సరదాగా వ్యాఖ్యానించారు. అందుకే ఈ కేంద్రానికి 'ఎలిగేటర్ అల్కట్రాజ్' అని శ్వేతసౌధం పేరు పెట్టడం గమనార్హం.

ఈ ఏడాది వేడిగాలులతో 84 మరణాలు

- ఓ విశ్లేషణలో వెల్లడి



దిల్లీ: వేడిగాలుల వల్ల ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జులై మధ్యలో దేశవ్యాప్తంగా 84 మరణాలు సంభవించాయని నూతన విశ్లేషణలో శుక్రవారం వెల్లడైంది. కార్మికులకు బలమైన రక్షణ వ్యవస్థ లేకపోవడం, ఉష్ణోగ్రత, వాతావరణాన్ని అంచనా వేసి హెచ్చరికలు జారీ చేయడంలో విఫలమవడం, రోగనిర్ధారణ చేయకుండా గుడ్డిగా వైద్యం చేయడం వంటి పలు కారణాల వల్ల మరణాలు సంభవిస్తున్నాయని 'హీట్‌వాచ్' అనే సంస్థ వెల్లడించింది. అయితే, మార్చి 1 నుంచి జూన్ 24 మధ్య 7,192 మంది వేడిగాలుల కారణంగా ఆసుపత్రి పాలయ్యారని, 14 మంది మాత్రమే మృతి చెందారని జాతీయ వ్యాధి నియంత్రణ సంస్థ(ఎన్‌సీడీసీ) నివేదించింది. జాతీయ, స్థానిక మీడియా సంస్థలు అందించిన సమాచారం ప్రకారం.. మహారాష్ట్రలో 17 మంది, ఉత్తర్‌ప్రదేశ్, తెలంగాణాల్లో 15 మంది, గుజరాత్‌లో 10 మంది, అస్సాంలో ఆరుగురు, పంజాబ్, బిహార్, రాజస్థాన్‌ల్లో ఐదుగురు చొప్పున వడగాలుల వల్ల మరణించారు. వీరిలో ఎక్కువ శాతం వృద్ధులు, బహిరంగ కార్మికులు, దినసరి కూలీలు, రైతులు, విద్యార్థులు ఉన్నారు.

కార్మికుల దీర్ఘకాలిక ఆరోగ్యంపై ప్రభావం..

విపరీతమైన వేడి ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని, కార్మికుల ఉత్పాదకతపై ప్రభావం చూపుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 20 డిగ్రీల పరిసర ఉష్ణోగ్రత కన్నా ఎక్కువ ఉన్న ప్రతి డిగ్రీకి రెండు నుంచి మూడు శాతం కార్మిక ఉత్పాదకత తగ్గుతుందని పేర్కొంది. ఐదేళ్ల సమాచారాన్ని పరిశీలించగా. . తీవ్రమైన వేడి పరిస్థితుల కారణంగా మెదడు, మూత్రపిండాల వ్యాధులు, వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితులు కార్మికుల దీర్ఘకాల ఆరోగ్యం, భద్రతా ప్రమాణాలను ప్రభావితం చేస్తున్నాయి.

కరవు గుప్పిట గాజా సిటీ

- ఆహారం దొరక్క 5 లక్షలమంది పాలస్తీనియన్ల విలవిల
- ఐరాసకు చెందిన ఐపీసీ అధికారికంగా ప్రకటన

గాజా సిటీ: ఇజ్రాయెల్ దాడులతో ఉక్కిరిబిక్కిరవుతున్న గాజా కరవు కోరల్లో చిక్కుకోనుందని ఆహార సంక్షోభంపై నివేదికలు జారీ చేసే ప్రముఖ సంస్థ 'ది ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్' (ఐపీసీ) పేర్కొంది. ఈ సంస్థకు ఐక్యరాజ్యసమితి మద్దతు కూడా ఉంది. గాజాలో అతి పెద్ద నగరమైన గాజా సిటీ ఇప్పటికే కరవు గుప్పిట్లో ఉందని ఐపీసీ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. గాజా జనాభాలో నాలుగో వంతు (దాదాపు 5 లక్షల మంది) మంది ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని తెలిపింది. గాజా సిటీ నుంచి మరో నెలలో గాజా దక్షిణ భాగంలో ఉన్న ఖాన్ యూనిస్, డెయిర్ అల్ బలా నగరాలకూ కరవు విస్తరించనుందని హెచ్చరించింది. ఇజ్రాయెల్ చేస్తున్న సైనిక దాడులు, సాయంపై నియంత్రణ, భారీస్థాయిలో ప్రజలు స్వస్థలాలను వీడటం, గాజాలో ఆహార ఉత్పత్తి జరగకపోవడం ఈ కరవుకు కారణాలుగా ఐపీసీ పేర్కొంది. ఈ నివేదికను ఇజ్రాయెల్ ఖండించింది. హమాస్ దుష్ప్రచారానికి అనుగుణంగా ఐపీసీ తన ప్రమాణాలను మార్చి నకిలీ నివేదికను రూపొందించిందని ఆరోపించింది. సోమాలియా, సూడాన్‌లకు 30 శాతం పోషకాహార లోపాన్ని ప్రమాణంగా తీసుకున్న ఐపీసీ.. గాజాకొచ్చేసరికి 15 శాతాన్ని మాత్రమే లెక్కలోకి తీసుకోవడాన్ని తప్పుబట్టింది. ఈ నివేదికపై ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ స్పందించారు. ఇది మనిషి చేసిన విపత్తుగా పేర్కొన్నారు. ఓ ఆక్రమిత శక్తిగా గాజా ప్రజలకు సరిపడినంత ఆహారం, వైద్య సరఫరాలను అంతర్జాతీయ చట్టాల ప్రకారం అందించాల్సిన బాధ్యత ఇజ్రాయెల్‌కు ఉందని స్పష్టం చేశారు. ఎలాంటి నియంత్రణలు లేకుండా గాజాలోకి మానవతా సాయం వెళ్లేలా చూడాలని అన్నారు.



గాజాలో స్వచ్ఛంద సంస్థ పంపిణీ చేసే ఆహారం కోసం ఓ చిన్నారి వేదన

దారికి రాకపోతే.. నరకదారులను తెరుస్తాం

- గాజాను నాశనం చేస్తాం
- హమాస్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక

డెయిర్ అల్–బలా: హమాస్ ఆయుధాలను వదిలి తమ షరతులకు ఒప్పుకోకపోతే గాజా సిటీని నాశనం చేస్తామని ఇజ్రాయెల్ మరోసారి హెచ్చరించింది. ఈ మేరకు ఆ దేశ రక్షణ శాఖ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. "యుద్ధాన్ని ముగించేందుకు తమ చెరలోని బందీలను హమాస్ విడుదల చేయడంతో పాటు పూర్తిగా ఆయుధాలను వదిలిపెట్టాలి. ఈ షరతులకు వారు అంగీకరించకపోతే గాజాలోని హంతకుల కోసం నరకదారులను త్వరలోనే తెరుస్తాం" అని కట్జ్ హెచ్చరించారు. గాజా సిటీని స్వాధీనం చేసుకునేందుకు సైనికులకు అధికారం ఇస్తానని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపిన మరుసటి రోజే ఇజ్రాయెల్ కట్జ్ ఈ హెచ్చరిక వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు యుద్ధాన్ని ముగించేందుకు మార్పిడి పద్ధతిలో బందీలను విడుదల చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే పాలస్తీనా రాజ్యం ఏర్పాటయ్యేంత వరకూ ఆయుధాలను వదిలిపెట్టబోమని హమాస్ పేర్కొనడం గమనార్హం. మరోవైపు ఇజ్రాయెల్ దాడుల్లో 17 మంది పాలస్తీనియన్లు చనిపోయినట్లు గాజా సిటీలోని షిఫా ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

పార్లమెంటులోకి చొరబడే యత్నం

20 ఏళ్ల యువకుడి అరెస్టు

దిల్లీ: పార్లమెంటు ప్రాంగణం వద్ద భద్రతాపరమైన ఉల్లంఘన చోటుచేసుకుంది. చెట్టు మీదకు ఎక్కి పార్లమెంటు గోడ దూకేందుకు యత్నించిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని ఉత్తర్‌ప్రదేశ్‌లోని భదోహీకి చెందిన రామ్ కుమార్ బింద్ (20)గా గుర్తించారు. 'శుక్రవారం ఉదయం 5.50 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి పార్లమెంటు భవనం ప్రాంగణం సమీపంలోకి వచ్చాడు. సరిహద్దు గోడకు ఆనుకుని ఉన్న చెట్టును ఎక్కి గోడను దూకేందుకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. అతడు మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తు జరుపుతున్నాం" అని డిప్యూటీ కమిషనర్ దేవేశ్ మహ్లా తెలిపారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిసిన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. 2023లో పార్లమెంటు శీతాకాల సమావేశాల వేళ లోక్‌సభలోకి ఇద్దరు దుండగులు దూసుకొచ్చిన సంగతి తెలిసిందే.

ఖైదీల కదలికలపై పర్యవేక్షణకు బెంగాల్ జైళ్లలో ఏఐ కెమెరాలు



కోల్‌కతా: జైళ్లలో ఖైదీల కదలికలను పర్యవేక్షించడానికి పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఏఐ ఆధారిత నిఘా కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. బెంగాల్‌లోని పరివర్తన కేంద్రాల్లో శిక్ష అనుభవిస్తున్న కరడుగట్టిన నేరగాళ్లు బయట జరిగే నేరాలకు జైళ్ల నుంచే ప్రణాళికలు రచించడం, గంజాయి అక్రమ రవాణా వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. చట్టవిరుద్ధమైన ఈ పనులను గుర్తించి, అడ్డుకునేందుకు వీలుగా ఏఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. బెంగాల్‌లోని దాదాపు 60 పరివర్తన కేంద్రాల్లో ఇప్పటికే ఈ అత్యాధునిక కెమెరాలు ఉన్నప్పటికీ ఖైదీలు తమ దృష్టి నుంచి తప్పించుకొంటున్నారని పోలీసులు తెలిపారు. "ప్రతి ఖైదీ బయోమెట్రిక్ వివరాలను ఇందులో పొందుపరుస్తాం, ఇవి సాధారణ కెమెరాల్లా రికార్డు చేయడమేకాక జైలు లోపల అనుమానాస్పద కదలికలు, తగాదాలు, విధ్వంసం, తప్పించుకునే ప్రయత్నాల వంటివాటిని గుర్తించి వెంటనే జైలు గార్డులను అప్రమత్తం చేస్తాయి. ఈ ఏఐ-ఆధారిత వీడియో విశ్లేషణలు ఖైదీల ప్రవర్తన, మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ధోరణులను కూడా అంచనా వేస్తాయి" అని చెప్పారు.

ఇసుక తవ్వకాలతో పర్యావరణంపై ప్రభావం: సుప్రీం కోర్టు

దిల్లీ: నదీ తీరం ప్రస్తుత పరిస్థితిపై సరైన అధ్యయనం జరపకుండానే ఇసుక తవ్వకాలకు అనుమతులిస్తే పర్యావరణ విధ్వంసానికి దారితీసే ప్రమాదం ఉందని సుప్రీంకోర్టు హెచ్చరించింది. భవన నిర్మాణాలకు వినియోగించే ఇసుకకు గిరాకీ భారీగా పెరిగిపోతోందని, ఇది ఇలాగే కొనసాగితే 2050 నాటికి ఈ సహజ వనరు కనుమరుగైపోతుందని జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ ధర్మాసనం ఆందోళనవ్యక్తం చేసింది. నదీ గర్భం నుంచి, తీరం వెంట అంచుల నుంచి ఇసుకను ఇష్టారీతిగా తొలగిస్తే ప్రవాహ దిశలు మారిపోయి, వరదలు ముంచెత్తి జీవావరణానికీ నష్టం జరుగుతుందని తెలిపింది. తొలగించిన ఇసుక సహజసిద్ధంగా మళ్లీ భర్తీ అయ్యే అవకాశాన్నీ పరిగణనలోకి తీసుకోవాలని, తవ్వకాలకు ఏ మేరకు అనుమతించాలనే విషయమై జిల్లాల నుంచి వివిధ విభాగాల నివేదికలను తెప్పించుకుని నిశితంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం తెలిపింది.

రాష్ట్రపతిని కలిసిన శుభాంశు శుక్లా

దిల్లీ: భారత వ్యోమగామి, బృంద కెప్టెన్ శుభాంశు శుక్లా శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిశారు. తన అంతరిక్ష యాత్ర అనుభవాలను రాష్ట్రపతితో పంచుకున్నారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. శుక్లాతో పాటు బృంద కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, బృంద కెప్టెన్ పుణ్యశ్లోక్ బిశ్వాల్, ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్, హ్యూమన్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ దినేశ్ కుమార్ సింగ్‌లతో ముర్ము భేటీ అయినట్లు రాష్ట్రపతి కార్యాలయం పేర్కొంది.




యాక్సియం 4 చిహ్నాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు అందజేస్తున్న వ్యోమగామి శుభాంశు శుక్లా. చిత్రంలో ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్

సీఈసీపై వ్యక్తిగత దాడులు.. ఖండించిన ఐఏఎస్ అధికారుల సంఘం

దిల్లీ: ప్రతిపక్ష నాయకుల 'ఓట్ల చోరీ' ఆరోపణల నడుమ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఆయన కుటుంబంపై జరుగుతున్న వ్యక్తిగత దాడులను ఐఏఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. అధికారిక విధుల నిర్వహణకు, వారి కుటుంబ సభ్యులకు సంబంధం లేదని ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. ప్రజాసేవలో నిమగ్నమైన వారి గౌరవం, సమగ్రతను కాపాడేందుకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొంది.

శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె అరెస్టు



కొలంబో: శ్రీలంక మాజీ అధ్యక్షుడు, ఆరు సార్లు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన రణిల్ విక్రమసింఘే(76)ను శుక్రవారం అరెస్టు చేశారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న అభియోగాలతో ఈ చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన కొలంబో సీఐడీ అధీనంలో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. లండన్‌లో 2023 సెప్టెంబరులో జరిగిన తన భార్య స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అనధికారికంగా ప్రభుత్వ నిధులను వినియోగించారని ఆయనపై ఆరోపణలు వచ్చాయి. 2022లో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రణిల్ విక్రమసింఘే 2024 ఎన్నికల్లో ఓడిపోయారు.

ఛాంపియన్

చిన్నస్వామిలో ప్రపంచకప్ లేదు

బెంగళూరు నుంచి ముంబయికి మహిళల మ్యాచ్‌లు



దిల్లీ: అనుకున్నదే అయింది. బెంగళూరులో చిన్నస్వామి స్టేడియంలో మహిళల వన్డే ప్రపంచకప్ మ్యాచ్‌లు జరగబోవు. అక్కడ నిర్వహించాల్సిన మ్యాచ్‌లు అన్నింటినీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియానికి తరలిస్తూ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిర్ణయం తీసుకుంది. సెప్టెంబరు 30న ఈ మెగా టోర్నీ మొదలు కానుండగా.. చిన్నస్వామిలో భద్రత ప్రమాణాల పట్ల ఐసీసీ సంతృప్తి చెందకపోవడంతో బెంగళూరును ఆతిథ్య నగరాల జాబితా నుంచి తప్పించారు. ఈ ఏడాది ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ సాధించిన అనంతరం చిన్నస్వామి స్టేడియంలో నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో తొక్కిసలాట చోటు చేసుకుని 11 మంది మరణించిన సంగతి తెలిసిందే. దీంతో ఆ మైదానంలో భద్రత ప్రమాణాల పట్ల ఆందోళన వ్యక్తమైంది. ఆ విషాదం తర్వాత అక్కడ ఏ క్రికెట్ మ్యాచ్‌లూ జరగలేదు. ఈ నేపథ్యంలో ప్రపంచకప్ ఆతిథ్య వేదికల నుంచి ఆ స్టేడియాన్ని తప్పిస్తారని వార్తలు వచ్చాయి. ఇప్పుడు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) ఐసీసీని సంతృప్తిపరచలేకపోవడంతో ఆ వార్తలే నిజమయ్యాయి. ఇక్కడి మ్యాచ్‌లను తిరువంతపురానికి తరలిస్తారని ఊహాగానాలు వినిపించినప్పటికీ.. చివరికి ముంబయినే ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నారు. సవరించిన షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించింది. తొలి మ్యాచ్‌కు గువాహటి ఆతిథ్యం ఇవ్వనుంది. ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియంలో మూడు లీగ్ మ్యాచ్‌లతో పాటు ఒక సెమీఫైనల్ జరగనుంది. ఫైనల్ వేదికను ఇంకా ఖరారు చేయలేదు.

కాజల్ పసిడి పట్టు

అండర్-20 ప్రపంచ రెజ్లింగ్



కాజల్

సామోకోవ్ (బల్గేరియా): అండర్-20 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాజల్ అదరగొట్టింది. జోరు కొనసాగిస్తూ పసిడి పతకాన్ని పట్టేసింది. శుక్రవారం మహిళల 72 కేజీల ఫైనల్లో కాజల్ 8-6తో యుకిలూ (చైనా)పై విజయం సాధించింది. తుది పోరులో ప్రత్యర్థి నుంచి గట్టిపోటీ ఎదురైనా 17 ఏళ్ల కాజల్ నిలిచింది. సాంకేతిక బలంగా కనిపించిన భారత రెజ్లర్.. ఆఖర్లో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. రెండు పాయింట్ల తేడాతో చైనా అమ్మాయిని వెనక్కి నెట్టి పసిడి కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో భారత్‌కు దక్కిన రెండో స్వర్ణమిది. ఇంతకుముందు తపస్య (57 కేజీ) పసిడి నెగ్గింది. శ్రుతి (50 కేజీ), సారిక (53 కేజీ) కాంస్యాలు గెలుచుకున్నారు. శ్రుతి 6-0తో జోస్పైన్ రించ్ (జర్మనీ)పై గెలిచింది. సారిక 11-0తో వాల్‌చుక్ (పోలెండ్)ను చిత్తు చేసింది. గ్రీకో రోమన్‌లో భారత రెజ్లర్లకు నిరాశ ఎదురైంది. అనుజ్ (67 కేజీ), నమన్ (97 కేజీ) ఓడిపోయారు. ప్రిక్వార్టర్స్‌లో అనుజ్ 0-9తో జావోయాన్ (చైనా) చేతిలో ఓడాడు. నమన్ 1-2తో ఆండ్రి రోడిన్ (క్రొయేషియా)కు తలొంచాడు. 72 కేజీల్లో మహ్మద్ షాబామ్ (ఈజిప్ట్) చేతిలో వినీత్ పరాజయం చవిచూశాడు. టురాన్ (అజర్‌బైజాన్)తో ప్రిక్వార్టర్స్‌లో అనిల్ మోర్ (55 కేజీ) గట్టిగానే పోరాడినా ఓటమి తప్పలేదు.

ఇలవేనిల్ గురి అదుర్స్

- 10 మీటర్ల ఎయిర్‌రైఫిల్ స్వర్ణం సొంతం
- ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్



ఇలవేనిల్

షెమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల హవా కొనసాగుతోంది. శుక్రవారం మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో ఇలవేనిల్ వలరివాన్ స్వర్ణంతో మెరిసింది. క్వాలిఫికేషన్లో 630.7 పాయింట్లతో ఎనిమిదో స్థానం సాధించిన ఇలవేనిల్.. ఫైనల్లో సత్తా చాటింది. 253.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. గ్జిన్ పెంగ్ (చైనా, 253) రజతం.. యిన్‌జి వాన్ (కొరియా, 231.2) కాంస్యం సాధించారు. ఇదే విభాగంలో పోటీపడిన మరో భారత షూటర్ మెహులి ఘోష్ (208.9) నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. స్కీట్ మిక్స్‌డ్ డబుల్స్‌లో గనేమత్ షెకాన్-అభయ్ సింగ్ షెకాన్ జంట కాంస్యం నెగ్గింది. కంచు పోరులో గనేమత్ జంట 39-37తో అబ్దుల్లా-అఫ్రా (కువైట్) జోడీని ఓడించింది. జూనియర్ విభాగంలోనూ భారత షూటర్లు జోరు కొనసాగిస్తున్నారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో శాంభవి దేవి, హృద్యశ్రీ, ఇషా అనిల్‌లతో కూడిన భారత జట్టు (1896.2 పాయింట్లు) స్వర్ణం కైవసం చేసుకుంది. జూనియర్ స్కీట్ మిక్స్‌డ్‌లో కాంస్య పతక పోరులో ఇషాన్ సింగ్-అగ్రిమ జంట 36-40తో ఆర్టెమ్-సొరోకినా (కజకిస్థాన్) జోడీ చేతిలో ఓడింది.

విజృంభించిన ఎంగిడి

- రెండో వన్డేలోనూ దక్షిణాఫ్రికా విజయం
- ఆసీస్‌తో సిరీస్‌లో 2-0తో పైచేయి



లుంగి ఎంగిడి 5/42

మెకే (ఆస్ట్రేలియా): ఆస్ట్రేలియా చేతిలో టీ20 సిరీస్‌లో ఎదురైన ఓటమికి.. వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా బదులు తీర్చుకుంది. కంగారూలతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే ఆ జట్టు 2-0తో సొంతం చేసుకుంది. తొలి వన్డేలో కేశవ్ మహరాజ్ 5 వికెట్ల ప్రదర్శన చేయడంతో 98 పరుగుల తేడాతో ఆసీస్‌ను మట్టికరిపించిన సఫారీ జట్టు.. రెండో మ్యాచ్‌లో లుంగి ఎంగిడి (5/42) విజృంభణతో 84 పరుగుల తేడాతో నెగ్గింది. మొదట దక్షిణాఫ్రికా 49.1 ఓవర్లలో 277 పరుగులకు ఆలౌటైంది. మాథ్యూ బ్రీట్జ్‌కే (88; 78 బంతుల్లో 8×4, 2×6), ట్రిస్టన్ స్టబ్స్ (74; 87 బంతుల్లో 3×4, 1×6) రాణించారు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా (3/63), జేవియర్ బార్ట్‌లెట్ (2/45), నాథన్ ఎలిస్ (2/46), లబుషేన్ (2/19) సత్తా చాటారు. అనంతరం ఎంగిడి, బర్గర్ (2/23), సెనురన్ ముత్తుస్వామి (2/30)ల ధాటికి ఆసీస్ 37.4 ఓవర్లలో 193 పరుగులకే ఆలౌటైంది. జోష్ ఇంగ్లిస్ (87; 74 బంతుల్లో 10×4, 1×6) ఒంటరి పోరాటం చేశాడు. చివరి వన్డే ఆదివారం జరుగుతుంది.

సిద్ధు రికార్డు బద్దలు: దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ మాథ్యూ బ్రీట్జ్‌కే అరుదైన ఘనత సాధించాడు. అతను అరంగేట్రం నుంచి వరుసగా నాలుగు వన్డేల్లోనూ అతను 50+ ప్లస్ స్కోర్లు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. కెరీర్లో అతి తక్కువ సమయంలో బ్రీట్జ్‌కే ఈ ఘనతను అందుకున్నాడు. భారత మాజీ బ్యాటర్ నవ్‌జ్యోత్ సిద్ధు.. వన్డేల్లో రెండో మ్యాచ్ నుంచి మొదలుపెట్టి అయిదో మ్యాచ్‌కు ఈ రికార్డును చేరుకున్నాడు.



కూత కాస్త కొత్తగా

ప్రొ కబడ్డీ ఫార్మాట్‌లో మార్పులు

ముంబయి: కూతకు రంగం సిద్ధమవుతోంది. ఈసారి ప్రొ కబడ్డీ సరికొత్తగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆగస్టు 29న ఆరంభంకానున్న పన్నెండో సీజన్‌లో టై అన్న మాటే వినిపించదు. ఉత్కంఠభరిత పోరాటాలతో రెండు జట్ల స్కోర్లు సమమైతే.. గోల్డెన్ రైడ్ ద్వారా ఫలితం రాబడతారు. గతంలో ప్లేఆఫ్స్‌కు పరిమితమైన ఈ నిబంధనను లీగ్ దశలోనూ అమలుచేయనున్నారు. మొత్తం 12 జట్ల మధ్య సమరంలో ఎనిమిది జట్లు తర్వాతి దశకు చేరుకుంటాయి. ఫైనల్లో చోటు కోసం ఆయా జట్ల స్థానాల ఆధారంగా మ్యాచ్‌లుంటాయి. ఈసారి కొత్తగా అమలు చేయనున్న ఫార్మాట్‌ను, నిబంధనలను ప్రొకబడ్డీ శుక్రవారం వెల్లడించింది.

టైబ్రేకర్ నిబంధన: మ్యాచ్ టై అయితే గోల్డెన్ రైడ్ నిబంధన అమల్లోకి వస్తుంది. ఫలితం తేల్చేందుకు ప్రతి జట్టుకు అయిదు రైడ్ అవకాశాలను ఇస్తారు. అత్యధిక పాయింట్లు సాధించిన జట్టును విజేతగా ప్రకటిస్తారు. అయిదు రైడ్‌లు ముగిసినా స్కోర్లు సమమైతే మళ్లీ గోల్డెన్ రైడ్ నిబంధనను అమలుచేస్తారు. మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు రెండు పాయింట్లు లభిస్తాయి.

12 జట్లు

హరియాణ స్టీలర్స్, దబంగ్ దిల్లీ, యూపీ యోధాస్, పట్నా పైరేట్స్, యు ముంబా, జైపూర్ పింక్ పాంథర్స్, తెలుగు టైటాన్స్, పుణెరి పల్టాన్, తమిళ్ తలైవాస్, బెంగాల్ వారియర్జ్, గుజరాత్ జెయింట్స్, బెంగళూరు బుల్స్

నాలుగు వేదికల్లో..

విశాఖపట్నంలో ఆగస్టు 29న ప్రొకబడ్డీ ఆరంభమవుతుంది. సెప్టెంబరు 11 వరకు తొలి అంచె పోటీలు అక్కడే జరుగుతాయి. ఆ తర్వాత జైపూర్, చెన్నై, చివరకు దిల్లీలో అక్టోబరు 23న జరిగే ఫైనల్‌తో ఈ సీజన్ ముగుస్తుంది.

- లీగ్ దశలో మొత్తం 108 మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతి జట్టు 18 మ్యాచ్‌లు ఆడుతుంది.


ఎనిమిది జట్లకు ఫైనల్ అవకాశం: లీగ్ దశ ముగిశాక అగ్రస్థానంలోని ఎనిమిది జట్లకు ఫైనల్ చేరేందుకు అవకాశం లభిస్తుంది. అయితే లీగ్ దశలో ఆయా జట్ల స్థానాల ఆధారంగా ఫైనల్ చేరే దారి నిర్ణయమవుతుంది.

- లీగ్ దశలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వాలిఫయర్-1లో పోటీపడతాయి. గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత పొందుతుంది. ఓడిన జట్టుకు క్వాలిఫయర్-2లో ఆడే అవకాశం లభిస్తుంది.
- 5వ, 8వ స్థానం సాధించిన జట్ల మధ్య, 6వ, 7వ స్థానంలోని జట్ల మధ్య ప్లేఇన్ మ్యాచ్‌లు ఆడిస్తారు. ఈ రెండు మ్యాచ్‌ల్లో విజేతలు ఎలిమినేటర్-1కు చేరతాయి. ఈ రెండు జట్ల మధ్య విజేత ఎలిమినేటర్-2కు అర్హత సాధిస్తుంది.
- 3, 4 స్థానాల్లో నిలిచిన జట్లు మినీ క్వాలిఫయర్‌లో పోటీపడతాయి. విజేత జట్టు ఎలిమినేటర్-3కు అర్హత సాధిస్తుంది. ఓడిన జట్టు ఎలిమినేటర్-2కు వెళ్తుంది.
- ఎలిమినేటర్-2లో విజేత ఎలిమినేటర్-3కు వస్తుంది. ఎలిమినేటర్-3లో విజేత క్వాలిఫయర్-2కు అర్హత పొందుతుంది. క్వాలిఫయర్-2లో విజేత ఫైనల్ చేరుతుంది.

రెజ్లింగ్‌కు పుట్టినిల్లు హరియాణా. ఇక్కడ నుంచి ఎందరో స్టార్ క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. ఇప్పుడా జాబితాలోకి కాజల్, తపస్య గెహ్లోట్ కూడా చేరారు. మారుమూల పల్లెటూళ్ల నుంచి వచ్చిన ఈ అమ్మాయిలు బల్గేరియాలో జరుగుతున్న అండర్-20 ప్రపంచ రెజ్లింగ్ పోటీల్లో ఛాంపియన్లుగా నిలిచి ఔరా అనిపించారు.

భలే అమ్మాయిలు

అండర్-20 ప్రపంచ రెజ్లింగ్ పోటీల్లో స్వర్ణాలు గెలిచిన కాజల్, తపస్యలది రెజ్లింగ్ నేపథ్యమే. హరియాణలోని సోనెపట్ జిల్లా లాత్ గ్రామానికి చెందిన కాజల్.. బంధువు కృష్ణన్‌ను చూసి తాను రెజ్లర్ కావాలని భావించింది. ఆమె నాన్న ట్యాక్సీ డ్రైవర్. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా గ్రామంలోని అకాడాల్లో సాధన చేసి రాటుదేలింది. జాతీయ టోర్నీల్లో సత్తా చాటిన ఆమె *2022లో అండర్-15 ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది.* అక్కడ నుంచి ఆమె మరో అడుగు ముందుకేసింది. *2024లో జోర్డాన్‌లోని* అమ్మాన్‌లో జరిగిన పోటీల్లో *అండర్-17* ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ క్రమంలో స్టార్ ప్లేయర్లు ఉలియానా లాప్నిక్ (రష్యా), అకో ఉచియామా (జపాన్)ను ఓడించి అందరి దృష్టిలో పడింది. తాజాగా *అండర్-20* టోర్నీలో బరువు కేటగిరిని *72* కేజీలకు మార్చుకుని విజేతగా నిలిచింది. కేటగిరి మారినా.. తనకన్నా అనుభవం ఉన్న ప్లేయర్లు బరిలో ఉన్నా కాజల్ వెనక్కి తగ్గలేదు. మరోవైపు తపస్య రెజ్లింగ్ కుటుంబం నుంచి వచ్చింది. ఆమె తాత చౌదరి హజారి లాల్ రెజ్లర్. ఆమె తండ్రి పరమేశ్ గెహ్లోట్ కూడా మల్ల యోధుడే. తమ వారసత్వాన్ని కొనసాగిస్తూ తపస్యను రెజ్లింగ్‌లోకి తీసుకు రావాలని ఆమె తండ్రి నిర్ణయించాడు. అమ్మాయిలు క్రీడల్లోకి రావడానికి ఒకప్పుడు తపస్య గ్రామం ఖానాపుర్ కలాన్‌లో ఎంతో వ్యతిరేకత ఉండేది. అయినా కూడా ఆమె రెజ్లింగ్ వైపు మళ్లింది. *2016లో* స్థానికంగా ఉండే అకాడమీలో చేరింది. ఈ ఆటలో రాణిస్తుండడంతో మెరుగైన శిక్షణ కోసం ఆమె సోనెపట్‌కు వెళ్లింది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా ఆమె కుటుంబం తపస్యను మాత్రం రెజ్లింగ్‌కు దూరం చేయలేదు. సోనెపట్‌లో కోచ్ కుల్‌బీర్ శిక్షణలో ఆమె రాటుదేలింది. "నా తండ్రి మంచి రెజ్లర్. నేను కూడా జాతీయ స్థాయిలో ఆడాను. గాయం నన్ను ఈ ఆటకు దూరం చేసింది. ఇప్పుడు మా కుటుంబంలో మూడో తరానికి ప్రతినిధిగా తపస్య వచ్చింది. ఆమె జూనియర్ ప్రపంచ ఛాంపియన్ కావడం ఎంతో గర్వంగా ఉంది. మేం పడిన కష్టానికి ప్రతిఫలమిది" అని తపస్య నాన్న పరమేశ్ అన్నాడు.



తపస్య

– ఈనాడు క్రీడావిభాగం

పుంజుకున్న భారత్-ఎ



రాఘవి బిష్త్

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా-ఎ మహిళల జట్టుతో అనధికార టెస్టులో భారత్-ఎ పుంజుకుంది. రాఘవి బిష్త్ (93; 153 బంతుల్లో 16×4), జోష్న (51; 72 బంతుల్లో 7×4) రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 299 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 93/5తో రెండో రోజు, శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్‌ను రాఘవి నడిపించింది. కెప్టెన్ రాధ యాదవ్ (33)తో ఆమె ఆరో వికెట్‌కు 72 పరుగులు జోడించడంతో భారత్ కోలుకుంది. రాధ ఔటైనా.. మిన్ను మణి (28), రాఘవి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. సెంచరీ చేసేలా కనిపించిన రాఘవి ఆ మైలురాయికి కొద్ది దూరంలో ఔటైంది. ఈ స్థితిలో అర్ధసెంచరీ చేసిన జోష్న జట్టు స్కోరును 300 సమీపానికి తీసుకెళ్లింది. తితాస్ సాధు (23) నుంచి ఆమెకు మంచి సహకారం అందింది. అనంతరం ఆస్ట్రేలియా-ఎ ఆట చివరికి తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 158 పరుగులు చేసింది. నికోల్ ఫల్టామ్ (30 బ్యాటింగ్), సియానా (24 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఒక దశలో 71/1తో మెరుగైన స్థితిలో నిలిచిన ఆసీస్.. తర్వాత తడబడింది. 37 పరుగుల తేడాతో 4 వికెట్లు చేజార్చుకుంది. సైమా (2/21), రాధ యాదవ్ (2/40) ప్రత్యర్థిని దెబ్బ కొట్టారు.

వాళ్లనెందుకు విస్మరించారు?

టీమ్‌ఇండియా ఆటగాళ్లను దులీప్ ట్రోఫీకి ఎంపిక చేయకపోవడంపై బీసీసీఐ

ముంబయి: కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్ సహా పలువురు టీమ్‌ఇండియా ఆటగాళ్లను దులీప్ ట్రోఫీకి ఎంపిక చేయకపోవడంపై బీసీసీఐ స్పందిస్తూ, క్రీడా సంఘాలకు లేఖ రాసింది. బీసీసీఐ కాంట్రాక్టులో ఉన్న ఆటగాళ్లందరూ దులీప్ ట్రోఫీ సెలక్షన్‌కు అందుబాటులో ఉన్నట్లే అని, వారిని జట్లలోకి ఎంపిక చేసుకోవచ్చని బీసీసీఐ స్పష్టం చేసింది. రాహుల్, సిరాజ్, వాషింగ్టన్ సుందర్, ప్రసిద్ధ్ కృష్ణ, సాయి సుదర్శన్ లాంటి టీమ్‌ఇండియా ఆటగాళ్లను దులీప్ ట్రోఫీలో పోటీ పడే సౌత్‌జోన్ జట్టుకు ఎంపిక చేయని నేపథ్యంలో బీసీసీఐ స్పందించింది. "దులీప్ ట్రోఫీ ప్రతిష్ఠను పెంచేలా, అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించడానికి వీలుగా అందుబాటులో ఉన్న భారత ఆటగాళ్లందరినీ జోనల్ జట్లకు ఎంపిక చేయొచ్చు. జోనల్ కన్వీనర్లు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఆటగాళ్లను జట్లలోకి తీసుకోవాలి" అని బీసీసీఐ జనరల్ మేనేజర్ అబయ్ కురువిల్లా రాష్ట్ర సంఘాలకు పంపిన ఈమెయిల్లో పేర్కొన్నాడు.

క్రికెట్‌కు గౌహర్ వీడ్కోలు



గౌహర్ సుల్తానా

దిల్లీ: హైదరాబాద్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ గౌహర్ సుల్తానా క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. 2008లో పాకిస్థాన్‌పై అరంగేట్రం చేసిన 37 ఏళ్ల గౌహర్.. భారత్ తరఫున 50 వన్డేలు, 37 టీ20లు ఆడింది. ఆమె 2014 ఏప్రిల్‌లో పాకిస్థాన్‌పై చివరి అంతర్జాతీయ మ్యాచ్ (టీ20)లో కనబడింది. గౌహర్ వన్డేల్లో 66 వికెట్లు.. టీ20ల్లో 29 వికెట్లు పడగొట్టింది. 2009, 2013 వన్డే ప్రపంచకప్‌ల్లోనూ ఆడి 11 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీసింది. 2009-2014 మధ్య మూడు టీ20 ప్రపంచకప్‌లలో పాల్గొని ఏడు వికెట్లు పడగొట్టింది. సుదీర్ఘ విరామం వచ్చినా.. 2024 డబ్ల్యూపీఎల్‌లో గౌహర్ యూపీ వారియర్స్ తరఫున పునరాగమనం చేసింది. ఈ ఏడాది లీగ్‌లోనూ ఆడింది. ప్రస్తుతం ఆమె బీసీసీఐ కోచ్‌గా పని చేస్తోంది. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం.. ప్రపంచకప్‌లలో ఆడడం ఎంతో గర్వంగా భావిస్తున్నా" అని గౌహర్ తెలిపింది.

రోహిత్ గొప్ప నాయకుడు



ద్రవిడ్ రోహిత్

చెన్నై: టీమ్‌ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ నాయకత్వ శైలిపై మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ ప్రశంసల జల్లు కురిపించాడు. రోహిత్ ప్రశాంతంగా తన పని పూర్తి చేస్తాడని.. జట్టు ప్రయోజనాలే అతడికి ఎప్పుడూ ముఖ్యమని ద్రవిడ్ అన్నాడు. మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ షోలో ద్రవిడ్ మాట్లాడుతూ.. 'రోహిత్ జట్టు గురించి చాలా లోతుగా ఆలోచించేవాడు. తొలి రోజు నుంచి జట్టు కోసం, గెలవడం కోసం ఏం చేయాలో స్పష్టతతో ఉన్నాడు. కెప్టెన్, కోచ్‌ల మధ్య సంబంధం చాలా కీలకమైన విషయం అని నా అభిప్రాయం. జట్టు ఎప్పుడూ కెప్టెన్ సొంతమని నేను నమ్ముతాను. నేను ఆటగాడిగా, కెప్టెన్‌గా ఉన్నాను. జట్టును సరైన దారిలో నడిపించడం కెప్టెన్ బాధ్యత. ఆ విషయంలో కోచ్‌గా మనం చేతనైన సాయం చేయాలి. జట్టులో ఎలాంటి వాతావరణం ఉండాలో, ఆటగాళ్ల నుంచి తనకేం కావాలో రోహిత్‌కు స్పష్టంగా తెలుసు. అనుభవం తనకు కలిసొచ్చింది. రోహిత్‌తో కలిసి పని చేయడం, తనకు కొన్ని సందర్భాల్లో సవాళ్లు విసరడం, తనను సౌకర్యవంతంగా ఉంచడం.. వీటన్నింటినీ నేను ఆస్వాదించాను. అతను చాలా ప్రశాంతంగా ఉంటాడు. జట్టుతో తనకు బలమైన బంధం ఉంటుంది. అతిగా ఏమీ చేసేవాడు కాదు. సమతూకం పాటించేవాడు" అని ద్రవిడ్ పేర్కొన్నాడు.

సెమీస్‌లో జ్ఞానదత్తు

అంతర్జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ సిరీస్‌లో జ్ఞానదత్తు సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం అండర్-19 బాలుర సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో అతడు 23-21, 14-21, 21-11తో ప్రణవ్ రామ్‌ను ఓడించాడు. అండర్-19 మహిళల సింగిల్స్‌లో తన్విరెడ్డి, శ్రేయాంశి వలిశెట్టి సెమీస్ చేరారు. క్వార్టర్స్‌లో తన్వి 18-21, 21-19, 21-10తో దీక్షపై విజయం సాధించింది. శ్రేయాంశి 21-18, 23-21తో తనూ చంద్రపై నెగ్గింది. పురుషుల డబుల్స్‌లో విష్ణు కేదార్-మిథిలేష్ జంట 21-9, 21-12తో రాఘవేంద్ర-సౌరభ్ సాహు జోడీపై విజయం సాధించగా.. నిరంజన్-యుధజిత్ జంట 21-12, 21-13తో హార్దిక్-అమిత్‌రాజ్ ద్వయంపై గెలిచింది. బాలికల్లో కీర్తి మంచాల-వర్ణప్రభ జోడీ 21-14, 21-19తో తారిణి-శ్రావణి జంటపై నెగ్గగా.. మిక్స్‌డ్ డబుల్స్‌లో దీపిక-కరామత్ ద్వయం 21-13, 21-18తో హరి-జాన్విక జోడీపై పైచేయి సాధించి సెమీఫైనల్లో అడుగుపెట్టింది.

గుకేశ్, ప్రజ్ఞానంద గేమ్‌లు డ్రా

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్వెఫీల్డ్ చెస్ కప్ నాలుగో రౌండ్లో భారత గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నారు. శుక్రవారం లాగ్రెవ్ (ఫ్రాన్స్)తో గుకేశ్.. సెవియాన్ (అమెరికా)తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకున్నారు. డుడా (పోలెండ్)తో గేమ్‌ను అరోనియన్ (అమెరికా) డ్రాగా ముగించాడు. 5 రౌండ్లు మిగిలున్న ఈ టోర్నీలో కరువానా (అమెరికా) 3 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ప్రజ్ఞానంద, అరోనియన్ చెరో 2.5 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో.. 2 పాయింట్లతో గుకేశ్, లాగ్రెవ్, వెస్లీ, ఫిరౌజా, సెవియాన్ మూడో స్థానంలో ఉన్నారు.

జూనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా శరత్!

దిల్లీ: భారత క్రికెట్ జూనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా తమిళనాడు మాజీ బ్యాటర్ ఎస్.శరత్ నియమితం కానున్నాడు. శరత్ ప్రస్తుతం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సీనియర్ సెలక్షన్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాడు. జూనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా తిలక్ నాయుడు పదవీకాలం ముగియడంతో ఆ స్థానంలో శరత్ నియామకానికి బీసీసీఐ ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఈ కమిటీలో కృష్ణన్ మోహన్, రణదేబ్ బోస్, ప్రతీక్ పటేల్, హెచ్.ఎస్.సోధి సభ్యులుగా ఉన్నారు.

షటిల్ సంక్షోభం ఏమీ లేదు: బీడబ్ల్యూఎఫ్

దిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్‌లో నాణ్యమైన షటిల్ కాక్స్ కొరత ఉన్న మాట వాస్తవమే అయినా, దీన్ని సంక్షోభంగా భావించాల్సిన అవసరం లేదని ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య పేర్కొంది. చైనాలో గూస్ పెంపకం తగ్గిపోవడంతో వాటి ఈకలతో తయారు చేసే షటిల్ కాక్‌ల తయారీకి ఇబ్బందిగా మారింది. బ్యాడ్మింటన్‌లో ఈ ఈకలతో చేసే షటిల్ కాక్‌లనే ఎక్కువమంది వినియోగిస్తారు. వాటి నాణ్యత బాగుంటుంది. అయితే ఈకల లభ్యత తగ్గిపోవడంతో ఈ షటిల్ కాక్‌ల ధరలు పెరిగిపోయాయి. వీటికి ప్రత్యామ్నాయంగా సింథటిక్ షటిల్ కాక్‌ల వైపు మళ్లాల్సిన అవసరం కనిపిస్తోంది. ఈ క్రమంలోనే బీడబ్ల్యూఎఫ్ కూడా స్పందించింది. "షటిల్ కాక్‌ల సరఫరాలో ఎదురవుతున్న సవాళ్ల గురించి మాకు తెలుసు. ప్రపంచవ్యాప్తంగా ఈకలతో తయారు చేసిన షటిల్ కాక్‌ల ధరలు పెరిగి బ్యాడ్మింటన్ వర్గాలు ఇబ్బంది పడుతున్నాయి. ఇది ఇంకా సంక్షోభ స్థాయికి రాలేదు. సింథటిక్ షటిల్ కాక్‌ల అభివృద్ధికి మేం కట్టుబడి ఉన్నాం. తయారీ సంస్థలు కూడా ఈ సమస్యను పరిష్కరించడంపై దృష్టిపెట్టాలి" అని బీడబ్ల్యూఎఫ్ పేర్కొంది.

ఇది బందిపోటు పరిశుద్ధ మార్కు!



ఎన్టీఆర్ జిల్లా రామాపురంలోని ఈ పరిశుద్ధ మార్కు దేవాలయానికి 140 ఏళ్లు. బందిపోటు దొంగ కోరిక మేరకు నిర్మించడం దీని ప్రత్యేకత. అప్పట్లో గ్రామానికి చెందిన పాగోలు వెంకయ్య అనే బందిపోటు.. మత గురువుల బోధనలతో మారి మంచి మార్గంలో నడిచారు. గ్రామంలో ఓ చర్చి నిర్మించాలని వెంకయ్య తన జీవిత చరమాంకంలో అప్పటి ఇంగ్లండ్ రెవరెండ్ థామస్ యంగ్ డార్లింగ్ అనే మత గురువును కోరారు. దీంతో మత గురువులు 1883లో సీఎస్ఐ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1885 మార్చి 5న నిర్మాణం పూర్తి చేసి.. పరిశుద్ధ మార్కు దేవాలయంగా పేరుపెట్టి ప్రారంభించారు. అప్పట్లో దీని పరిధిలో 250 చర్చిలు కొనసాగేవి. గ్రామానికి చెందిన రెవరెండ్ పాస్టర్ డాక్టర్ ఎర్రయ్య ఏసు ఈ చర్చిపై పీహెచ్‌డీ చేశారు. వర్షాల్లోనూ ఇప్పటికీ నిర్మాణం చెక్కుచెదరకపోవడం మరో విశేషం.

– న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

రాయపట్నం..
సాగు బోరు లేని ఊరు



ఒకప్పుడు కరవు నెలకొన్న గ్రామం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని రాయపట్నం. ఆ గ్రామానికి ఎస్సారెస్పీ కాలువ నీరు దశాబ్దాలుగా అందేది కాదు. దీంతో సాగు నీటి కోసం దుర్భిక్షం అనుభవించారు. ఆ సమయంలోనే కాలువ నీటి కోసం స్థానిక సంస్థల ఎన్నికలను సైతం బహిష్కరించారు. భూగర్భజలాలు అడుగంటగా రైతులు వ్యవసాయం మానేసి గల్ఫ్ వలస వెళ్లారు. చివరకు భూగర్భ జలమట్టాన్ని పరిరక్షించుకోవాలని.. గ్రామంలో సాగు నీటి కోసం ఎవ్వరూ వ్యవసాయ బోర్లను వేయకూడదని 2000లో సమష్టిగా కఠిన నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి అందరూ వ్యవసాయ బావులపైనే ఆధారపడుతున్నారు. అక్కడ సుమారు 200 వరకు బావులున్నాయి. చివర ఆయకట్టు కావడంతో కాలువ ద్వారా నీరందకపోయినా దశాబ్దాల కృషి ఫలితంగా భూగర్భ నీటిమట్టం గణనీయంగా పెరిగింది. దీంతో గ్రామంలో వ్యవసాయ బావులు జలకళ సంతరించుకున్నాయి.

– న్యూస్‌టుడే, ధర్మపురి

థాయ్‌లాండ్‌ను
ఉచితంగా చుట్టేయొచ్చు!



విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు థాయ్‌లాండ్ ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతోంది. దీని కింద సందర్శకులు దేశీయ విమానాల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించనుంది. విదేశీ పర్యాటకులు బ్యాంకాక్, ఫుకెట్ వంటి ప్రాంతాలకే ఎక్కువగా వెళ్తున్నారని గ్రహించిన ప్రభుత్వం.. మిగిలిన ప్రదేశాలకూ ఎక్కువ మంది సందర్శకులు వచ్చేలా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందుకోసం ఆ దేశ టూరిజం శాఖ ఆరు దేశీయ విమానయాన సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. 'హై అండ్ ట్రావెల్ ఫ్రీ థాయ్‌లాండ్ డొమెస్టిక్ ఫ్లైట్' పేరిట సెప్టెంబరు-నవంబరు మధ్యలో ఈ ఆఫర్‌ను అందుబాటులోకి తెస్తోంది. దేశీయ విమానాల్లో ప్రయాణించేవారికి వన్‌వే టికెట్ ధర 1,750 బాత్‌లు, రౌండ్ ట్రిప్ అయితే 3,500 బాత్‌లను ప్రభుత్వమే భరించనుంది. థాయ్‌లాండ్‌కు వెళ్లాలనుకునేవారు ఎయిర్‌లైన్ వెబ్‌సైట్స్, మల్టీ సిటీ ఆప్షన్స్, ఫ్లైత్రూ సర్వీసెస్, ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెంట్ల వద్ద ఈ ఆఫర్‌ను పొందవచ్చు. ప్రతి ప్రయాణికుడు రెండు దేశీయ విమాన టికెట్లు పొందడానికి వీలుంటుంది. 20 కేజీల బ్యాగేజీని అనుమతిస్తారు.

–ఇంటర్నెట్‌డెస్క్

ఏఐ... చెప్పేవన్నీ చేసెయ్యొద్దు!





చదువు అర్థం కాలేదా?
ఏఐ నే టీచర్..
రోగం తగ్గట్లేదా?
ఏఐ నే వైద్యుడు..
సందేహాలున్నాయా?
ఏఐ నే సమాధానం..!
ప్రస్తుత పరిస్థితికి ఇది ప్రతిబింబం
అయితే ఏఐ చెప్పేవన్నీ నిజాలా?
కృత్రిమ మేధ టూల్స్‌తో పాటు..
నిపుణులు సైతం కాదనే అంటున్నారు!

ఆహారంలో ఉప్పు (సోడియం క్లోరైడ్-టేబుల్ సాల్ట్) వాడకంతో ఎదురయ్యే సమస్యలను చదివిన అమెరికాలోని ఒక వ్యక్తి.. దానికి బదులుగా దేన్ని తీసుకోవచ్చని ఏఐ టూల్ చాట్ జీపీటీని సంప్రదించాడు.. సోడియం బ్రోమైడ్ వాడొచ్చని తెలుసుకుని ఆచరణలో పెట్టాడు.. అనారోగ్యం బారిన పడ్డాడు. తీవ్రమైన మానసిక, శారీరక సమస్యలతో ఆసుపత్రిలో చేరాడు. వాస్తవానికి సోడియం బ్రోమైడ్ అనేది ఆహారంలో తీసుకోకూడదు.

ఇప్పుడు ఎవరి నోట విన్నా ఏఐ(కృత్రిమ మేధ) అనే మాటలే.. ఉన్నత విద్యావంతులే కాదు, గ్రామీణ ప్రాంత ప్రజల మొబైల్స్‌లోనూ ఇప్పుడీ చాట్‌బాట్ టూల్స్ దర్శనమిస్తున్నాయి. ఒకటికి రెండు, మూడు టూల్స్ ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ఏ చిన్న సందేహం వచ్చినా అందులోకి వెళ్లి సమాధానాలు తెలుసుకుంటున్నారు. ఇదిగో సమాధానం అంటూ పక్కనున్న పదిమందికీ చెప్పేస్తున్నారు. అయితే వాటిని గుడ్డిగా అనుసరిస్తే.. ఎలాంటి సమస్యలొస్తాయో చెప్పేందుకు పై ఉదాహరణే నిదర్శనం. ముఖ్యంగా ఆరోగ్యం, ఆహారం, మందుల వాడకం తదితర విషయాల్లో అత్యంత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

లింకులు చూడండి.. వివరంగా తెలుసుకోండి

కృత్రిమ మేధ అనేది ఒక అవకాశంగానే ఉపయోగించుకోవాలి. మనం ఏదైనా ప్రశ్న అడిగితే.. దాన్ని వెబ్‌సైట్లు, యూట్యూబ్ ఇతర మార్గాల ద్వారా సేకరించి ఇస్తాయి. కొన్ని సంస్థలు సమాచారం ఎక్కడెక్కడ నుంచి తీసుకున్నారు? ఆధారాలేంటనే లింకులు కూడా ఉంటాయి. వాటిలోకి వెళ్లి మనకు కావాల్సిన సమాచారాన్ని మరింత వివరంగా తెలుసుకోవాలి.

వైద్యులు చెబితేనే... మందులు!

- అనారోగ్య సమస్యలు.. వాటికి వాడాల్సిన ఔషధాలపైనా కొందరు చాట్‌జీపీటీ, డీప్‌సీక్, పెర్‌ప్లెక్సిటీ, గ్రోక్ తదితర టూల్స్‌ను సంప్రదిస్తున్నారు.
- ఏ మందులు వాడాలో తెలుసుకుని దుకాణాల్లో కొని వాడుతున్నారు. అయితే వైద్యుల సూచనతోనే వాటిని తీసుకోవాలనే అంశాన్ని విస్మరిస్తున్నారు.
- కృత్రిమ మేధ టూల్స్ కూడా ఔషధాల వాడకంపై వైద్యులను సంప్రదించాలనే సూచిస్తున్నాయి.
- ఔషధాల వాడకంలో పలు రకాల సమస్యలుంటాయి. వయసును బట్టి మోతాదు తీసుకోవాలి. పిల్లలు, గర్భిణులు, గుండె సంబంధ సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలున్న వారు కొన్ని మందులు వేసుకోకూడదు. వాటికి పరిమితులు, వాడే విధానంలో తేడాలూ ఉంటాయి. కొన్ని రకాల ఔషధాలు కలిపి తీసుకుంటే ప్రమాదకరంగా మారతాయి. వైద్యులైతేనే వాటిపై కచ్చితమైన సూచనలు ఇస్తారు.

సమాచారాన్ని నిర్ధారించుకోవాలి

- ఏఐ ఇచ్చే సమాచారం ఏదైనా.. దాన్ని ఇతర మార్గాల్లోనూ పరిశీలించుకోవాలి. అందులో వాస్తవమెంతో ధ్రువీకరించుకున్నాకే వినియోగించుకోవాలి.



- ఆంగ్లం నుంచి తెలుగులోకి తర్జుమా చేయడానికి కూడా కృత్రిమ మేధ వాడకం బాగా పెరిగింది. అయితే ఇందులోనూ తప్పులు దొర్లే అవకాశం ఉంది. అన్వయ, భాషాపరమైన సమస్యలూ ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో వాక్యాల అర్థాలు మారిపోయే ప్రమాదమూ ఉంది. అందుకే పూర్తిగా దీనిపైనే ఆధారపడకూడదు. తర్జుమా సమయంలో ఆంగ్ల మూలాన్ని ఒకటికి రెండుసార్లు సమగ్రంగా చదివి అర్థంచేసుకోవాలి. అవసరమైతే ఆంగ్లం బాగా తెలిసిన వారితో అయినా ధ్రువీకరించుకోవాలి.

ఏఐ ఏది చెప్పినా, ఎంత విశ్లేషించినా.. అంతిమంగా మనం విచక్షణతో ఆలోచించాలి. మన బుర్రను ఉపయోగించాలి. తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలి.

- ఈనాడు, అమరావతి

ఏనుగు కొండ.. రాజుల కోట



45 కి.మీ..	హైదరాబాద్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి కోటకున్న దూరం
500 అడుగులు..	సముద్ర మట్టానికి కోటకు ఉన్న ఎత్తు
300 మెట్లు..	కొండపైకి ఎక్కడానికి ఉన్నాయి

శత్రువుల బారి నుంచి రక్షణ పొందేందుకు అప్పట్లో బలీయమైన రాతి ప్రాకారాలతో సున్నితమైన బురుజుల శ్రేణులతో భువనగిరి కోటను నిర్మించారు. ఏనుగు ఆకారంలో ఉన్న ఈ కోటపై శత్రుదుర్భేద్యంగా నిర్మించిన నిర్మాణాలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. సభా మందిరం, నివాస గృహాల గోడలపైన కమాన్‌ల ఆకారంలో నిర్మించిన చిన్న చిన్న గూళ్లు, శిల్పాలు, పుష్పగుచ్ఛాలు నేటికీ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. కొండపైన ఏడు కోనేరులు(గుండాలు) నిర్మించారు. వీటిని సప్త సరస్సులుగా పిలుస్తారు. శత్రువుల బారి నుంచి రక్షించుకునేందుకు కొండపై నుంచి నాడు భూగృహమార్గాన్ని నిర్మించుకున్నారు. దక్షిణ దిశలో ఉన్న ఏనుగు బావి నుంచి నీటిని అప్పట్లో వినియోగించుకున్నారు. ఇక్కడి నుంచి గోల్కొండ వరకు భూ గృహమార్గం ఉండేదని చెబుతుంటారు. 12వ శతాబ్దంలో పశ్చిమచాళుక్య రాజైన ఆరో త్రిభువన మల్లు విక్రమాదిత్యుడు ఈ కోటను నిర్మించినట్లు శాసనాలు చెబుతున్నాయి. తొలుత 'త్రిభువనగిరి'గా ఏర్పడి కాలక్రమంగా 'భువనగిరి'గా మారింది.

– న్యూస్‌టుడే, భువనగిరి పట్టణం

త్యాగాల చరిత్రను చూసొద్దాం!

పర్యాటకం అంటే పచ్చని కొండలకు కాదు.. విషాదానికి సాక్ష్యమైన వేదికలకు! జలజల జాలువారే జలపాతాలకు కాదు.. సైనికుల రక్తం ఏరులై పారిన ప్రదేశాలకు..! మంచుపర్వతాలకు కాదు.. మన స్వేచ్ఛా వాయువుల కోసం పోరాటాలు జరిగిన స్థలాలకు..! అంటూ చరిత్రను తెలుసుకునేందుకు యువత పయనమవుతోంది!

డార్క్ టూరిజం అనేది కేవలం చీకటి ప్రదేశాల సందర్శనే కాదు. మన చరిత్ర పట్ల విజ్ఞానం కోసం చేసే ప్రయాణం. ఇది మనకు మానవ జీవిత విలువలు, శాంతి, ఓర్పుపై అవగాహన పెంచుతుంది. ఈ తరహా ప్రయాణాలు కొన్నిచోట్ల సాహసోపేతంగానూ ఉంటున్నాయి. ఆసక్తి ఉన్న వాళ్లు కలిసి ఓ బృందంగా వెళ్లి వస్తున్నారు.




పోర్ట్‌బ్లెయిర్ : సెల్యూలార్ జైలు



స్వాతంత్ర్య సమరయోధులపై బ్రిటిష్ పాలకులు చూపిన క్రూరత్వానికి చిహ్నం. చిన్నచిన్న గదులు, కఠిన శిక్షలు, ప్రతి గోడపైనా నిక్షిప్తమైన మానవ సహనానికి పరీక్ష పెట్టిన గాథలు తెలుసుకోవచ్చు.

అమృత్‌సర్: జలియన్‌వాలాబాగ్



భారతీయుల్లో జాతీయ భావాన్ని రగిల్చిన ఉదంతం. బ్రిటిష్ పాలకుల క్రూరత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఇటుక గోడల్లో దిగిన తూటాల గుర్తులు.. వందల మందిని బలి తీసుకున్న బావి సందర్శకుల హృదయాలను బరువెక్కిస్తాయి.

లద్దాఖ్ : హాల్ ఆఫ్ ఫేం




కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన సైనికుల ఫొటోలు, వీరోచిత కథలు, ఆయుధాలు, సైనిక దుస్తుల్ని, యుద్ధ మ్యాప్‌లు, ఆయుధాలను చూడొచ్చు.

ద్రాస్: కార్గిల్ వార్ మెమోరియల్



1999లో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన కార్గిల్ యుద్ధానికి జ్ఞాపకార్థం. భారత సైన్యం నిర్మించిన ఈ కట్టడం ప్రతి ఒక్కరిలో దేశభక్తిని నింపుతుంది.

జోడేఘాట్: కుమురంభీం మ్యూజియం



ఇది ట్రైబల్ మ్యూజియం. ఆదివాసీల జీవన శైలితో పాటు, కుమురంభీం జీవితాశయ సాధనను, పోరాటస్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది.

ఇవే కాకుండా.. హైదరాబాద్‌లోని గోల్కొండ కోట, గుజరాత్‌లో సబర్మతిజైలు, ఉత్తర్‌ప్రదేశ్‌లో చౌరీచౌరా స్మారకం, భోపాల్‌లో గ్యాస్ ట్రాజెడీ మెమోరియల్, ఉత్తరాఖండ్ వరదల ప్రభావిత ప్రాంతాలు, కేదార్‌నాథ్ చుట్టుపక్కల ప్రదేశాలకూ డార్క్ టూరిజం పర్యాటకులు వెళుతున్నారు. కొన్నిచోట్ల డార్క్ టూరిజంతో పాటు ప్రకృతి, సంస్కృతి కలిసి పర్యాటకుల్ని మరింతగా ఆకర్షిస్తున్నాయి. దట్టమైన అడవులు, జలపాతాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి.





ఎందుకు?

- పాఠ్యపుస్తకాల్లో చదివిన ఘటనల ప్రదేశాలను ప్రత్యక్షంగా చూసి, వాటి తీవ్రతను మనసుతో తెలుసుకునే అవకాశం
- మనుషుల తప్పిదాల వల్ల జరిగిన హింస, విధ్వంసం, మనం పునరావృతం చేయకూడదన్న బోధన
- బాధితుల బాధను గుర్తించి, సమాజంపై మన బాధ్యతను పెంచుకోవడం

- ఈనాడు, హైదరాబాద్

ఈ హైదరాబాదీ..
టాప్ లోకల్ గైడ్



హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన కావలి చంద్రకాంత్.. వారాంతంలో కుటుంబంతో కలిసి సరదాగా విహార యాత్రకు వెళ్లాలనుకున్నారు. గూగుల్ మ్యాప్స్‌లో ప్రదేశాన్ని, మార్గాన్ని ఎంపిక చేసుకొని.. అక్కడ ప్రదేశం ఎలా ఉంటుందో చూద్దామంటే ఫొటో అందుబాటులో లేదు. దీంతో అసహనానికి గురయ్యారు. తనలాగే ఎంతో మంది ఇబ్బంది పడుతుంటారని గ్రహించి 2017 నుంచి ఆయా ప్రదేశాల ఫొటోలను అప్‌లోడ్ చేయడం మొదలుపెట్టారు. ఇలా ఇప్పటి వరకు సుమారు 23 వేల ఫొటోలు, 3,900 వీడియోలు అప్‌లోడ్ చేశారు. తెలంగాణతో పాటు సరిహద్దు రాష్ట్రాల్లోని 289 కొత్త ప్రదేశాలను గూగుల్ మ్యాప్స్‌లో చేర్చారు. వీటిని ఇప్పటి వరకు 430 మిలియన్ల మంది వీక్షించారు. ఇలా వాలంటరీగా చేస్తున్న పనిని మెచ్చిన గూగుల్.. చంద్రకాంత్‌ని 'టాప్ లోకల్ గైడ్'గా గుర్తించింది.

వికీపీడియాకు 650 ప్రదేశాలపై సమాచారమిచ్చా

"కూకట్‌పల్లిలో ఉంటూ ఓ సంస్థలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నా. గూగుల్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసేవారికి 1 నుంచి 10 లెవల్స్‌లో గుర్తింపునిస్తారు. ఇందులో టాప్-10 స్థానంలో నిలిచా. ఇలాంటి వారికోసం గూగుల్ ఆధ్వర్యంలో 'గూగుల్ లోకల్ గైడ్స్ కనెక్ట్' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 2019లో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి 'టాప్ లోకల్ గైడ్' హోదాలో నన్ను ఆహ్వానించడం సంతృప్తినిచ్చింది. మా స్వగ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా అడ్డకల్ మండలం పెద్దమునగలచేడులో శిథిలమైన పాఠశాల భవనాల ఫొటోలు తీసి, స్థానిక నాయకులకు విషయం చెప్పగా.. సుమారు రూ.35 లక్షల నిధులు సమకూర్చి తరగతి గదులను పునర్నిర్మించారు. మా మండలంలోని 14 గ్రామాలకు జియోట్యాగింగ్ చేశా. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఉనికిలో లేని పలు చారిత్రక కట్టడాలు, పాత దేవాలయాలు, ప్రదేశాలను డాక్యుమెంట్ చేశా. వికీపీడియాకు 650 ప్రదేశాలపై సమాచారం అందించా. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నేను తీసిన ఫొటోలను ఇటీవల ప్రదర్శించా"నని చంద్రకాంత్ వివరించారు.

– ఈనాడు డిజిటల్, హైదరాబాద్

ఆ వాస్తవాన్ని త్వరగా గుర్తించండి



మీ జీవితంపై మీకున్నంత శ్రద్ధ ఇంకెవరికీ ఉండదు! ఈ వాస్తవాన్ని ఎంత త్వరగా గుర్తిస్తే.. అంత త్వరగా మీ భవిష్యత్తు విషయంలో మీరు పూర్తి బాధ్యత తీసుకుంటారు. సాకులు వెతకడం మాని, కష్టపడి పనిచేయడం మొదలుపెట్టండి. మీ చర్యల పరిణామాలను మనస్ఫూర్తిగా అంగీకరించండి.

– శరణ్ శ్రీవత్స, వ్యాపారవేత్త

చిగురించిన సినిమా చెట్టు!





తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవంలో గోదావరి గట్టున ఉన్న సినిమా చెట్టు మళ్లీ జీవం పోసుకుంది. ఎందరో దర్శకులు, కళాకారులను ఆకట్టుకున్న ఈ నిద్రగన్నేరు వృక్షరాజం 300 సినిమాల్లో కనిపించింది. గతేడాది వరదలకు రెండుగా చీలి నేల వాలింది. దీంతో చెట్టును సినిమాలో చూసిన వాళ్లు, దాని గురించి తెలిసిన వారు ఎంతగానో ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని కాపాడాలని కోరారు. అందుకే పునరుజ్జీవం పోయాలని రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో గ్రీన్ భారత్ వనం-మనం విభాగం ముందుకొచ్చింది. ఆ ప్రాజెక్టు ఛైర్మన్ రేకపల్లి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో కొన్నాళ్లపాటు రసాయనాలతో చికిత్స చేశారు. వేరు మధ్య ఓ అంకురానికి ప్రాణం పోశారు. ఇప్పుడది 10 అడుగుల మొక్కైంది. వచ్చే ఏడాది వరకు నలుగురికి నీడనిస్తుందని దుర్గాప్రసాద్ తెలిపారు.

– న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

కోనసీమ ప్రభల ఉత్సవం.. పదిలో పాఠ్యాంశం




సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఏటా కనుమ రోజున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించే జగ్గన్నతోట ప్రభల తీర్థానికి 426 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. ఏకాదశ రుద్రులు కొలువుదీరిన ప్రాచీన ప్రాంతమిది. ఇప్పుడు ఈ తీర్థం పదోతరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో పాఠ్యాంశంగా మారింది. 'చేజారిన బాల్యం' పాఠంలో 'కోనసీమ జగ్గన్నతోట ప్రభల తీర్థం' పేరుతో ప్రచురించారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి దీన్ని పొందుపరిచారు. గ్రామీణ నేపథ్యంలో జరిగే ఉత్సవాల్లో ఇదొకటి. ఈ వేడుక తిలకించడానికి తెలుగు రాష్ట్రాల నుంచి జనం పెద్దఎత్తున తరలివస్తుంటారు.

– న్యూస్‌టుడే, అంబాజీపేట

అవును మీరు వింటుంది నిజమే
సాగుచేయని ఆకుకూరల పండగ





ఆకు కూరలంటే.. పాల కూర, తోటకూర, గోంగూర, మెంతికూర, బచ్చలి కూర.. ఇలా ఓ పది వరకు చెబుతాం. అయితే జొన్నచెంచలి కూర, ఎలుక చెవుల కూర, అడవి సోయకూర, తెల్ల గర్జల కూర, బంకటి ఆకు, తడక దొబ్బుడు, పప్పుకూర, గునుగ కూర, ఉత్తరేణి.. వంటివి సహజ సిద్ధంగా లభించేవి. ఇవన్నీ పొలాల్లో కలుపు మొక్కలుగా పెరిగేవే. ఇలాంటి ఆకుకూరలను సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలో ఆహారంగా వండుకొని తింటుంటారు. వీటి గుర్తింపు, వంట తయారీ తదితర అంశాలపై ఇక్కడి మహిళల నైపుణ్యాన్ని, అవగాహనను బాహ్య ప్రపంచానికి తెలియజేసేందుకు దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) కృషి చేస్తోంది. ఇలాంటి ఆకుకూరలను జాతీయ పోషకాహార సంస్థలో పరీక్షలు చేయించగా... వీటిలో అధిక మొత్తంలో పోషకాలున్నట్లు గుర్తించారు. ఆయా ఆకుకూరల వారీగా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసి..వండే విధానం, తినడం వల్ల ప్రయోజనాలపై అనుభవజ్ఞులు, నిపుణులతో 'సాగుచేయని ఆకుకూరల పండగ' పేరిట గత ఎనిమిదేళ్లుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది డీడీఎస్. సుమారు 160 రకాల సహజ సిద్ధ ఆకుకూరలపై అవగాహన కల్పిస్తోంది. ఈ నెల 31న హైదరాబాద్‌తో పాటు.. జిల్లాకు సమీప పట్టణ ప్రాంతాలకు చెందిన ప్రజల సమక్షంలో పండుగను నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తిచేసింది.

–ఈనాడు, సంగారెడ్డి; న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

కొబ్బరి నార, బొండాం పీచు..
కావేవీ రోడ్డు నిర్మాణానికనర్హం!



తారుతో వేసిన రోడ్లు సాధారణంగా కొద్ది రోజులకే దెబ్బతింటుంటాయి. తారు లేచిపోవడమో.. చిన్నచిన్న గుంతలు పడటమో జరుగుతోంది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం నాగారం నుంచి పోతారం(ఎస్) వరకు ప్రయోగాత్మకంగా కొబ్బరి నార, బొండాం పీచుతో తయారు చేసిన మెష్‌తో (జియో కాయర్ టెక్స్‌టైల్) నిర్మించిన తారు రోడ్డు మాత్రం నాలుగేళ్లయినా చెక్కుచెదరలేదు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.3.60 కోట్లతో నిర్మించారు. ఈ పద్ధతిలో ముందుగా మొరం పోశారు. నీరు పట్టి తొక్కించారు. కొబ్బరినారతో చేసిన మెష్‌ను రోడ్డుపై పరిచారు. గ్రాన్యులర్ సబ్-బేస్ (జీఎస్‌బీ) మిశ్రమాన్ని వేసి తొక్కించారు. తర్వాత పైన పెద్ద కంకర వేసి తారు పోశారు. వర్షం పడినపుడు ఈ మెష్ నీటిని లోపలికి పీల్చుకుంటుంది. బయటకు పంపడమో.. ఇంకేలా చేయడమో చేస్తుంది. రోడ్డు తొందరగా చెడిపోకుండా ఎక్కువ కాలం మన్నికగా ఉంటుందని అప్పటి డీఈ సదాశివరెడ్డి తెలిపారు. ఈ రోడ్డుపై ద్విచక్ర, ట్రక్కులు, ట్రాక్టర్లు, లారీలు.. ఇలా రోజూ సుమారు 100కు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి.

– న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్

యానాం వద్ద భారీగా ఎగసిపడిన మంటలు



దరియాలతిప్ప సమీపంలో ఎగసిపడుతున్న మంటలు

యానాం, న్యూస్‌టుడే: కేజీ బేసిన్ నుంచి యానాంలోని దరియాలతిప్ప మూడో నంబరు దీవి మీదుగా వెళ్లే గ్యాస్ పైప్‌లైన్ గురువారం అర్ధరాత్రి లీకైంది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం ఓఎన్జీసీ ప్లాంటుకు ఈ పైప్‌లైన్ ద్వారా గ్యాస్‌ను తరలిస్తారు. గౌతమీ గోదావరి అంతర్భాగంలో ఉన్న ఈ పైప్‌లైన్ నుంచి దరియాలతిప్ప సమీపంలో సహజవాయువు అధిక పీడనంతో వెలువడడంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ అగ్నికీలలు కిలోమీటర్ల మేర కనిపించడంతో సమీపంలోని దరియాలతిప్ప, గిరియాంపేట, సావిత్రీనగర్ తదితర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అర్ధరాత్రి 1.15 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకోగా ఓఎన్జీసీ వర్గాలు కేజీ బేసిన్‌లోని రిగ్ వద్ద గ్యాస్ సరఫరా నిలిపివేశాయి. ప్రమాదం సంభవించిన ప్రాంతంలో చెలరేగిన మంటలను సహాయక బృందం అదుపుచేసింది. సుమారు మూడు గంటల పాటు మంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదని ఓఎన్జీసీ ఓ ప్రకటనలో తెలిపింది.

కాసులిస్తే..వైకల్యం పెంచేస్తున్నారు

- అనర్హులకు పింఛన్ల కోసం రూ.50 వేల వరకూ వసూళ్లు
- తాజాగా నోటీసులు అందిన వారితోనూ బేరసారాలు

ఈనాడు, అమరావతి: దివ్యాంగులు, అనారోగ్య పింఛన్లు పొందుతున్న అనర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం చేపట్టిన తనిఖీలకు కొంతమంది క్షేత్రస్థాయి సిబ్బంది తూట్లుపొడుస్తున్నారు. పకడ్బందీగా చేపట్టాలని నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసినా బేఖాతరు చేస్తున్నారు. అనర్హులను గుర్తించేందుకు 8 నెలలుగా తనిఖీలు జరుగుతున్నాయి. ఇందులో అనర్హులుగా గుర్తించిన వారి నుంచి రూ.50 వేల వరకు తీసుకొని తప్పుడు సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. కొన్ని చోట్ల ఆసుపత్రుల్లోని సిబ్బంది నేరుగా అనర్హులకు ఫోన్లు చేసి బేరాలు పెడుతుండగా..మరికొన్ని చోట్ల దళారులు చక్రం తిప్పుతున్నారు. అప్పట్లో అనర్హులకు పింఛన్లు దక్కడంలో ఎక్కువగా వైకాపా కార్యకర్తలు, ఆ పార్టీ సానుభూతిపరుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. మరో రెండు నెలలపాటు సాగే తనిఖీల్లో ప్రభుత్వం ఈ దోరణికి అడ్డుకట్ట వేయకుంటే మళ్లీ అనర్హులు పెద్ద సంఖ్యలో పింఛన్లు పొందే అవకాశముంది.

★ అనంతపురం జీజీహెచ్‌లో పనిచేసే సిబ్బంది అనర్హులకు ఫోన్ చేసి..వారికి నిర్దేశిత వైకల్యం 40 శాతం కంటే తక్కువ వచ్చిందని, రూ.30 వేలు ఇస్తే ఎక్కువ వైకల్యశాతం నమోదు చేయిస్తామని చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నారు. తద్వారా పింఛన్లు తొలగిపోకుండా చూశారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులోనూ ఇదే తరహాలో కొంతమంది అనర్హులకు పింఛన్లు తొలగిపోకుండా చూశారు.

★ చిత్తూరు జిల్లాలో అనర్హులకు పింఛన్లను కొనసాగించేందుకు రూ.25 వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. అక్కడి ప్రభుత్వ ఆసుపత్రి, డీఆర్‌డీఏకు చెందిన సిబ్బంది..తనిఖీ నిర్వహించే కొందరు డాక్టర్లతో కుమ్మక్కయ్యారని తెలిసింది.

నోటీసులు తీసుకున్న వారి నుంచీ వసూళ్లే

అనర్హులుగా తేలి నోటీసులు అందిన వారినీ వదలడం లేదు. అనంతపురానికి చెందిన ఓ వ్యక్తికి 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నట్లు గుర్తించి పింఛన్ తొలగిస్తూ నోటీసు జారీ చేస్తే..రూ.50 వేలు ఇస్తే 70 శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువపత్రం ఇస్తామని చెప్పి బేరంపెట్టారు. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలంలోనూ నోటీసులు జారీ అయిన అనర్హుల వద్దకు దళారులు వెళ్లి రూ.30 వేలు ఇస్తే పింఛన్లను పునరుద్ధరిస్తామని చెప్పి ఒప్పందాలు చేసుకుంటున్నారు. కృష్ణా జిల్లా అవనిగడ్డలో కొంతమంది అనర్హులకు పింఛన్లు తొలగించకుండా చేశారు.

★ వైకాపా హయాంలో ఏటా 20 శాతానికిపైగా అనర్హులకు తప్పుడు సదరం ధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యాయి. 2019 నుంచి 2024 మధ్య వైకాపా ప్రభుత్వ హయాంలో 55,224 మంది అనర్హులకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు ప్రభుత్వ తనిఖీల్లో బయటపడింది. అప్పట్లో వైకాపా నాయకుల సిఫార్సులతో ఆ పార్టీ కార్యకర్తలకు అర్హత లేకున్నా పింఛన్లు మంజూరు చేశారు.

వైకాపా ప్రభుత్వంలో అనర్హులకు సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ అయిన తీరు ఇది..

ఏడాది	జారీ అయిన సదరం ధ్రువీకరణలు	అనర్హులకు ఇచ్చినవి	శాతం
2019	29,155	6,747	23.14
2020	35,214	8,456	24.01
2021	52,760	13,801	26.15
2022	52,365	14,636	27.94
2023	37,969	11,194	29.48
2024	2,455	390	15.33

తొలి వారం కోటి మంది 'స్త్రీశక్తి' ప్రయాణాలు

- వీరికి రూ.41.22 కోట్ల మేర లబ్ధి
- పెరిగిన మహిళా ప్రయాణికులు, తగ్గిన పురుషులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం ఆరంభించాక తొలి వారం 1.04 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. ఆగస్టు 15న ఈ పథకం మొదలవ్వగా, 21వ తేదీ వరకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో 2.21 కోట్ల మంది ప్రయాణించారు. వీరిలో మహిళలు 1.04 కోట్లు కాగా, టికెట్లు తీసుకుని ప్రయాణించిన పురుషులు 1.17 కోట్ల మంది ఉన్నారు. ఈ వారం రోజుల్లో కలిపి మహిళలకు రూ.41.22 కోట్ల మేర ఈ పథకం ద్వారా లబ్ధి కలిగింది.

రోజుల వారీగా ఉచితంగా ప్రయాణించిన మహిళల సంఖ్య

తేదీ	స్త్రీశక్తి ప్రయాణికులు (లక్షల్లో)
ఆగస్టు 15	0.76
16	10.84
17	15.47
18	18.79
19	17.68
20	20.18
21	20.95
మొత్తం	104.67

మహిళలు పెరిగారు.. పురుషులు తగ్గారు

స్త్రీశక్తి పథకం ఆరంభమయ్యాక ఐదు రకాల బస్సుల్లో మహిళా ప్రయాణికులు క్రమంగా పెరుగుతుండగా, పురుషుల సంఖ్య తగ్గుతోంది. గతంలో సగటున పురుష, మహిళా ప్రయాణికుల నిష్పత్తి 60:40గా ఉండేది. స్త్రీశక్తి పథకం మొదలయ్యాక పురుష ప్రయాణికుల సంఖ్య 33 శాతానికి తగ్గి, మహిళా ప్రయాణికుల సంఖ్య 67 శాతానికి పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు ముందే అంచనా వేశారు. వీరు అనుకున్నట్లుగానే ఇప్పటికి మహిళా ప్రయాణికులు 60 శాతానికి పెరిగారు.

మహిళ, పురుష ప్రయాణికుల నిష్పత్తి మారిందిలా.. (శాతాల్లో)

తేదీ	మహిళలు	పురుషులు
ఆగస్టు 15	03	97
16	38	62
17	49	51
18	51	49
19	54	46
20	58	42
21	60	40

★ ఆగస్టు 15న సాయంత్రం తర్వాత ఈ పథకం ప్రారంభమైంది.





పి.గన్నవరం కాటన్ అక్విడక్టు వద్ద వరద ఉద్ధృతి ★ వరద నీరు చుట్టుముట్టడంతో ముక్తేశ్వరం వైపు పడవలో వెళుతున్న అయినవిల్లి లంక, వీరవల్లిపాలెం ప్రజలు

లంక గ్రామాలను చుట్టుముట్టిన గోదావరి

- నీట మునిగిన పంటలు

పి.గన్నవరం, ధవళేశ్వరం, ఆలమూరు, న్యూస్‌టుడే-ఈనాడు, పెనుగొండ: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద ఉద్ధృతి పెరుగుతోంది. శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు జలవనరుల శాఖ అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. శుక్రవారం రాత్రి 6గంటలకు నీటిమట్టం 14.20 అడుగులకు చేరుకుంది. 13,51,272 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వ్యవసాయ అవసరాలకు తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు 12,600 క్యూసెక్కుల సాగునీటిని వదులుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలను గోదావరి వరద చుట్టుముట్టింది. పి.గన్నవరం, అయినవిల్లి, ఆలమూరు మండలాల్లోని లంకల్లో పంట పొలాలు, కూరగాయల తోటలు, పాదులు ముంపునకు గురయ్యాయి. ఆలమూరు మండలం మూలస్థానం నుంచి రావులపాలెం మండలం తోకలంక మధ్య రెండు వారాల క్రితం తూరలతో నిర్మించిన కాజ్‌వే వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు నాలుగు పడవలు ఏర్పాటు చేశారు. భద్రాచలం వద్ద గోదావరి వరద ఉద్ధృతి తగ్గుముఖం పట్టినా పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రం శుక్రవారం సాయంత్రం వరకు పెరుగుతూనే ఉంది. ఆచంట, యలమంచిలి మండలాల్లో లంక గ్రామాల ప్రజలు పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వరద తీవ్రతకు ఏటిగట్టు లోపల, లంక గ్రామాల్లో కొబ్బరి తోటలు కోతకు గురవుతున్నాయి.

882 అడుగులకు శ్రీశైలం జలాశయం నీటిమట్టం

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం కొనసాగుతుంది. శ్రీశైలం జలాశయం 10 రేడియల్ క్రస్ట్‌గేట్లను 18 అడుగుల మేర పైకి ఎత్తి స్పిల్ వే ద్వారా 4,21,530 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 64,963 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి 4,57,237 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి 882.10 అడుగులు, నీటినిల్వ 199.7354 టీఎంసీలుగా నమోదైంది.

'స్త్రీశక్తి' అమల్లో ఆర్టీసీ ఉద్యోగుల ఇబ్బందులు తొలగించాలి: ఎన్ఎంయూఏ


ఈనాడు, అమరావతి: బస్సుల్లో స్త్రీశక్తి పథకం అమలు సమయంలో ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) కోరింది. టిమ్స్‌కు ఛార్జింగ్ సరిపోవడం లేదని, బస్టాండ్లలో వాటి ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, పవర్ బ్యాంకులూ ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. టిమ్స్‌లో మహిళల ఉచిత ప్రయాణం (డబ్ల్యూఎఫ్‌టీ) బటన్ పక్కనే ప్రింట్ అనే బటన్ ఉండటంతో పొరపాట్లు జరుగుతున్నాయని, వీటిని వేర్వేరు స్థానాల్లో ఉండేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని పేర్కొంది. ఓటీ డ్యూటీలను స్ప్రెడ్ ఆఫ్ డ్యూటీలుగా మార్చాలని, ఓవర్ లోడ్ వల్ల మధ్యలో బస్సులు ఆపలేదనే ఫిర్యాదులు పరిగణనలోకి తీసుకోవద్దని కోరింది. వీటితో పాటు ఇంకా పలు సమస్యలు పరిష్కరించాలని ఎండీకి లేఖ రాసినట్లు ఎన్ఎంయూఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆన్‌కాల్ డ్రైవర్లకూ ఆ మొత్తం ఇవ్వాలి: రెగ్యులర్ డ్రైవర్లు డబుల్ డ్యూటీలకు వెళ్లినప్పుడు ఎంత మొత్తం చెల్లిస్తున్నారో.. ఆన్‌కాల్ డ్రైవర్లు డబుల్ డ్యూటీలకు వెళ్లినప్పుడూ అంతే మొత్తాన్ని చెల్లించాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) కోరింది. ఈ మేరకు ఎండీకి లేఖ రాసినట్లు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోదరరావు, నరసయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

రూ.166 కోట్ల ఉపాధి నిధుల విడుదల

ఈనాడు, అమరావతి: ఉపాధి పథకం కింద మెటీరియల్ నిధులతో చేపట్టిన పనులకు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.166.67 కోట్లు విడుదల చేసింది. 2025-26లో రెండో విడత కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాటాలతో కలిసి ఈ నిధులు విడుదల చేస్తున్నట్లుగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. 2014-19 మధ్య కాలంలో తెదేపా ప్రభుత్వంలో మెటీరియల్ నిధులతో చేపట్టిన పనులకు వైకాపా ప్రభుత్వం బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. వీటికి కూటమి ప్రభుత్వం మరోసారి కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకుంది. పెండింగ్ బిల్లుల కోసం రూ.145 కోట్లు విడుదల చేయనున్నట్లు సీఎం చంద్రబాబు రెండు రోజుల క్రితం ప్రకటించారు. ఇందులో భాగంగా నిధులు విడుదలయ్యాయి.

'లక్ష'ణమైన వస్త్ర గణపతి!



లక్ష వస్త్రాలతో రూపుదిద్దుకుంటున్న మహాగణపతి

విశాఖలోని పాత గాజువాక లంకా మైదానంలో లక్ష వస్త్రాలతో మహా గణపతిని ఏర్పాటు చేస్తున్నారు. 86 అడుగుల ఎత్తయిన 'శ్రీ సుందర వస్త్ర మహా గణపతి' కోసం 120 అడుగుల మండపం వేశారు. అందులో చీరలను ఒకదానిపై ఒకటి పేర్చుకుంటూ వినాయకుడి రూపు తీసుకొస్తున్నారు. చీరాలకు చెందిన కళాకారులు ఇప్పటికే ఎక్కువ శాతం పనులు పూర్తి చేశారు. ఇందుకోసం కోల్‌కతా, సూరత్ నుంచి చీరలు తెప్పించారు. వీటిని నిమజ్జనం రోజున భక్తులకు అందజేస్తామని ఉత్సవ నిర్వాహకులైన ఎస్.వి.ఎంటర్‌టైన్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు.

– న్యూస్‌టుడే, గాజువాక (విశాఖపట్నం)

దిగుమతి సుంకం ఎత్తివేత.. పత్తి రైతుకు శరాఘాతమే

- ఇప్పటికే మద్దతు కంటే తక్కువగా లభిస్తున్న ధర
- కేంద్ర నిర్ణయంతో సీజన్‌లో మరింత తగ్గే అవకాశం

ఈనాడు, అమరావతి: పత్తి దిగుమతులపై సెప్టెంబరు 30వ తేదీ వరకు కేంద్రం సుంకాన్ని ఎత్తేసింది. దీంతో సుమారు 40 రోజుల పాటు 11 శాతం సుంకం భారాన్ని తగ్గించింది. రైతు చేతికి పత్తి వచ్చే కీలక సమయం ఇది. ఇలాంటి సమయంలో విదేశాల నుంచి తక్కువ ధరకే పత్తి దిగుమతి చేసుకునే అవకాశం కల్పించింది. అంటే ప్రస్తుత సీజన్‌లో ధరపై ప్రభావం కచ్చితంగా ఉంటుంది. దీనిపై రైతులు, రైతు సంఘాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. జూన్, జులై నెలలతో పోలిస్తే ఇప్పటికే ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం మద్దతు ధరలకు (పొడవు పింజ క్వింటాకు రూ. 8,110, మధ్యస్థ పింజ రూ. 7,710) అటూ ఇటుగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర నిర్ణయంతో ధరలు మరింతగా తగ్గే అవకాశం ఉందేమోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. సెప్టెంబరు 30 వరకు అమలు వల్ల పెద్ద ప్రభావం ఉండదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

తగ్గుతున్న పత్తి సాగు.. పెరిగిన ఖర్చులు

రాష్ట్రంలో పత్తి సాగు వ్యయం గణనీయంగా పెరిగింది. ఎకరాకు రూ.50 వేల వరకు ఖర్చవుతోంది. దిగుబడి సగటున 5 క్వింటాళ్లే. అంటే ఎకరాకు రూ.30 వేలు వస్తోంది. రూ.20 వేలు నష్టమే. మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాల్సి ఉన్నా రైతు చేతికి పంట వచ్చే సమయానికి ఏదో ఒక సమస్య సృష్టిస్తున్నారు. తేమ పేరుతో వేధిస్తుండటంతో అధికశాతం రైతులు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 1,500 నుంచి రూ.2వేల వరకు నష్టపోతున్నారు.

★ గత ఆరేళ్ల గణాంకాలు చూస్తే పత్తి సాగు భారీగా తగ్గింది. గతేడాది 10.10 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటికి 8.80 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. తెగుళ్ల తాకిడి కూడా మొదలైంది.

పత్తి రైతులకు మరణ శాసనమే

కేంద్ర నిర్ణయం పత్తి రైతుల పాలిట మరణశాసనం అవుతుందని కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య పేర్కొన్నారు. దిగుమతి సుంకం ఎత్తేయడం వల్ల ధరలు తగ్గుతాయని.. రైతులు నష్టపోతారని వివరించారు.

కరుడుగట్టిన నేరస్థుడు శ్రీకాంత్ విశాఖ జైలుకు!

ఈనాడు, నెల్లూరు: కరడుగట్టిన నేరస్థుడు..హత్య కేసులో నెల్లూరు సెంట్రల్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తూ మూడు జిల్లాల్లో నేర సామ్రాజ్యాన్ని విస్తరించిన అవిలేలి శ్రీకాంత్ అరాచకాలకు ముగింపు పలకాలని ప్రభుత్వం నిర్ణయించింది. తరచూ అనారోగ్య కారణాలతో బయటకు వస్తూ. . తన ప్రియురాలు, అనుచరులతో కలిసి దందాలు, దౌర్జన్యాలకు పాల్పడిన శ్రీకాంత్‌ను ఎట్టకేలకు మరో జైలుకు తరలించింది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ విషయం బయటకు రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. అతడిని తరలించేటప్పుడు ఎస్కార్ట్‌గా వచ్చే ఏఆర్ పోలీసులకూ తెలియనివ్వలేదు. వారి నుంచి ముందస్తుగా ఫోన్లు తీసుకున్న తర్వాతే పోలీసు ట్రైనింగ్ కళాశాల దగ్గరకు తీసుకువెళ్లారు. శుక్రవారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో జైలు నుంచి ప్రత్యేక వాహనంలో విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు. కొందరు ప్రజాప్రతినిధుల అండతో శ్రీకాంత్ తన ప్రియురాలైన లేడీడాన్ అరుణ ద్వారా సెటిల్‌మెంట్లు చేస్తున్నాడన్న ఫిర్యాదుల నేపథ్యంలో నెల్లూరులో ప్రత్యేకంగా గస్తీ నిర్వహించారు. శ్రీకాంత్, అరుణలతో ఎవరెవరు కలిసి పనిచేస్తున్నారు? గతంలో వాళ్లతో ఉండి.. ప్రస్తుతం దూరంగా ఉంటున్న వారెవరన్న వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఇద్దరు రౌడీషీటర్లను అరెస్టు చేయగా పలువురు పరారీలో ఉన్నారు. శుక్రవారం ఉదయం పలు కేసుల్లో వాయిదాలకు వచ్చే రౌడీషీటర్ల కోసం పోలీసులు మఫ్టీలో కోర్టు సమీపంలోనూ గస్తీ నిర్వహించారు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు వెంకటేశ్‌నాయుడి ఫోన్లు

హైకోర్టుకు తెలిపిన సిట్

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడు వెంకటేశ్‌నాయుడు (ఏ-34) నుంచి స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్లను న్యాయస్థానం అనుమతితో ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని సిట్ తరఫు ప్రత్యేక పీపీ పోసాని వెంకటేశ్వర్లు, సహాయ పీపీ సాయి రోహిత్ హైకోర్టుకు తెలిపారు. ఫోన్‌లోని సమాచారాన్ని దర్యాప్తు అధికారి లీక్ చేశారని పిటిషనర్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. యాపిల్ ఫోన్లకు ఫేస్‌లాక్, బయోమెట్రిక్ పాస్‌వర్డ్ ఉంటాయని.. వాటిని తాము తెరవడం సాధ్యం కాదన్నారు. ఫోన్లను తెరిచేందుకు నిందితుడు సహకరించలేదన్నారు. నిందితుడి వైపు నుంచే సమాచారాన్ని లీక్ చేసి ఉండొచ్చన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి విచారణను సెప్టెంబర్ 2కి వాయిదా వేశారు. కౌంటర్ వేయాలని ఆదేశించారు. మద్యం కేసు దర్యాప్తులో భాగంగా తన భర్త సీహెచ్ వెంకటేశ్‌నాయుడు నుంచి సేకరించిన సెల్‌ఫోన్లలోని సమాచారాన్ని దర్యాప్తు అధికారి మీడియాకు లీక్ చేస్తున్నారని.. దీన్ని నియంత్రించాలంటూ ఆయన భార్య వాసిరెడ్డి మహిత హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ఆమె తరఫున సీనియర్ న్యాయవాది వీఆర్ ఆవుల వాదనలు వినిపిస్తూ.. 'జూన్ 4న ఫోన్లను సీజ్ చేస్తే.. జులై 14న ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఈ మధ్యలోనే సమాచారాన్ని మీడియాకు సిట్ లీక్ చేసింది' అని చెప్పారు. వెంకటేశ్‌కు సంబంధించిన సమాచారం ఇలా మీడియాలో, సోషల్ మీడియాలో రాకుండా అడ్డుకోండని కోరారు.

కాకాణికి షరతుపై హైకోర్టు స్టే

- ఐఓ ముందు హాజరు కావాలని స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో బెయిలిస్తూ వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డికి విధించిన ఓ షరతును హైకోర్టు సవరించింది. దర్యాప్తు పూర్తి చేసి, పోలీసులు అభియోగపత్రం దాఖలు చేసేవరకు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించకూడదన్న షరతును ఈ నెల 29 వరకు స్టే చేసింది. వచ్చే ఆదివారం దర్యాప్తు అధికారి (ఐఓ) ముందు హాజరు కావాలని కాకాణికి స్పష్టం చేసింది. హైకోర్టు సింగిల్ జడ్జి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల విషయంలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో హైకోర్టు ఇటీవల గోవర్ధన్‌రెడ్డికి షరతులతో బెయిల్ మంజూరు చేసింది. అభియోగపత్రం దాఖలు చేసే వరకు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించడానికి వీల్లేదని, ప్రతి ఆదివారం ఐఓ ముందు హాజరు కావాలని షరతులు విధించింది. షరతులను సవరించాలని కాకాణి అనుబంధ పిటిషన్ వేశారు. ఆయన తరఫు సీనియర్ న్యాయవాది మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'క్వార్ట్జ్ కేసులో హైకోర్టు బెయిలిస్తూ.. నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించడానికి వీల్లేదని ఓ వైపు, ప్రతి ఆదివారం ఐఓ ముందు హాజరుకావాలని మరో వైపు పరస్పర విరుద్ధ షరతులు విధించింది. దానిని సవరించండి' అని కోరారు.

షరతులను ఉల్లంఘించేలా..: పీపీ

పోలీసుల తరఫున పీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ 'కోర్టు షరతులను ఉల్లంఘించేలా గోవర్ధన్‌రెడ్డి జైలు నుంచి విడుదలైన వెంటనే మీడియాతో మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలు క్వార్ట్జ్ కేసులో సాక్షిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యేను బెదిరించేలా ఉన్నాయి. నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించేందుకు అనుమతిస్తే దర్యాప్తును ప్రభావితం చేస్తారు. ప్రతి ఆదివారం ఐఓ ముందు హాజరైన తర్వాత జిల్లాను విడిచి వెళ్లేలా ఆదేశాలు ఇవ్వండి' అని కోరారు.

42 మందితో భాజపా రాష్ట్ర కార్యవర్గం

ఈనాడు, అమరావతి: భాజపా రాష్ట్ర కార్యవర్గం 42 మందితో ఏర్పాటయింది. కార్యవర్గ సభ్యుల పేర్లను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం ప్రకటించారు. వారి వివరాలు..

★ **రాష్ట్ర ఉపాధ్యక్షులు:** బిట్ర శివన్నారాయణ (గుంటూరు జిల్లా), గారపాటి సీతారామాంజనేయ చౌదరి (ఏలూరు), కాపు రామచంద్రారెడ్డి (అనంతపురం), పుట్టేటి సురేందర్‌రెడ్డి (నెల్లూరు), పైడి వేణుగోపాలం (శ్రీకాకుళం), ఆడారి ఆనంద్‌కుమార్ (అనకాపల్లి), కోలా ఆనంద్ (తిరుపతి), బొల్లిన నిర్మలాకిషోర్ (ఏలూరు), గుడిసె దేవానంద్ (శ్రీ సత్యసాయి), డాక్టర్ అశోక్‌రాజు (చిత్తూరు).

★ **రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు:** సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి (తిరుపతి), నాగోతు రమేశ్‌నాయుడు (అన్నమయ్య), మట్టా ప్రసాద్ (కృష్ణా), సాలగ్రామ లక్ష్మీప్రసన్న (కాకినాడ) ★ పార్టీ రాష్ట్ర కోశాధికారిగా మొగళ్ల నాగేంద్రరావు (విశాఖపట్నం) ఎంపికయ్యారు.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

చేయి ఉన్నా.. లేనట్లు వైకాపా కార్యకర్త కట్టుకథ


దివ్యాంగ పింఛను తొలగించారంటూ దుష్ప్రచారం



తనకు కుడిచేయి లేదని చెబుతున్న రమేశ్, పక్కనే రెండు చేతులూ ఉన్న చిత్రం

ఈనాడు, పుట్టపర్తి: కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడమే లక్ష్యంగా శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం నార్సింపల్లి చెందిన వైకాపా కార్యకర్త పాలయ్యగారి రమేశ్ దుష్ప్రచారానికి దిగాడు. వాస్తవంగా ఇతను దివ్యాంగుడే కాదు. కాళ్లు, చేతులు సక్రమంగా ఉన్నా.. తనకు వచ్చే దివ్యాంగుల పింఛనును అన్యాయంగా తొలగించారంటూ తప్పుడు వీడియో తీసి, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. అందులో తన కుడిచేయి కనిపించకుండా వెనక్కి కట్టుకుని, అసత్య ప్రచారానికి తెగబడ్డాడు. ఈ వీడియోకు వైకాపా అనుబంధ సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున ప్రచారం కల్పించారు. దీన్ని గమనించిన గ్రామస్థులు.. అతని రెండు చేతులు, కాళ్లు బాగానే ఉన్నాయని తెలియజేసే పాత వీడియోలను బయటపెట్టారు. దీంతో వైకాపా బండారం బట్టబయలైంది. దీనిపై ప్రభుత్వం సీరియస్ కావడంతో రమేశ్ గ్రామం నుంచి పరారయ్యాడు. ఈ ఉదంతంపై స్థానిక ఎస్సై కృష్ణమూర్తి.. అతని సోదరుడిని పిలిచి ఆరా తీశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెల్లడించారు.

వర్సిటీకి సౌరశక్తి!



వర్సిటీ సివిల్ మెకానికల్ బ్లాక్‌పై సోలార్ ప్యానళ్లు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సౌరశక్తిని ఉపయోగించి గడిచిన ఐదేళ్లలో ఏకంగా రూ.7 కోట్లు ఆదా చేసుకుంది. ఎలాగంటే.. వర్సిటీలో 2020లో భారీ 'సోలార్ పవర్ రూఫ్ టాప్ ప్రాజెక్టు' చేపట్టింది. ఇది దక్షిణ భారతదేశంలోని ప్రభుత్వ వర్సిటీల్లో అతి పెద్ద సౌర ప్రాజెక్టుగా నిలిచింది. దీనికోసం నెడ్‌క్యాప్ సాయంతో కేంద్ర ప్రభుత్వ గ్రామీణ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ నిధులు సమకూర్చింది. ఈ మొత్తంతో వర్సిటీలోని 14 భవనాలపై 2 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయగల సౌర ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంది. ఫలితంగా..ఈ ఐదేళ్లలో 90 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి అయింది. యూనిట్‌కు రూ.8 వంతున వేసుకున్నా.. దీని విలువ రూ.7 కోట్ల పైమాటే. మొత్తం విద్యుత్తును నేరుగా గ్రిడ్‌కు ఇచ్చి.. అంత మేర కరెంటు బిల్లు చెల్లించకుండా.. వర్సిటీ ఆదా చేసుకుంటోంది. ఏటా విద్యుత్తు రూపంలో లక్షలు ఆదా అవుతున్నట్లు వర్సిటీ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

– ఈనాడు, గుంటూరు




మధుమేహానికి అవకాడోతో చెక్!

మధుమేహాన్ని దూరంగా ఉంచడంలో దోహదపడే అద్భుత ఫలాల్లో ఒకటి- అవకాడో. రక్తంలో చక్కెర నిల్వలు ఒక్కసారిగా పెరగకుండా అవకాడోలోని ఆరోగ్యకర కొవ్వులు, ఫైబర్ నిలువరిస్తాయి. ఆహారంలో భాగంగా రోజూ సగం అవకాడో పండును తీసుకుంటే.. భోజనానంతరం గ్లూకోజ్ స్థాయిలు మెరుగవుతున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కొవ్వును నిల్వ చేసుకోకుండా, ఎల్లప్పుడూ ఖర్చు చేస్తూనే ఉండేలా శరీరాన్ని ప్రేరేపించడంలో ఈ ఫలం ఉపకరిస్తుంది.

– వారెన్ ఇంగ్లిష్, హెల్త్ కోచ్

కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శిగా వీఎల్ కాంతారావు



ఈనాడు, దిల్లీ: కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శిగా 1992 బ్యాచ్ మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి వీఎల్ కాంతారావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన పశ్చిమగోదావరి జిల్లాకు చెందినవారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, ఐఐఎం కోల్‌కతాలో ఎంబీఏ చేశారు. 2020 ఫిబ్రవరి నుంచి డిప్యుటేషన్ మీద కేంద్ర ప్రభుత్వంలో పనిచేస్తున్నారు. 2023 సెప్టెంబర్ 1 నుంచి ఆయన గనులశాఖ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకూ జలశక్తిశాఖ కార్యదర్శిగా ఉన్న దేబశ్రీ ముఖర్జీ నైపుణ్యాభివృద్ధిశాఖ కార్యదర్శిగా బదిలీ అయ్యారు.

EENADU Vol: 52, Issue: 14 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

వసుంధర

vasundhara@eenadu.in

శివలింగ ముద్ర



ఈ ముద్ర శివపార్వతుల శక్తుల్ని సూచిస్తుంది. పద్మాసనం లేదా వజ్రాసనంలో మ్యాట్‌పైనగానీ, కుర్చీలోగానీ కూర్చోండి. ఎడమచేతిని తెరచి అరచేతిని ఛాతీ ముందుకు తీసుకురండి. ఆపై కుడి చేయి పిడికిలి బిగించి... బొటనవేలిని పైకి ఉంచండి. ఈ ముద్రను, తెరచి ఉంచిన ఎడమచేతిపైన పెట్టండి. కుడి బొటనవేలిని నిలువుగా ఆకాశం వైపుగా చాచి ఉంచండి. ఇప్పుడు కళ్లను మూసి ఉంచి ప్రశాంతంగా శ్వాసమీద ధ్యాస పెట్టండి. ఇలా 15-20 సెకన్లు ఉండి తర్వాత విశ్రాంతి తీసుకోండి.

జాగ్రత్తలు: జ్వరం, రక్తపోటు, శరీర వేడి అధికంగా ఉన్నవాళ్లు డాక్టర్ సలహాతో చేయాలి.

ఉపయోగాలు: వ్యతిరేక ఆలోచనలు దూరమై సానుకూల ఆలోచనలు వస్తాయి. జీర్ణక్రియ మెరుగవుతుంది. శక్తిని పెంచుతుంది. ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది.

ఆహారం: ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉండే నట్స్, ఓట్స్, విత్తనాలు, తృణధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి.

అధిక కొవ్వును కరిగించే కటిచక్రాసన



కాళ్ల దగ్గరగా ఉంచి నిటారుగా నిల్చోండి. ఇప్పుడు ప్రశాంతంగా రెండు పాదాల మధ్య సుమారు ఒకటిన్నర అడుగుల దూరం ఉండేలా చాచండి. చేతుల్ని ముందుకు చాచి, అరచేతుల్ని అభిముఖంగా ఉంచండి. ఇప్పుడు దీర్ఘశ్వాసను తీసుకొని గాలి వదులుతూ చేతుల్ని, మెడను, కళ్లను కుడి పక్కగా తిప్పుతూ ఎగువ శరీరాన్ని వృత్తాకారంలో తిప్పే ప్రయత్నం చేయండి. ఆపై ఎడమ చేతిని కుడి భుజం మీద ఉంచి, కుడి చేత్తో ఎడమవైపు నడుమును ఊతంగా పట్టుకొని శరీరాన్ని వృత్తాకారంలో తిప్పండి. శరీరం కదలకుండా పాదాలను నేలకు అదిమిపెట్టండి. ఇప్పుడు గాలి తీసుకొంటూ మధ్యస్థ స్థితికి, ఆపై గాలి వదులుతూ ఎడమవైపు... ఇలా 12-14సార్లు కొనసాగించాలి. తర్వాత నెమ్మదిగా చేతుల్ని కిందకు దించి కాళ్ల మధ్య దూరం తగ్గించి విశ్రాంతి తీసుకోండి.

జాగ్రత్తలు: వెన్ను, మడమ, తుంటి సర్జరీలు అయినవాళ్లు డాక్టర్ సలహాతో చేయడం మంచిది.

ఉపయోగాలు: వెన్ను బలాన్ని పెంచుతుంది, అధిక కొవ్వును కరిగిస్తుంది, బద్ధకాన్ని తగ్గిస్తుంది.

- శిరీష, యోగ గురు

ఈ చిన్నారి... నైపుణ్యాల వారధి!


శరణ్య

'ఆలోచన, ఆసక్తి ఉండాలేకానీ ఏదైనా సాధించొచ్చు... నలుగురిలో ప్రత్యేకంగా నిలబడొచ్చు...' అని నిరూపిస్తోంది కల్లా శరణ్య. చిరుప్రాయంలోనే కంప్యూటర్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్ నేర్చుకోవటమే కాదు, ఓ లర్నింగ్ యాప్‌నీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

మాది వరంగల్. అమ్మ అవునూరి కారుణ్య. నాన్న కల్లా ప్రవీణ్. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే. యూఎస్ఏలో స్థిరపడ్డాం. ఇప్పుడు నేను సెవెంత్ గ్రేడ్ చదువుతున్నా. అమ్మానాన్నలను చూస్తూ నాకూ కంప్యూటర్ ప్రోగ్రామింగ్, రోబోటిక్స్ వంటి వాటిపై ఆసక్తి కలిగింది. వాటి గురించి తెలుసుకోవాలనే కుతూహలం పెరిగింది. దాంతో నాన్నను అడిగి, వీటన్నింటికీ సంబంధించిన ప్రాథమిక అంశాలు నేర్చుకున్నా. ఆ తరవాత నేనే సొంతంగా వాటి గురించి మరింత లోతుగా తెలుసుకున్నా. ఇందుకోసం నాకున్న టైమ్‌ని సద్వినియోగపరచుకునేదాన్ని. రోజుకి 3-4 గంటలు వాటికే కేటాయించేదాన్ని. మెరిట్ విద్యార్థినినే. కాబట్టి, చదువు నాకెప్పుడూ కష్టంగా అనిపించేదికాదు. దాంతో పూర్తి శ్రద్ధంతా కొత్త విషయాలు నేర్చుకోవటంపైనే పెట్టా. అప్పుడే, నాలా ఆసక్తి ఉన్న వాళ్లు నేర్చుకునేందుకు వీలుగా ఏదైనా ప్లాట్‌ఫామ్ తయారుచేస్తే బావుంటుందన్న ఆలోచన వచ్చింది. అలా 'ఎస్3 లర్నింగ్' యాప్ ప్రారంభించా. ఇందులో వృత్తి నిపుణులు, విద్యార్థులు రిజిస్టర్ అయ్యే వెసులుబాటు కల్పించా. దీనిద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీలకు కావాల్సిన మార్కెటింగ్, సేల్స్, ఇంజినీరింగ్, ప్రొడక్ట్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ... లాంటి అనేక నైపుణ్యాలు నేర్చుకునే, బోధించే వీలు ఉంటుంది. అంతేకాదు, మెటీరియళ్లు, స్పెషల్ సమ్మరీ, అసైన్‌మెంట్లు... వంటివి విద్యార్థులకు అందించటంతోపాటు రియల్‌టైమ్ వర్కింగ్ అనుభవాలను పంచుకుంటారు నిపుణులు. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ లేదా వ్యాపార రంగం వైపు అడుగులు వేయాలనుకుంటున్నా. అందుకోసం ఎప్పటికప్పుడు కొత్త స్కిల్స్ నేర్చుకునే పనిలో ఉన్నా. యాప్‌ని మరింత అభివృద్ధి చేయటం ప్రస్తుతం నా ముందున్న ప్రధాన లక్ష్యం.

అనగనగనగా అంటూ ఎవరు కథ మొదలుపెట్టినా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆసక్తిగా వింటారు. ఈమె చెప్పేదీ కథలే! కాకపోతే జీవిత కథలు. వాటి ద్వారా పల్లె కళాకారులను ప్రపంచానికి పరిచయం చేయడమే కాదు, వారి అభివృద్ధికీ సాయపడుతున్నారు సాహితీ దివి. ఆమె యజ్ఞానికి తాజాగా ప్రభుత్వ సహకారమూ తోడైంది. 'వసుంధర' పలకరించగా తన గురించి చెప్పుకొచ్చారిలా...

వెయ్యి గ్రామాలు... నా లక్ష్యం!


సాహితీ దివి

అడవిపాలెంలో 80ఏళ్ల నేతకారుడు ఉండేవారు. నేతే జీవనభృతి. మగ్గం పాడైనా దాంతోనే ఎలాగోలా నెగ్గుకొస్తున్నారు. ఆయన చీర నేసే వీడియో తీసి సోషల్‌మీడియాలో పెట్టా. మగ్గం రావడమే కాదు, అందిన సాయంతో ఆయనకి కాటరాక్ట్ సర్జరీ చేయించాం. ఇల్లూ కట్టించాం. ఎన్నో దేశాలకు చెందినవారి స్పందన ఆయన జీవితాన్ని మార్చింది. ఇలాంటి ఎన్నో కథలు... వాటిని ప్రపంచానికి పరిచయం చేయాలనుకున్నా. మాది ఏలూరు. నా చిన్నతనమంతా భోపాల్‌లో గడిచింది. నాన్న రామ్‌కుమార్ స్పెన్సర్‌కి సీఈఓగా చేశారు. అమ్మ నాగమణి. సెలవుల్లో ఊరొచ్చినప్పుడు గోదావరి, స్థానిక పంటలు, నేత... వంటివన్నీ ఆకర్షించేవి. వాటికోసం... నానమ్మ, తాతయ్యలతో కలిసుండొచ్చనీ బీఫార్మసీ చీరాలలో చదివా. అప్పుడు స్నేహితులతో కలిసి నేతకారులు, జాలర్లు, రైతులకు వేస్ట్ మేనేజ్‌మెంట్ మీద అవగాహన, వారి ఉత్పత్తులు మార్కెటింగ్ చేయడం వంటివి చేశా. ఈ అంశాలపై పట్టు తెచ్చుకోవాలనే పైచదువులకు అమెరికా వెళ్లా. అక్కడ సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్‌లో మాస్టర్స్, శ్రీలంకలో ఇంటర్న్‌షిప్ చేసి 2016లో తిరిగొచ్చా. ఎంఎన్‌సీలో, స్టార్టప్‌కి పనిచేశాక ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి నా కలల ప్రాజెక్టు 'ఇంపాక్ట్ సైంటిస్ట్' ప్రారంభించా. రాజమండ్రిలో నేత, క్రాఫ్ట్స్ వంటివి రూపొందడంపై లైవ్ డాక్యుమెంట్ తీసి... వివిధ సంస్థల సాయంతో కళాకారులకు కావాల్సిన సాయాన్ని అందించేదాన్ని. అవసరమైతే నేనూ వాళ్లతో కలిసి పనిచేస్తుంటా. అలా వచ్చిందే 'గూడపల్లి సిల్క్' బ్రాండ్ కూడా. దీనికోసం 3-4 నెలలు అక్కడే ఉన్నా.

ప్రభుత్వం తోడుగా...

ఆపై నేను తమిళనాడులోని ఆరోవిల్లే అనే ఇంటర్నేషనల్ టౌన్‌షిప్‌కి వెళ్లాను. 3ఏళ్లు అక్కడో ఎన్‌జీఓకి డైరెక్టర్‌గా, 'బాంబూ సెంటర్' అనే మరో సంస్థకు సీనియర్ కన్సల్టెంట్‌గా చేశా. ఇంతలో తెలంగాణ 'వీహబ్'లో కమ్యూనికేషన్ స్ట్రాటజిస్ట్‌గా అవకాశమొచ్చింది. దాదాపు 300మంది ఆంత్రప్రెన్యూర్లకి బ్రాండింగ్, ఆలోచన స్టార్టప్‌గా తీసుకెళ్లడం వంటి వాటిల్లో సాయపడ్డా. ఆ సమయంలోనే... సొంత ఊళ్లో స్థానిక నైపుణ్యాలను వాడుతూ ఉపాధి కల్పించే సంస్థలకు పెట్టుబడి పెట్టే 'అల్సిసార్ ఇంపాక్ట్' అనే సంస్థతో పరిచయమైంది. వాళ్లతో కలిసి పశ్చిమ్‌బంగాలో 'ఎంపవరింగ్ విమెన్ గ్లోబల్లీ' ప్రాజెక్టులో పనిచేశా. మనసు ఆంధ్రా వైపు మళ్లింది. మనవాళ్లకి సాయపడాలని తిరిగొచ్చి 'సోల్ ఆఫ్ స్వదేశ్' ప్రారంభించా. దీనికోసం పనిచేస్తున్నప్పుడే ఏపీ ప్రభుత్వంలో టూరిజం డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ కన్సల్టెంట్‌గా అవకాశం వచ్చింది. రూరల్ టూరిజం, బ్రాండింగ్ మార్కెటింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ క్లస్టర్స్... ఇదివరకు దృష్టిపెట్టిన అంశాలే! కాకపోతే ప్రభుత్వ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున, ప్రభావవంతంగా చేయొచ్చు. ప్రస్తుతం 100 గ్రామాలను గ్లోబల్ రూరల్ టూరిజం విలేజ్‌లుగా తీర్చిదిద్దబోతున్నాం.

అప్పుడు నమ్మారు

దాదాపు 15 ఏళ్ల క్రితం ఈ ప్రయాణం మొదలుపెట్టా. 250కిపైగా గ్రామాలు తిరిగా. ఎంతోమంది గ్రామీణులతో పనిచేశా. భాషా ఇబ్బందులొచ్చేవి. పల్లెవాళ్లు... త్వరగా నమ్మేవారు కాదు. ఏమన్నా నవ్వుతూ మళ్లీమళ్లీ వెళ్లేదాన్ని. వాళ్ల ఉత్పత్తులు మార్కెటింగ్ చేసేదాన్ని. ఫొటోలు తీసుకోవడానికి కాదు... నిజంగా సాయం చేస్తానని గుర్తించాకే నమ్మారు. ప్రేమ, ఓపికతో వాళ్ల హృదయాలను గెలిచా. కానీ వ్యక్తిగత జీవితానికే దూరమయ్యా. అయినా నా లక్ష్యం పెద్దది. కాబట్టే, ప్రతిచోటా నన్ను నేను తీర్చిదిద్దుకున్నా. ఈ క్రమంలో నేర్చుకున్న అంశాలు, అనుభవం, నెట్‌వర్క్... ఇవే నా బలం. వెయ్యి గ్రామాల్ని అభివృద్ధి చేయాలి, కనీసం 100 గ్రామాల్ని మోడల్ పల్లెలుగా నిలపాలన్నవి నా కలలు. నాన్నెప్పుడూ 'నువ్వు స్పెషల్. నీకు నచ్చింది చెయ్యి. ఎవరికో సమూ మారొద్దు' అంటుంటారు. ఇంట్లోవాళ్ల అండతోనే నచ్చింది చేయగలుగుతున్నా!

మైక్రో వాక్స్ చేస్తున్నారా..?



'ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు పదివేల అడుగులు వేయాల్సిందే'... ఇది అందరూ చెప్పే మాటే. కానీ ఎంతమంది పాటిస్తున్నారంటే? మేం చేస్తున్నాం అని ఒక్కరూ చెప్పలేరు. కారణం నిమిషం కూడా ఖాళీ లేకుండా లేచింది మొదలు పనులతోనే సరిపోతుంది మహిళలకు. ఒకవేళ ఏ కొద్ది సమయం దొరికినా... అది కూడా వ్యాయామానికి కేటాయిస్తే... ఇక విశ్రాంతి తీసుకునేదెప్పుడు అని రిలాక్స్ అయిపోతుంటారు. అలా కాకుండా, మీ బిజీ రోజులో మీకు తెలియకుండానే నడవచ్చు. దీన్నే 'మైక్రో వాక్స్' అంటారు. ఉద్యోగం చేస్తున్న మహిళలకు టీ, లంచ్, స్నాక్స్ బ్రేకులు ఉంటాయి కదా. అప్పుడు 'సమయం లేదు. డెస్క్ దగ్గరే తినేద్దాం' అని అనకుండా... డైనింగ్ రూమ్‌కు వెళ్లి తినడానికి ప్రాధాన్యత ఇవ్వండి. ఒకవేళ ఆ గది పైన ఉంటే లిఫ్టును వాడకుండా, మెట్లు ఎక్కితే సరి. స్నాక్స్, టీ విరామాల్లో... వీలును బట్టి ఆఫీసు చుట్టూ తిరిగి రావొచ్చు. పని మధ్యలో ఒత్తిడి తగ్గించుకోవడానికి, సహోద్యోగులతో చిట్‌చాట్ చేసేటప్పుడూ అలా బాల్కనీ వరకూ నడిచి వెళ్లొచ్చు. నడుస్తూ కాల్స్ మాట్లాడొచ్చు. తరచి చూడాలే కానీ పదివేల అడుగులు వేయడానికి ఇలా ఎన్ని అవకాశాలో. సమావేశాలకు ప్రణాళికలు తయారుచేసుకున్నట్లే... ఫలానా సమయంలో నడవాలి అంటూ ఓ టైమ్‌టేబుల్ వేసుకుని, పక్కాగా దాన్ని అమలు చేస్తే మీ లక్ష్యం ఇట్టే పూర్తై... ఆరోగ్యం మీ సొంతం అవుతుంది. ప్రయత్నిస్తారుగా మరి!

మీకు తెలుసా?



లీసా గెలోబ్టర్... కంప్యూటర్ సైంటిస్ట్, టెక్నాలజిస్ట్ అయిన ఈమె, మనం చాటింగ్‌లో ఉపయోగించే జీఐఎఫ్(జిఫ్)లను సృష్టించే యానిమేషన్ టెక్నాలజీని డెవలప్ చేశారట.

బంగారం - వెండి



22న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,03,330	92,550	1,19,313
విజయవాడ	99,240	92,150	1,17,400
ప్రొద్దుటూరు	1,01,000	92,920	1,17,100
రాజమహేంద్రవరం	1,00,530	92,150	1,28,000
విశాఖపట్నం	1,00,170	92,150	1,25,000
తమిళనాడు	-----	92,150	1,28,000

అది... డూమ్‌స్క్రోలింగ్!



పని అవ్వగానే ఫోన్ పట్టుకుని... ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లను స్క్రోల్ చేసే మహిళలూ అమ్మాయిలే ఎక్కువ. ఒక్కసారి మొదలుపెడితే... సమయం ఎలా గడిచిపోతుందో కూడా తెలియదు. సామాజిక మాధ్యమాల్లో మనకు నచ్చిన, అవసరమైన విషయాలే కాదు... కొన్నిసార్లు అనవసరమైన అంశాలూ వస్తుంటాయి. వాటిలో ప్రతికూల, మనసును కలచివేసేవీ ఉంటాయి. ప్రమాదాలు, హత్యలు, లైంగిక దాడులు లాంటివి. ఈ మధ్య వీటిని కూడా ఆసక్తిగా చెప్పే వాళ్లూ ఎక్కువైపోతున్నారు. ఒక్క వీడియో చూస్తే చాలు... వాటి ప్రవాహం ఆగదు. పదే పదే అదే రకమైన కంటెంట్ కనిపిస్తుంది. మనం కూడా ఆసక్తితో అవన్నీ చూస్తుంటాం. ఇలా మనకు అక్కర్లేని, ప్రతికూల, మనసును నొప్పించే అంశాల్ని చూడటాన్నే 'డూమ్‌స్క్రోలింగ్' అంటారు. ఇది మానసిక సంతులతను దెబ్బతీస్తుంది. సున్నిత మనస్కులు రాత్రి నిద్రపోయే ముందు ఈ తరహా వీడియోలు చూడటం వల్ల... నిద్రలేమి, కలత నిద్రతో బాధపడుతున్నట్లు ఇటీవల ఓ అధ్యయనం వెల్లడించింది. దీన్నుంచి బయట పడాలంటే... మీ ఫోన్‌లో స్క్రీన్ లేదా యాప్ టైమ్‌ను ఆన్ చేసుకోండి. దీనివల్ల నిర్ణీత సమయం తర్వాత స్క్రీన్ ఆగిపోతుంది. ఈ మధ్య సామాజిక మాధ్యమ ఖాతాల్లో... మీరు చూస్తున్న కంటెంట్ మీకు ఆసక్తి ఉందా? లేదా? అని నోటిఫికేషన్ వస్తోంది. కాదనే ఆప్షన్ క్లిక్ చేస్తే సరి. లేదా నచ్చని విషయాలు వచ్చినప్పుడు... రిపోర్ట్ అనే ఆప్షన్ ఉంటుంది. దాన్ని క్లిక్ చేసి హైడ్ అండ్ రిపోర్ట్ చేస్తే సరి. ఈ తరహా విషయాలు మిమ్మల్ని ఇబ్బంది పెట్టవు.

అరోమా స్నానంతో హాయి..!



ఆఫీసులో పని ఒత్తిడి... ఇంట్లో తీరికలేని బాధ్యతలు... ఆడవాళ్లందరికీ ఉండేవే. దీంతో చికాకు, అలసట... వీటిని మామూలే అని తీసిపారేయకండి. ఇవే తర్వాత వివిధ రకాల నొప్పులకూ, మరెన్నో అనారోగ్యాలకూ కారణం అవుతాయి. మరేం చేయాలంటారా? ఎప్పటికప్పుడు సాంత్వన పొందేందుకు ప్రయత్నించాలి. ఇందుకు మీకోసం మీరు కొంత సమయం కేటాయించాలి. అప్పుడే, మనసు శరీరం ఆరోగ్యంగా ఉంటాయి. అందులో భాగంగానే వారంలో రెండు రోజులైనా ఈ వెచ్చని అరోమా థెరపీ స్నానాన్ని ప్రయత్నిస్తే సరి. వేడినీళ్లల్లో 5 చుక్కల లావెండర్ నూనె లేదా కామెమైల్ ఆయిల్‌ను వేయండి. గుప్పెడు గులాబీ రేకలూ చేర్చండి. ఈ నీటితో కనీసం 15-20 నిమిషాల పాటు స్నానం చేయగలిగితే చాలు. కండరాలు రిలాక్స్ అవుతాయి. బడలిక తీరుతుంది. లేదంటే ముందుగా కప్పు పెసరపిండిలో రెండు చెంచాల చొప్పు సెనగపిండి, శీకాయపొడి తీసుకోండి. వీటికి పావు చెంచా కస్తూరి పసుపు, అరచెంచా చొప్పున చందనం, గులాబీరేకల పొడి చేర్చి పాలతో పేస్ట్‌లా చేసి పక్కన పెట్టాలి. ఇప్పుడు గోరువెచ్చని నువ్వుల నూనెను ఒళ్లంతా రాసి మసాజ్ చేయండి. ఆపై పెసరపిండి మిశ్రమాన్ని ఒంటికి రాసి 5 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత నీటితో తడుపుతూ మృదువుగా రుద్దుతూ స్నానం చేస్తే సరి. ఒంటిపై మురికి వదలడమే కాదు... మనసూ, శరీరం హాయిగా ఉంటాయి. రక్తప్రసరణ సక్రమంగా జరిగి ఆపై నిద్రా ముంచుకొస్తుంది. ఓసారి ప్రయత్నించి చేస్తే సరి.

పిల్లలను రైతులను చేస్తోంది!



'ఈ తరానికి తిండి విలువ తెలియట్లేదు'... ఆహారాన్ని చెత్తబుట్ట పాలు చేసే పిల్లల్ని చూసి ఈ మాట చాలాసార్లే అనుకుంటాం కదూ! అదెంత కష్టపడితే వస్తోందో పాపం వాళ్లకు మాత్రం ఏం తెలుసు? 'అమ్మ షాపు నుంచి సరకులు కొనుక్కొచ్చి ఇంట్లో వండుతుంది' అనే అనుకుంటారు. అయితే ఆ కష్టమేదో రుచి చూపిస్తే చిన్నారులకీ ఆహారం విలువ తెలుస్తుంది కదా అనుకున్నారు ప్రగతి చస్వాల్. ఆమె ప్రయత్నంతో వేలమంది చిన్నారి రైతులు సిద్ధమవుతున్నారు.

అడ్వర్టైజ్‌మెంట్ రంగంలో దశాబ్దానికిపైగా అనుభవం ప్రగతిది. మంచి జీతం, గుర్తింపు. కానీ ఏదో లోటు. దానికితోడు తుది గడువులతో పోటీపడి అలసిపోయా అనిపించిందామెకు. తిరిగి పుంజుకోవాలంటే కొంత విరామం కావాలనిపించి... ఉద్యోగానికి సెలవు పెట్టారు. ఈమెది ఢిల్లీ. సెలవుల్లో కొడుకు నీల్‌తో గడుపుతున్నప్పుడు... బాబు కూరగాయల్ని పక్కన పెట్టడం, వేస్ట్ అంటూ చెత్తబుట్టలో పడేయడం గమనించారు. స్నేహితులను కలిసినప్పుడు వాళ్ల పిల్లలూ ఇలాగే ఉండటం చూసి బాధేసిందామెకు. 'రైతులు ఎంతో కష్టపడితే ఈ భోజనం మన పళ్లెంలోకి వస్తోంది. దాన్ని వృథా చేయడమంటే ఆ కష్టానికి విలువనివ్వనట్లే అనిపించింది. ఆహార విలువ తెలిసేలా ఏదైనా చేయాలనుకున్నా'నంటారు ప్రగతి.



ఇంటి ఆవరణలోనే మొక్కల పెంపకం మొదలుపెట్టారామె. సేంద్రియ వ్యవసాయం, పర్మాకల్చర్‌ల్లో మెలకువలు తెలుసుకుంటూ 35 రకాల కూరగాయలు, పండ్లు పెంచారు. దీనిలో కొడుకునీ భాగస్వామ్యం చేశారు. దీని గురించి లోతుగా తెలుసుకోవడానికి ఇగ్నో నుంచి వ్యవసాయ కోర్సులూ చేశారు. ఈ క్రమంలో కొడుకులో వచ్చిన మార్పును గమనించారామె. ఇతర పిల్లలనూ భాగస్వాములను చేయాలని 2017లో 'సో గుడ్ ఫౌండేషన్' ప్రారంభించారు. దీని ద్వారా ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులకు సాగు పాఠాలు చెప్పడమే కాదు, పిల్లలతో వ్యవసాయం చేయించడమూ మొదలుపెట్టారు. ప్లాస్టిక్‌కి దూరంగా ఉంచుతూ రీయూజింగ్, రీసైక్లింగ్‌నీ నేర్పిస్తున్నారు. ఉచితంగా చేస్తుండటంతో పాఠశాలలూ ప్రగతికి అవకాశమిచ్చాయి.

'చేయడం ద్వారా ఎక్కువ నేర్చుకుంటారని భావిస్తాన్నేను. దీనికోసం మూడేళ్ల కరిక్యులమ్‌నీ రూపొందించా. దీనిలో వానపాములు, కొన్నిరకాల పురుగులు పంటలకు ఎలా సాయపడతాయి, కొన్నిరకాల పంటలు కొన్ని కాలాల్లోనే ఎందుకు పండుతాయి? వంటివీ నేర్పుతాం. ప్రతి విద్యార్థికీ కొన్ని మొక్కలను అప్పగిస్తా. దాంతో బాధ్యత తెలుస్తుంది. పిల్లలతో క్యాంపెయిన్లు, వర్క్‌షాపులూ నిర్వహిస్తున్నా. దీంతో వీళ్లూ ఇతరులకు నేర్పగలుగుతారు. సస్టెయినబిలిటీ ఒక జీవన విధానం. అది పాఠాలుగా నేర్చుకుంటే సరిపోదు. మట్టి, నీళ్లు, చుట్టూ ఉండే జీవజాతులతో అనుబంధం ఏర్పరచుకోగలిగితేనే దానిపై ప్రేమ పెంచుకోగలుగుతారు. ఇందుకు బాల్యం సరైన ఎంపిక. పిల్లలుగా ప్రయత్నిస్తేనే పెద్దయ్యాక ప్రకృతికి రక్షకులుగా మారతారు' అంటోన్న ప్రగతి మూడో తరగతి నుంచి విద్యార్థులను ఎంచుకుంటారు. పండిన పంటను వాళ్లతోనే స్వయంగా అమ్మిస్తారు. ఇప్పటివరకూ 72వేల మంది విద్యార్థులను రైతులుగా తీర్చిదిద్దారు. వాళ్లతో ఆహారవృథానీ ఆపగలిగారు. చిన్నారులను బుల్లి రైతులుగా, ప్రకృతి రక్షకులుగా తీర్చిదిద్దుతున్న ఈమె ప్రయత్నాన్ని అభినందించాల్సిందే కదూ!



నయా ట్రెండ్

వధువుల మెహందీ... మినిమల్‌గా!



ఎర్రగా పండిన గోరింట చేతుల్ని చూసుకుని మురిసిపోని అమ్మాయుండదు. అందుకే పండుగ, వేడుకేదైనా అరచేతులు గోరింట, మెహందీ డిజైన్లతో నిండాల్సిందే. ఇక పెళ్లిలో దీనికోసం 'మెహందీ' పేరుతో ప్రత్యేకంగా వేడుకనీ నిర్వహించుకుంటున్నారు. వధువంటే మోచేతివరకూ ఏమాత్రం ఖాళీ లేకుండా డిజైన్లు మెరవడమూ రివాజు. ఎంత ఎర్రగా పండితే అంత బాగా భాగస్వామి ప్రేమిస్తాడని నమ్మకం. ఆ ఎరుపుదనం ఆశీస్సులు, సౌభాగ్యాలను మోసుకొస్తుందనీ భావిస్తారు. అందుకే మన సంప్రదాయంలో గోరింటకు అంత ప్రాముఖ్యం. ఓపిగ్గా కూర్చొని మరీ గంటలకొద్దీ డిజైన్లు వేయించుకుంటారు. ఆ చేతులూ అమ్మాయిలకు కొత్త కళని తీసుకొస్తాయి. కానీ ఇప్పటి వధువులు ఆ విధానాన్ని కొంచెం తిరగరాస్తున్నారు. సంప్రదాయాన్ని కాదనట్లేదు. కానీ భారీ డిజైన్లకే నో చెబుతున్నారు. నగలు, దుస్తులు, వేడుకల నిర్వహణల్లోనే కాదు మెహందీ విషయంలోనూ 'మినిమలిజా'నికి ఓటేస్తున్నారు. అలా వచ్చిందే ఈ 'మినిమలిస్టిక్ మెహందీ' ట్రెండ్. చేతులంతా తీర్చిదిద్దే డిజైన్లు ఉండవు. చిన్నగా, చూడముచ్చటగా ఉండేవాటికే ప్రాధాన్యమిక్కడ. సన్నని తీగలు, గంటలు, బ్రేస్‌లెట్లు, హాఫ్ హ్యాండ్... అంటూ బోలెడు డిజైన్లు. వాటిల్లో వాళ్లకు నచ్చిన ప్రత్యేకమైనదాన్ని ఎంచుకుంటున్నారు. తమదైన స్టైల్‌స్టేట్‌మెంట్‌ని సృష్టిస్తున్నారు. భారీతనమే లేదు కానీ... అందమేం తగ్గట్లేదు. పైగా చిన్న డిజైన్ భలేగుందే అన్న కితాబులూ అందుకుంటున్నారు. కాబట్టే, ముచ్చటపడి మరీ వీటిని పెట్టించుకుంటున్న వధువులు పెరుగుతున్నారు. మీ సంగతేంటి? మీదీ మినిమలిజం బాటేనా? అయితే మిమ్మల్ని ఆకట్టుకునే డిజైనేంటో ఎంచేసుకోండి మరి.

20 ఏళ్లకు పైబడిన వాహనాలకు

ఆర్‌సీ రెన్యూవల్ రుసుము పెంపు

ఈనాడు, దిల్లీ: 20 ఏళ్లకు పైబడిన వాహనాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ) రెన్యూవల్ రుసుమును ప్రభుత్వం పెంచింది. ఇలాంటి పాత వాహనాలను వినియోగదార్లు



అట్టే పెట్టుకోకుండా చేయడమే ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు మోటారు వాహనాల నిబంధనల్లో రూల్ 81-4బీ కింద కేవలం ఆర్‌సీ రెన్యూవల్‌కు మాత్రమే అవకాశం ఉండేది. ఇప్పుడు రూల్ 81 కింద కొత్తగా 4సీ క్లాజ్‌ని చేర్చి అందులో 20 ఏళ్లకు పైబడిన వాహనాల ఆర్‌సీల రెన్యూవల్‌కు అవకాశం కల్పించారు. ఈ ఛార్జీలపై జీఎస్‌టీ అదనం. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. 20 ఏళ్లకు పైబడిన మోటార్ సైకిళ్లకు రిజిస్ట్రేషన్ రెన్యూవల్ రుసుమును రూ.2,000కు; త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు రూ.5000కు పెంచారు. దిగుమతి చేసుకున్న ద్వి, త్రిచక్ర వాహనాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ రుసుము రూ.20,000గా ఉండనుంది. నాలుగు లేదా అంతకుమించి చక్రాల వాహనాలకైతే రూ.80,000 చెల్లించాలి.

మోటారు వాహనాల ఆర్‌సీ రెన్యూవల్ ఛార్జీల స్వరూపం ఇలా

వాహనం	సాధారణ రెన్యూవల్ రుసుము (రూ.ల్లో)	20 ఏళ్లకు పైబడితే (రూ.ల్లో)
ఇన్‌వ్యాలీడ్ క్యారేజ్	50	100
మోటార్ సైకిళ్లు	100	2,000
3/4 చక్రాల వాహనాలు	2,500	5,000
తేలికపాటి మోటార్ వాహనాలు	5,000	10,000
దిగుమతి చేసుకుంటే..		
2/3 చక్రాల వాహనాలు	10,000	20,000
4పైబడిన చక్రాల వాహనాలు	40,000	80,000
పైనవి కాకుండా మిగతావి	6,000	12,000

మహిళా మదుపర్లను ప్రోత్సహించండి

తొలి పెట్టుబడులపై డిస్ట్రిబ్యూటర్లకు ప్రయోజనాలు

ప్రవేశపెట్టే యోచనలో సెబీ

దిల్లీ: మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి మహిళల నుంచి తొలి పెట్టుబడిని తీసుకొని వస్తే అదనపు ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టడంపై సెబీ యోచన చేస్తోంది. 'పెట్టుబడుల్లో మహిళలకూ సమ ప్రాతినిధ్యం లభించకుంటే అందరికీ ఆర్థిక సేవలను దర్చిచేర్చాలనే ఉద్దేశం అసంపూర్ణమే అవుతుంది. అందుకే వాళ్ల నుంచి తొలి పెట్టుబడులను తీసుకొని వస్తే అదనపు డిస్ట్రిబ్యూషన్ ప్రోత్సాహకాలను ఇవ్వాలని అనుకుంటున్నామ'ని యాంఫీ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. మ్యూచువల్



ఫండ్ పరిశ్రమను ప్రోత్సహించడంలో భాగంగా ఇప్పటికే పలు కీలక చర్యలను సెబీ చేపట్టిందని పేర్కొన్నారు. రెండో, మూడో అంచె నగరాల్లో తొలిసారిగా పెట్టుబడులు పెడుతున్న మదుపర్ల నుంచి పెట్టుబడులు తీసుకొచ్చిన డిస్ట్రిబ్యూటర్లకు ప్రోత్సాహకాలు ఇవ్వాలన్న ఇటీవలి ప్రతిపాదన ఇందులో భాగమేనని అన్నారు. దీని వల్ల కొత్త మదుపర్లు రావడమే కాకుండా మారుమూల ప్రాంతాలకూ మ్యూచువల్ ఫండ్ పథకాలు చేరువవుతాయని అన్నారు. మ్యూచువల్ ఫండ్ పథకాల వర్గీకరణపైనా సెబీ సమీక్ష జరుపుతోందని తెలిపారు.

మోసపూరిత ఉపసంహరణల ముప్పు!

మ్యూచువల్ ఫండ్ పరిశ్రమకు మోసపూరిత ఉపసంహరణల ముప్పు కూడా ఇటీవల పెరిగిందని... ఇది మదుపర్ల విశ్వాసంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని అన్నారు. అందువల్ల ఇలాంటి మోసాల నియంత్రణకు నిఘా వ్యవస్థను మ్యూచువల్ ఫండ్ సంస్థలు పటిష్ఠం చేసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు.

ఆ పథకాలపై జాగ్రత్తగా ఉండండి

సామాజిక మాధ్యమాలు లేదా మొబైల్ యాప్‌ల ద్వారా ప్రచారం చేస్తున్న మోసపూరిత ట్రేడింగ్ పథకాల విషయంలో మదుపర్లు అప్రమత్తంగా ఉండాలని సెబీ సూచించింది. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐ) ద్వారా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులకు వీలు కల్పిస్తామంటూ తప్పుదోవ పట్టించే ప్రకటనలను చేస్తున్నారని, వాటిని మదుపర్లు నమ్మొద్దని సూచించింది. భారత్‌లో నివసించే భారతీయులకు ఎఫ్‌పీఐల పెట్టుబడి మార్గం వర్తించదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనే సెబీ నిబంధనలకు లోబడి అనుమతులు ఉంటాయని వెల్లడించింది. అందువల్ల సెబీ వెబ్‌సైట్‌లో ఫలానా సంస్థకు సెబీ గుర్తింపు ఉందా? లేదా? అని పరిశీలించాకే పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవాలని, అధికారిక ట్రేడింగ్ యాప్‌లనే ఉపయోగించాలని మదుపర్లకు వివరించింది.

ఈనాడు బిజినెస్

చైనా డేటా కేంద్రాలకు ఎన్‌విడియా కొత్త చిప్!

ట్రంప్ ప్రభుత్వ అనుమతి కోసం సంస్థ చర్చలు

దిల్లీ: చైనా డేటా కేంద్రాలకు కొత్త కంప్యూటర్ చిప్‌ను రూపొందించే అంశంపై అమెరికా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు అమెరికా దిగ్గజ సంస్థ ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ హాంగ్ తెలిపారు. ఎన్‌విడియా ముఖ్య తయారీ భాగస్వామి అయిన తైవాన్ సెమీకండక్టర్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కార్ప్ ప్రతినిధులతో సమావేశం అయ్యేందుకు తైవాన్ పర్యటనకు హాంగ్ వెళ్లారు. ఈ సందర్భంగా చైనా కృత్రిమ మేధ (ఏఐ) డేటా కేంద్రాల కోసం 'బీ30ఏ' సెమీకండక్టరును తీసుకొచ్చే అంశంపై ఆయనను అడగ్గా.. ట్రంప్ ప్రభుత్వంతో దీనిపై చర్చిస్తున్నామని చెప్పారు. 'హెచ్20 స్థానంలో చైనా ఏఐ డేటా కేంద్రాలకు కొత్త చిప్ అందివ్వనున్నాం. అయితే ఈ నిర్ణయం మా చేతిలో లేదు. అమెరికా ప్రభుత్వం దీనిని నిర్ణయించాలి. ఇప్పటికైతే చర్చలు జరుపుతున్నాం. త్వరలోనే ఈ చర్చల ఫలితం తెలుస్తుంద'ని హాంగ్ తెలిపారు. కృత్రిమ మేధ వ్యవస్థల రూపకల్పన, నవీకరణ కోసం గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్స్‌గా వ్యవహరించే ఈ చిప్‌లను వాడతారు. అయితే ఎన్‌విడియాకు చెందిన ప్రధాన శ్రేణి సెమీ కండక్టర్లతో పోలిస్తే ఇవి తక్కువ సామర్థ్యంతో కూడుకున్నవి. అమెరికా జాతీయ భద్రతా ఆంక్షల రీత్యా ఈ సెమీ కండక్టర్లను చైనాకు ఎన్‌విడియా విక్రయించడం లేదు. ఎన్‌విడియా ప్రత్యేక బ్లాక్‌వెల్ సాంకేతికతతో రూపొందిస్తున్న బీ30ఏ చిప్‌ల సామర్థ్యం.. ఎన్‌విడియా ప్రధాన బీ300 చిప్‌ల సామర్థ్యంలో దాదాపు సగానికి ఉంటుంది.

రూ.3,000 కోట్లు సమీకరించనున్న జీఎంఆర్ పవర్

ఈనాడు, హైదరాబాద్: భవిష్యత్తు వ్యాపార అవసరాల కోసం రూ.3,000 కోట్లు సమీకరించాలని జీఎంఆర్ పవర్ అండ్ అర్బన్ ఇన్‌ఫ్రా యోచిస్తోంది. ఈ ప్రతిపాదనకు జీఎంఆర్ పవర్ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. ఈక్విటీ షేర్లు, డిబెంచర్లు లేదా కన్వర్టబుల్ వారెంట్లు జారీ చేయడం ద్వారా సమీప భవిష్యత్తులో ఈ నిధులు సమీకరించే యోచన జీఎంఆర్ పవర్‌కు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బోర్డులో స్వతంత్ర డైరెక్టర్లుగా ఉన్న శంతను ఘోష్, ఫరీద్ అహ్మద్, సుమన్ నరేష్ సబ్‌నాని లను మరో అయిదేళ్ల పాటు కొనసాగించాలని ప్రతిపాదించారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ విద్యుత్ బైకు

● ఫ్లయింగ్ ఫ్లీ సీ6 ● 2026లో విపణిలోకి


ఈనాడు, హైదరాబాద్: రాయల్ ఎన్‌ఫీల్డ్ అనుబంధ సంస్థ ఫ్లయింగ్ ఫ్లీ నుంచి వచ్చే ఏడాది విద్యుత్ బైక్ అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించి ఫ్లయింగ్ ఫ్లీ సీ6 మోడల్‌ను సంస్థ హైదరాబాద్‌లో ప్రదర్శించింది. నగరాల్లో సులభంగా నడిపేందుకు వీలుగా, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఆధారిత ఆవిష్కరణల మిళితం చేసి దీన్ని రూపొందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధంలో ఉపయోగించిన ఫ్లయింగ్ ఫ్లీ మోటార్ సైకిల్ నుంచి స్ఫూర్తి పొంది దీన్ని సంస్థ రూపొందించింది. దాదాపు 200 మందికి పైగా ఇంజినీర్లు దీనికోసం పనిచేశారని, 40కి పైగా పేటెంటు దరఖాస్తులు చేసినట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు. ఒకే సీటుతో, 19 అంగుళాల అలాయ్ వీల్స్‌తో ఇది ఉంది. స్మార్ట్‌ఫోన్‌తో కనెక్ట్ అయ్యే 3.5 అంగుళాల గుండ్రటి టచ్ స్క్రీన్ టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంటల్ క్లస్టర్ ఉంది. ఇందులో గూగుల్ మ్యాప్స్ సహా అనేక ఇతర అప్లికేషన్‌లూ వాడుకోవచ్చు. రిమోట్ లాక్/అన్‌లాక్, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్ ఛార్జర్, 5 రకాల రైడింగ్ పద్ధతులు తదితర సదుపాయాలు ఉన్నాయి. ఒక ఛార్జింగ్‌తో ఎన్ని కిలోమీటర్లు వెళ్తుందనే విషయాన్ని సంస్థ చెప్పలేదు. కానీ, అందుబాటులో ఉన్న నివేదికల ప్రకారం 100-150 కిలోమీటర్ల సామర్థ్యం ఉండొచ్చని తెలుస్తోంది.



జీనోమ్ వ్యాలీలో థర్మో ఫిషర్ సైంటిఫిక్ కేంద్రాలు

ఈనాడు, హైదరాబాద్: శాస్త్ర సాంకేతిక పరికరాలు, ఇతర ఉత్పత్తులు, సేవలు అందించే సంస్థ థర్మో ఫిషర్ సైంటిఫిక్, హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో రెండు యూనిట్లు ఏర్పాటు చేయనుంది. ఏటా 40 బిలియన్ డాలర్ల (1 బిలియన్ డాలర్లు= రూ.8,800 కోట్లు) వార్షిక ఆదాయాలు నమోదు చేసే యూఎస్‌కు చెందిన ఈ సంస్థ మనదేశంలో బయోఫార్మా ఉత్పత్తి రంగంలో క్రియాశీల పాత్ర పోషించడానికి సిద్ధమవుతోంది. థర్మో ఫిషర్ సైంటిఫిక్ యూనిట్లు ఈ సంవత్సరాంతానికి ఉత్పత్తి దశలోకి అడుగుపెడతాయని తెలుస్తోంది. ఇందులో ఒకటైన బయోప్రాసెస్ డిజైన్ సెంటర్ (బీడీసీ) ను తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తారు. కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ (సీఈసీ)ని థర్మో ఫిషర్ సైంటిఫిక్ ఏర్పాటు చేస్తోంది. అంకుర సంస్థలకు, ఇతర బయోఫార్మాస్యూటికల్ సంస్థల ప్రతినిధులకు ఈ రెండు కేంద్రాలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సేవలను అందిస్తాయని థర్మో ఫిషర్ సైంటిఫిక్ ఇండియా ఎండీ శ్రీనాథ్ వెంకటేష్ వివరించారు.

ప్రవాస పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్ పాల్ మృతి



లండన్/దిల్లీ: దిగ్గజ ప్రవాస పారిశ్రామికవేత్త లార్డ్ స్వరాజ్ పాల్ (94) మృతిచెందారు. బ్రిటన్‌లోని కపారో గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడైన పాల్ ఆరోగ్యం ఇటీవల క్షీణించడంతో, లండన్‌లోని ఆసుపత్రిలో చేరారని, గురువారం సాయంత్రం ఆయన పరమపదించారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. పాల్ మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బ్రిటన్‌లో ఆయన చేపట్టిన ప్రజా సేవలు, దాతృత్వ కార్యకలాపాలను, భారత్‌తో బ్రిటన్ సంబంధాల విషయంలో ఆయనిచ్చిన మద్దతును జాతి ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. ఉక్కు ఉత్పత్తులు తయారు చేసే చిన్న ఫౌండ్రీని నిర్వహించే ప్యారే లాల్ దంపతులకు 1931 ఫిబ్రవరి 18న జన్మించిన పాల్ 1949లో పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ, అమెరికాలోని మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎమ్ఐటీ) నుంచి బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీలు చేశారు. 1983లోనే భారత ప్రభుత్వం పాల్‌కు పద్మభూషణ్ ఇచ్చింది.

మారుత్ డ్రోన్స్ నిఘా డ్రోన్‌కు డీజీసీఏ ధ్రువీకరణ



హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన డ్రోన్ల కంపెనీ మారుత్ డ్రోన్స్ తన నిఘా డ్రోన్ అయిన 'ద స్కైస్విఫ్ట్56'కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) టైప్ సర్టిఫికేషన్ లభించింది. నిఘా, హై-ప్రెసిషన్ మాపింగ్, ఫీల్డ్ ట్రైనింగ్ వంటి అవసరాలకు ఈ క్వాడ్‌కాప్టర్-క్లాస్ రోటోక్రాఫ్ట్ ఉపయోగపడుతుందని కంపెనీ పేర్కొంది. ఎఫ్‌పీఏ కెమేరా, 24 ఎమ్‌పీ మ్యాపింగ్ కెమేరా, 4కే సర్వేలెన్స్ కెమేరా, థర్మల్ ఇమేజింగ్ పరికరాలతో పాటు పలు పేలోడ్ కాన్ఫిగరేషన్లతో దీనిని అభివృద్ధి చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కన్నేయడానికి ఇది ఉపయుక్తంగా ఉంటుందని సంస్థ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు ప్రేమ్ కుమార్ విస్లావత్ పేర్కొన్నారు.

18.97 లక్షల షేర్లు విక్రయించిన 'అపోలో' సునీతారెడ్డి

● ఒక్కో షేరు ధర రూ.7,850

● లావాదేవీ విలువ రూ.1489 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ప్రమోటర్లలో ఒకరైన సునీతా రెడ్డి, బల్క్ డీల్ పద్ధతిలో స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా అపోలో హాస్పిటల్స్ షేర్లు 18,97,239 విక్రయించారు. ఒక్కో షేరును రూ.7,850 ధరకు విక్రయించినట్లు అపోలో హాస్పిటల్స్ వెల్లడించింది. ఈ విక్రయం వల్ల ఆమెకు దాదాపు రూ.1489 కోట్లు లభిస్తాయి. ఈ షేర్లు అపోలో హాస్పిటల్స్ మూలధనంలో 1.3 శాతానికి సమానం. ప్రమోటర్ల గ్రూపునకు ఉన్న రుణభారాన్ని తగ్గించుకోవడానికి ఈ నిధులు కేటాయిస్తారు. సమీప భవిష్యత్తులో షేర్లు విక్రయించే ఆలోచన లేదని ప్రమోటర్ల గ్రూపు ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

కోడి గుడ్లు

23న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	535
గోదావరి	525
విశాఖపట్నం	525
చిత్తూరు	558

రియల్ మనీ గేమ్‌ల నిలిపివేత

ఆన్‌లైన్ గేమింగ్ చట్టం అమల్లోకి వచ్చిన ఫలితం



దిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదం లభించినందున.. చట్టంగా మారింది. ఇందులో ఏ క్లాజులు ముందుగా అమల్లోకి తెస్తారనే విషయాలపై ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్ స్పష్టతనిచ్చారు. 'ప్రతిపాదిత నిబంధనలపై ఐటీ శాఖ పనిచేస్తోంది. ఇస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషియల్ గేమ్స్ ప్రోత్సాహం, నియంత్రణ విషయంలో ఒక వ్యవస్థను తీసుకొస్తారు. అదే సమయంలో ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్-2025లో పేర్కొన్న నియంత్రణ సంస్థను ఏర్పాటు చేస్తార'ని కృష్ణన్ వివరించారు. ఈ చట్టం ద్వారా దేశంలో అన్నిరకాల ఆన్‌లైన్ మనీ గేమ్స్‌పై నిషేధం విధించగా, ఇప్పటికే సంస్థలు రియల్ మనీ గేమ్‌లను నిలిపివేశాయి. అదే సమయంలో ఇ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషియల్ గేమింగ్‌ను ప్రోత్సహించడానికీ ఈ బిల్లును తీసుకొచ్చారు. 'సొంతంగా నిలబడగలిగే చట్టం కాదిది. బిల్లులోని ఇతర సెక్షన్లకు ముందే 'నిషేధా'న్ని అమల్లోకి తీసుకొచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్న'ట్లు తెలిపారు. ఎందుకంటే ఆ విషయానికి సంబంధించిన నిర్దిష్ట నిబంధనలేమీ అందులో లేవన్నారు.

నజారా షేరు 3 రోజుల్లో 17.52% పతనం

నజారా టెక్నాలజీస్ షేర్ల పతనం కొనసాగుతోంది. మూడు రోజుల్లో ఇవి 17.52% మేర విలువను కోల్పోయాయి. ఈ కంపెనీకి చెందిన అసోసియేట్ సంస్థ మూన్‌షైన్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న 'పోకర్‌బాజీ' తన రియల్ మనీ ఆన్‌లైన్ గేమ్స్‌ను నిలిపేయడం ఇందుకు నేపథ్యం. అన్ని రకాల ఆన్‌లైన్ మనీ గేమ్స్‌పై నిషేధం విధిస్తూ గురువారం పార్లమెంటు ఒక బిల్లుకు ఆమోదం తెలిపిన అనంతరం ఈ పరిణామం చోటు చేసుకుంది. 'ఆగస్టు 21, 2025న పార్లమెంటు ఆమోదించిన ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్, 2025 నేపథ్యంలో రియల్ మనీ గేమింగ్ కార్యకలాపాలను నిలిపేస్తున్న'ట్లు మూన్‌షైన్ టెక్నాలజీస్ ఒక ప్రకటనలో తెలిపింది. నజారాకు ఈ కంపెనీలో 46.07% వాటా ఉంది.

ఇవి కూడా: రమ్మీ, ఫాంటసీ క్రికెట్, పోకర్ వంటి 100కు పైగా రియల్ మనీ గేమ్స్ ఉన్న విన్‌జో కూడా తన గేమ్స్‌ను నిలిపివేసింది. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికాల్లో 12 కోట్ల మంది వినియోగదార్లున్న మొబైల్ ప్రీమియర్ లీగ్(ఎమ్‌పీఎల్) సైతం భారత్‌లో తన గేమ్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టింది. జుపీ కూడా అన్ని పెయిడ్ గేమ్స్‌ను ఆపేసింది.

✦ ఇండియా గేమింగ్ రిపోర్ట్-2025 ప్రకారం, ప్రపంచ గేమింగ్ వినియోగదార్లలో భారత్‌కు 20% వాటా ఉంది.

✦ దేశీయ గేమింగ్ రంగం విలువ 2024లో 3.7 బి. డాలర్లు(దాదాపు రూ.32,000 కోట్లు)గా ఉంది. 2029 నాటికి 9.1 బి. డాలర్లకు చేరొచ్చని అంచనా.

శుక్రవారం నజారా షేరు 4.13% నష్టపోయి రూ.1,155.75 వద్ద స్థిరపడింది. గత 3 రోజుల్లో ఈ నష్టం 17.52%. డెల్టా కార్ప్(3.5%), ఆన్‌మొబైల్ గ్లోబల్ (2.73%) షేర్లు కూడా శుక్రవారం నష్టపోయాయి.

టోల్‌ప్లాజా ఆపరేటర్లకు పరిహారం

ఫాస్టాగ్ వార్షిక పాస్ నేపథ్యం

దిల్లీ: జాతీయ రహదారుల టోల్ ప్లాజా ఆపరేటర్లకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) 3 నెలల పరిహారం ఇవ్వనుంది. ప్రైవేటు వాణిజ్యేతర వాహనాలకు ఆగస్టు 15 నుంచి అమల్లోకి వచ్చిన ఫాస్టాగ్ వార్షిక పాస్ కారణంగా వినియోగదారు ఫీజు వసూళ్లలో వచ్చిన అంతరాన్ని పూడ్చనుంది. ఆ మేరకు ఒక ఏకరూప పరిహార వ్యవస్థ తీసుకురావాలని నిర్ణయించినట్లు ఒక సర్క్యులర్‌లో ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. 2024-25లో టోల్ ద్వారా రూ.72,931 కోట్లను ఎన్‌హెచ్ఏఐ వసూలు చేసింది. 'ఈ మెకానిజం ప్రస్తుత కాంట్రాక్ట్ ఒప్పందాలతో పాటు, వచ్చే 3 నెలల్లో ఆహ్వానించే బిడ్లకూ వర్తిస్తుంది. 3 నెలల తర్వాత అంటే ప్రతి టోల్ ప్లాజా వద్ద వార్షిక పాస్ వినియోగం అందుబాటులోకి వచ్చాక, బిడ్డర్లకు వార్షిక పాస్ గణాంకాలను బిడ్ పత్రాల్లో తెలుపుతాం. ఆ మేరకు బిడ్ వేయాల్సి ఉంటుంది. అపుడు పరిహారం ఉండద'ని ఆ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.

✦ ఫాస్టాగ్ వార్షిక పాస్ కింద రూ.3,000ను ఒకేసారి కట్టడం ద్వారా ఏడాదిలో జాతీయ రహదారులపై 200 టోల్‌ప్లాజాల పరిధిలో, ఒక్కోదానికి రూ.15 మాత్రమే అవుతుంది.

ఎంపీసీ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఇంద్రనీల్ భట్టాచార్య



లఖ్‌నవూ: ప్రస్తుత అంతర్జాతీయ, దేశీయ ఆర్థిక వ్యవస్థల స్థితిపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మదింపు చేసింది. భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఆర్థిక మార్కెట్ల పరిణామాలు, సంబంధిత సవాళ్లపైనా చర్చించింది. శుక్రవారం ఆర్‌బీఐ గవర్నరు సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో ఆర్‌బీఐ 618వ సెంట్రల్ బోర్డ్ డైరెక్టర్ల సమావేశం జరిగింది. ఆర్‌బీఐకి చెందిన కొన్ని కేంద్ర కార్యాలయ విభాగాలు, సెంట్రల్ బోర్డు కమిటీల పనితీరు, అంబుడ్స్‌మన్ పథకంపైనా ఈ సమావేశంలో సమీక్ష జరిపారు. పరపతి విధాన కమిటీ (ఎంపీసీ)కి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంద్రనీల్ భట్టాచార్యను నామినేట్ చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో బ్యాంక్ డిప్యూటీ గవర్నర్లు ఎం రాజేశ్వర్ రావు, టి రవి శంకర్, స్వామినాథన్, పూనమ్ గుప్తాతో పాటు ఇతర బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

1.4 బి.డాలర్లు పెరిగిన ఫారెక్స్ నిల్వలు

ముంబయి: మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు ఆగస్టు 15తో ముగిసిన వారానికి 1.488 బి.డాలర్లు (దాదాపు రూ.13,000 కోట్లు) పెరిగి 695.106 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.60.47 లక్షల కోట్ల)కు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 4.747 బి.డాలర్లు అధికమై 693.618 బి.డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 1.924 బి.డాలర్లు పెరిగి 585.903 బి.డాలర్లుగా నమోదయ్యాయి.

ఆదాయపు పన్ను చట్టం-2025ను ఆమోదించిన రాష్ట్రపతి



వచ్చే ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి

దిల్లీ: ఆదాయపు పన్ను చట్టం-2025కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో ఆదాయపు పన్ను చట్టం-1961ని ఇది భర్తీ చేయనుంది. ఆదాయపు పన్ను చట్టం-2025 వచ్చే ఆర్థిక సంవత్సరం అంటే, 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఇది పన్ను చట్టాలను మరింత సులభతరం చేయనుంది. 'ఆదాయపు పన్ను చట్టం-2025 రాష్ట్రపతి ఆమోదం పొందింది. సరళమైన, పారదర్శకమైన, అనుకూలమైన ప్రత్యక్ష పన్ను విధానాన్ని ఇది తీసుకురానుంది' అని ఆదాయపు పన్ను విభాగం 'ఎక్స్' వేదికగా తెలిపింది. ఆదాయపు పన్ను-2025 బిల్లును ఈ నెల 12న పార్లమెంటు ఆమోదించింది. సంక్లిష్టమైన పన్ను చట్టాలను సులభంగా అర్థం చేసుకునేందుకు సరళమైన భాషలో దీన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. అనవసర నిబంధనలనూ తొలగించింది. 1961 నాటి చట్టంలోని 819 సెక్షన్ల సంఖ్యను 536కు, 47 అధ్యాయాలను 23కు తగ్గించింది. పదాల సంఖ్యా 5.12 లక్షల నుంచి 2.6 లక్షలకు తగ్గింది. స్పష్టత పెంచేందుకు కొత్తగా 39 పట్టికలు, 40 సూత్రాలూ ఇందులో ఉన్నాయి.

పుణె-సతారా టోల్ రోడ్డు ప్రాజెక్టు రూ.2000 కోట్లకు విక్రయం

ముంబయి: పుణె-సతారా టోల్ రోడ్డు ప్రాజెక్టును విక్రయించడానికి రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సిద్ధమైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్ట్‌ను నిర్వహించే స్పెషల్ పర్పస్ వెహికల్ పీఎస్ టోల్ రోడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100% వాటాను సింగపూర్‌కు చెందిన క్యూబ్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 3 పీటీఈ రూ.2000 కోట్లకు కొనుగోలు చేయనుందని తెలిపాయి.

బజాజ్ విద్యుత్ చేతక్ సరఫరాల పునరుద్ధరణ



దిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని విక్రయశాలల్లో విద్యుత్ స్కూటర్ 'చేతక్' సరఫరాలను పునరుద్ధరించినట్లు బజాజ్ ఆటో శుక్రవారం వెల్లడించింది. అంతర్జాతీయంగా అరుదైన భూఅయస్కాంతాల కొరత కారణంగా, ఈ స్కూటర్ల తయారీలో తలెత్తిన ఇబ్బందులను అధిగమించినట్లు తెలిపింది. కొన్ని వారాలుగా.. భూఅయస్కాంతాల కొరత వల్ల డెలివరీలు నెమ్మదించాయని, చేతక్‌కు ఉన్న గిరాకీ కారణంగా తాము మరింత ఇబ్బంది పడినట్లు కంపెనీ వివరించింది. స్కూటర్ల ఉత్పత్తి, సరఫరాలను ఈనెల 20న మళ్లీ ప్రారంభించామని, అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తి సామర్థ్యానికి చేరామని పేర్కొంది. రాబోయే పండగల సీజన్‌లో అవసరమైన ఉత్పత్తి కోసం సరిపడా అరుదైన భూఅయస్కాంతాలను దక్కించుకున్నామని బజాజ్ ఆటో తెలిపింది.

హెచ్ఎంటీ వాచెస్ పునరుజ్జీవంపై దృష్టి

దిల్లీ: హెచ్ఎంటీ వాచెస్ సంస్థ పనితీరును సమీక్షించి, భవిష్యత్ ప్రణాళికపై కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి శుక్రవారం చర్చించారు. ఈ దేశీయ వాచ్ బ్రాండు వారసత్వాన్ని పరిరక్షించే ఉద్దేశంలో భాగంగా, సంస్థ కార్యకలాపాలను బలోపేతం చేయడంపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో భారీ పరిశ్రమల శాఖ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన హెచ్ఎంటీ లిమిటెడ్.. భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ నియంత్రణ కిందకు వస్తుంది. ఈ సంస్థకు ఔరంగబాద్‌లో ఆహార ఉత్పత్తులను ప్రాసెస్ చేసే కేంద్రం ఉండగా.. బెంగళూరులో గడియారాల అసెంబ్లింగ్ విక్రయాలను నిర్వహించేందుకు అనుబంధ వ్యాపార విభాగం ఉంది.

గరిష్ఠాల్లో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ ▼694 81307 | నిఫ్టీ ▼214 24870

సమీక్ష



ఆరు రోజుల సూచీల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. ట్రంప్ టారిఫ్‌ల కారణంగా పెరిగిన అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగానికి ముందు మదుపర్లు అప్రమత్తత పాటించడం సూచీల నష్టాలకు కారణమైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లలో మదుపర్లు లాభాలు స్వీకరించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 27 పైసలు తగ్గి 87.52 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.24% నష్టంతో 67.52 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ శుక్రవారం రూ.2.62 లక్షల కోట్లు తగ్గి రూ.453.65 లక్షల కోట్లు (5.19 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 49 పాయింట్ల (క్రితం ముగింపు 82,000.71) నష్టంతో 81,951.48 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ, ఒకదశలో 81,291.77 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడింది. చివరకు 693.86 పాయింట్ల నష్టంతో 81,306.85 వద్ద ముగిసింది. నిఫ్టీ 213.65 పాయింట్లు కోల్పోయి 24,870.10 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,859.15- 25,084.85 పాయింట్ల మధ్య కదలాడింది. వారం ప్రాతిపదికన చూస్తే.. సెన్సెక్స్ 709.19 పాయింట్లు, నిఫ్టీ 238.8 పాయింట్లు చొప్పున లాభాలు నమోదుచేశాయి.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 24 నష్టపోయాయి. ఏషియన్ పెయింట్స్ 2.44%, అల్ట్రాటెక్ 1.94%, ఐటీసీ 1.84%, టాటా స్టీల్ 1.83%, హెచ్‌సీఎల్ టెక్ 1.77%, కోటక్ బ్యాంక్ 1.68%, అదానీ పోర్ట్స్ 1.55%, టీసీఎస్ 1.53%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.28%, టెక్ మహీంద్రా 1.21% డీలాపడ్డాయి. ఎం అండ్ ఎం, మారుతీ, సన్ ఫార్మా, బీఈఎల్ 0.79% వరకు లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. లోహ 1.27%, కమొడిటీస్ 1.08%, బ్యాంకింగ్ 1.06%, ఆర్థిక సేవలు 0.84%, చమురు-గ్యాస్ 0.80%, ఫోకస్డ్ ఐటీ 0.77%, ఐటీ 0.77% పడ్డాయి. ఆరోగ్య సంరక్షణ, టెలికాం, యంత్ర పరికరాలు రాణించాయి. బీఎస్ఈలో 2322 షేర్లు నష్టపోగా, 1757 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 175 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

వచ్చే వారం 2 ఐపీఓలు

✦ గ్లోబ్‌టైర్ ఇన్ఫోటెక్ రూ.31 కోట్ల ఐపీఓ ఈనెల 25న ప్రారంభమై 28న ముగియనుంది. ఒక్కో షేరు ధరను రూ.72గా నిర్ణయించారు. ఐపీఓ అనంతరం కంపెనీ షేర్లు బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై నమోదుకానున్నాయి.

✦ స్నేహ ఆర్గానిక్స్ రూ.32.68 కోట్ల ఎస్ఎంఈ ఐపీఓ ఈనెల 29న ప్రారంభమై సెప్టెంబరు 2న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.115-122 నిర్ణయించారు. కంపెనీ షేర్లు ఎన్ఎస్ఈ ఎస్ఎమ్ఈపై నమోదుకానున్నాయి.

పసిడి విలువలో 90% వరకు రుణం

ముంబయి: ఎస్ఐబీ గోల్డ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో కొత్త పసిడి రుణ పథకాన్ని సౌత్ ఇండియన్ బ్యాంక్ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా పసిడి విలువలో 90% వరకు రుణంగా పొందొచ్చు. మూడేళ్ల వరకు కాలవ్యవధితో రూ.25000 నుంచి రూ.25 లక్షల వరకు ఈ రుణాలను బ్యాంక్ ఇవ్వనుంది. చిన్న వ్యాపారులు, ఎంఎస్ఎంఈలను దృష్టిలో పెట్టుకుని ఈ పథకాన్ని ప్రారంభించినట్లు బ్యాంక్ వివరించింది.

క్షీణించిన జర్మనీ ఆర్థిక వ్యవస్థ

బెర్లిన్: ఈ ఏడాది రెండో త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో జర్మనీ ఆర్థిక వ్యవస్థ వృద్ధి 0.3% క్షీణించింది. అమెరికా టారిఫ్‌ల భయాలు తగ్గడంతో వృద్ధిరేటు -0.1 శాతంగా నమోదు కావచ్చని అంచనా వేశారు. అయితే అంతకంటే తక్కువగానే నమోదైంది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో జర్మనీ వృద్ధి 0.3 శాతంగా ఉంది.

ఆత్మవిశ్వాసంతో ఉద్యోగ విజయం! జాబ్ స్కిల్స్



ఖాళీలు తక్కువ, అభ్యర్థులు ఎక్కువ. పోటీపడి ఉద్యోగాన్ని గెలుచుకోవాలి. అర్హతలు, పరిజ్ఞానం, నైపుణ్యాలున్నా ఎందరో వెనుదిరగాల్సి వస్తోంది. విఫలమైనవారిలో కొన్ని ఉమ్మడి లోపాలు కనిపిస్తున్నాయి. వారు తగిన ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించలేకపోతున్నారు. విభిన్న పరిస్థితుల్లో అభ్యర్థులు స్పందించే తీరు ముఖ్యమని, విషయజ్ఞానం తక్కువైనా ఇబ్బంది లేదని నిపుణులు చెబుతున్నారు. ఆత్మవిశ్వాసం ఉన్నవాళ్లకే అవకాశాలు అందుతున్నాయి. దానిని మెరుగుపరుచుకునే మెలకువలను తెలుసుకోడానికి **క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.**

కరెంట్ అఫైర్స్



■ ఏ దేశ పర్యటన సందర్భంగా 2025, జూన్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్-III' ను ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టో డౌలిడెస్ ప్రదానం చేశారు? **జ:** సైప్రస్

మాదిరి ప్రశ్నలు

■ 'వరల్డ్ బ్లడ్ డోనర్ డే' ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? ('గివ్ బ్లడ్, గివ్ హోప్' అనే థీమ్‌తో 2025లో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. 2004 నుంచి ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్కులు రక్తదానం చేయవచ్చు.) **జ:** జూన్ 14

■ ఏ రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి ఇటీవల ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) 109.97 మిలియన్ డాలర్ల రుణాన్ని ప్రకటించింది? (ఈ రాష్ట్రంలోని 'కౌసల్య: ది స్కిల్ యూనివర్సిటీ' భాగస్వామ్యంతో ఏడీబీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.) **జ:** గుజరాత్

మరింత సమాచారం

జనరల్ స్టడీస్ – రీజనింగ్

కూర్చున్న పద్ధతిని కాస్త కనిపెడితే..!



సభలు, సమావేశాలను నిర్వహించేటప్పుడు వేదికపై ఎవరెవరిని ఎలా కూర్చోబెట్టాలి, ఎవరి పక్కన ఎవరు ఉండాలి అని లెక్కలేస్తుంటారు. అదే విధంగా ఒక కార్యాలయంలోని ఉద్యోగులకు సీట్లు సమకూర్చాలంటే, వివిధ విభాగాల మధ్య ఉండే సమన్వయాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయిస్తారు. ఇలాంటి సందర్భాల్లో అభ్యర్థుల తార్కిక ఆలోచనా సామర్థ్యాలను అంచనా వేయడానికి రీజనింగ్‌లో 'సీటింగ్ అరేంజ్‌మెంట్' అధ్యాయం నుంచి ప్రశ్నలు అడుగుతారు. అందులో కొన్ని నియమాలతో కూడిన సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. నిర్దిష్ట సమూహంలోని వ్యక్తులు లేదా వస్తువులను రకరకాల ఆకారాల్లో అమర్చినప్పుడు ఎలా కూర్చున్నారో లేదా ఎక్కడ పెట్టారో తెలుసుకోవాలి. ఇందుకోసం వృత్తం, సరళరేఖ తదితర రేఖాగణిత ఆకృతులపై అవగాహన పెంచుకోవాలి. కుడి, ఎడమ, వెంటనే కుడి, వెంటనే ఎడమ, వ్యతిరేక తదితర పదాలను స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

సీటింగ్ అరేంజ్‌మెంట్

సీటింగ్ అరేంజ్‌మెంట్ అనేది వెర్బల్ రీజనింగ్‌కు సంబంధించిన 'దిశలు' అనే అధ్యాయానికి అనువర్తనం. ప్రశ్నలో ఇచ్చిన నియమాల ఆధారంగా వ్యక్తులు, వస్తువులను అమర్చాల్సి ఉంటుంది. ఈ అమరిక సాధారణంగా రేఖీయంగా, వృత్తాకారంగా లేదా ఇతర రకాలుగా ఉంటుంది. సాధారణంగా ప్రశ్నలోని నియమాలను పరిగణించే క్రమంలో, వీటిని వరుసలో పాటించాల్సిన అవసరం లేదు. ఒకవేళ వస్తువులు, వ్యక్తులను వృత్తాకారంగా అమర్చే సందర్భంలో ప్రశ్నలో చెప్పనంత వరకు కేంద్రం వైపుగా ముఖం పెట్టి ఉన్నారని భావించవచ్చు.

ప్రశ్నలకు సమాధానాలు గుర్తించే క్రమంలో కింది అంశాలు ఉపయోగపడతాయి.

1. A అనే వ్యక్తి కుడివైపు చివరన ఉన్నాడు.

L ├──────┤ R
A

2. A అనే వ్యక్తి, B అనే వ్యక్తికి వెంటనే ఎడమ పక్కన ఉన్నాడు.

•──┼─┼──•
A B

3. P అనే వ్యక్తి Q, R ల మధ్య ఉన్నాడు.


•─┼─┼─┼─• లేదా •─┼─┼─┼─•
Q P R R P Q

4. వ్యక్తులు రెండు వరుసల్లో కూర్చున్నప్పుడు A అనే వ్యక్తి B అనే వ్యక్తికి కర్ణమూలంగా చివరన ఉన్నాడు.


•────• A/B
B/A •────•
లేదా
A/B •────•
•────• B/A


5. వృత్తాకార అమరికలో ముందుగా ఒక వ్యక్తిని లేదా వస్తువును అమర్చి, దానికి అనుగుణంగా మిగతా వ్యక్తులను లేదా వస్తువులను అమర్చాల్సి ఉంటుంది.

6. వృత్తాకార అమరికలో వ్యక్తులు ఎదురెదురుగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన క్రమం.



7. 8 మంది వ్యక్తులను ఒక దీర్ఘ చతురస్రాకార బల్ల చుట్టూ అమర్చే విధానం.







మాదిరి ప్రశ్నలు

1. 6 మంది స్నేహితులు A, B, C, D, E, F లు ఒక వరుసలో కూర్చున్నారు. B అనే వ్యక్తి A నకు కుడివైపున, D నకు ఎడమవైపున ఉన్నాడు. E అనే వ్యక్తి C నకు కుడివైపున, F నకు ఎడమవైపున ఉన్నాడు. అయితే ఈ వరుసలో కుడి వైపు చివరన ఎవరు ఉన్నారు?

1) B 2) C 3) F 4) E

వివరణ: B స్థానం = A B D, E స్థానం = C E F

పై అమరికను కలిపి రాయగా

A B D C E F

లేదా

C E F A B D **జ: 3**

2. W, X, Y, Z, P, Q అనే 6 పుస్తకాలను ఒక షెల్ఫ్‌లో అమర్చారు. Z అనే పుస్తకం W నకు వెనువెంటనే ఎడమవైపు ఉంది. X అనే పుస్తకం Y, Q ల మధ్య ఉంది. P పుస్తకం Q నకు ఎడమవైపున ఉంది కానీ, Z పక్కన కాదు. అయితే ఈ పుస్తకాల అమరిక ఎడమ నుంచి కుడి వైపునకు వరుసగా?

1) P, Y, X, Q, Z, W
2) P, Q, X, Y, Z, W
3) P, X, Z, W, Y, Q
4) P, Q, X, Y, W, Z



వివరణ: Z స్థానం = Z W

X స్థానం = Y X Q లేదా Q X Y

P స్థానం = P Q

పై అమరికలను కలిపి రాయగా

P Q X Y Z W **జ: 2**

3. A, B, C, D, E, F అనే 6 మంది స్నేహితులు ప్రతి వరుసలో ముగ్గురు చొప్పున రెండు వరుసల్లో కూర్చున్నారు. E అనే వ్యక్తి ఏ వరుసలోనూ చివరన లేడు. D అనే వ్యక్తి F నకు ఎడమవైపు, రెండో స్థానంలో ఉన్నాడు. C అనే వ్యక్తి E పక్కన, D నకు కర్ణమూలంగా ఉన్నాడు. B, D లు పక్క పక్కన ఉన్నారు. అయితే ఈ అమరికలో B నకు ఎదురుగా ఎవరు ఉన్నారు?

1) F 2) C 3) D 4) E

వివరణ: D స్థానం = • D • F

C స్థానం = C E • లేదా • E C

B స్థానం = B D • లేదా • D B

పై అమరికలను కలిపి రాయగా

A E C
F B D

(లేదా)

D B F
C E A

∴ B నకు ఎదురుగా E ఉన్నాడు. **జ: 4**



(4 - 6): S, T, U, V, W, X, Y, Z అనే 8 మంది ఒక భవనంలోని 8 ఫ్లోర్‌లలో నివసిస్తున్నారు. ఈ ఫ్లోర్‌లలో గ్రౌండ్‌ఫ్లోర్‌ని 1గా, అపై ఫ్లోర్‌లను 2, 3, ...8 లుగా గుర్తించారు. X అనే వ్యక్తి బేసిసంఖ్య ఫ్లోర్‌లో నివసిస్తున్నాడు కానీ, అది 3 కాదు. Z అనే వ్యక్తి X కింద ఫ్లోర్‌లో ఉన్నాడు. Z, Y ల మధ్య ఇద్దరి కంటే ఎక్కువ మంది నివసిస్తున్నారు. S, Y ల మధ్య 6 మంది నివసిస్తున్నారు. V అనే వ్యక్తి W పై ఫ్లోర్‌లో, T కింది ఫ్లోర్‌లో ఉన్నాడు. U అనే వ్యక్తి X పైన నివసించడు. W అనే వ్యక్తి Y ఫ్లోర్‌కు వెనువెంటనే పై వరుసలో నివసించడు.

4. 5వ ఫ్లోర్‌లో ఎవరు నివసిస్తున్నారు?

1) U 2) S 3) Z 4) T

5. W, X ల మధ్య ఎంతమంది ఉన్నారు?

1) 1 2) 3 3) 5 4) 2

6. V నకు వెనువెంటనే పై వరుసలో ఎవరు ఉన్నారు?

1) Z 2) T 3) Y 4) W

ప్రశ్నలో ఇచ్చిన నియమాల ఆధారంగా అమరిక కింది విధంగా ఉంటుంది.

ఫ్లోర్	వ్యక్తి
8	S
7	X
6	Z
5	T
4	V
3	W
2	U
1	Y



4. 5వ ఫ్లోర్‌లో T ఉన్నాడు. **జ: 4**


5. W, X ల మధ్య ముగ్గురు ఉన్నారు. **జ: 2**

6. V నకు వెనువెంటనే పై వరుసలో T ఉన్నాడు. **జ: 2**

7. అభినవ్, అలోక్, అంకుర్, అపూర్వ, అభిషేక్ అనే 5 మంది స్నేహితులు ఒక వృత్తాకార వలయం చుట్టూ కేంద్రం వైపు ముఖం పెట్టి కూర్చున్నారు. అభినవ్.. అలోక్, అంకుర్‌ల మధ్య ఉన్నాడు. అపూర్వ.. అభిషేక్‌కు ఎడమ వైపున ఉంది. అలోక్.. అపూర్వకు ఎడమ వైపున ఉన్నాడు. అయితే అభినవ్‌కు కుడివైపున ఎవరు ఉన్నారు?

1) అలోక్ 2) అంకుర్
3) అపూర్వ 4) అభిషేక్

వివరణ:




∴ అభినవ్‌కు కుడి వైపున అలోక్ ఉన్నాడు. **జ: 1**



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

దరఖాస్తు చేశారా?



☛ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో 3,588 ఉద్యోగాలు
చివరి తేదీ: 2025 ఆగస్టు 23

☛ రైట్స్ లిమిటెడ్‌లో సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు
చివరి తేదీ: 2025 ఆగస్టు 23

సిక్కింలో బౌద్ధులు.. మహారాష్ట్రలో జైనులు!

భారతదేశం - జనాభా

ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశం భారత్. ప్రస్తుతం పెరుగుదల రేటు తగ్గుతున్నప్పటికీ జనాభా పరిమాణం అంతకంతకు అధికమవుతూనే ఉంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులతోపాటు పురోగతినీ జనాభా ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది. దేశంలో జనాభా తీరు, వృద్ధిరేటు ధోరణులు, జనసాంద్రత తదితర లెక్కల వివరాలన్నీ పోటీ పరీక్షార్థులకు తెలియాలి. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా గణాంకాలు, ఎస్సీ, ఎస్టీ జనాభా; మతాలు, సామాజిక వర్గాల ప్రకారం లింగనిష్పత్తి, అక్షరాస్యత, నిర్దిష్ట ప్రాంతాల్లో నివసిస్తున్న షెడ్యూల్డ్ తెగల పేర్లను గుర్తుంచుకోవాలి.



1. కింది వాక్యాలను సరిచూడండి.



లార్డ్ మేయో

ఎ) భారతదేశంలో మొదటిసారిగా లార్డ్ మేయో హయాంలో 1872లో జనాభా వివరాలు సేకరించారు.
బి) లార్డ్ రిప్పన్ పరిపాలనా కాలం 1881 నుంచి జనాభా వివరాలు శాస్త్రీయంగా సేకరిస్తున్నారు.
సి) జులై 11 ప్రపంచ జనాభా దినోత్సవంగా నిర్వహిస్తారు.
డి) జనాభా అధ్యయనాన్ని 'డెమోగ్రఫీ' అంటారు.
1) ఎ, బి, సి, డి లు సరైనవి.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

2. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) జనసాంద్రత అధికంగా ఉన్న 2వ రాష్ట్రం	1) అండమాన్ నికోబార్ దీవులు
బి) జనసాంద్రత అధికంగా ఉన్న 2వ కేంద్రపాలిత ప్రాంతం	2) అరుణాచల్‌ప్రదేశ్
సి) జనసాంద్రత తక్కువ ఉన్న రాష్ట్రం	3) చండీగఢ్
డి) జనసాంద్రత తక్కువ ఉన్న కేంద్రపాలిత ప్రాంతం	4) పశ్చిమ బెంగాల్

1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-3, బి-4, సి-2, డి-1
4) ఎ-2, బి-1, సి-3, డి-4

3. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) క్రైస్తవులు అధికంగా ఉన్న రాష్ట్రం నాగాలాండ్.
బి) బౌద్ధులు అధికంగా ఉన్న రాష్ట్రం సిక్కిం.
సి) జైనులు అధికంగా మహారాష్ట్రలో ఉన్నారు.
డి) హిందువులు అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్.
1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి లు సరైనవి.
3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

4. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) తమిళనాడు	1) బైగా
బి) కేరళ	2) కురుబ
సి) కర్ణాటక	3) తోడ
డి) ఝార్ఖండ్	4) పళ్లియార్

1) ఎ-3, బి-4, సి-2, డి-1
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4
4) ఎ-1, బి-4, సి-2, డి-3



5. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) మన దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ తెగలు అధికంగా ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్.
బి) షెడ్యూల్డ్ తెగల జనాభా శాతం అత్యల్పంగా ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్.
సి) 2011 నాటికి మన దేశంలో షెడ్యూల్డ్ తెగల జనాభా శాతం 8.6.
డి) 2011 నాటికి షెడ్యూల్డ్ తెగల్లో అక్షరాస్యుల శాతం 58.96.
1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
2) ఎ, బి, సి, డి లు సరైనవి.
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

6. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) అక్షరాస్యత అధికంగా ఉన్న 2వ రాష్ట్రం	1) కేరళ
బి) అక్షరాస్యత అత్యల్పంగా ఉన్న 2వ రాష్ట్రం	2) లక్షద్వీప్
సి) అక్షరాస్యత అధికంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతం	3) మిజోరాం
డి) మహిళల అక్షరాస్యత అధికంగా ఉన్న రాష్ట్రం	4) అరుణాచల్‌ప్రదేశ్

1) ఎ-4, బి-3, సి-2, డి-1
2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4
4) ఎ-1, బి-4, సి-3, డి-2

7. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) ఆఫ్రికా నుంచి అరేబియా మీదుగా మన దేశానికి వచ్చినవారు నీగ్రిటోలు.
బి) పశ్చిమ ఆసియా నుంచి మన దేశానికి వచ్చినవారు ప్రోటో ఆస్ట్రలాయిడ్‌లు.

ఇండియన్ జాగ్రఫీ



నీగ్రిటో

సి) మన దేశానికి వచ్చి స్థిరపడిన వారిలో చివరివారు మంగోలాయిడ్లు.
డి) ఇరాన్ నుంచి మన దేశానికి వచ్చినవారు నార్డిక్‌లు.
1) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
2) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.
3) ఎ, బి, సి, డి లు సరైనవి.
4) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.

8. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) లింగ నిష్పత్తి అధికంగా ఉన్న రాష్ట్రం కేరళ.
బి) లింగ నిష్పత్తి అత్యల్పంగా ఉన్న రాష్ట్రం హరియాణా.
సి) లింగ నిష్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి.
డి) లింగ నిష్పత్తి అత్యల్పంగా నమోదైన దశాబ్దం 1991.
1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి లు సరైనవి.
3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.



4) ఎ, సి లు సరైనవి; బి, డి లు సరికావు.

9. కింది వాటిని జతపరచండి.

రాష్ట్రం	షెడ్యూల్డ్ తెగ
ఎ) సిక్కిం	1) చక్మ
బి) అస్సాం	2) గరాసియ
సి) రాజస్థాన్	3) తయాంగ్
డి) త్రిపుర	4) లలాంగ్

1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2
4) ఎ-3, బి-4, సి-2, డి-1

10. కింది వాటిని జతపరచండి.

మతాలు	లింగ నిష్పత్తి
ఎ) హిందువులు	1) 954
బి) సిక్కులు	2) 965
సి) బౌద్ధులు	3) 903
డి) జైనులు	4) 939

1) ఎ-4, బి-3, సి-2, డి-1
2) ఎ-4, బి-1, సి-2, డి-3
3) ఎ-1, బి-4, సి-3, డి-2
4) ఎ-1, బి-2, సి-3, డి-4

11. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) ఎస్సీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్.
బి) ఎస్టీ జనాభా అత్యల్పంగా ఉన్న రాష్ట్రం గోవా.
సి) 2011 ప్రకారం మన దేశంలో ఎస్సీ జనాభా దాదాపుగా 20.14 కోట్లు.
డి) 2011 ప్రకారం మన దేశంలో ఎస్టీ జనాభా దాదాపుగా 10.43 కోట్లు.
1) ఎ, బి, సి, డి లు సరైనవి.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

12. కింది వాటిని జతపరచండి.

మతం	అక్షరాస్యత
ఎ) హిందువులు	1) 94.1 %
బి) బౌద్ధులు	2) 69.4%
సి) జైనులు	3) 65%
డి) సిక్కులు	4) 72.7%

1) ఎ-1, బి-4, సి-3, డి-2
2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-3, బి-4, సి-2, డి-1
4) ఎ-3, బి-4, సి-1, డి-2

13. కింది వాక్యాలను సరిచూడండి.
ఎ) బౌద్ధులు తక్కువగా ఉన్న రాష్ట్రం గోవా.
బి) ఎస్సీ జనాభా లేని రాష్ట్రాలు నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్.
సి) ఎస్టీ జనాభా లేని రాష్ట్రాలు పంజాబ్, హరియాణా.
డి) ఎస్సీల్లో స్త్రీ, పురుష నిష్పత్తి 945 గా ఉంది. ఎస్టీల్లో స్త్రీ, పురుష నిష్పత్తి 990.
1) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి లు సరైనవి.
3) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

14. కింది వాటిని జతపరచండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) పిల్లల లింగ నిష్పత్తి అధికంగా ఉన్న రాష్ట్రం	1) దిల్లీ
బి) పిల్లల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న రాష్ట్రం	2) అండమాన్ నికోబార్ దీవులు
సి) పిల్లల లింగ నిష్పత్తి అధికంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతం	3) హరియాణా
డి) పిల్లల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతం	4) అరుణాచల్‌ప్రదేశ్

1) ఎ-4, బి-3, సి-2, డి-1
2) ఎ-4, బి-1, సి-2, డి-3
3) ఎ-3, బి-4, సి-2, డి-1
4) ఎ-1, బి-2, సి-3, డి-4

15. జనాభా వృద్ధిరేటుకు సంబంధించి వాక్యాలను సరిచూడండి.
ఎ) 2001లో మన దేశంలో జనాభా వృద్ధిరేటు 21.54%
బి) 2011 లో మన దేశంలో జనాభా వృద్ధిరేటు 17.7%.
సి) 2001 - 2011 మధ్య ఉన్న వార్షిక వృద్ధిరేటు 1.64%.
డి) 1921లో రుణాత్మక వృద్ధిరేటు -0.31%
1) ఎ, బి, సి, డి లు సరైనవి.
2) ఎ, బి లు సరైనవి; సి, డి లు సరికావు
3) ఎ, బి, సి లు సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి లు సరైనవి; సి సరికాదు.

16. కింది వాటిని జతపరచండి. (2011 జనాభా లెక్కల ప్రకారం).

జాబితా – 1	జాబితా – 2
ఎ) గ్రామీణ మహిళా అక్షరాస్యులు	1) 15.24 కోట్లు
బి) పట్టణ మహిళా అక్షరాస్యులు	2) 28.13 కోట్లు
సి) గ్రామీణ పురుష అక్షరాస్యులు	3) 20.14 కోట్లు
డి) పట్టణ పురుష అక్షరాస్యులు	4) 12.74 కోట్లు

1) ఎ-3, బి-4, సి-2, డి-1
2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-1, బి-4, సి-3, డి-2
4) ఎ-4, బి-3, సి-2, డి-1



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-1; 2-2; 3-2; 4-1; 5-2; 6-2; 7-3; 8-2; 9-4; 10-1; 11-1; 12-4; 13-2; 14-1; 15-1; 16-4.

అహింస, శాంతి చర్చలు, నిరసనలతో స్వతంత్ర భారతాన్ని చూడలేమని నమ్మిన కొందరు జాతీయవాదులు విప్లవోద్యమం వైపు మొగ్గు చూపారు. ఆయుధాలను చేతబూని సమరశీల ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. భారతదేశం నుంచి బ్రిటిష్ వారిని తరిమికొట్టడమే ధ్యేయంగా పనిచేశారు. వీరిలో కొందరు స్వదేశంలో ఉండి ఉద్యమంలో పాల్గొంటే, మరికొందరు విదేశాల్లో ఉంటూ స్వేచ్ఛా భారతావని కోసం శ్రమించారు. పార్టీలు స్థాపించి, పత్రికలు నెలకొల్పి ఆంగ్లేయుల ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారు.

సమరశీల ఉద్యమం.. స్వదేశం కోసం పోరాటం!


ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
భారతదేశ చరిత్ర

భారత విప్లవోద్యమకారులు

వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ (1880 - 1937)

ఈయన ఒక ప్రముఖ భారతీయ విప్లవకారుడు. సరోజినీ నాయుడికి సోదరుడు. 1880లో హైదరాబాద్‌లో జన్మించారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇంగ్లండ్ వెళ్లాడు. అక్కడ వీర్‌సావర్కర్‌తో కలిసి అనేక విప్లవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనేక మంది విదేశీ విప్లవకారులతో సంబంధాలుండేవి. ఈయన బహుభాషా కోవిదుడు. తెలుగు, తమిళం, బెంగాలీ, ఉర్దూ, పర్షియన్, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో నిష్ణాతుడు. తర్వాత ఫ్రెంచ్, ఇటాలియన్, జర్మనీ, రష్యన్, స్కాండినేవియన్ భాషలను నేర్చుకున్నారు.

- మద్రాస్, కలకత్తా విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించారు.
- ఇంగ్లండ్‌లో 'తల్వార్' అనే విప్లవ పత్రికలో పనిచేశారు. ఆ పత్రిక అభ్యున్నతికి కృషి చేశారు.
- మేడం బికాజీ కామాతో కలిసి విప్లవ కార్యకలాపాలు కొనసాగించేవారు. 1919లో భారత విప్లవకారుల రహస్య సమావేశం కోసం బెర్లిన్‌లో ఏర్పాట్లు చేశారు.
- బెర్లిన్‌లో స్థాపించిన 'ఇండియా స్వాతంత్ర్య కమిటీ'కి కార్యదర్శిగా ఎన్నికయ్యారు.
- మాస్కోలో జరిగిన కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ మూడో కాంగ్రెస్‌కు చెందిన భారత కమిటీకి హాజరయ్యారు. 1921 డిసెంబరులో బెర్లిన్‌లో రాస్ బిహారీ బోస్‌తో కలిసి జపాన్‌లో 'ఇండియన్ న్యూస్ అండ్ ఇన్ఫర్మేషన్ బ్యూరో'ను ఏర్పాటు చేశారు.
- ఎం.ఎన్.రాయ్ సలహాతో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ జర్మనీలో చేరారు. స్వీడన్‌లో ప్రముఖ బోల్షివిక్ నాయకులను కలిసి, సామ్యవాద భావాల వైపు మొగ్గు చూపారు.
- 1937 జులైలో వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయను అరెస్ట్ చేసి, సెప్టెంబరులో ఉరితీశారు.



దర్శి చెంచయ్య (1890 - 1964)

ప్రకాశం జిల్లా కనిగిరిలో 1890 డిసెంబరు 28న జన్మించారు. ఈయనపై వీరేశలింగం ప్రభావం ఎక్కువ. బాల్యంలోనే మూఢనమ్మకాలను వ్యతిరేకించారు.

- ఒంగోలులో మెట్రిక్యులేషన్, చెన్నైలో బీఏ పూర్తి చేశారు. వ్యవసాయంపై మక్కువతో 1912లో అమెరికా వెళ్లి చదువుకుంటూనే గదర్ పార్టీలో వ్యవస్థాపక సభ్యుడిగా చేరారు.
- భారతదేశ స్వాతంత్ర్యం కోసం అమెరికా నుంచి ఆయుధాలతో ఓడలో బయలుదేరి కెనడాకు వెళ్లాడు. అక్కడి నుంచి ఫిలిప్పీన్స్, బ్యాంకాక్, జపాన్ తీరాల మీదుగా ప్రయాణిస్తూ బ్రిటిష్ వారికి చిక్కారు. బర్మా సరిహద్దులో తిరుగుబాటు దళాలకు సంధానకర్తగా వ్యవహరించారు. బ్రిటిష్ ప్రభుత్వం కాన్పూర్ కుట్ర కేసులో ఈయన్ను ఇరికించేందుకు విఫలయత్నం చేసింది. స్త్రీ విద్య వ్యాప్తికి, వేశ్యా వృత్తి నిర్మూలనకు కృషి చేసిన సంస్కరణవేత్తగా ఈయన పేరుపొందారు. 1964 డిసెంబరు 30న మరణించారు.

అరబిందో ఘోష్

విప్లవవాద జాతీయోద్యమంలో ప్రముఖులు అరబిందో ఘోష్. ఈయన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో చదివి, ఐసీఎస్ పరీక్ష ఉత్తీర్ణులయ్యారు. ఈ పదవిని తిరస్కరించి 1892లో భారతదేశానికి వచ్చారు.

- బొంబాయిలోని ఇందు ప్రకాశ్ పత్రికలో 'న్యూ ల్యాంప్స్ ఫర్ ఓల్డ్' అనే శీర్షికతో 1893 ఆగస్టు నుంచి 1894 మార్చి వరకు వ్యాసాలు రాశారు.
- వందేమాతరం పత్రికా నిర్వహణలో బిపిన్ చంద్రపాల్‌కి సహకరించారు. బెంగాల్ యుగాంతర్ అనే దినపత్రికను ప్రారంభించారు.
- బెంగాల్ జాతీయ కళాశాలను స్థాపించి, అనేక మందిని ప్రభావితం చేశారు. వీరంతా స్వదేశీ, విదేశాల్లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా విప్లవ కార్యకలాపాలు నిర్వహించారు.

చంపక్ రామన్ పిళ్లై (1891 - 1934)

ఈయన 1891 సెప్టెంబరు 15న కేరళలోని తిరువనంతపురంలో జన్మించారు. జై హింద్ నినాదాన్ని తొలిసారిగా ఇచ్చింది ఈయనే.

- జర్మనీలో స్థిర నివాసం ఏర్పర్చుకుని, ఆ దేశస్థుల సహాయంతో బ్రిటిష్ వారిని భారతదేశం నుంచి తరిమి కొట్టడమే లక్ష్యంగా పని చేశారు. కానీ విఫలమయ్యారు.
- మొదటి ప్రపంచ యుద్ధకాలంలో జర్మనీలో 'భారతీయ స్వచ్ఛంద సేవాదళాన్ని' ఏర్పాటు చేసి, ఐరోపాలో ఉన్న భారతీయ సైనికులను చేర్చుకునే ప్రయత్నం చేశారు.
- లాలా హర్‌దయాళ్, తారక్‌నాథ్‌దాస్, బర్కతుల్లాతో కలిసి బెర్లిన్‌లో భారత జాతీయ పార్టీని స్థాపించారు.
- 1915లో ఆఫ్ఘనిస్థాన్‌లో రాజమహేంద్ర ప్రతాప్ స్థాపించిన తాత్కాలిక భారత ప్రభుత్వంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు.
- రామన్ పిళ్లై వలస ప్రజల కోసం 'పీడిత జాతుల సంఘం' అనే ఒక వేదికను ఏర్పాటు చేశారు. ఈయన కేరళలో సామాజిక సంస్కరణల కోసం ప్రయత్నించారు.

జతిన్ ముఖర్జీ (1879 - 1915)

బెంగాల్‌లో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడానికి ప్రయత్నించిన వారిలో ప్రముఖుడు. యుగాంతర్ పార్టీకి చెందిన ప్రధాన నాయకుడు. బాఘ జతిన్‌గా పేరొందిన ఈయనను టైగర్ జతిన్ అని కూడా పిలుస్తారు.

- గ్రామీణ ప్రాంతాల్లో జాతీయవాదం వ్యాప్తి చేసేందుకు గ్రామ బోర్డులను ఏర్పాటు చేశాడు.
- ఇతడు ప్రసిద్ధ బోలానందగిరి అనే సన్యాసి శిష్యుడు.
- బరీంద్రకుమార్ ఘోష్‌తో కలిసి దియోఘర్‌లో బాంబు కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని బ్రిటిష్ అధికారులను శిక్షించడానికి ఉపయోగించేవారు.
- 'యుగాంతర్ రహస్య సమాజం' అనే సంఘానికి నాయకత్వం వహించారు.
- విదేశాల్లో కొన్ని విప్లవ కార్యక్రమాలు ఇతడి ఆధ్వర్యంలోని యుగాంతర్ ద్వారా నేరుగా జరిగేవి. ఈ కార్యక్రమాలకు జిడ్డు గోపాల ముఖర్జీ సహాయపడేవారు.
- విప్లవ బృందాలన్నింటినీ ఒక సంఘటిత పార్టీగా ఏర్పాటు చేశారు. విజయానికి ఆయుధ బలం అవసరమనే సిద్ధాంతాన్ని నమ్మారు.
- 1915 సెప్టెంబరు 10న బ్రిటిష్ పోలీసుల చేతిలో గాయపడి, ఒడిశాలోని బాలాసోర్‌లో మరణించారు.



రచయిత
డాక్టర్ వి. రాజ్‌మహ్మద్
అసోసియేట్ ప్రొఫెసర్

విప్లవ సంస్థలు

సంస్థ పేరు	స్థాపకులు	ప్రదేశం
మిత్రమేళా (1899) (1904లో అభినవ భారత్‌గా మార్పు)	సావర్కర్ సోదరులు (వి.డి.సావర్కర్, గణేష్ దామోదర్ సావర్కర్)	నాసిక్ (ఉత్తర్‌ప్రదేశ్)
అనుశీలన్ సమితి	సతీష్‌చంద్రబసు, ప్రమత్‌నాథ్ మిత్రా	కలకత్తా
హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్	సచ్చింద్రనాద్ సన్యాల్, నరేంద్రమోహన్ సేన్, ప్రతుల్ గంగూలీ	-
ఇండియన్ ఇండిపెండెంట్స్ లీగ్ (1928)	సుభాష్‌చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ, శ్రీనివాస్ అయ్యంగార్	-
ఇండియన్ ఇండిపెండెంట్స్ లీగ్ యూఎస్ఏ (1907)	తారక్‌నాథ్‌దాస్	కాలిఫోర్నియా
ఇండియన్ హోమ్‌రూల్ సొసైటీ	శ్యామ్‌జీ కృష్ణవర్మ, ఎస్.ఆర్.రాణా	లండన్
హిందుస్థాన్ రిపబ్లికన్ ఆర్మీ	రామ్‌ప్రసాద్ బిస్మిల్	-
గదర్ పార్టీ	లాలా హర్‌దయాళ్, సోహన్‌సింగ్ బక్నా, సంతోష్‌సింగ్	-

750 Word of the Day

Malady

Telugu meaning: రుగ్మత, అనారోగ్యం

English meaning: The word malady (మెలడీ) is a noun that refers to a serious problem or illness, especially one affecting a person or society.

Synonyms: Disease, Ailment

Antonyms: Cure, Remedy

Usage: **1.** Poverty is a social malady that continues to plague many developing countries.

2. The doctor diagnosed him with a rare malady that affected his nervous system.

కరెంట్ అఫైర్స్



మధ్యమ శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అయిన 'అగ్ని-5'ను భారత రక్షణ శాఖ 2025, ఆగస్టు 20న విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపుర్ పరీక్షా కేంద్రంలో ఈ ప్రయోగం జరిగింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేస్తున్న ఈ క్షిపణి పరిధి 5 వేల కిలోమీటర్లు. ఒకేసారి మూడు అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లి, ఫైర్ చేసే సామర్థ్యం దీనికి ఉంది.

దేశంలో సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత సాధించిన ప్రథమ రాష్ట్రంగా కేరళ నిలిచినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ 2025, ఆగస్టు 21న ప్రకటించారు. దేశంలో 38 శాతం కుటుంబాలే డిజిటల్ అక్షరాస్యత సాధించాయని, ఇలాంటి పరిస్థితుల్లో సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యతను పొందిన రాష్ట్రంగా కేరళ ప్రత్యేకత చాటుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.



బ్రెజిల్ ఆటగాడు ఫాబియో ప్రపంచంలో అత్యధిక ప్రొఫెషనల్ సాకర్ మ్యాచ్‌లు ఆడిన ఫుట్‌బాలర్‌గా రికార్డు సృష్టించాడు. అతడి మ్యాచ్‌ల సంఖ్య 1,391కు చేరుకుంది. ఫాబియో ఫ్లుమినెన్స్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 90వ దశకంలో కెరీర్‌ను ఆరంభించిన ఫాబియో వయసు ప్రస్తుతం 44 ఏళ్లు.

జాతీయ మహిళా కమిషన్ సలహా కమిటీ-2025 సభ్యులుగా ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, తెలంగాణ అదనపు డైరెక్టర్ జనరల్ మహేశ్ భగవత్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ మహిళా సంఘం 2025, ఆగస్టు 20న ప్రకటన విడుదల చేసింది. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయా కిశోర్ రహాట్కర్ ఆధ్వర్యంలో నడిచే ఈ కమిటీలో మొత్తం 21 మంది సభ్యులు ఉంటారు.

మన దేశ ఆర్థిక వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 6.3 శాతంగా నమోదు కావొచ్చని ఎస్‌బీఐ రిసెర్చ్ నివేదిక అంచనా వేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనా వేసిన 6.5 శాతం కంటే ఇది తక్కువ.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జాతీయ అంతరిక్ష దినోత్సవం

ఆగస్టు 23
చరిత్రలో ఈనాడు

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ విజయానికి గుర్తుగా ఏటా ఆగస్టు 23న 'జాతీయ అంతరిక్ష దినోత్సవం'గా (National Space Day) నిర్వహిస్తారు. అమెరికా, రష్యాల కంటే కాస్త ఆలస్యంగా అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టిన భారత్ చంద్రయాన్-3తో చంద్రుడిపై ల్యాండర్‌ను సాఫీగా దింపిన నాలుగో దేశంగా చరిత్ర సృష్టించింది. ఇప్పటివరకు అమెరికా, సోవియట్ యూనియన్ (రష్యా), చైనా మాత్రమే ఈ ఘనత సాధించాయి. అంతేకాక చంద్రుడి దక్షిణ ధ్రువం పైకి ల్యాండర్, రోవర్‌ను పంపిన మొదటి దేశంగా భారత్ అవతరించింది. అంతరిక్ష రంగంలో భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన చంద్రయాన్-3 విజయాన్ని స్మరించుకోవడంతోపాటు అంతరిక్ష పరిశోధనల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

ప్రయాణం సాగిందిలా..

2023, జులై 14న ఆంధ్రప్రదేశ్‌లోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి LVM3-M4 రాకెట్ చంద్రయాన్-3ని విజయవంతంగా భూకక్ష్యలోకి ప్రవేశపెట్టింది. మొత్తం 5 సార్లు భూ కక్ష్యా వేగం పెంచుతూ చివరికి ఆగస్టు 1న ట్రాన్స్‌లూనార్ ఆర్బిట్‌లో ఉంచారు.

- ఆగస్టు 5న చంద్రయాన్-3 చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించింది. ఆగస్టు 17న ప్రొపల్షన్ మాడ్యుల్ నుంచి ల్యాండర్ మాడ్యుల్ వేరుపడింది.
- ఆగస్టు 23న ల్యాండర్ వేగాన్ని తగ్గించుకుని చందమామ ఉపరితలం నుంచి 7.4 కి.మీ. ఎత్తులోకి చేరుకుంది. ల్యాండర్ క్రమంగా చంద్రుడి 150 మీ. ఎత్తుకు వచ్చిన తర్వాత ఉపరితలాన్ని స్కాన్ చేసి ఆగస్టు 23 సాయంత్రం 6.04 సమయంలో జాబిల్లిపై అడుగుపెట్టింది.
- సుమారు 3.84 లక్షల కి.మీ. ప్రయాణించాక 41 రోజులకు చంద్రయాన్-3 చంద్రుడిపై సురక్షితంగా దిగింది.



- చంద్రుడిపై సాఫీగా దిగేందుకు కావాల్సిన సాంకేతికతను, అనుభవాన్ని సంపాదించుకోవడంతోపాటు జాబిల్లి దక్షిణ ధ్రువాన్ని శోధించి, అక్కడ ఉన్న ఖనిజ మూలకాలను గుర్తించి విశ్లేషించే ఉద్దేశంతో ఇస్రో చంద్రయాన్-3ని చేపట్టింది. భూమి, సౌరవ్యవస్థ పుట్టుక గురించి తెలుసుకోవడం కూడా ఇందులో భాగం.


పోటీపరీక్షల నేపథ్యంలో చంద్రయాన్-3 గురించిన పూర్తి వివరాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి!

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

ప్రజా సేవలు - సంక్షేమ సేవలు

ప్రజలకు ప్రయోజనాన్ని చేకూర్చడం లేదా వివిధ రకాలుగా సాయం అందించడమే సంక్షేమం. భారతదేశాన్ని సంక్షేమ రాజ్యంగా పరిగణిస్తారు. ప్రభుత్వ విధానాలన్నీ కూడా సామాజిక విధానాల రూపంలోనే రూపొందుతున్నాయి. ప్రభుత్వం చేపట్టే పథకాల్లో మొదటి ప్రాధాన్యం సంక్షేమ కార్యక్రమాలకే. అందులోనూ నగదు చెల్లింపులు, రాయితీలు, మినహాయింపులన్నీ ప్రభుత్వ పంపిణీ రూపంలో ఉంటాయి.

ప్రజలందరి కోసం ఉద్దేశించిన వాటిని ప్రజా సేవలు లేదా సాధారణ సేవలు అంటారు. కేవలం బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, వారి వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు ఉద్దేశించిన వాటిని 'సంక్షేమ సేవలు' అంటారు.



ప్రజా సేవలు: రోడ్డు, ఆసుపత్రి, విద్య, రవాణా, పార్కు మొదలైన సౌకర్యాలు.
సంక్షేమ సేవలు: రిజర్వేషన్లు, ప్రత్యేక కార్పొరేషన్లు, సంక్షేమ పథకాలు, ప్రత్యేక సంస్థలు.

సామాజిక విధానం (సోషల్ పాలసీ)

ఆధునిక రాజ్యాలు రాజ్యాంగబద్ధంగా ప్రజల అభివృద్ధి కోసం ప్రజల ద్వారా ఎన్నికై సేవలందిస్తాయి. ప్రజావసరాలను అధ్యయనం చేసి, వనరులను సమీకరించుకొని, లక్ష్యాలను నిర్ధారించుకుని, వాటిని చేరుకునే మార్గాలను నిర్వచించుకొని, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసేందుకు రూపొందించుకునే ప్రణాళికలను 'సామాజిక విధానం' అంటారు.

భారతదేశంలో సంక్షేమ యంత్రాంగం, జాతీయ స్థాయిలో బలహీన వర్గాల సంక్షేమం కోసం ఏర్పాటైన కమిషన్లు, నూతన జాతీయ బాలల విధానం, జాతీయ మహిళా సాధికారత విధానం- 2001, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

నేషనల్ స్కాలర్‌షిప్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్

భారత విద్యార్థులకు దేశంలోనే పీజీ చదువుల కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆధ్వర్యంలో జాతీయ పీజీ విద్యావేతనం అందిస్తోంది. సంవత్సరానికి 10 నెలలు, నెలకు రూ.15,000 చొప్పున, గరిష్ఠంగా 2 సంవత్సరాల పాటు 10,000 మంది విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ లభిస్తుంది. ప్రభుత్వ రిజర్వేషన్ విధానం ప్రకారం 30 శాతం మహిళలకు కేటాయిస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 31 అక్టోబరు 2025.

హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్‌లో ఉద్యోగాలు

వారణాసిలోని హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్ ఒప్పంద ప్రాతిపదికన మల్టీ-టాస్కింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 16. అర్హులైన అభ్యర్థులు 2025 ఆగస్టు 25, 26 తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (ఆగస్టు 23) చివరి తేదీ

- బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో 3,588 ఉద్యోగాలు. పదో తరగతి ఉత్తీర్ణులు అర్హులు.
- ఎన్‌టీహెచ్‌లో 24 యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు. బీటెక్, ఎంఎస్సీ, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఎన్‌ఐఏబీలో 14 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు. డిగ్రీ/బీఫార్మ్/బీవీఎస్సీ, పీజీ, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఎన్‌ఐహెచ్‌లో 14 ప్రొఫెసర్ ఉద్యోగాలు. పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Mensuration - 3D

1. For a right circular cone with radius r = 40 cm and slant height l = 58 cm, find the ratio between the total surface area and the volume of the cone.
A) 5 : 32 B) 7 : 40
C) 4 : 35 D) 14 : 75

2. A conical tent has a radius of 20 m and a vertical height of 21 m. How many full bags of rice can it hold if each bag occupies 16 m^3? $\left(\text{Use } \pi = \frac{22}{7}\right)$
A) 525 B) 540 C) 550 D) 560

3. The dimensions of a hall are 12 m in length, 9 m in breadth, and 7 m in height. Find the cost of whitewashing the four walls and the ceiling at the rate of Rs.8 per m^2.
A) Rs.3024 B) Rs.3216
C) Rs.3528 D) Rs.3744

4. A solid metallic cube of side 18 cm is melted and recast into three smaller cubes. Two of the cubes have sides 9 cm and 12 cm respectively. Find the length of each side of the third cube.
A) 15 cm B) 14 cm
C) 13 cm D) 16 cm

5. The height of a cuboid is twice its breadth, and the length of the cuboid is five times its breadth. If the breadth of the cuboid is 4 cm, what is the total surface area of the cuboid?
A) 544 cm^2 B) 364 cm^2
C) 376 cm^2 D) 588 cm^2

6. The ratio of the volumes of two cylinders is 27 : 8 and the ratio of their heights is 3 : 2. If the area of the base of the first cylinder is 346.5 cm^2, then what will be the radius of the second cylinder?
A) 7 cm B) 8 cm
C) 9 cm D) 10 cm

7. A frustum of a right circular cone has height 28 cm, larger base radius 21 cm, and smaller base radius 14 cm. It is melted and recast into small spheres of diameter 7 cm each. How many such spheres will be formed?
A) 128 B) 144 C) 152 D) 168

8. A cylinder of height 12 cm and radius 35 cm is melted and recast into 4 cones, each having the same height and radius as the cylinder. Find the total curved surface area of all the cones.
A) 14500 cm^2 B) 14980 cm^2
C) 16280 cm^2 D) 15210 cm^2

9. How many 20 cm × 10 cm × 5 cm bricks will be required to construct a wall of dimensions 10 m × 4 m × 25 cm? (ignoring mortar and plaster)
A) 13800 B) 10000
C) 14200 D) 14400

Railway Exams

Mathematics

10. The total surface area of a closed hemisphere is 30800 cm^2. What is the sum of the radius and the diameter of this hemisphere? (Approx)
A) 171 cm B) 168 cm
C) 182 cm D) 196 cm

11. A solid metallic cuboid of dimensions 16 cm × 40 cm × 125 cm is melted and recast into 10 cubes of equal size. What is the sum of the lateral surface areas (in cm^2) of 5 such cubes?
A) 6,000 cm^2 B) 7,200 cm^2
C) 8,000 cm^2 D) 9,600 cm^2

12. Some spherical balls of diameter 4 cm are dropped into a cylindrical vessel containing water and are completely submerged. If the diameter of the vessel is 16 cm and the water level rises by 18 cm, then how many balls were dropped into the vessel?
A) 80 B) 85 C) 105 D) 108

13. A spherical ball of diameter 10 cm is cut into two equal hemispheres. The curved surface area of one hemisphere has to be painted with yellow colour, while the other hemisphere has to be painted with white colour. The flat bases of both hemispheres are painted with black colour. The cost of painting the curved area is Rs.4/cm^2, while the cost of painting the bases is Rs.3/cm^2. What will be the total cost (in Rs.) of painting both hemispheres?
A) 1727 B) 1880 C) 1790 D) 1700

14. A cistern can be completely filled by 18 cans of water, each of capacity 12.5 liters. How many cans will be required to fill the same cistern if each can has a capacity of 7.5 liters?
A) 28 B) 29 C) 30 D) 31

15. A wooden crate has dimensions 2 m × 1.2 m × 0.8 m. It is to be completely filled with small rectangular packets, each of size 20 cm × 16 cm × 10 cm. How many such packets can be packed into the crate without leaving any space?
A) 670 B) 675 C) 680 D) 600

16. A solid cuboid of dimensions 24 cm × 18 cm × 12 cm is melted and recast into small cubes, each of edge 6 cm. How many cubes will be formed?
A) 18 B) 20
C) 22 D) 24

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

రష్యాలో వాట్సప్‌కు ప్రత్యామ్నాయంగా 'మ్యాక్స్'

ఇంటర్నెట్‌డెస్క్‌: విదేశీ డిజిటల్ సర్వీసులపై ఆధారపడకుండా సొంత డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనతో వాట్సప్‌కు ప్రత్యామ్నాయంగా రష్యా సొంత యాప్‌ను రూపొందించింది. ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్, ట్యాబ్లెట్లలో ప్రీ-ఇన్‌స్టాల్ యాప్‌గా 'మ్యాక్స్'ను ఉంచాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ యాప్‌లో ప్రభుత్వ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని అధికారులు చెబుతున్నారు. వాట్సప్, టెలిగ్రామ్ కన్నా 'మ్యాక్స్'కు పరిమిత యాక్సెస్ ఉంటుందని, ఈ యాప్‌లో నిఘా పెట్టే అవకాశం లేదని స్పష్టంచేశారు. దీనితోపాటు సెప్టెంబర్ ఒకటి నుంచి రష్యాలో తయారయ్యే మొబైల్ ఫోన్లలో దేశీయ యాప్‌స్టోర్ 'రు స్టోర్'ను కూడా ప్రీ-ఇన్‌స్టాల్ యాప్ జాబితాలో చేర్చాలని పుతిన్ ప్రభుత్వం ఆదేశించింది. వచ్చే ఏడాది ప్రారంభం నుంచి 'లైమ్ హెచ్‌డీ టీవీ' యాప్‌ను కొత్త టీవీల్లో కచ్చితంగా ప్రీ-ఇన్‌స్టాల్ చేయాలని పేర్కొంది. దీని ద్వారా ప్రభుత్వ టీవీ ఛానెళ్లను ఉచితంగా ప్రసారం చేయనున్నారు.


ఘటనాస్థలిలో కొనసాగుతున్న సహాయక చర్యలు

అమెరికాలో బస్సు బోల్తా

• పలువురి మృతి

న్యూయార్క్‌: అమెరికాలో పర్యాటకుల బస్సు బోల్తా పడటంతో పలువురు మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు. పర్యాటకులు శుక్రవారం నయాగరా జలపాతాన్ని సందర్శించి న్యూయార్క్‌కు తిరిగొస్తుండగా, పెంబ్రోక్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలిలో సహాయక చర్యలను చేపట్టారు.


సైబర్ నేరగాళ్ల పనిపట్టే 'చిత్రగుప్త'

• అభివృద్ధి చేసిన కాన్పుర్ ఐఐటీ

ఈటీవీ భారత్: సైబర్ భద్రత, రక్షణ రంగానికి పనికొచ్చే పరికరాల స్టార్టప్ ఎగ్జిబిషన్‌ను కాన్పుర్ ఐఐటీ దిల్లీలో నిర్వహించింది. ఇందులో 'చిత్రగుప్త' సాధనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుషిత్ సోని అనే పూర్వ విద్యార్థి ఐఐటీ కాన్పుర్ ఇంక్యుబేషన్ సెంటర్ సహాయంతో దీన్ని అభివృద్ధి చేశారు. ప్రస్తుతం 90 శాతం సైబర్ నేరాలలో మొబైల్ ఫోన్‌ను ఉపయోగిస్తున్నారని రుషిత్ సోని చెప్పారు. తాను అభివృద్ధి చేసిన పరికరంతో మొబైల్ డేటాను అక్కడికక్కడే గుర్తించొచ్చని పేర్కొన్నారు. "దీన్ని అనేక కేంద్ర దర్యాప్తు సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు ఉపయోగిస్తున్నాయి. ఈ పరికరం ధర రూ.15 లక్షలు. ఏదైనా సైబర్ నేరం జరిగినప్పుడల్లా, నిందితుడి మొబైల్‌ను డేటా కేబుల్ ద్వారా పరికరానికి అనుసంధానించి డేటాను విశ్లేషించొచ్చు. అప్పుడు అతని డేటా అంతా పరికరంలోకి వస్తుంది. నేరాల కోసం చేసిన చాటింగ్, లొకేషన్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ డేటా బయటపడతాయి" అని రుషిత్ సోనీ చెప్పారు. ఈ ప్రదర్శనలో సైబర్ దాడుల ప్రభావాన్ని తగ్గించే కొన్ని పరికరాలూ ఉన్నాయి. రక్షణ రంగానికి ఉపయోగకరంగా ఉండే అనేక డ్రోన్‌లను కూడా ప్రదర్శించారు.

భారత్, చైనా చర్చలు మంచి పరిణామం

• ఆర్మీ మాజీ చీఫ్ నరవణె



దిల్లీ: సరిహద్దు సమస్యను పరిష్కరించుకొని ముందుకు వెళ్లేందుకు భారత్, చైనాలు చర్చల దిశగా ముందడుగు వేయడంపై సంతోషంగా ఉందంటూ ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎం.ఎం.నరవణె హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగవుతాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'భారత్ సద్భావనతో ముందుకు వెళ్తున్నకొద్దీ చైనా కూడా సహకరిస్తుందని ఆశిస్తున్నా. మనం ఎప్పుడూ చైనాతో మంచి సంబంధాలనే కోరుకున్నాం' అని నరవణె తెలిపారు.

యూట్యూబర్ ఇంటిపై కాల్పులు జరిపిన షూటర్లలో ఒకరి అరెస్టు

ఫరీదాబాద్: హరియాణాలోని గురుగ్రామ్‌లో ఆగస్టు 17న బైకుపై వచ్చి రియాలిటీ షో 'బిగ్‌బాస్ ఓటీటీ (హిందీ)-2' విజేత, యూట్యూబర్ ఎల్విశ్ యాదవ్ ఇంటిపై కాల్పులు జరిపిన ముగ్గురు షూటర్లలో ఒకరిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితులు రెండు డజన్ల రౌండ్లకు పైగా కాల్పులు జరిపారు. యాదవ్ బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తున్నాడన్న కారణంగా తాము ఈ దాడికి పాల్పడినట్లు 'భావూ ముఠా' ప్రకటించిందని పోలీసులు తెలిపారు. పట్టుబడిన నిందితుడిని ఫరీదాబాద్‌కు చెందిన ఇషాంత్ గాంధీ అలియాస్ ఇషుగా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఫరీదాబాద్‌లోని సెక్టార్ 30 వద్ద తెల్లవారుజామున 4.30 గంటలకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇషాంత్‌ను క్రైమ్ బ్రాంచ్ సిబ్బంది అడ్డుకొన్నారు. వాహనం ఆపమని సిగ్నల్ ఇవ్వగా అతడు పోలీసులపై కాల్పులు జరుపుతూ పారిపోవడానికి ప్రయత్నించాడు. దీంతో పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఇషాంత్ కాలికి గాయమైంది. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత అతణ్ని విచారిస్తామని ఫరీదాబాద్ డీసీపీ ముఖేశ్ మల్హోత్రా తెలిపారు.

జాతీయ రహదారులకూ విపత్తు నిర్వహణ ప్రణాళిక

• వైపరీత్యాలు సంభవించినప్పుడు రవాణా వ్యవస్థ స్తంభించకుండా చర్యలు
• తుది ప్రతిని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిన కేంద్రం
* 2030 నాటికి రహదారి ప్రమాదాలు, మరణాలు 50% తగ్గించడమే లక్ష్యం



ఈనాడు, దిల్లీ: ప్రకృతి వైపరీత్యాల సమయంలో రహదారులు స్తంభించిపోవడాన్ని నివారించేందుకు కేంద్ర రహదారులు, రవాణాశాఖ సంసిద్ధమైంది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వామ్య సంస్థలతో సంప్రదింపులు జరిపి జాతీయ రహదారి వ్యవస్థపై ఎదురయ్యే ఇబ్బందులను వేగంగా సరిదిద్దడానికి 'డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఫర్ రోడ్ అండ్ హైవే సెక్టార్' పేరుతో ఒక బృహత్తర ప్రణాళిక తయారుచేసింది. దాని తుదిప్రతిని శుక్రవారం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, రహదారి రవాణాతో సంబంధం ఉన్న అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు పంపించింది. దీని ప్రధాన ఉద్దేశం ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రహదారుల్లో చిక్కుకున్నవారిని వేగంగా రక్షించడంతోపాటు, భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా ముందు జాగ్రత్తలతో రహదారులను నిర్మించడమే. ఇందుకోసం కొన్ని ప్రధాన లక్ష్యాలను పెట్టుకొంది. అవేంటంటే.. 1. జాతీయ రహదారులు, ఇతర రహదారి మౌలికసదుపాయాలను అన్ని రకాల విధ్వంసాలను తట్టుకొని నిలబడేలా తీర్చిదిద్దడం. 2. ప్రమాదాలు జరిగినప్పుడు సమన్వయంతో పనిచేసే ప్రతిస్పందన వ్యవస్థను ఏర్పాటుచేసి, రహదారుల్లో చిక్కుకున్నవారిని భద్రంగా గమ్యస్థానాలకు వెళ్లేందుకు వీలు కల్పించడం, సహాయ పునరావాస చర్యలను వేగంగా చేపట్టడం. 3. వైపరీత్యాలతో కలిగే సామాజిక, ఆర్థిక నష్టం కనిష్ఠస్థాయిలో ఉండేలా చూడటం 4. జాతీయ రహదారి, రవాణా శాఖ ఆధ్వర్యంలోని వివిధ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వామ్య సంస్థలు సమన్వయంతో పనిచేసి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కోవడం. 5. ప్రమాదాల సమయంలో ప్రజలకు అవగాహన కల్పించి, వారు భద్రమైన దారుల్లో వెళ్లేలా మార్గదర్శనం చేయడం, అలాంటి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విస్తృతంగా ప్రచారం చేయడం 6. రహదారి నెట్‌వర్క్‌ను పునర్నిర్మించేటప్పుడు 'బిల్డ్ బ్యాక్ బెటర్' సూత్రాలను అనుసరించి భవిష్యత్తులో ఎదురయ్యే దుర్బలత్వాలను తట్టుకొనేలా పటిష్ఠ నిర్మాణాలు చేపట్టడం. 7. వైపరీత్యాల సమయంలో 48 గంటలకు మించి జాతీయరహదారులను మూసివేసే సందర్భాలను ఏటా కనీసం 10% తగ్గించడం. తాత్కాలిక రోడ్ల మూసివేత సంఘటనలను, కొండచరియలు విరిగిపడే ఘటనలను ఏటా 10% తగ్గిస్తూపోవడం. 8. వైపరీత్యాల కారణంగా ప్రధాన వంతెనలు, సొరంగమార్గాలు కూలకుండా జాగ్రత్తలు తీసుకోవడం. 9. 2030కల్లా రహదారి ప్రమాదాలు, మరణాలను కనీసం 50% తగ్గించడం.

ఓట్ల చోరీపై ప్రధాని మోదీ మాట్లాడరేం?

• భగల్పూర్ సభలో రాహుల్ గాంధీ విసుర్లు


ఓటర్ అధికార్ యాత్రలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

భగల్పూర్: ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని ఓట్ల చోరీకి జరుగుతున్న యత్నాలపై ప్రధాని మోదీ ఒక్క మాట కూడా మాట్లాడటంలేదంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. బిహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ ప్రారంభించిన 'ఓటర్ అధికార్ యాత్ర' ఆరో రోజైన శుక్రవారం భగల్పూర్ చేరుకుంది. అక్కడ నిర్వహించిన సభలో ప్రజలనుద్దేశించి రాహుల్ గాంధీ ప్రసంగించారు. 'మీ ఓటును చోరీ చేసేందుకే ఎన్నికల సంఘంతో కలిసి ప్రధాని మోదీ, భాజపా బిహార్‌లో ఎస్ఐఆర్ కసరత్తు చేపట్టారు. మీ ఓటు హక్కును హరించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం గయాజీ వచ్చిన ఆయన తన ప్రభుత్వ ఓట్ల చోరీ యత్నంపై ఒక్క మాట కూడా మాట్లాడలేదు' అని రాహుల్ పేర్కొన్నారు. ఒక్కో రాష్ట్రంలో వరుసపెట్టి ఓట్లు చోరీ చేస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర, కర్ణాటక, మణిపుర్ ఎన్నికలలో అక్రమాల గురించి ప్రధాని మోదీ మౌనం వహించారని ఆక్షేపించారు. ఓట్ల చోరీ భారత రాజ్యాంగంపై దాడేనని పేర్కొన్నారు. బిహార్ ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు ఇండియా కూటమి కృషి చేస్తుందని తెలిపారు.

రాహుల్‌గాంధీపై పరువునష్టం కేసు విచారణ 9కి వాయిదా

సుల్తాన్‌పుర్: భాజపా అగ్రనేత అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై నమోదైన పరువునష్టం కేసు విచారణ వచ్చే నెల తొమ్మిదో తేదీకి వాయిదాపడింది. కేసుకు సంబంధించి స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు శుక్రవారమిక్కడి ఎంపీ-ఎమ్మెల్యే న్యాయస్థానానికి సాక్షి వచ్చారని పిటిషనర్, భాజపా నాయకుడు విజయ్ మిశ్ర తరఫు న్యాయవాది సంతోష్‌కుమార్ తెలిపారు. అయితే రాహుల్ తరఫు న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్ల హాజరు కానందున విచారణ మొదలు కాలేదని చెప్పారు. ఈ కేసులో మరికొంత సమయం కావాలని ఆయన న్యాయస్థానానికి సమాచారం ఇచ్చారని తెలిపారు. దీంతో న్యాయస్థానం విచారణను వచ్చే నెల 9వ తేదీకి వాయిదా వేసిందన్నారు. 2018లో కర్ణాటక శాసనసభ ఎన్నికల ప్రచారం సందర్భంగా అప్పటి భాజపా అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర హోం శాఖ మంత్రి అయిన అమిత్ షాపై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ మిశ్ర పరువునష్టం కేసు దాఖలుచేశారు.

పోలీస్ హెలికాప్టర్‌పై డ్రోన్ దాడి

• కొలంబియాలో 12 మంది మృతి
• కారు బాంబు ఘటనలో మరో ఐదుగురు

బొగోట: కొలంబియాలో పోలీసుల హెలికాప్టర్‌పై డ్రోన్‌తో జరిపిన దాడిలో 12 మంది అధికారులు ప్రాణాలు కోల్పోయారు. కారులో పేలుడు పదార్థాలు తీసుకొచ్చి పేల్చిన ఘటనలో మరో ఐదుగురు మరణించారు. ఈ దాడులకు కొలంబియా విప్లవ సాయుధ దళాల అసమ్మతి వాదులు కారణమని అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఆరోపించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొకైన్ ముడిపదార్థమైన కోకా ఆకు పంటలను ధ్వంసం చేయడానికి ఆంటియోక్వియాలోని ఓ ప్రాంతానికి గురువారం హెలికాప్టర్‌లో పోలీసు సిబ్బందిని తరలిస్తుండగా డ్రోన్ దాడి జరిగింది. మరోవైపు కాలి నగరంలో సైనిక విమానయాన పాఠశాల సమీపంలో పేలుడు పదార్థాలతో నిండిన కారును పేల్చడంతో ఐదుగురు మృతిచెందగా, 30 మంది గాయపడ్డారు.

40 శాతం మంది సీఎంలపై క్రిమినల్ కేసులు

• వారిలో అత్యధికులు విపక్షాల వారే • ఏడీఆర్ వెల్లడి

దిల్లీ: దేశంలో 30 మంది ముఖ్యమంత్రు(సీఎం)లు ఉండగా వారిలో 12 (40 శాతం) మందిపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధికంగా 89 కేసులు నమోదైవున్నాయని ఆయనే ప్రకటించుకున్నారు. అలాగే తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్ తనపై 47 క్రిమినల్ కేసులున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై 19 కేసులు, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై 13 కేసులు, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై ఐదు కేసులు నమోదై ఉన్నాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్‌లపై నాలుగేసి కేసులు ఉన్నాయి. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై రెండు, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌పై ఒక కేసు ఉన్నాయి. ముఖ్యమంత్రుల్లో పదిమందిపై హత్యాయత్నం, కిడ్నాప్, లంచగొండితనం, నేరపూరిత బెదిరింపు వంటి తీవ్రమైన నేరారోపణలు నమోదయ్యాయి. దేశంలోని 30 మంది ముఖ్యమంత్రులు ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌ల ఆధారంగా ఏడీఆర్ ఈ వివరాలు వెల్లడించింది. నేరారోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు నాయుడు, ఫడణవీస్ తప్ప మిగిలిన అందరూ ప్రతిపక్ష పార్టీలకు చెందినవారు కావడం విశేషం. తీవ్రమైన నేరానికి పాల్పడినట్టు కేసు నమోదై 30 లేదా అంతకన్నా ఎక్కువ రోజులు జైలులో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఉద్వాసన పలికే బిల్లును కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఈ సమాచారం ప్రాధాన్యం సంతరించుకుది.

భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు యూఎస్‌ఎయిడ్ నిధులు అబద్ధం

• అమెరికా ఎంబసీనే నిర్ధారించింది
• వెల్లడించిన కేంద్రం

దిల్లీ: భారత్‌లో 2014-2024 మధ్య ఓటింగ్ శాతాన్ని పెంచడానికి యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్‌ఎయిడ్) 21 మిలియన్ల డాలర్లు వ్యయం చేసినట్లు వచ్చిన వార్తలు వాస్తవం కాదని కేంద్రం స్పష్టం చేసింది. ఓటింగ్ శాతం పెంచే దిశగా ఆ సంస్థ కార్యక్రమాలు చేపట్టడం కూడా నిజం కాదని తెలిపింది. అమెరికా ఎంబసీ తమకు సమర్పించిన వివరాలతో ఈ విషయం నిర్ధారణ అయినట్లు పేర్కొంది. సీపీఐ ఎంపీ జాన్ బ్రిట్టాస్ రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ గురువారం ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సెప్టెంబరు 2 కల్లా భారత్‌లో యూఎస్‌ఎయిడ్ కార్యకలాపాలను పూర్తిస్థాయిలో ఆపేస్తున్నట్లు యూఎస్ ఎంబసీ తమకు తెలిపినట్లు కీర్తివర్ధన్ పేర్కొన్నారు. భారత్‌లో ఓటింగ్ శాతం పెంచడం కోసం యూఎస్‌ఎయిడ్ చేపట్టిన ప్రాజెక్టుకు 21 మిలియన్ల డాలర్లు అందినట్లు గతంలో యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్) పేర్కొనడం చర్చనీయాంశమైంది.




భయపడను.. ఓడిపోను

• 'దాడి'పై దిల్లీ సీఎం రేఖా గుప్తా స్పందన

దిల్లీ: తనపై దాడి జరిగిన రెండు రోజుల తర్వాత తొలిసారిగా దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రజల సమక్షంలోకి వచ్చారు. శుక్రవారం గాంధీనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ...తాను ఎన్నటికీ భయపడనని, ఓడిపోనని అన్నారు. పోరాటమే తన అచంచలమైన సంకల్పమని, దిల్లీ ప్రజల హక్కుల కోసం అవిశ్రాంతంగా పనిచేస్తానని అన్నారు. "మీ ముఖ్యమంత్రి ఎప్పటికీ భయపడరు.. అలసిపోరు.. ఓడిపోరు. దిల్లీ హక్కులను సాధించేంత వరకు మీతో పాటు నేను పోరాడుతూనే ఉంటాను. ఇది నా దృఢ సంకల్పం" అని రేఖా గుప్తా అన్నారు. దిల్లీలోని సివిల్ లైన్స్ ప్రాంతంలో బుధవారం జరిగిన జన్ సున్వాయ్ కార్యక్రమంలో రాజేశ్‌భాయ్ ఖిమ్జి అనే రాజ్‌కోట్‌కు చెందిన వ్యక్తి రేఖా గుప్తాపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడితో సంబంధం ఉందన్న ఆరోపణలపై రాజ్‌కోట్‌లో ఐదుగురిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

దేశంలో 696 మాన్యువల్ స్కావెంజింగ్ రహిత జిల్లాలు

• కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్ వెల్లడి



దిల్లీ: దేశంలో 696 మాన్యువల్ స్కావెంజింగ్ రహిత (మానవ విసర్జితాన్ని చేతులతో తొలగించే పద్ధతి లేని) జిల్లాలు ఉన్నట్టు ఒక సర్వేలో తేలిందని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారికతా శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ శుక్రవారం ప్రకటించారు. చేతులతో మురుగు శుభ్రపరిచే వృత్తి నిర్మూలనను పర్యవేక్షిస్తున్న కేంద్ర కమిటీ సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు. మురుగు కాల్వలు, సెప్టిక్ ట్యాంకులను కేవలం యంత్రాలతో శుభ్రం చేసే పద్ధతిని సత్వరం అమలు చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. "పారిశుద్ధ్య కార్మికుడు తన పనిలో భాగంగా మానవ విసర్జితాన్ని చేతులతో తాకాల్సిన పరిస్థితి లేకుండా చూడండి" అని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం 2024-25 వార్షికంలో 86,806 మంది పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు, ఆరోగ్య బీమా అందించామని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

దక్షిణ అట్లాంటిక్‌లో భారీ భూకంపం

• అంటార్కిటికాలో కొన్ని ప్రాంతాలకు సునామీ హెచ్చరిక

బ్యూనస్ఎయిర్స్(అర్జెంటీనా): దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రంలో గురువారం రాత్రి రిక్టర్ స్కేలుపై 7.5 తీవ్రతతో భారీ భూకంపం వచ్చినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే విభాగం వెల్లడించింది. అంటార్కిటికాలోని కొన్ని ప్రాంతాల్లో సునామీ వచ్చే అవకాశం ఉందని చిలీ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. ఈ భూకంప కేంద్రానికి దగ్గరగా ఉన్న చిలీ, అర్జెంటీనా దేశాల్లో తక్షణ తరలింపులకు ఎటువంటి ఆదేశాలు జారీ చేయలేదు. అర్జెంటీనాలోని ఉసువాయా నగరానికి ఆగ్నేయంగా 710 కి.మీ.ల దూరాన ఉన్న డ్రేక్ మార్గంలో స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 11.16 గంటల సమయంలో ఈ భూకంపం వచ్చింది. ప్రాథమికంగా 10.8 కి.మీ.ల లోతున ఇది నమోదైంది. దక్షిణ అమెరికా దక్షిణ కొన, అంటార్కిటిక్ ద్వీపకల్పాల మధ్య దక్షిణ అట్లాంటిక్, దక్షిణ పసిఫిక్ మహాసముద్రాలను కలుపుతూ డ్రేక్ మార్గం ఉంటుంది. ఇది చాలా మారుమూల ప్రాంతమైనందున నష్టానికి సంబంధించిన తక్షణ వివరాలు అందుబాటులో లేవు.

పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసినందుకు..

మహిళను 7 ముక్కలు చేసి బావిలో పడేశాడు

లఖ్‌నవూ: పెళ్లి చేసుకోవాలని కోరిన ఓ మహిళను దారుణంగా హత్యచేసి, ఏడు ముక్కలుగా నరికి బావిలో పడేసిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాలో చోటుచేసుకుంది. కిశోర్‌పురా గ్రామంలోని బావిలో ఇటీవల ఓ మహిళ శరీర భాగాలున్న రెండు బస్తాలు తేలుతూ ఉండడాన్ని ఇటీవల పోలీసులు గుర్తించారు. మృతురాలి తల, కాళ్ల లభ్యం కాకపోవడంతో ఎవరనే విషయం గుర్తించడం కష్టంగా మారింది. అనంతరం పోలీసులు అంటించిన పోస్టర్ల ఆధారంగా మృతురాలి సోదరుడు వారిని ఆశ్రయించడంతో ఆమె తికంగఢ్ గ్రామానికి చెందిన రచనా యాదవ్(35)గా గుర్తించారు. రచనా యాదవ్ భర్త కొంతకాలం క్రితం మరణించారు. గ్రామ మాజీ ప్రధాన్ సంజయ్‌పటేల్(41)తో ఆమెకు వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తనను వివాహం చేసుకోవాలని రచన ఒత్తిడి చేస్తుండడంతో- తన మేనల్లుడు సందీప్‌పటేల్, స్నేహితుడు ప్రదీప్ సహాయంతో ఆమెను నిందితుడు గొంతు కోసి, హత్య చేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని ఏడు ముక్కలుగా నరికి, బస్తాల్లో కుక్కి బావిలో పడేసినట్లు పోలీసులు వివరించారు. తల భాగాన్ని సమీపంలోని లఖేరి నది వద్ద కనుగొన్నారు. ప్రధాన నిందితుడిని, అతడి మేనల్లుడిని పోలీసులు అరెస్టు చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు.

జర్నలిస్టులు వరదరాజన్, కరణ్ థాపర్‌లకు సుప్రీం రక్షణ

• వారిని అరెస్టు చేయకుండా ఉత్తర్వులు



దిల్లీ: దేశ ద్రోహం ఆరోపణలపై అస్సాం పోలీసులు నమోదు చేసిన కేసుకు సంబంధించి సీనియర్ జర్నలిస్టులు సిద్ధార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్‌లను అరెస్టు చేయకుండా సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. ఫౌండేషన్ ఫర్ ఇండిపెండెంట్ జర్నలిజం (ఎఫ్‌ఐజే) దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ ధర్మాసనం ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మోరిగావ్ పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో జర్నలిస్టులకు మధ్యంతర రక్షణ కల్పించాలని కోర్టు ఆదేశించినప్పటికీ, గువాహటి పోలీసులు మరో కేసులో వారికి సమన్లు జారీ చేసి శుక్రవారం విచారణకు రావాలని ఆదేశించారని పిటిషనర్ తరఫు న్యాయవాది నిత్య రామకృష్ణన్ తెలిపారు. గతంలో సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను గువాహటి పోలీసులు ఉల్లంఘించారని ఆమె పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం వరదరాజన్, కరణ్ థాపర్‌లపై కఠిన చర్యలు తీసుకోవద్దని గువాహటి పోలీసులను ఆదేశించింది. ప్రతి ఒక్కరూ చట్టాలను అనుసరించాలని, తదుపరి విచారణలోపు జర్నలిస్టులపై పోలీసు దర్యాప్తుపై స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని సూచించింది.

కేరళ నర్సు కేసులో ధ్రువీకరించని ప్రకటనలపై విచారణకు సరేనన్న సుప్రీం

దిల్లీ: యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియ కేసుపై వ్యక్తులు, సంస్థలు ధ్రువీకరించని ప్రకటనలు చేయకుండా నిరోధించాలన్న పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకరించింది. పిటిషన్ నకలును అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి కార్యాలయానికి పంపుతామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం పిటిషనర్ కేఏ పాల్‌కు తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది.

న్యాయాధికారుల పట్ల తల్లిదండ్రుల్లా వ్యవహరించాలి

• ఝార్ఖండ్ హైకోర్టుకు సుప్రీం హితవు

దిల్లీ: న్యాయాధికారుల పట్ల హైకోర్టులు తల్లిదండ్రుల్లా వ్యవహరించాలంటూ సుప్రీంకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా ఒంటరి తల్లైన ఓ జ్యుడీషియల్ అధికారిణిని హజారీబాగ్‌లోనైనా కొనసాగించాలని లేదా బొకారోకు బదిలీ చేయాలని ఝార్ఖండ్ హైకోర్టుకు సూచించింది. ఆమె కుమారుడు 12వ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని పేర్కొంది. "హైకోర్టులు తమ న్యాయాధికారుల సమస్యలను ఓర్పుతో పరిష్కరించాలి" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆరు నెలలపాటు పిల్లల సంరక్షణ సెలవు కావాలన్న తన అభ్యర్థనను తిరస్కరించడంపై ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఓ జిల్లా అదనపు న్యాయమూర్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అలాగే తనను దుమకాకు బదిలీ చేయడంపైనా అభ్యంతరం వ్యక్తం చేశారు. తన కుమారుడు చదువుకునేందుకు దుమకాలో మంచి సీబీఎస్ఈ పాఠశాలలు లేని కారణంగా ప్రస్తుతం పనిచేస్తున్న హజారీబాగ్‌లోనే తనను కొనసాగించాలని లేదా రాంచీకి కానీ బొకారోకు కానీ బదిలీ చేయాలంటూ ఝార్ఖండ్ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. వీటన్నింటినీ పరిశీలించిన సుప్రీం ధర్మాసనం..ఆమె కుమారుడి పరీక్షలు పూర్తయ్యే మార్చి/ఏప్రిల్, 2026 వరకూ ఆమెను హజారీబాగ్‌లోనైనా కొనసాగించాలని లేదా బొకారోకు బదిలీ చేయాలని సూచించింది. ఆదేశాల పాటించేందుకు హైకోర్టుకు రెండు వారాల గడువిచ్చింది. అలాగే ఆమె కోరిన ఆరు నెలల సెలవు విజ్ఞప్తిని పరిశీలించి మూడు నెలలపాటు సెలవుకు అనుమతించింది.

ఉపాధ్యాయులకు గౌరవప్రద జీతమివ్వాలి

• సుప్రీం కోర్టు తీర్పు

దిల్లీ: ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన జీతభత్యాలు చెల్లించకపోవడం దేశం విజ్ఞానానికి ఇచ్చే విలువను తగ్గిస్తుందని, దేశ మేధో సంపదను నిర్మించేవారిలో నిస్పృహ పెంచుతుందని సుప్రీం కోర్టు శుక్రవారం పేర్కొంది. విద్యావేత్తలు, లెక్చరర్లు, ప్రొఫెసర్లను దేశ మేధో వెన్నెముకగా జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం అభివర్ణించింది. వారు భావితరాల మనసులను, గుణశీలాలను మలిచేందుకు తమ జీవితాలను అంకితమిస్తారని అభిప్రాయపడింది. గుజరాత్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సమాన పనికి సమాన వేతనం ప్రాతిపదికన శాశ్వత అసిస్టెంట్ ప్రొఫెసర్లతో సమానమైన కనీస జీతభత్యాలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. గుజరాత్ హైకోర్టు తీర్పుపై దాఖలైన అప్పీలుకు స్పందిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. 'గురు బ్రహ్మ.. గురూ విష్ణు..గురుదేవో మహేశ్వరః' అంటూ వేదికలెక్కి సంస్కృత శ్లోకాలు వల్లెవేస్తే సరిపోదని ఉపాధ్యాయుల పట్ల వాస్తవంగా ఎలాంటి వైఖరి అవలంబిస్తామన్నది ప్రధానమని ధర్మాసనం పేర్కొంది. గుజరాత్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కేవలం రూ.30 వేలు నెలజీతంగా చెల్లించడంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై చర్యలు తీసుకొని వారి వేతనాలను హేతుబద్ధీకరించాలని ఆదేశించింది.

అది పుతిన్ పన్నిన ఉచ్చు

• ఈయూ దౌత్యవేత్త వ్యాఖ్యలు

ఇంటర్నెట్ డెస్క్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగిసే దిశగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం కావడంపై యురోపియన్ యూనియన్(ఈయూ) దౌత్యవేత్త కాజా కల్లాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌కు చెందిన భూభాగాలను ఆక్రమించుకోవడం కోసం శాంతి ఒప్పందం పేరుతో పుతిన్ ఉచ్చు పన్నారని ఆమె అన్నారు. ఎప్పటికైనా ఉక్రెయిన్ భూభాగాలను ఆక్రమించుకోవడమే రష్యా లక్ష్యమని పేర్కొన్నారు. యుద్ధాన్ని ఆపడానికి పుతిన్ ఉక్రెయిన్ నుంచి పలు రాయితీలను డిమాండ్ చేస్తున్నారని.. వాటిని నెరవేర్చడం అంటే కీవ్ తన భూభాగాలను వదులుకున్నట్లేనని కాజా కల్లాస్ పేర్కొన్నారు. యుద్ధం ముగిస్తున్నందుకు రష్యా ఉక్రెయిన్‌కు ఒక్క రాయితీ కూడా ఇవ్వట్లేదన్నారు. యుద్ధం ముగింపు అనంతరం ఉక్రెయిన్‌కు పాశ్చాత్య భద్రతా హామీలు ఇవ్వడం, మరోసారి రష్యా దాడి చేయకుండా చర్యలు తీసుకోవడం వంటి విషయాలపై చర్చలు జరుగుతున్నట్లు తెలిపారు. అయితే రష్యా పైకి మాత్రం యుద్ధ ముగింపుపై అనుకూలంగా కనిపిస్తున్నప్పటికీ.. కీవ్‌పై దాడులు కొనసాగిస్తోందని, దీనిని బట్టి చూస్తుంటే మాస్కో శాంతిని కోరుకోవట్లేదనే విషయం స్పష్టమవుతుందన్నారు.

ఉగ్రవాదులకు సాయం చేస్తున్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు

శ్రీనగర్: కేంద్రపాలిత ప్రాంతంలో ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా విధుల నుంచి శుక్రవారం తొలగించారు. వీరిని గొర్రెల సంవర్ధక శాఖలో పనిచేసే సియాద్ అహ్మద్ ఖాన్, కర్నాహ్ ప్రాంతంలో ఉపాధ్యాయునిగా పనిచేసే ఖుర్షిద్ అహ్మద్ రాథెర్‌గా అధికారులు గుర్తించారు. భద్రతా, నిఘా సంస్థలు దర్యాప్తు జరిపి వారి ప్రమేయం ఉన్నట్లు తేల్చిన తర్వాతే విధుల నుంచి తొలగించినట్లు వెల్లడించారు. లష్కరే తోయిబా ఉగ్ర సంస్థకు సహాయం చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వీరివురూ ప్రస్తుతం కుప్వారాలోని జైలులో ఉన్నారు.


రాజస్థాన్‌లోని సవాయి మాధోపుర్‌లో భారీ వర్షాలతో నీటమునిగిన పట్టాలపైనే వెళ్తున్న రైలు

యువతను రక్షిస్తుంది..

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025పై లోకేశ్

ఈనాడు, అమరావతి: నగదుతో ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణ, సహకారం, ప్రాచుర్యం కల్పించడాన్ని నిషేధిస్తూ కేంద్రం తెచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుతో యువత, వారి కుటుంబాలకు మేలు జరుగుతుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా తెలిపారు. ఇదో ప్రగతిశీల నిర్ణయమని పేర్కొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు రూ.322 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పది లక్షల్లోపు జనాభాగల పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు ప్రభుత్వం రూ.322.48 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు శుక్రవారం విడుదల చేసింది. 2025-26 సంవత్సరానికి మొదటి విడతగా బేసిక్ గ్రాంట్ కింద రూ.128.99 కోట్లు, టైడ్ గ్రాంట్‌గా మరో 193.49 కోట్లు విడుదల చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

కేంద్ర సర్వీసుకు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిగా డిప్యుటేషన్‌పై కొనసాగుతున్న ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ మంజుల డి.హోస్మనిని కేంద్ర ప్రభుత్వ సర్వీసుకు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని రెవెన్యూ (సీ అండ్ ఐటీ)విభాగానికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె వైద్యారోగ్య శాఖలోని కొవిడ్- 19 మానిటరింగ్ అండ్ వెరిఫికేషన్ విభాగం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఏపీ కేడర్ ఐఏఎస్‌గా ఎం.వెంకటేశ్వర్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పౌర సరఫరాల శాఖలో పని చేస్తున్న ఎం.వెంకటేశ్వర్లును ప్రభుత్వం ఏపీ కేడర్ ఐఏఎస్‌గా ప్రమోట్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రావెల్ మార్ట్‌లో పాల్గొనేందుకు మంత్రికి అనుమతి

ఈనాడు, అమరావతి: బ్యాంకాక్‌లో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించే పసిఫిక్ ఆసియా ట్రావెల్ అసోసియేషన్ (పటా) ట్రావెల్ మార్ట్-2025లో పాల్గొనేందుకు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లకు అనుమతినిస్తూ సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బ్యాంకాక్‌లోని సిరికిట్ నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో వీరు పాల్గొననున్నారు.

గనులశాఖ కమిషనర్‌గా ప్రవీణ్‌కుమార్

ఈనాడు, అమరావతి: గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు.. ఆ శాఖ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. తొలుత ఆయన గనుల శాఖ కమిషనర్‌గానే ఉన్నారు. తర్వాత కార్యదర్శిగా బదిలీ అయ్యారు. అయితే కమిషనర్ స్థానంలో మరెవరినీ నియమించలేదు. అనధికారికంగా ఆయనే ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. తాజాగా ప్రవీణ్‌కుమార్‌కే పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇది జనవరి 21 నుంచి అమల్లోకి వస్తుందని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఆగమ సలహా మండలి ఛైర్మన్, సభ్యుల రాజీనామాలు ఆమోదం

ఈనాడు, అమరావతి: ఆగమ సలహా మండలి ఛైర్మన్ సహా సభ్యుల రాజీనామాలను ప్రభుత్వం శుక్రవారం ఆమోదించింది. ఛైర్మన్ వేదాంతం సత్య శ్రీనివాస అయ్యంగార్, సభ్యులు శశిభూషణ సిద్ధాంతి, ఎం.మృత్యుంజయ ప్రసాద్‌శర్మ, కె.సూర్యనారాయణాచార్యులు, కె.సుబ్రమణ్యం, బి.వీరభద్ర సిద్ధాంతి, ఆర్‌వీవీ గోపాలాచార్యులు, వారణాసి నాగభూషణం రాజీనామాలను ఆమోదిస్తూ దేవాదాయశాఖ కార్యదర్శి జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు.

కార్పొరేషన్ల ఉద్యోగుల పదవీవిరమణ వయసు పెంపుపై మంత్రివర్గ ఉపసంఘం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని 9, 10 షెడ్యూళ్లలో ఉన్న ప్రభుత్వ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీవిరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనపై సిఫార్సులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. సభ్యులుగా మంత్రులు పి.నారాయణ, నారా లోకేశ్, పయ్యావుల కేశవ్‌లను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సమ్మిళిత విద్య బలోపేతానికి సలహా బృందం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సమ్మిళిత విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర సలహా బృందాన్ని నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 125 ఆటిజం కేంద్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా ఈ మేరకు చర్యలు చేపట్టారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లను రాష్ట్ర సలహా బృందంలో నియమించారు.

వైద్యారోగ్య శాఖలో పలువురికి పదోన్నతి

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్య శాఖలోని ఖాళీల భర్తీలో భాగంగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా టీబీ నియంత్రణ అధికారి (కుష్ఠు- ఎయిడ్స్- టీబీ) హోదాకు పదోన్నతుల ప్యానల్ ఎంపిక చేసిన జాబితాలో 14 మంది డిప్యూటీ సివిల్ సర్జన్లు/ సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు చోటు కల్పించింది. ప్రజారోగ్య శాఖలోని అసిస్టెంట్ డైరెక్టర్లు (పరిపాలన) డిప్యూటీ డైరెక్టర్లు (పరిపాలన)గా పదోన్నతి పొందడానికి ఐదుగురు అధికారులను అర్హులుగా ప్రకటించింది.

లోక్‌సభ నియోజకవర్గాలకు తెదేపా అధ్యక్షుల ఎంపికకు కమిటీలు

● ముగ్గురేసి సభ్యులతో ఏర్పాటుచేసిన అధిష్ఠానం

ఈనాడు, అమరావతి: లోక్‌సభ నియోజకవర్గాలకు పార్టీ అధ్యక్షుల ఎంపికకు తెదేపా అధిష్ఠానం కమిటీల్ని నియమించింది. ఒక్కో నియోజకవర్గానికి ముగ్గురేసి చొప్పున సభ్యులను నియమించింది. వీరు అధ్యక్షులతో పాటు ప్రధాన కమిటీ, 17 అనుబంధ విభాగాల కమిటీల నియామకాలకు ప్రతిపాదనలు స్వీకరిస్తారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో ఆయా నియోజకవర్గాలకు వెళ్లి స్థానిక పార్టీ శ్రేణులు, ఎమ్మెల్యేలతో చర్చించి అధ్యక్షుల ఎంపికకు గరిష్ఠంగా ముగ్గురి పేర్లను, కమిటీల నియామకానికి ప్రతిపాదనలను స్వీకరిస్తారు. అధ్యక్షులను అధిష్ఠానం ఎంపిక చేస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. వీటికి సంబంధించిన విధివిధానాలపై కమిటీ సభ్యులతో ఉండవల్లి నివాసంలో శనివారం చంద్రబాబు సమావేశమవుతారని వెల్లడించారు.

24 నియోజకవర్గాలకు నియమితులైన సభ్యులు వీరే..

● అరకు: కొండపల్లి శ్రీనివాస్, బెందాళం అశోక్, బడేటి రాధాకృష్ణ
● శ్రీకాకుళం: వంగలపూడి అనిత, నజీర్ అహ్మద్, కర్రోతు బంగార్రాజు
● విజయనగరం: వాసంశెట్టి సుభాష్, ఎంఏ షరీఫ్, పీజీవీఆర్ నాయుడు (గణబాబు)
● విశాఖపట్నం: నిమ్మల రామానాయుడు, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కుడిపూడి సత్తిబాబు
● అనకాపల్లి: ఏలూరి సాంబశివరావు, పి.శ్రీనివాసులురెడ్డి, దేగల ప్రభాకర్
● కాకినాడ: కింజరాపు అచ్చెన్నాయుడు, అరిమిల్లి రాధాకృష్ణ, ప్రణవ్‌గోపాల్
● అమలాపురం: కొల్లు రవీంద్ర, జీవీ ఆంజనేయులు, గొట్టిముక్కల రఘురామరాజు
● రాజమహేంద్రవరం: ప్రత్తిపాటి పుల్లారావు, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కొలుసు పార్థసారథి
● నరసాపురం: పొంగూరు నారాయణ, నూకసాని బాలాజీ, రవినాయుడు
● ఏలూరు: గొట్టిపాటి రవికుమార్, బుద్దా నాగజగదీష్, ఎంఎస్ రాజు
● మచిలీపట్నం: కాల్వ శ్రీనివాసులు, దామచర్ల సత్య, పీల గోవింద సత్యనారాయణ
● విజయవాడ: పయ్యావుల కేశవ్, బీటీ నాయుడు, పొలంరెడ్డి దినేష్‌రెడ్డి
● గుంటూరు: ఎన్‌ఎండీ ఫరూక్, మద్దిపాటి వెంకట్రాజు, కిమిడి నాగార్జున
● నరసరావుపేట: జ్యోతుల నెహ్రూ, కొనకళ్ల నారాయణ, ఎం.రవి
● బాపట్ల: పంచుమర్తి అనురాధ, వీరంకి గురుమూర్తి, మన్నే సుబ్బారెడ్డి
● ఒంగోలు: గుమ్మిడి సంధ్యారాణి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు
● నెల్లూరు: అనగాని సత్యప్రసాద్, పులివర్తి వెంకట మణిప్రసాద్, డూండి రాకేశ్
● తిరుపతి: మంతెన రామరాజు, ఎస్.సవిత, బుచ్చి రాంప్రసాద్
● రాజంపేట: ఆనం రామనారాయణరెడ్డి, గన్ని వీరాంజనేయులు, వై.నాగేశ్వరరావు యాదవ్
● చిత్తూరు: బీసీ జనార్దన్‌రెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, పిల్లి మాణిక్యరావు
● నంద్యాల: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవెలమూడి నాని, పూల నాగరాజు
● కర్నూలు: మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నక్కా ఆనంద్‌బాబు, బీకే పార్థసారథి
● కడప: బీద రవిచంద్ర, బీవీ జయనాగేశ్వరరెడ్డి, నాదెండ్ల బ్రహ్మంచౌదరి
● అనంతపురం: డోలా బాల వీరాంజనేయస్వామి, ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, మద్దిపట్ల సూర్యప్రకాశ్
● హిందూపురం: టీజీ భరత్, దేవినేని ఉమామహేశ్వరరావు, ఎం.శ్రీనివాసరెడ్డి

భాజపా రాష్ట్ర కార్యవర్గ ఏర్పాటు

● పేర్లు ప్రకటించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: భాజపా రాష్ట్ర కార్యవర్గం 42 మందితో ఏర్పాటయింది. కార్యవర్గ సభ్యుల పేర్లను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం ప్రకటించారు. వారి వివరాలు..

● రాష్ట్ర కార్యదర్శులు: కె.సురేంద్రమోహన్ (విశాఖపట్నం), రెడ్డి పావని (విజయనగరం), బొమ్ముల దత్తు (తూర్పుగోదావరి), సురవరం గీతామాధురి (కర్నూలు), బొడ్డు నాగలక్ష్మి (ఎన్టీఆర్), మేకల హనుమంతరావు (పల్నాడు), సందిరెడ్డి శ్రీనివాసులు (అనంతపురం), భోగిరెడ్డి ఆదిలక్ష్మి (పశ్చిమ గోదావరి), ఉమ్మిడి సుజాత (విశాఖపట్నం), ఈరోజి స్వప్నకుమారి (అల్లూరి సీతారామరాజు)

● సంయుక్త కోశాధికారిగా కందుకూరి సత్యనారాయణ (నెల్లూరు), రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా బి.ఎల్.ఎన్.పవన్ (ఎన్టీఆర్), స్టేట్ సెల్స్ కన్వీనర్‌గా కె.చిరంజీవిరెడ్డి (అనంతపురం), కో- కన్వీనర్‌గా నిడమనూరి సూర్య కల్యాణ్‌చక్రవర్తి (ప్రకాశం జిల్లా) ఎంపికయ్యారు.

● రాష్ట్ర ప్రధాన కార్యాలయ ఇన్‌ఛార్జిగా ఉప్పలపాటి శ్రీనివాసరాజు (ఎన్టీఆర్), రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎ.కేశవకాంత్ (విశాఖపట్నం), రాష్ట్ర ఐటీ కన్వీనర్‌గా మకుటం శివ (గుంటూరు), రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధిగా వల్లూరు జయప్రకాశ్‌నారాయణ (గుంటూరు), రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జిగా కిలారు దిలీప్ (ఎన్టీఆర్), రాష్ట్ర కార్యక్రమాలు- ప్రోటోకాల్ ఇన్‌ఛార్జిగా పాతూరి నాగభూషణం (ఎన్టీఆర్) ఎంపికయ్యారు.

● యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్.సునీల్ కుమార్ రెడ్డి (కర్నూలు), రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఎం.నిషిధరాజు (చిత్తూరు), ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా రొంగల గోపిశ్రీనివాస్ (తూర్పుగోదావరి), ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పనతల సురేష్ (అన్నమయ్య), ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పాంగి రాజారావు (అల్లూరి సీతారామరాజు), కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా సీహెచ్ కుమార్‌స్వామి (కృష్ణా), రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా సయ్యద్ బాషా (ఎన్టీఆర్)లను ఎంపికచేశారు.


సీహెచ్‌వోలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఏపీఎంఎల్‌హెచ్‌పీ సంఘం

ఈనాడు, అమరావతి: సమ్మె విరమణ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)లకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఏపీఎంఎల్‌హెచ్‌పీ) సంఘం డిమాండ్ చేసింది. సమ్మె విరమించి మూడు నెలలు గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కారం కాలేదని అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.నిరంజన్, బి.సందీప్‌కుమార్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ''సమ్మె కాలంలోని 40 రోజుల జీతాలు ఇవ్వాలి. ఏళ్ల తరబడి ఒకేచోట పని చేస్తున్న సీహెచ్‌వోలకు జీరో ట్రాన్స్‌ఫర్ అమలు చేయాలి. బకాయి ఉన్న ప్రోత్సాహకాలన్నీ ఒకేసారి విడుదల చేయాలి. జాబ్‌చార్టులో మార్పులు చేయాలి' ' అని కోరారు. సమ్మెలో ఇచ్చిన మాట ప్రకారం ఎక్స్‌గ్రేషియా పాలసీ ఇచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పుట్టిన రోజునే తండ్రి చితికి బాలుడు నిప్పు పెట్టాల్సి వచ్చింది

● సమాజం సిగ్గుతో తల దించుకోవాల్సిన పరిస్థితి ఇది..
● అనుమతుల్లేని కేబుళ్లను తొలగించండి
● రామంతాపూర్ విద్యుదాఘాతం ఘటనపై తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యలు



ఈనాడు, హైదరాబాద్: విద్యుత్తు స్తంభాలకు అనుమతి లేకుండా కట్టిన కేబుళ్లను తక్షణం తొలగించాలని తెలంగాణ హైకోర్టు శుక్రవారం ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అనుమతులున్న వాటిని గుర్తించి, అవి ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటే చట్టప్రకారం నోటీసులిచ్చి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అనుమతులున్న కేబుల్ ఏజెన్సీలు.. అనధికారిక కేబుళ్లను తొలగించే ప్రక్రియలో విద్యుత్తు సిబ్బందికి సహకరించాలని ఆదేశించింది. అక్రమ కేబుళ్లను తొలగించడానికి, ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా ఉండటానికి ఏం చర్యలు తీసుకోవాలన్న దానిపై ప్రభుత్వం, టీజీఎస్పీడీసీఎల్‌తోపాటు పిటిషనర్ కూడా ప్రతిపాదనలతో రావాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది. రామంతాపూర్‌లో విద్యుదాఘాతంతో ఆరుగురు మృతి చెందిన దుర్ఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేబుళ్లను కత్తిరించడాన్ని సవాలు చేస్తూ భారతి ఎయిర్‌టెల్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.రవి వాదనలు వినిపిస్తూ.. అన్ని అనుమతులు పొందాకే స్తంభాల ద్వారా కేబుళ్లు తీసుకున్నామన్నారు. ఎలాంటి నోటీసు జారీ చేయకుండా నగరమంతటా కేబుళ్లను కట్ చేశారన్నారు. టీజీఎస్పీడీసీఎల్ తరఫున ఎన్.శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 20 లక్షలకు పైగా స్తంభాలుండగా, 1.73 లక్షల స్తంభాలకు మాత్రమే అనుమతులున్నాయని తెలిపారు. అయినా ప్రతి స్తంభానికీ విచ్చలవిడిగా కేబుళ్లు కట్టేశారని తెలిపారు. పరిమితికి మించి కేబుళ్లు ఉండటంతో స్తంభాలు భారం భరించలేక వాలిపోతున్నాయన్నారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. కేబుళ్ల బరువుకు స్తంభాలు వాలిపోతుంటే కింది సిబ్బంది జేబులు సొమ్ముతో నిండుతున్నాయని వ్యాఖ్యానించారు. అక్రమంగా కేబుళ్లు ఉన్నాయని గుర్తించినపుడు వాటిపై మీరెందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. చట్టాలున్నా అవి నిద్రాణంగా ఉన్నాయని, సరళంగా ఉంటే అనుసరించలేరు, కఠినంగా ఉంటే అమలు చేయలేరన్నారు. 'ఆరు కుటుంబాలకు చెందిన వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఆ కుటుంబాలు ఎంత వేదనకు గురవుతున్నాయో అర్థం చేసుకోవాలి. ఈ నిర్లక్ష్యానికి సమష్టి బాధ్యత తీసుకోవాలి. అనుమతుల్లేని కేబుళ్లతోపాటు అనుమతులుండీ మనిషికి తగిలేలా ఉన్న కేబుళ్లను తొలగించాల్సిందే' అని తేల్చి చెప్పారు.

> "తల్లిదండ్రుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాల్సిన తొమ్మిదేళ్ల బాలుడు.. తండ్రి చితికి నిప్పు పెట్టాల్సిన దుస్థితి ఎదురైంది. తండ్రి మరణ వేదన అతని బాల్యంపై చెరగని ముద్ర వేస్తుంది. ఇలాగే ఆరు కుటుంబాల ఆవేదనకు ఎవరు బాధ్యత తీసుకుంటారు? ఒకరిపై ఒకరు చెబుతూ బాధ్యతల నుంచి తప్పుకొంటున్నారు. దీనికి అందరూ బాధ్యులే. ఇది సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి" - జస్టిస్ నగేశ్ భీమపాక

హైదరాబాద్ అభివృద్ధిని విస్మరిస్తున్న కాంగ్రెస్

● వీధి దీపాలు కొనలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం
● ఉద్యోగ సంఘాల ధర్నాకు భాజపా మద్దతు
● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ నగరాభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. గతంలో భారాస, ఇప్పుడు కాంగ్రెస్ పుణ్యమా అని హైదరాబాద్ సమస్యలతో విలవిలలాడుతోందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రజా సమస్యలు, నగర అభివృద్ధి అంశాలపై భాజపా ఆధ్వర్యంలో సచివాలయం ఎదుట నిరసన చేపడితే, తెలంగాణ ప్రభుత్వానికి భయం ఎందుకని ప్రశ్నించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో పాటు నాయకులను అరెస్టులు, హౌస్ అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. "హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ, గచ్చిబౌలి మాత్రమే కాదు. అసలైన హైదరాబాద్ అభివృద్ధిని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారమున్న చోటే ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. నేడు రాజధానిలో ఏ ప్రధాన రహదారిపైకెళ్లి చూసినా వీధి దీపాలు కనిపించవు. రాష్ట్ర ప్రభుత్వం వీధి దీపాలు కొనలేని దుస్థితిలో ఉంది. కేసీఆర్ హైదరాబాద్‌ను విశ్వనగరం అన్నారు. విశ్వనగరం కన్నా ఎక్కువ అని రేవంత్‌రెడ్డి అన్నారు. మరి ఇలాంటి నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే కదా.

జీపీఎఫ్ మొత్తాల విత్‌డ్రాపై మారటోరియం దారుణం

రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పరిస్థితి దారుణంగా తయారైంది. వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం లేదు. పీఆర్సీ అమలు కావడం లేదు. 200 ఉద్యోగ సంఘాలు ఐకాసగా ఏర్పడి సెప్టెంబరు 1 నుంచి ధర్నాకు పిలుపునిచ్చాయి. ఈ ధర్నాకు భాజపా పూర్తి మద్దతు ఇస్తుంది. కాంగ్రెస్ 2023లో తన మ్యానిఫెస్టో ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగు డీఏలన్నింటినీ తక్షణమే చెల్లిస్తామని హామీ ఇచ్చింది. కానీ అమలు కావడం లేదు. మరోవైపు విశ్రాంత ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్, గ్రాట్యుటీ, జీపీఎఫ్ సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీపీఎఫ్ మొత్తాల విత్‌డ్రాపై మారటోరియం విధించడం దారుణం. కేంద్రం రాయితీపై ఇస్తున్న యూరియాను రైతులకు సక్రమంగా అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. రాష్ట్రంలో యూరియా కొరత ఎందుకు ఏర్పడుతుందో సమాధానమివ్వాలి' అని కిషన్‌రెడ్డి కోరారు

ఎంఎన్‌జేలో వంద దాటిన రోబో సర్జరీలు

● పేదలకు ఉచితంగా అధునాతన క్యాన్సర్ వైద్యం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి ఎంఎన్‌జేలో వివిధ రకాల క్యాన్సర్లకు వందకుపైగా రోబో చికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఒకప్పుడు కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులకే పరిమితమైన రోబో సేవలను కొంత కాలం క్రితం ఇక్కడ ప్రవేశపెట్టారు. రూ.30 కోట్లతో అధునాతన యంత్రాలను సమకూర్చారు. ఆరుగురు ప్రొఫెసర్లు ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఇవన్నీ సత్ఫలితాలు ఇస్తున్నాయి.

■ "సాధారణంగా శరీరంలోని వివిధ భాగాల్లో క్యాన్సర్ కణితి వృద్ధి చెందినప్పుడు శరీరంపై కోతలు పెట్టి శస్త్ర చికిత్సతో తొలగించేవారు. దీనివల్ల రక్తస్రావం అధికంగా ఉండటంతోపాటు గాయం నయమవడానికి రెండు, మూడు వారాలకుపైనే పట్టేది.

■ రోబో శస్త్ర చికిత్సల్లో శరీరంపై నాలుగు ప్రాంతాల్లో చిన్నపాటి రంధ్రాలు చేసి, వాటి ద్వారా రోబో చేతులను పంపిస్తారు. అతి చిన్న కణితులు కూడా 3డీలో హైరెజుల్యూషన్‌లో కనిపించడం వల్ల.. వాటిని పూర్తిగా తొలగించేందుకు వీలవుతోంది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.లక్షలు ఖర్చుచేసి ఇలాంటి చికిత్సలు పొందలేని పేదలు. ఎంఎన్‌జేలో ఉచితంగా పొందవచ్చు' అని ఎంఎన్‌జే డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

ఏయే క్యాన్సర్లకు రోబో చికిత్సలంటే..

★ అన్నవాహికలో కణితులు ★ గర్భాశయంలో క్యాన్సర్ ★ పెద్దపేగులు, పురీషనాళంలో కణితులు ★ పొట్ట, కిడ్నీ క్యాన్సర్లు ★ యూరినరీ బ్లాడర్ ★ వీర్య గ్రంథి క్యాన్సర్లు ★ క్లోమగ్రంథి క్యాన్సర్లు

టీవీ సీరియల్ ఎంత పని చేసింది!

భర్తతో ఘర్షణ... కుమారుడితో కలిసి మహిళ ఆత్మహత్యాయత్నం

బయ్యారం, న్యూస్‌టుడే: టీవీ సీరియల్ చూస్తున్న భార్య... ఇంటికి వచ్చిన తన భర్తను పట్టించుకోకపోవడంతో చెలరేగిన ఘర్షణ... ఆమె తన కుమారుడితో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడే వరకు దారితీసింది. ఈ ఘటన తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఓ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన ఓ రైతు గురువారం రాత్రి పొలం పనులు ముగించుకొని ఇంటికొచ్చి భార్యను అన్నం పెట్టాలని అడిగారు. ఆ సమయంలో టీవీ చూస్తున్న అతడి భార్య... సీరియల్ పూర్తయ్యాక పెడతానని చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఇదే విషయమై శుక్రవారం ఉదయం మరోసారి తగాదా పడ్డారు. అనంతరం రైతు పొలం వద్దకు వెళ్లగా మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి... కుమారుడు(8)కి సైతం తాగించింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికుల సాయంతో మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం కాస్త మెరుగుపడగా బాలుడి పరిస్థితి విషమంగానే ఉంది. దాంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా.. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.


యూపీహెచ్‌సీల నిర్మాణానికి రూ.30 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 30 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (యూపీహెచ్‌సీ)ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.కోటి చొప్పున కేటాయించింది. 2023-24, 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులతో పురపాలక శాఖ ఈ పనులను చేపడుతుంది.

లాటరీ తీయకపోతే దరఖాస్తు రుసుము వెనక్కి

ఈనాడు,అమరావతి: నూతన బార్ పాలసీలో భాగంగా..ఏదైనా బార్‌కు 4 కంటే తక్కువ దరఖాస్తులు రావడం వల్ల లాటరీ తీయకపోతే దరఖాస్తు రుసుము తిరిగి వెనక్కి ఇచ్చేస్తామని ఎక్సైజ్ కమిషనర్ నిషాంత్‌కుమార్ తెలిపారు.

ప్రకృతి ఒడిలో.. ఆహ్లాద ప్రయాణం!



నింగిని తాకేలా పచ్చని కొండలు.. పక్కనే ప్రధాన రహదారి.. ప్రకృతి ఒడిలో సాఫీగా సాగే ప్రయాణం. ఇది ఎక్కడో కాదు.. హైదరాబాద్-నర్సాపూర్ ప్రధాన రహదారిలో అలరిస్తోన్న ప్రకృతి అందమిది. తెలంగాణ రాజధానికి చేరువలో ఉన్న నర్సాపూర్ అర్బన్ పార్కు చెంత ప్రకృతి పేర్చిన పచ్చని గోడల అందాలు ఆస్వాదిస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు ప్రయాణికులు. ఆ దారిలో 30 చ.కి.మీ. మేర రక్షిత అటవీ అందాలు కనువిందు చేస్తున్నాయి. సుమారు 150 అడుగుల ఎత్తయిన కొండలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - ఈనాడు, హైదరాబాద్

జేడీ పోస్టుల భర్తీకి ఆమోదం

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్య శాఖలో ఖాళీగా ఉన్న జాయింట్ డైరెక్టర్ల పోస్టుల భర్తీకి శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) ఆమోదం తెలిపింది. ఈ మేరకు 2024-25 సప్లిమెంటరీ ప్యానల్‌లో 10 మంది డిప్యూటీ డైరెక్టర్లను చేరుస్తూ వారి పదోన్నతికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలని ఉన్నతాధికారులను ఆదేశించింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కేసముద్రం రూరల్, న్యూస్‌టుడే: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గంధసిరి బొందయ్య(56)కు మూడున్నర ఎకరాల భూమి ఉంది. సాగు పెట్టుబడితోపాటు కుటుంబ అవసరాలకు రూ.25 లక్షల వరకు అప్పుజేశారు. 4 నెలల కిందట రెండెకరాల భూమిని విక్రయించి కొంత రుణం తీర్చారు. మరో రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయకుండా మనోవేదనకు గురై శుక్రవారం గడ్డి మందు తాగారు. మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందారు.

ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు రూ.70 వేలు.. గిఫ్ట్ డీడ్‌కు రూ.5 వేలు

● అనిశా వలలో వనస్థలిపురం, ఆదిలాబాద్‌ల సబ్‌రిజిస్ట్రార్లు




లంచం డబ్బులతో సబ్‌రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్, డాక్యుమెంట్ రైటర్ రమేశ్ బీ అనిశాకు చిక్కిన ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్-2 శ్రీనివాస్‌రెడ్డి

వనస్థలిపురం, ఆదిలాబాద్ నేర విభాగం, ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు యజమాని నుంచి రూ.70 వేలు తీసుకుంటూ తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్.., ఇంటి పట్టాను గిఫ్ట్ డీడ్ చేసేందుకు రూ.5 వేలు తీసుకుంటూ ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్-2 శుక్రవారం అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని తుర్కయంజాల్‌కు చెందిన ఓ వ్యక్తికి స్థానికంగా 200 గజాల స్థలం ఉంది. దాన్ని ఇటీవల విక్రయించారు. ప్లాటు రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌ను సంప్రదించగా.. ఆ స్థలం వివాదంలో ఉందని రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో స్థల యజమాని అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం ప్లాటు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన బాధితుడు రూ.70 వేల నగదును సబ్‌రిజిస్ట్రార్ సూచన మేరకు కార్యాలయం సమీపంలో డాక్యుమెంట్ రైటర్ రమేశ్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు అనిశా డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు.

★ ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన గౌసియా బేగం తన పేరిట ఉన్న ఇంటిని భర్త మన్సూర్‌ఖాన్ పఠాన్ పేరిట గిఫ్ట్ డీడ్ చేయాలనుకున్నారు. మన్సూర్‌ఖాన్ ఈ నెల 19న ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డిని సంప్రదించగా రూ.10 వేలు డిమాండ్ చేయడంతో అనిశాను ఆశ్రయించారు. మన్సూర్‌ఖాన్ సబ్ రిజిస్ట్రార్‌కు రూ.5 వేలు ఇస్తుండగా పట్టుకున్నట్లు అనిశా డీఎస్పీ మధు తెలిపారు.

సీపీఐ తెలంగాణ కార్యదర్శిగా మరోసారి కూనంనేని

● 101 మందితో రాష్ట్ర సమితి ఎన్నిక

ఈనాడు, హైదరాబాద్-షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మరోసారి ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు ఉంటారు. సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డికి జాతీయ కార్యదర్శిగా అవకాశం కల్పిస్తామని జాతీయ నాయకత్వం హామీ ఇచ్చింది. హైదరాబాద్‌లోని గాజులరామారంలో జరుగుతున్న సీపీఐ నాలుగో మహాసభల్లో రాష్ట్ర సమితిని, కార్యవర్గాన్ని, కార్యదర్శివర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటీ నర్సింహ ఎన్నికయ్యారు. వీరితోపాటు 10 మంది కార్యదర్శివర్గ, 32 మంది కార్యవర్గ సభ్యులు సహా 101 మందితో నూతన రాష్ట్ర సమితి ఎన్నికైంది.

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీసీ అభ్యర్థి దొరకలేదా?

కాంగ్రెస్‌కు ఎంపీ కె.లక్ష్మణ్ ప్రశ్న

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలు గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీకి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నిలబెట్టడానికి బీసీ అభ్యర్థి దొరకలేదా? అని భాజపా రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. బీసీల పేరుతో రాజకీయాలు చేయడం తప్పితే... న్యాయం చేసే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదన్నది నిరూపితమైందన్నారు. ఆయన శుక్రవారం దిల్లీలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ... "కాంగ్రెస్ నాయకులు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరును అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారు" అని లక్ష్మణ్ మండిపడ్డారు. రాష్ట్రానికి యూరియా సరఫరా అవుతున్నా బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవడం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

కిడ్నీ రాకెట్ కేసులో మత్తు వైద్య నిపుణుడి అరెస్టు

ఈనాడు, హైదరాబాద్: సరూర్‌నగర్ కిడ్నీ రాకెట్ కేసులో మరో నిందితుడిని తెలంగాణ సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. వైద్యనిపుణుడు డా.రుత్తల వెంకటరామ సంతోశ్ నాయుడు(36)ను శుక్రవారం ఎల్‌బీనగర్ కోర్టులో హాజరుపరిచారు. విశాఖపట్నం మురళీనగర్‌కు చెందిన ఇతన్ని సీఐడీ సంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయానికి చెందిన బృందం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో పట్టుకుంది. సరూర్‌నగర్‌లోని అలకనందా, జనని, అరుణ ఆసుపత్రుల్లో అక్రమంగా కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సలు జరిగిన సమయంలో గ్రహీతలకు, దాతలకు సంతోశ్‌నాయుడు మత్తుమందు ఇచ్చినట్లు గుర్తించారు. ఈ కేసులో కీలక నిందితుడు పాములపర్తి పవన్‌కుమార్ అలియాస్ లియోన్ అవసరమైనప్పుడల్లా సంతోశ్‌ను విశాఖపట్నం నుంచి పిలిపించినట్లు వెల్లడైంది. ఒక్కో శస్త్రచికిత్స సమయంలో మత్తుమందు ఇచ్చినందుకు సంతోశ్ రూ.2.5 లక్షల చొప్పున తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది.